


సేకరణ : దేవినేని మధుసూదన్‌రావు

1989లో ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన దీపావళి నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల

పల్లెపిలిచింది ద్వారకా

D. Madhusudana Rao B.Com., F.C.A., Tenneru-521 260, Krishna Dt., email: mdevineni@gmail.com Mobile: 9989051200 x..we

హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్

ప్లాట్ నెం. 33, యూనియన్ బ్యాంక్ కాలనీ, రోడ్ నెం.3, బంజారా హిల్స్ హైదరాబాద్ - 500034. టెలిఫోన్: 3551860 ఫాక్సు: 3551821

First Print: 1993, May Second Edition: 2001, January

Cover Design: BALI

Cover Printed at: Mudrika, Vijayawada

Publisher: Hitech Print Systems Limited

Copies available at: Akshara Hyderabad Ashok Book Centre, Vijayawada / Vizag Hitech Print Systems Limited, Hyderabad

Price: Rs. 75/ $5M

Printed at: Hitech Print Systems Limited Pedaavutapalli, 521 286

Krishna Dt. Tel.: 08676 513211

NORBERT ABDURA

నారా చంద్రబాబు నాయుడు

హైదరాబాదు జనవరి 2001

PRANE

ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్

సందేశము

పల్లెలు బాగుంటే దేశం బాగుంటుంది

అన్ని వనరులూ, వసతులూ ప్రభుత్వమే సమకూర్చడం సాధ్యం కాదు. సామాజిక స్పృహ కొరవడితే ఈ వనరుల ప్రయోజనం కూడా పరిమితమే. అందుకే ప్రజల కోసం, వారే భాగస్వాములుగా ప్రభుత్వం 'జన్మభూమి' కార్యక్రమం చేపట్టింది. ప్రజలు పూనుకుంటే అసాధ్యమేదీ కాదని ఋజువయ్యింది. పల్లెపల్లెలో 'జన్మభూమి'కి లభించిన స్పందనతో మరెన్నో ప్రజాహిత కార్యక్రమాల్ని చేపట్టాలనే ఉత్తేజం కలుగుతోంది. 'పల్లె పిలిచింది' చక్కటి నవల. ఒక సాధారణ ఉపాధ్యాయుడు పల్లెప్రజల్ని చైతన్య వంతుల్ని చేసి, వారిలో అంతర్గతమైన సంఘటిత భావాన్ని బహిర్గతం చేసి, వారి చేత అనూహ్యమైన పనులను చేయిస్తాడు. ఒక మంచి పని చెయ్యడానికి కావల్సింది చిత్తశుద్ధి, కార్యదీక్ష. కార్యక్రమం ఆచరణ యోగ్య మయితే ప్రజాబలం ఆ కార్యక్రమాన్ని సునాయాసంగా నెరవేరుస్తుంది.

ఈ నవలలో టీచర్ ప్రసాద్ సాటి ఉపాధ్యాయులకే గాక ప్రతి వారికీ ఆదర్శప్రాయం. ఆయన మార్గం అందరికీ అనుసరణీయం, ఆచరణీయం. రచయిత స్వానుభవంతో రాసినదీ నవల. అందుకే ఇందులో పల్లెజీవితం కళ్ళకు కట్టినట్లు మలిచారు. ఇతివృత్తం సందేశాత్మకమైనా, కృత్రిమత్వం మచ్చుకైనా లేదు ఇందులో.

'పల్లె పిలిచింది' లాంటి మంచి రచనలు యింకా రావాలి. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కర్నీ పురికొల్పాలి. 'స్వర్ణాంధ్రప్రదేశ్ సాక్షాత్కా రానికి దోహదం చేయాలి.

జై జన్మభూమి

(నారా చంద్రబాబు నాయుడు)

పల్లె వాస్తవికతకు పిలుపు

ఈ పోటీకి వచ్చిన నవలల్లో రెండవ బహుమతికి అర్హమని భావించిన 'పల్లె పిలిచింది'లో మెచ్చుకోతగిన మొదటి నవలా లక్షణం వాస్తవికత. ఇతివృత్తంలో, సన్నివేశాల్లో, పాత్ర చిత్రణలో, నేపథ్య చిత్రణలో, శైలిలో కనిపించే వాస్తవికత. ఈ నవల ఇతివృత్తంలో నేలవిడిచి చేసే సాము గరిడీలున్న సన్నివేశాలు లేవు. ఒక మామూలు మధ్య తరగతి ఉపాధ్యాయుడు, సంస్కారం కొంతైనా అలవరచుకోవాలనే ఆరాటమూ, భావుకత్వమూ, ఆత్మ పరిశీలనా ఉండే ఒక సగటు మనిషి, తమిళనాడు సరిహద్దుల్లోని 'జంబాడ' అనే చీకటి పల్లెలో చదువునూ, సంస్కారాన్ని పెంచటానికి చేసిన మందితో కలిసి చేసిన ప్రయత్నాలే ఈ నవలలో ఇతివృత్తం. 'జంబాడ'లో బరితెగించిన భూస్వాములూ లేరు; డబ్బు, స్వార్థమూ, అవధుల్లేని అధికార కాంక్ష కలగలసిన అచ్చోసిన ఆంబోతులూ లేరు. మంచీ, చెడ్డా, స్వార్థం, పరమార్థం ఉండే సాదాసీదా మనుషులు. జడత్వమూ, చైతన్యమూ ఎప్పుడేది కదిలితే ఆ రకంగా కదిలే సమాజం వాళ్ళది. ఈ చిన్న సమాజంలోకి బదిలీ మీద అయిష్టంతో వచ్చిన టీచరు హెడ్మాస్టర్ ప్రసాద్ ప్రధానపాత్ర. అతను ఉపన్యాస వాచాలుడూ, పరమ ధీరుడూ అయిన శుద్ధ ఆదర్శవాది కాడు. ఆ చిన్న సమాజంలో ఆచరణ యోగ్యమైన పనుల్ని తాను చిత్తశుద్ధితో చేస్తూ వ్యక్తిగా తన లోపాలను తాను సవరించుకోవటానికి ప్రయత్నిస్తూ, నలుగురిలోనూ ఆమాత్రం కదలికకు దోహదం చేసేవాడు. 1940 దశకానికే దాదాపు అంతరించిపోయిన మధ్యతరగతి జీవలక్షణం అది. ఆ జీవ లక్షణం సంస్కరణ జీవలక్షణమే కావచ్చు. దాన్ని ప్రధాన పాత్రలోనూ, ఇతర పాత్రల్లోనూ మనం ఈ నవలలో చూస్తాం. ఈ నవలలోని ఉపాధ్యాయులూ, గ్రామ పెద్దలూ, స్త్రీలూ, పురుషులూ వ్యక్తి స్వార్థం పెరిగిన స్వాతంత్ర్యానంతర సమాజం వాళ్ళే. అయితే వీళ్ళలోని ఒకే ఒక్క సుగుణం వీళ్ళంతా కరడుగట్టిన వ్యక్తివాదులూ

కారు; బండబారిన దుర్మార్గులూ, పీడకులూ కారు. కాదు కాబట్టే సమూహంలో వ్యక్తులుగా కలసిపోయారు. స్కూలు బిల్డింగు కట్టుకున్నారు. కలిసి నాటకాలాడారు. చూశారు. 8, 9, 10 తరగతులను బడికి తెప్పించుకున్నారు. ఇదేదో విప్లవచర్య కాకపోవచ్చు. మధ్య తరగతి జీవలక్షణానికి తోడ్పడే చర్య మాత్రం కాకపోదు.

ఈ నవలలో ఒక రకంగా మెచ్చుకోతగిన రెండో లక్షణం జానపద కథా సంప్రదాయానికి సంబంధించిన కథన పద్ధతి. తల పండిన మనిషి నింపాదిగా, నిండుగా కూర్చుని అనుభవాలతో నిండిన కథను ఒక క్రమంలో చుట్టూ మూగిన శ్రోతలకు చెప్పే సరళమైన ఉత్తమ పురుష కథన పద్ధతి ఇది. ఘటనల్లో బలమైన ప్రత్యర్థి వర్గాలూ, వాటిమధ్య అనివార్యమైన భీకర ఘర్షణా ఉండే నాటకీయ లక్షణం లేనప్పుడు కథనంలో ఉత్కంఠా, వేగమూ ఉండకపోవచ్చు. కానీ విశ్వసనీయమైన సన్నివేశాల్లో ఉండే గాంభీర్యమూ, జీవిత పరిశీలనా, జీవకళా ఉంటాయి. ఈ నవలలో అవి కనిపిస్తాయి. ఈ సందర్భంలో కొడవటిగంటి కుటుంబరావు వంటి ఉత్తమ కథకులు ఈ కథన సంప్రదాయాన్ని ఆధునిక కల్పనా సాహిత్యంలో పాదుకొల్పారనేది మనం మరచిపోరాదు. ఈ పద్ధతి కథనం విద్యావంతులైన ఇటీవలి నగర మధ్యతరగతి పాఠకుల ఒళ్ళును జల్లుమని పించదేమో కానీ చాలామందిచే చదివిస్తుంది. ఆలోచింప చేస్తుంది అని మా నమ్మకం. సరిహద్దుల్లోని ఉభయ భాషా వ్యవహార ప్రాంతాల్లోని మాండలిక శైలులు మనల్ని ఆకర్షిస్తాయనీ, అవి మన తెలుగులో ఒక భాగం కావాలనీ మా ఆకాంక్ష.

ప్రొఫెసర్ నాయని కృష్ణకుమారి, ప్రొఫెసర్ కేతు విశ్వనాథరెడ్డి

అభినందనలు

1989 దీపావళి నవలల పోటీలో 'పల్లె పిలిచింది' నవలకు ద్వితీయ బహుమతి నిచ్చి సత్కరించిన అభ్యుదయ కాముకులు 'ఆంధ్రప్రభ వార పత్రిక సంపాదకవర్గానికి -

బహుమతి నిర్ణేతలుగా వ్యవహరించిన శ్రీమతి నాయని కృష్ణకుమారి, శ్రీ కేతువిశ్వ నాథరెడ్డి గార్లకు –

'పల్లెపిలిచింది' పుస్తక రూపంలో వచ్చేందుకు కారణభూతులు, మిత్రులు శ్రీ వల్లం పాటి వెంకటసుబ్బయ్య గారికి - నవలను ప్రచురించిన విశాలాంధ్ర ప్రచురణాలయం - హైదరాబాదు వారికి - 1995-96 లో వెలువడిన నవలల్లో ఉత్తమ మైనదిగా ఎంపిక చేసి తిరుపతిలో సత్కరించిన 'నూతల పాటి గంగాధరం సాహితీ కుటుంబం - తిరుపతి వారికి - నవలపై చక్కటి సమీక్షలు ప్రచురించిన 'ఇండియాటుడే', 'ఆంధ్ర భూమి', 'ఆంధ్రజ్యోతి', 'ఈనాడు' పత్రికలవారికి -

నవల కొని చదివి ప్రశంసలు కురిపించిన పాఠక మహోదయులకు, ఉపాధ్యాయ మిత్రులకు -

'పల్లెపిలిచింది' తను కొని చదివి, ఇతరులకు కొనిపెట్టి చదివించి, చాలా గొప్పగా ప్రభావితులై, నన్ను వెదకి పట్టుకొని, ద్వితీయముద్రణను చేపట్టి, చక్కని రూపురేఖలతో వెలువరించేందుకు, తనకు తానుగా ముందుకు వచ్చిన సహృదయులు, స్నేహ స్వరూపులు, సాహితీప్రియులు, హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్ - హైదరాబాదు సంస్థ అధినేత డి. మధుసూదన రావు గారికి - May his tribe increase!

నా కథాసంపుటి 'సుఖాలతీరం' ప్రచురణకు కారణభూతులైన చిరంజీవులు - శ్రీమతి నారాయణమ్మ - శ్రీ యం. రెడ్డెప్ప నాయుడు (తిరుపతి) గార్లకు

- ఉత్తమ సాహిత్యాభిరుచిగల పాఠకోత్తములందరికీ మనవి - ఈ నవలను కొని చదవండి - కొనిపించి చదివించండి - ఆలోచించండి - చర్చించండి – కార్యోన్ముఖులు కండి.

"All the wealth in Indian village if the people తిరుపతి 01.01.2001.

the world cannot help one little are not taught to help themselves" -Swami Vivekananda. భవదీయుడు సి.హెచ్. వెంకటరత్నం 'ద్వారకా

అంకితం

జంబాడ గ్రామ ప్రజలకు - ముఖ్యంగా

పెద్దగంగరాజు, నరసరాజు, నరసమ్మగార్లకు కృతజ్ఞతలతో

'ద్వారక'

పల్లె పిలిచింది

నేను, నాతో వచ్చిన ఇబ్రహీం ఆర్కాడు కుప్పం దగ్గర బస్సు దిగాము.

మేము పోవాల్సిన ఊరు 'జంబాడ' అనే గ్రామం. ఆ గ్రామం ఎక్కడుందో ఆరాలు తీసి తెలుసుకునేసరికి వారం రోజులు పట్టింది. తిరుత్తణి నుంచి మద్రాసుకి పోయే మార్గంలో ఆర్కాడు కుప్పం దగ్గర బస్సు దిగి నడిచిపోతే ఊరు వస్తుందని చెప్పారు. ఆ ప్రకారమే బస్సు దిగాము.

అక్కడ నలుగురు మనుషులు నుంచొని తమిళంలో ఏదో మాట్లాడు కుంటున్నారు. నేను వాళ్ళ దగ్గరికిపోయి "జంబాడ అనే ఊరు ఇక్కడికెంత దూరమండీ ? ఎటు పోవాలి ?" అని అడిగాను.

వారిలో ఒకతను నన్ను చూస్తూ "జంబాడనా? అదో ఆ దిక్కు సూడు. అటు పోవాల. రోడ్డు మేలు అయితే నాలు మైలు. గనేల మేల పూడ్చితే ఎరడు మైలుదా!" అన్నాడు.

అతని ఒంటిమీద చొక్కా లేదు. వక్కాకు నములుతూ ఉమ్మి నోటి నిండా ఉంచుకునే నాతో మాట్లాడాడతను. పెరిగిన గడ్డం, గారపళ్ళు కారుతున్న ముక్కు, వికారంగా ఉన్నాడతను నల్లగా.

అతను సగం అరవం, సగం తెలుగు మాట్లాడినా అతను చెప్పింది అర్థమైంది నాకు. ఇబ్రహీం గుడ్లప్పగించి చూస్తున్నాడు మా వంక.

నా చేతులు ఖాళీగానే ఉన్నాయి. ఇబ్రహీం చేతిలో కాస్త పెద్ద సైజుదే ట్రంకు పెట్టె ఉన్నది. అతను పెట్టెను కింద పెట్టకుండా రెండు చేతులతోనూ హాండిలు పట్టుకుని నుంచున్నాడు.

"రోడ్డు మీద పోతే నాలుగు మైళ్ళు. పొలంగట్ల మీదుగా పోతే రెండు మైళ్ళానట. ఎటు పోదాం?" అంటూ ఇబ్రహీంను చూశాను.

అతను సమాధానం చెప్పలేదు. 'మీ ఇష్టం' అన్నట్లు ముఖం పెట్టాడు.

"గట్ల వెంబడి పడుతూ లేస్తూ పోయేకంటే రోడ్డు వెంట పోతేనే బాగుంటుంది" అన్నాను. రిస్టు వాచీలో టైము మూడు గంటలయింది.

నాలుగు మైళ్ళు, ఎంత నిదానంగా నడిచినా నాలుగున్నరకల్లా ఊరికి చేరిపోవచ్చు అనుకున్నాను. రోడ్డు వెంట నేను ముందు నడుస్తుంటే, ట్రంకు పెట్టె భుజానికెత్తుకొని ఇబ్రహీం అనుసరిస్తున్నాడు.

ఒకరితో ఒకరం మాట్లాడుకోకుండా నడుస్తున్నాం. ఇబ్రహీం ట్రంకు పెట్టెను చేతులు మార్చుకుంటూ మోస్తున్నాడు. భుజం మీద నుంచి తలమీదకి, తల మీద నుంచి భుజం మీదకి మార్చుకుంటున్నాడు పెట్టెను.

మెలికలు తిరుగుతున్నది రోడ్డు. కొత్తగా వేసినట్లున్నారు కంకర రోడ్డు. ఎద్దు మెడమీది గాయాల్లాంటి గుంటలున్నాయి రోడ్డు పొడవునా. గాయాల్లోంచి పైకెగిరి తిరిగి వాలుతున్న ఈగలు, దోమల్లా చిన్న, పెద్ద కంకర రాళ్ళు రోడ్డు పని సరిగా జరగలేదు.

మనవాళ్ళింతే! ఆ ఊరి చరిత్రలో ప్రప్రథమంగా రోడ్డు వేసే అవకాశం ఏర్పడి ఉంటుంది. వేసే రోడ్డును ఎంత చక్కగా, మన్నికగా వెయ్యాలి అన్న ఆలోచన ఎవరూ చేసినట్లు లేదు. కంట్రాక్టరుకు కావాల్సింది అధిక లాభం. ఇంజనీరుకు, ఆయన పరివారానికి కావాల్సింది వాళ్ళకు రావాల్సిన కమీషను. గీకి తినేవాడొకడైతే నాకి తినేవాడొకడు. మసిబూసి మారేడుకాయల్ని చెయ్యాలనే అందరి తాపత్రయమూ!

పాపం, పదమూడేళ్ళ ఇబ్రహీం మొయ్యలేక మోస్తున్నాడు పెట్టెను.

“కాసేపు నేను తెస్తానివ్వవయ్యా!" అని అతని చేతిలోనించి పెట్టెను తీసుకునే ప్రయత్నం చేశాను కానీ, అతను ఇవ్వలేదు.

రెండు మైళ్ళు దాటాము. మరో రెండు మైళ్ళు నడిస్తే గాని ఊరు రాదు. రోడ్డు నిర్జనంగా ఉన్నది. ఇంత దూరం నడిచినా ఒక్క మనిషి కూడా ఎదురు రాలేదు. భారతదేశ జనాభా అంతా ఏమైపోయింది? అని విస్తుపోయా నో క్షణంసేపు. నాలో నేను నవ్వుకున్నాను.

ఎంత దూరం చూసినా రోడ్డుకు రెండు పక్కలా తాడిచెట్లు, తుమ్మచెట్లు, ఈతచెట్లు, ముళ్ళకంపలూ కనిపిస్తున్నాయి. పొలాల్లో పచ్చదనం మచ్చుకైనా కనిపించటం లేదు.

"ఈ దరిద్రపు ఊరికి నువ్వు రాకుండా ఉంటే బాగుండేది ఇబ్రహీం! నాకెటూ తప్పదు కాబట్టి నేను రావాలి” అన్నాను అతని కోసం ఆగి.

అతను రొప్పుతూ నడుస్తున్నాడు. మాటలేం మాట్లాడుతాడు పాపం! అతని చెంపల వెంట చమట కారుతున్నది.

ఇబ్రహీంకు నేనంటే ఎందుకో అభిమానం. అతను ఉన్న ఊళ్ళోనే ఉండి హాయిగా చదువుకోవచ్చు. తల్లిదండ్రులను వదిలి, తెలిసిన వారికి దూరంగా నామీది అభిమానం కొద్దీ వస్తున్నాడు. ఏమిటో అతని పిచ్చి. నాతో రావాలని ఉన్నట్లు ముందుగా చెప్ప లేదు. అతని తల్లిదండ్రులు కూడా అడగలేదు. తీరా నేను బయలుదేరే సమయానికి తనూ ప్రయాణమైనాడు ట్రంకుపెట్టెతో, వద్దని ఎంత వారించినా వినలేదు.

తెల్ల చొక్కా, తెల్ల నిక్కరు, యూనిఫారం డ్రెస్సులో ఎర్రగా బొద్దుగా, కోల ముఖం, కర్లింగ్ క్రాపుతో చూడముచ్చటగా ఉంటాడు ఇబ్రహీం. ప్రతిరోజూ నా రూములో కూచొని నాతో మాట్లాడుతూ చిన్న చిన్న పనులు చేసి పెడుతూ ఉండేవాడు. అతనంటే నాకూ ఇష్టమే. ఇష్టం లేనిదల్లా ఇప్పుడతను ఇలా నాతోబాటు కష్టపడటం. నేను ఆగ్రహాన్ని, అవమానాన్ని నాతోపాటు నాతోపాటు మోస్తున్నాను. ఏ పాపం ఎరుగని ఇబ్రహీంకు ఈ కష్టంలో భాగమెందుకు?

స్కూలు కమిటీవాళ్ళు సమితి ప్రెసిడెంటుచేత ఇలాంటి పని చేయిస్తారని నాకు తెలుసు. ఆ ఊరినుంచి బదిలీ అయ్యేందుకు నేను సిద్ధంగానే ఉన్నాను. నన్ను పోగొట్టు కున్నందువల్ల ఆ ఊరు నష్టపడుతుంది గాని, నాకు రాబోయే నష్టం ఏమీ ఉండదనే ధీమాతో ఉన్నాను. ఉద్యోగికి దూరభూమి లేదు. పైగా ఆ ఊరు నా స్వగ్రామం కాదు. అక్కడ నా పూర్వీకులు సంపాదించిన ఆస్తిపాస్తులేమీ లేవు. బంధువర్గం అంతకన్నా లేదు. ఏ ఊరయితే ఏం అన్న నిర్లిప్త భావంలో ఉండిపోయాను.

నిజానికి సమితి ప్రెసిడెంటుగారి ముఖం నేనుగాని, నా ముఖం ఆయనగాని ఎన్నడూ చూడలేదు. నావల్ల ఆయనకేం ఉపయోగం? స్కూలు కమిటీవాళ్ళు ఆయనకు ఓట్లేస్తారు. వేయిస్తారు. ఎన్నికల్లో గెలిపిస్తారు. అందువల్లనే ఆయన వాళ్ళమాటలకు విలువనిచ్చాడు.

1

సర్వశక్తులూ ఉపయోగించి నన్ను బదిలీ చేయించాడు. కార్యసాధకు డయినాడు.

'ఏ ఊరయితే ఏం' అనుకున్న నాకు ఇలాంటి ఊళ్ళు కూడా ఉన్నాయని తెలీదు. ఆఫ్రికా ఖండంలోని దేశాల పేర్లలాగా ఆ ఊరి పేరు - 'జంబాడ'. అది చీకటి ఖండమైతే, ఇది చీకటి పల్లె! ఎంత మంది నడిగినా ఆ ఊరి చిరునామా చెప్పలేక పోయారు. తమిళనాడు సరిహద్దుల్లో ఇరుక్కొని ఉన్న తెలుగుదీవి జంబాడ. అది పనిష్మెంటు ప్లేస్ అంటూ హడలగొట్టారు నన్ను. అయినా నాకు ధైర్యం సడలలేదు. జాయినింగ్ టైమ్ ఎవైల్ చేసుకొని బయలుదేరి వచ్చాను. పాపం, నాతోపాటు ఇబ్రహీం.

ఇప్పుడు నాకీ పనిష్మెంట్ ట్రాన్స్ఫర్ నేను సరిగా పని చెయ్యనందుకు కాదు. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటున్నానని కాదు. చదువులు సరిగా చెప్పటం లేదని కాదు. స్కూలు పురోభివృద్ధికి పాటుపడటం లేదని కాదు. బిల్డింగు ఫీజుల పేరుతో చదువు కోసం వచ్చిన పిల్లల్ని వేధించవద్దనీ, పీడించి పిప్పి చేయవద్దనీ చెప్పినందుకు, వారి అనుజ్ఞ లేకుండానే పిల్లల్ని స్కూల్లో చేర్చినందుకు, కమిటీ ప్రెసిడెంటు బావమరిది పరీక్షల్లో సున్నా మార్కులు తెచ్చుకున్నా పై తరగతికి ప్రమోట్ చెయ్యనందుకు.

అసలక్కడ వాళ్ళు స్కూలు పెట్టించింది పిల్లలకు చదువులు రావాలని కాదు. ఊరు బాగుపడాలని కాదు. సంవత్సరం సంవత్సరం స్కూల్లో చేరే పిల్లల దగ్గర్నుంచి వీలైనంత హెచ్చు మొత్తాల్లో బిల్డింగు ఫీజులంటూ వసూలు చేసి లక్షణంగా భోం చెయ్యవచ్చునని. స్కూలు పెట్టిస్తామని ప్రజల దగ్గర చందాలు వసూలు చేసి, స్కూలు వచ్చిన తరువాత ఆ ప్రజలనే దాని అభివృద్ధి పేరుతో పీక్కుతింటూ కోట్లకు సునాయాసంగా పడగలెత్తాలని చూసే వాహినీవారి పెద్ద మనుషులు కమిటీ మెంబర్లు. వాళ్ళ దురాశలు, దురాశయాలు వాళ్ళ కళ్ళ ముందే నావల్ల కుప్పకూలిపోవటం చూసి భరించలేకపోయారు. పదవిని పట్టుకొని వేలాడటమే పరమలక్ష్యంగా పెట్టు

కున్న సమితి ప్రెసిడెంటు వాళ్ళ మాటలు విన్నాడు. దాని ఫలితమే నాకీ శిక్ష! మంచి పని చేసినందుకు శిక్ష. మంచి కోరినందుకు శిక్ష!

అధికారుల అండదండలు అనధికార ప్రముఖులు తప్పులు చెయ్యటానికి లభిస్తున్నాయి కాని, మంచి పనులు, ప్రజోపయోగకరమైన పనులు చెయ్యటానికి కాదు. మంచి పనులు చెయ్యాలని ప్రణాళికలు ముందు పెడితే - సవాలక్ష ప్రశ్నలతో వాటిని తిప్పి కొట్టేస్తారు తమ తెలివితేటలన్నీ ఉపయోగించి. ఇలాంటి వెధవ పన్లకు మాత్రం కళ్ళు మూసుకొని సంతకాలు పెట్టేస్తారు. తమ తక్షణ లాభాల కోసం సమాజానికి శాశ్వత ద్రోహం చేస్తున్నామని క్షణంసేపైనా ఆలోచించరు!

కమిటీ వాళ్ళు నా మీద ఆరోపణలు చేస్తూ జిల్లా పరిషత్తు వారికి పిటిషన్లు పెట్టారు. దానిమీద ఎంక్వయిరీలు జరిపారు. దాదాపు వెయ్యి మంది ప్రజల సమక్షంలో ఆ ఆరోపణలన్నీ అభూతకల్పనలనీ, పచ్చి అబద్ధాలనీ రుజువు చేశాను. ఎంక్వయిరీలలో తేలిన నిజానిజాలను గురించి నాకు తెలియ జెయ్యలేదు. పాత సెక్రటరీ గారు బదిలీ అయ్యారు. వారి స్థానంలోకి కొత్త సెక్రటరీ గారు వచ్చారు. ఆయన అధికార పీఠాన్ని అధిరోహించిన మరు క్షణంలోనే నా బదిలీ ఉత్తర్వు మీద సంతకం పెట్టేశాడు - తన పేరుతాను రాసుకునేశాడు గొప్పగా. తను సంతకం పెడుతున్న కాగితంలో ఏమి రాసి ఉన్నదో చూసే ఓపిక లేదాయనకు పాపం! దాని పూర్వాపరాలను గురించి తెలుసు కోవాలనే తీరిక లేదాయనకు. తన కిందివాళ్ళ యోగక్షేమాలకు తాను ధర్మకర్తనని అనుకోలేదతను! ఇలాంటి వారి చేతిలో అధికారం పిచ్చివాడి చేతిలోని రాయి.

గతం చేసిన గాయాలను నాకుతున్నది మనసు. అడుగులు ముందుకు పడుతున్నాయి. వర్తమానంలో కొచ్చి ఇబ్రహీం కోసం వెనక్కు తిరిగి చూశాను. అతను యాభై గజాలు వెనకబడి ఉన్నాడు. అతనికోసం ఆగాను.

పెట్టెతోబాటు అతన్నికూడా భుజాన వేసుకొనిపోతే బాగుంటుందనిపించింది. పెట్టె ఇవ్వటానికి అతను ఒప్పుకోవటం లేదు!

మేము నాలుగో మైలు దాటేసరికి నాలుగున్నరైంది టైము.

అలవాటే. పరికించి చూశాను. ఊరి జాడలు కనిపించలేదు. నాలుగు మైళ్ళు పోతే ఊరొస్తుందని చెప్పారు. ఈ పల్లెటూరి మనుషులింతే. వాళ్ళకు కష్టాలు, దూరా భారాలు నడవటం వాళ్ళు 'ఎంత. ఇక్కడికి నాలుగడుగుల దూరం' అంటే - మనం దగ్గరేనని మురిసిపోతాంగాని కనీసం నాలుగు మైళ్ళ దూరమైనా ఉంటాయి ఆ నాలుగడుగులూ! అతను నాలుగు మైళ్ళేనన్నాడు. ఇంకా చాలా దూరం నడవాల్సి ఉంటుందేమోనని భయపడ్డాను.

మరో నూరు గజాల దూరం నడిచేసరికి ఓ చెరువుకట్ట కనిపించింది రోడ్డు పక్కనే. దానిమీదకెక్కి చూశాను. ఎత్తులోంచి పడిపోయిన గోడలతో పెంకుటిళ్ళు, పూరిళ్ళు కనిపించాయి. బ్రతుకుజీవుడా అనుకున్నాను. ఎలాగైతే ఏం, చేరాల్సిన ఊరికి చేరామనుకున్నాను. వెంటనే అనుమానం వచ్చింది. 'ఇదే జంబాడ' అని ఎలా నిర్ధారించు కోటం?'

2

“ఇది ఏ ఊరు బాబూ?" అడిగాను చెరువుకట్ట దిగి అటు పక్కగా పోతున్న ఓ పిల్లవాణ్ణి పిలిచి.

వాడు బెదురుచూపులు చూస్తూ “జంబాడ” అన్నాడు.

“ఇక్కడ ఒక మిడిల్ స్కూలు ఉండాలే ఉన్నదా ?" అన్నాను.

“అదుగో. ఆ చెట్లలో ఉందే అదే మిడిల్ స్కూలు." చేత్తో చూపుతూ అన్నాడు వాడు. వాడు చూపించిన దిక్కులో చూశాను. అన్నీ జపాన్ తుమ్మచెట్లే. నాకు భవనాలు ఏవీ కనిపించలేదు. “స్కూలు బిల్డింగేదయ్యా? నాక్కనిపించలేదు” అన్నాను.

“ఆడే. ఆ చెట్లమద్దెలో ఉంది ఇస్కూలు" అన్నాడు వాడు.

“ఇక్కడ అన్నీ ముళ్లచెట్లుగానే ఉన్నాయి గదయ్యా! వీటిల్లో పెట్టారేంటి స్కూలు?" అన్నాను. నేను వాడిని అడగకూడని ప్రశ్న అది అడిగాను. వాడు గుడ్లు మిటకరించి చూశాడు!

ఇబ్రహీం పెట్టెను నేలమీద పెట్టి, నవ్వు ముఖంతో మా సంభాషణ వింటూ నుంచున్నాడు. ఎవరెస్టు శిఖరం మీద పాదం మోపిన క్షణంలో టెన్సింగు, హిల్లరీలకు శిఖరారోహణలో తాము పడ్డ కష్టం జ్ఞాపకం ఉండి ఉండదు. జంబాడ చేరిన తరువాత చేరేందుకు పడిన శ్రమంతా మరచిపోయి నట్లున్నాడు ఇబ్రహీం.

“మమ్మల్ని మిడిల్స్కూల్ దగ్గరికి తీసుకుపోతావా?" దీనంగా అడిగాను వాడ్ని. “నే నాడికే పోతావుండా. సూపుతా రండి!" అన్నాడు వాడు నన్ను ఎగాదిగా చూస్తూ. నేను టీచర్నని వాడు గుర్తు పట్టినట్లున్నాడు.

వాడి వెనకాలే నడిచాను. ముళ్ళపొదలను తప్పించుకుంటూ నూరు గజాల దూరం, నడిచాము. అక్కడ కొంత ఖాళీ స్థలం. ఆ స్థలంలో కోళ్ళపాక లాంటి పూరిపాక ఉన్నది పొడుగ్గా. దాని కెదురుగా తాతల కాలంనాటిది ఓ చిన్న పెంకుటిల్లున్నది. పెంకు టింటికి కొంచెం ఎడంగా రెండు తాడి చెట్లున్నాయి. వాడు నేరుగా పెంకుటింట్లోకి పోయాడు. నేను దిక్కులు చూస్తూ వాడితోపాటే లోపలికి నడిచాను. ఊరు స్కూలుకు కొంత దూరంలో ఉన్నట్లున్నది. అక్కణ్నించి చూస్తే ఏమీ కనిపించలేదు.

ఊరికి దూరంగా ఉండాలని ఆ చోటు ఎన్నుకున్నట్లున్నారు. ఆ స్థలమంతా మరు భూమిలా ఉందిగాని, చదువుల నిలయంలా లేదు. ఇలాంటి స్కూలు, ఇలాంటి వాతావరణం నేనెన్నడూ చూడలేదు. ఉంటుందని కూడా అనుకోలేదు. ఇక్కడెలా ఉండటం? ఇలాంటి చోట్లో ఎలా పని చెయ్యటం? చాలా వెగటుగా, పరమ అసహ్యంగా తోచింది నాకు. ఉద్యోగంలో చేరింది

బ్రతుకుతెరువు కోసమే. కాని ఇలాంటి చోట్లో, నిస్సారమైన, నిరర్థకమైన, నిరుపయోగమైన బ్రతుకెందుకు?

బయట వెలుతురుగా ఉన్నా లోపల అప్పుడే చీకటి అలుముకున్నది. ఆ ఇంటికి ఒక్క తలుపు తప్ప కిటికీలు లేవు. గాలి, వెలుతురు లోపలికి ప్రవేశించే అవకాశమే లేదు. గోడలు ఇటుకలతో కట్టి సిమెంటు పూశారు. సిమెంటు చెక్కలు చెక్కలుగా ఊడి పోయింది అక్కడక్కడ. ఓ వికృతాకారం వికటాట్టహాసం చేస్తే బయటికి కనిపించే దంతాల్లా కనిపిస్తున్నాయి ఇటుకలు. నేలకు చేసిన గచ్చు లేచి పోయి గుంటలు పడ్డాయి. గది మొత్తం రెండువందల చదరపు అడుగులకు మించి ఉండదు.

గదిలో ఒక మూలగా పెద్ద కొయ్యపెట్టె ఉన్నది. దానికి చేరువలో ఒక కొయ్యకుర్చీ, కుర్చీలో ఒక స్థూలకాయం ముందున్న కొయ్యటేబులు మీదికి వాలి నిద్రావస్థలో ఉన్నది. ఇది ఆఫీసు రూమన్నమాట!

నా పూర్వపు స్కూలు, ఆ వాతావరణం, ఆ ఆఫీసు రూము గుర్తుకొచ్చాయి.

ఆ స్కూలు తారురోడ్డు నానుకొని ఉన్నది. బస్సు దిగుతూనే స్కూల్లోకి నడవవచ్చు. ఉన్న గదులు నాలుగే అయినా కొత్తగా కట్టించారు. మూడు గదులు తరగతులకు, ఒకటి ఆఫీసుకు ఉపయోగించుకుంటున్నాము. ఆఫీసు రూముకు రెండు తలుపులు, నాలుగు కిటికీలు ఉన్నాయి. గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరిస్తుంటాయి. ఆ స్కూలు నాకు ఎంతో నచ్చింది. అక్కడ చేరింది మొదలు ఆ ప్రదేశాన్ని మరింత సుందరంగా చేసేందుకు చాలా కృషి చేశాను. పున్నాగపూల మొక్కలు, గ్లెడోసీడియా మొక్కలు వరుసగా నాటించాను. స్కూలు గార్డెను ప్లాను తయారుచేయించి క్రోటను మొక్కలు, పూలమొక్కలు నాటించాను. కంటికి రెప్పలా వాటిని కాపాడాను. ఎంతో ఆకర్షణీయంగా ఉండేది స్కూలు. న్యాయంకోసం, ధర్మంకోసం పోరాడినందుకు ఆ స్వర్గం తొణికింది. నాడు సైతాను

దేవుడుమీద తిరుగుబాటు చేసి పాతాళంలోకి పడిపోతే, నేను సైతాన్నెదిరించి నరకంలోకి పడిపోయాను.

మమ్మల్ని తీసుకొచ్చిన పిల్లవాడు నిక్కరుజేబులోంచి సిగరెట్టు పెట్టె బయటికి తీసి “ఇందసా” అన్నాడు ఆ స్థూలకాయాన్ని సమీపించి. ఆయన ఉలిక్కిపడి లేచాడు. సిగరెట్టు పెట్టె అందుకుంటూ “ఇంతసేపట్రా మిగతా చిల్లరేదీ?” దబాయించాడు గంభీరస్వరంతో.

“ఇంకా చిల్లరేందిసా! నువ్విచ్చింది సరిపోయింది” భయం భయంగా అన్నాడు వాడు. “పది పైసలు తిరిగి రావాట్రా! కొట్టేశావా" అంటూ తలెత్తి చూశాడాయన పక్కనే నుంచొని ఉన్న నన్ను.

"ఎవరండీ మీరు? ఏం కావాలి?” అన్నాడాయన నాతో.

నేనేమీ మాట్లాడకుండా జేబులోంచి నా ట్రాన్స్ఫర్ ఆర్డరు, రిలీవింగు రిపోర్టు తీసి నా ఆయనకందించాను.

"ఆయన వాటిని తీసుకొని, గది తలుపు దగ్గరికి వెలుతురులోకి నడిచి చదివాడు. ఆయన ముఖం కోటిదీపాల కాంతితో వెలిగింది. గబగబా నా దగ్గరికొచ్చాడు పట్టలేని సంతోషంతో. నా చెయ్యి దొరకబుచ్చుకొని గట్టిగా ఊపేస్తూ “చాలా థాంక్సండీ! మీరు రారేమోనని అనుకున్నాను. మీ జాయినింగ్ టైము ఈ రోజుతో అయిపోతుంది గదా బహుశా వస్తారేమో నని దింపుడు కళ్ళెం ఆశతో కూర్చుని ఉన్నాను. లేకపోతే మధ్యాహ్నమే వెళ్ళిపోయి ఉండేవాడిని. మీరు వచ్చారు. అయాం ఎక్స్ట్రీమ్లీ హేపీ!" అంటూ నన్ను కుదిపేశాడు.

ఆయనకు ఎనలేని సంతోషం. నాకు పట్టరాని దుఃఖం. నేనేమీ మాట్లాడ లేకపోయాను. "మిగతా తతంగం పూర్తి కానిచ్చేద్దాము. మీరు ఇవాళ ఉదయమే జాయినైనట్లు రాసేస్తాను. ఛార్జి తీసుకుంటారా!" అన్నాడాయన.

“మీ ఇష్టం. మీకెలా మంచిదని తోస్తే అలా చెయ్యండి" అన్నాను పుట్టెడు విషాదంతో.

“అయినా ఇక్కడేముంది తీసుకునేందుకు?"

“ఆ ఏముంది! ఈ అటెండెన్సు రిజిస్టర్లు. ఆ పెట్టె, ఈ కుర్చీ, టేబులు, అంతకంటే ఏమీ లేవు" అన్నాడాయన నవ్వుతూ.

ఛార్జిలిస్టు జేబులో సిద్ధంగా ఉంచుకొన్నాడు ముందుగానే తయారు చేసుకొన్న పుణ్యాత్ముడు. అక్కడ ముళ్ళ మీదున్నట్లు ఉన్నాడు మానవుడు.

కాగితం చేతిలోకి తీసుకొని చూశాను. లిస్టులో వస్తువుల సంఖ్య కంటే హాండెడ్ ఓవర్', వగైరా రాతే ఎక్కువగా ఉన్నది.

వస్తున్న ఏడుపును దిగమింగుకుంటూ “టేకెనోవర్” అని రాసి సంతకం పెట్టాను. మొత్తం మూడు కాగితాల మీద సంతకాలు పెట్టాను. ఒకటి ఆయన తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. ఒకటి నేను తీసుకోవాలి, మూడోదాన్ని జిల్లాపరిషత్తు వారికి పంపించాలి.

ఛార్జీ లిస్టు జేబులో పెట్టుకొని తన సంచి చేతిలోకి తీసుకున్నాడు. “మీరు వస్తే ఇవాళ రావాలి. లేకపోతే ఈ నరకకూపం నుంచి నాకు విముక్తి ఉండదు అనుకుంటూ కూచున్నాను. ఎలాగైతేనేం మీరొచ్చారు చాలా థాంక్సండి!" అంటూ చెప్పులు తొడుక్కున్నాడు. ప్రయాణానికి అన్నీ సర్దుకొని కూచున్నాడు. ఆయన్ను చూసి చాలా అసూయ పడ్డాన్నేను.

నన్నిక్కడ ఒంటరిగా వదిలేసి తన త్రోవ తాను చూసుకుంటున్నాడు. ఇతర టీచర్లను పిలిపించి పరిచయం చెయ్యాలనే ఆలోచన కూడా రాలేదాయనకు.

“ఇక్కడ టీచర్లెవరూ లేరాండీ?" అన్నాను.

“లేకేం! అయిదుమంది ఉన్నారు. అందులో ముగ్గురు పనిష్మెంటు ట్రాన్స్ఫర్ మీద వచ్చినవాళ్ళు. ఇద్దరు కొత్తగా ఉద్యోగంలో చేరినవాళ్ళు!" నవ్వాడాయన.

"ఇలాంటి వాళ్ళ కోసమే ప్రారంభించినట్లున్నారు ఈ స్కూలును" అన్నాన్నేను.

"అంతేనండీ! అయినా ఎవడిక్కావాలి చెప్పండి చదువులు? తమ గ్రామం లో స్కూలుంటే యేదో గొప్పగా ఉంటుందనుకున్నారు వీళ్ళు. వెర్రి వెంగళప్పలు అడుగు తున్నారు. ఒకటి పారేద్దాం అనుకున్నారు వాళ్ళు. ఇద్దరిలో ఎవరూ చదువు గురించీ, చదువు చెప్పేందుక్కావాల్సిన వసతుల గురించి ఆలోచించలేదు. ఆ ఇద్దరి మధ్యా కడుపులు చేత్తో పట్టుకుని బయలుదేరిన మనం నలిగిపోతున్నాం. ఇది పనిష్మెంటు సెంటరుగాని చదువుల కేంద్రం కాదండీ బాబూ!" అన్నాడాయన. చాలా హుషారుగా మాట్లాడుతున్నాడు.

"ఇక్కడ చదువుతున్న పిల్లలెంతమంది ఉన్నారండీ?"

"ఆ ఎందరు! మొత్తం యాభయ్యారుమంది. ఊళ్ళో స్కూలు బెట్టుకొని ఆర్కాడు కుప్పంలో చదువుతున్న వాళ్ళు కూడా ఉన్నారు."

"అదే మంచిదిలెండి. ఆ పిల్లలైనా బయటి ప్రపంచం ఎలా ఉందో చూస్తుంటారు రోజూ. ఇక్కడ కూపస్థమండుకాల్లా మగ్గిపోవటమేగా!" అన్నాను. "టీచర్లు ఇక్కడే ఉంటున్నారా? బయటి ఊళ్ళ నుంచి వస్తున్నారా?"

"అందరూ చాలా దూరాల నుంచి వచ్చినవాళ్ళే. ఈ ప్రాంతానికి అంతా కొత్తవాళ్ళే. ఇక్కడే ఉంటున్నారు వండుకు తింటూ",

"ఎవరైనా ఒక టీచర్ని పిలిపించండి దయచేసి" అన్నాను.

"మీరడక్కుండానే పిలిపించేవాడినే కాని నాకు టైమవుతున్నది బస్సుకు. చీకటిపడితే ఈ తోవలో నడవటం కష్టం" అంటూ సంచి అయిష్టంగా కింద పెట్టి ఇందాక తనకు సిగరెట్టు పెట్టె తెచ్చి పెట్టిన పిల్లవాడితో - "ఒరే నరసూ: పోయి శ్రీనివాసులు అయ్యవార్ని పిల్చుకురారా! కొత్త హెడ్మాస్టరు వచ్చాడని చెప్పు" అని చెప్పి పంపించాడు. "ఇక్కడి పెద్దవాళ్ళు పరమ తాగు

బోతులయినా పిల్లలు మాత్రం చాలా మంచివాళ్ళండి. చదువులురావు గాని, టీచర్లకు మాత్రం చాలా సహాయం చేస్తుంటారు." మెచ్చుకోలుగా పోతూ ఉన్న సరసును చూస్తూ అన్నాడాయన.

"ఊరేమైనా పెద్దదేనాండీ ?"

"ఆ అదో వల్లకాడు. మొత్తం ఎనభై కొంపలు కూడా ఉండవు. ఉండేందుకు సరైన కొంప ఒకటీ దొరకదు."

"మీరెలా చేశారు ఇన్ని రోజులూ ?"

"ఈ స్కూల్లోనే ఎలాగో సర్దుకుంటూ ఉండేవాడిని. పైగా నేను ఫామిలీ పుటప్ చెయ్యలేదు. నా వైఫ్ సత్యవేడులో టీచరుగా పని చేస్తున్నది. వస్తూ పోతూ ఉన్నాను.

ట్రాన్స్ఫర్ కోసం ఆర్నెల్లుగా ట్రై చేస్తున్నాను. ఇప్పటికి దేవుడు కరుణించాడు. మీరు వచ్చారు. మీకు కృతజ్ఞతలు ఎలా తెలపాలో తెలియడం లేదు" అన్నాడాయన.

ఆయన కృతజ్ఞతలు శరాఘాతాల్లా నన్ను గుచ్చుకుంటున్నాయి.

ఇంతలో "నమస్తే సార్!" అంటూ వచ్చాడు శ్రీనివాసులు. ముఖం లేతగానే ఉన్నా, జుట్టంతా తెల్లబడిపోయింది. నల్లగా, బక్కపలచగా ఉన్నాడు. అతను నవ్వినపుడు ఒక పన్ను కనిపించలేదు.

"మీ కొత్త హెడ్మాస్టరు ప్రసాద్ గారు. స్కూలైపోయిన తరువాత వచ్చారు. ఉదయమే ఛార్జి ఇచ్చినట్లు, నేను రిలీవైనట్లు, ఆయన జాయినైనట్లు రాసేశాను" అన్నారాయన. నవ్వుతూ "నమస్తే సార్!" అన్నాడతను నాతో.

"నమస్తే నండీ!" అంటూ అతనితో కరచాలనం చేశాను.

"పిల్లవాడెవరూ? మీవాడేనా?" అన్నాడు పోతున్న హెడ్మాస్టరు ఇబ్రహీంను చూపుతూ. "ఇందాకటి బట్టి నేను గమనించలేదు".

“మిన్నూ మన్నూ కానని సంతోషం కద బాబు నీకు! వాడేం కనిపిస్తాడు, తప్పదు కాబట్టి నన్ను చూశావు.” లోలోపల అనుకున్నాను.

“ఇతను ఇబ్రహీం అని నా ఓల్డ్ స్టేషన్లో స్టూడెంటు, నేనంటే అభిమానం పాపం! నాతో వుండి చదువుకోవాలని వచ్చాడు" అన్నాను ఇబ్రహీం వంక చూస్తూ.

“అతన్నెందుకు తీసికొచ్చారు పాపం ఈ లోకంలోకి?" అన్నాడు శ్రీనివాసులు. “ఇక్కడ ఇలా ఉంటుందను కోలేదు" అన్నాను.

“నేను వెళుతున్నాను మాస్టారూ!" అంటూ సంచీ తీసుకొని వేగంగా నడక ప్రారంభించాడాయన.

ఆయనతోబాటు నాలుగడుగులు వేసి మేము ఆగిపోయాము. అలవాటైన తోవలో ఆయన చకచకా నడిచిపోయాడు. అదృష్టవంతుడు. ఆయన అదృష్టానికి నాకు సంతోషం కలగలేదు.

నేను, ఇబ్రహీం, మాతోబాటు శ్రీనివాసులు స్కూలు దగ్గరే ఆగిపోయాము. శ్రీనివాసులు పాత హెడ్మాస్టర్ను గురించి కొత్త హెడ్మాస్టరుతో చెప్పాడు. “ఆయన చాలా రోత మనిషి సార్. పనిష్మెంటు మీద ఇక్కడికొచ్చాడు".

“ఎందుకు పనిష్మెంటు?” అడిగాను కుతూహలంగా.

"పిల్లల దగ్గర పుస్తకాలకని, గ్రైడ్లకని డబ్బులు వసూలు చేసి తినేశాడట. వాళ్ళంతా జిల్లా పరిషత్తుకు పిటిషన్లు పెట్టారు. స్ట్రైకులు చేశారు. ఆయన్ను కొట్టబోయారట కూడా! దాంతో జిల్లా పరిషత్తు వాళ్ళు ఇక్కడ పారేశారు. ఇక్కడ చేరింది మొదలు బదిలీ కావాలంటూ తెగ తిరిగాడు. అయినవాళ్ళూ, కానివాళ్ళూ అందరి కాళ్ళూ పట్టుకున్నాడు. ఎలాగైతేనేం ట్రాన్స్ఫర్ సంపాదించాడు. ఇప్పుడు వెళ్ళిపోయాడు.”

"ఇక్కడా డబ్బులు బాగా గుంజుకున్నాడా ?"

“ఇక్కడేముంది ఆయన గుంజుకునేందుకు! ఈ జనం అష్ట దరిద్రులు. ఎక్కడి డబ్బూ తాగటానికే సరిపోదు! పిల్లలకేమిస్తారు. ఏమీ దొరకటం లేదు కాబట్టే వెళ్ళిపోవాలని అంత ఆరాటపడ్డాడు.”

"ఎలాగోలా ఆయన కాలం వెళ్ళబుచ్చుకున్నాడు."

“కాలం ఆయన వెళ్ళబుచ్చుకోలేదు సార్! అదే వెళ్ళిపోయింది. వారానికోరోజు స్కూలు కొచ్చేవాడు. ఉదయం పది గంటల కొచ్చేవాడు. సాయంత్రం మూడుకంతా తిరుగు ప్రయాణం కట్టేవాడు. ఆయనకేం ఆయన హాయిగానే ఉండిపోయాడు.”

ఇది నాకు కొత్త సమాచారం. ఇలా వారానికోసారి బడికి వచ్చి పోయేవాళ్ళు ఉంటారని నాకు తెలీదు ఇంతవరకు. “అతను ఇర్రెగ్యులర్‌గా స్కూలు కొస్తుంటే జిల్లా పరిషత్తు వాళ్ళు ఏమీ చర్య తీసుకోలేదా? ఊరివాళ్ళు ఎలా ఊరుకున్నారు?” కుతూహలంగా అడిగాను.

"జిల్లా పరిషత్తు వారి గొడవలు జిల్లా పరిషత్తు వారివి. మిగతా వాళ్ళు ఏ ఏట్లో కొట్టుకుపోతున్నారో చూసే తీరిక వాళ్ళకెక్కడుంది సార్! ఇక ఊరి వాళ్ళంటారా, తాగి తందానా లాడటంతోనే సరిపోతుంది వీళ్ళకు."

“హెడ్మాస్టరే అలా ఉంటే ఇక స్కూలు మాత్రం ఏం జరిగేడ్చి ఉంటుంది?” అన్నాను. “స్కూలుకేం సార్! స్కూలు మాత్రం రెగ్యులర్ గా నడుపుతూనే ఉన్నాం. నేను హయ్యరెలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగా పని చేశాను. కాస్త చూసుకోండని నన్ను బ్రతిమాలాడు. ఇక తప్పేదేముంది? అన్నీ నేనే నెత్తిన వేసుకొని చూస్తున్నాను". నవ్వాడు శ్రీనివాసులు.

చీకటి పడుతున్నది. ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తున్నాయి. ఏనుగంత దోమలు శరీరంలో దొరికిన భాగాన్నంతా కుడుతున్నాయి. సాయంత్రం కాసిని టీ నీళ్ళు కూడా తాగలేదు. నేను సరే, పాపం ఇబ్రహీం చిన్నపిల్ల వాడు. వాడికి ఆకలవుతూ వుంటుంది.

"ఈ ఊళ్ళో హోటళ్ళేమైనా ఉన్నాయా శ్రీనివాసులు గారూ!" అన్నాను.

పెద్దపెట్టున నవ్వాడాయన. “హోటలు కాదు గదా టీ బంకు కూడా లేదు. అసలిక్కడ అగ్గిపెట్టె కూడా దొరకదండీ! ప్రతిదానికీ ఆర్కాడు కుప్పం పోవాల్సిందే” అన్నాడు.

'అయితే ఈ రాత్రికి మేము ఇలా పడుండాల్సిందే! పాపం, నన్ను నమ్ముకొని వచ్చాడు వాడు. పసిపిల్లవాడు. వాడికైనా కాస్త భోజనం ఏర్పాటు చేయించండి ఎక్కడైనా.'

“మీరు పస్తు పడుకుంటారా? అంత బాధపడాల్సిన అవసరం లేదులెండి. ఈ పూటకు మా ఇంట్లో భోంచేసి పడుకుందురుగాని రండి. ఒకవేళ అక్కడ పడుకునేందుకు ఇబ్బందిగా ఉంటే స్కూల్లోనే పడుకుందురుగాని” అంటూ మమ్మల్ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు శ్రీనివాసులు.

“మీకెందుకులెండి శ్రమ పాపం. వాడికి పెట్టండి చాలు” అన్నాన్నేను మొహమాట పడుతూ.

“మీకోసం ప్రత్యేకంగా ఏమీ చెయ్యంలెండి. పోదాం పదండి. పద బాబూ!" అంటూ మమ్మల్ని వెంటేసుకొని ఊళ్ళోకి నడిచాడు.

ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. మమ్మల్ని చూసి ఒకటి రెండు కుక్కలు మొరిగాయి. పూరిళ్ళు, పెంకుటిళ్ళు బండల మిద్దెలు అన్నీ. ఊళ్ళోని ఇళ్ళన్నీ రెండు వరసల్లో ఇమిడిపోయాయి.

"ఊళ్ళో డబ్బున్న వారు ఎవరూ లేరా ?" అడిగాను శ్రీనివాసుల్ని.

“నాలుగైదు ఇళ్ళున్నాయి గాని, వాళ్ళు పిల్లికిగూడా బిచ్చమెయ్యరు. మహా పిసినారి మనుషులు” అన్నాడతను.

“అందరికీ బ్రతుకుతెరువు వ్యవసాయమే ననుకుంటాను.”

“అంతేసార్! కొందరు మాత్రం మద్రాసులో ఆ పనీ ఈ పని చేసుకొని బ్రతుకు తున్నారు. అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. రెండు కుటుంబాల వాళ్ళు మాత్రం తిరుత్తణిలో వ్యాపారం చేసుకొంటూ అక్కడే సెటిలై పోయారు. వాళ్ళకు భూములు అవీ ఉన్నాయి." శ్రీనివాసులుకు ఊరి విషయాలన్నీ బాగా తెలిసినట్లుంది.

ఊరికీ, స్కూలుకూ దాదాపు ఒక ఫర్లాంగు దూరముంటుంది. "మీరిక్కడ ఫామిలీతో ఉంటున్నారా ?"

“అవును సార్! ఫామిలీతో ఉంటున్నది నేనొక్కడినే. ఒకరు తప్ప మిగతా అందరూ పెళ్ళికానివాళ్ళే. వండుకు తింటున్నారు”.

“వాళ్ళందరూ ఒకేచోట ఉంటున్నారా! ఎవరితోవ వాళ్ళదేనా ?"

“ఎవరి కుంపటి వాళ్ళదే. పిల్లలు బాగా సాయం చేస్తార్లెండి. వంట చెయ్యటం అందరికీ చేతనవును” నవ్వాడు శ్రీనివాసులు.

ఇంతలో శ్రీనివాసులు ఇంటికి చేరాము.

ఇంట్లో పొగలు కక్కుతూ బెడ్లైటు మండుతున్నది. అంతా ఒకటే గది. ముందు పక్క ఈతమండలతో దడి కట్టుకొని మరి కాస్త పెద్దదిగా చేసుకున్నాడు ఆవరణను.

"లోపలికి రండి సార్!" అంటూ చాప పరిచి కూచోమన్నాడు.

ఇబ్రహీం గోడ పక్కగా పెట్టెను పెట్టి నా పక్కనే చాపమీద కూర్చున్నాడు.

“ఈయన మా కొత్త హెడ్మాస్టరు ప్రసాద్ గారు. ఈ అబ్బాయి ఆయనతో బాటు ఇక్కడి కొచ్చాడు చదువుకునేందుకు. ఇవాళ సాయంత్రమే వచ్చారు. భోజనానికి మనింటికి పిలుచుకొచ్చాను" అంటూ తన భార్యకు మమ్మల్ని పరిచయం చేశాడు.

ఆమె మమ్మల్ని చూసి ఇంటి గడపలోంచి లేచిపోయి ఇంట్లో ఒక మూలగా నుంచు న్నది. కాస్త బొద్దుగా, పొట్టిగా ఉన్నది. గుండ్రని ముఖం. పెద్ద పెద్ద

కళ్ళు. వంకీలు తిరిగిన జుట్టు. చామనచాయగా ఉంది. చూసేందుకు ఆకర్షణీయంగానే ఉంది మనిషి ఎర్రబార్డరు తెల్లచీర, తెల్ల రవికె. తలలో పూలున్నాయి. ముఖం మీద కాస్తంత బొట్టు ఎర్రగా మెరుస్తున్నది. రెండు చేతులూ జోడించి - "నమస్తే సార్!" అన్నది.

"గవర్నమెంటు హాస్పిటల్లో నర్సుగా ఉద్యోగం చేస్తుండేది మొన్నటిదాకా. ఉద్యోగం మాన్పించేశాను" అన్నాడు శ్రీనివాసులు.

"గవర్నమెంటు ఉద్యోగం చేయనివ్వక ఎందుకు మాన్పించేశారండి! డబ్బంటే చేదా మీకు?" అన్నాను నవ్వుతూ.

"నాకు ఉన్నదిగదండీ గవర్నమెంటు ఉద్యోగం. ఉన్న ఉద్యోగాలన్నీ ఒక ఇంటివాళ్ళే కాజేస్తే, మిగతావాళ్ళ గతేం గాను? మరొకరికి ఉద్యోగం దొరికినా ఇంకో సంసారం హాయిగా ఉంటుంది గదండీ. అందుకే మాన్పించేశాను" సీరియస్ గా చెప్పాడు శ్రీనివాసులు.

నా మనసులోకి దురూహలు రాకపోలేదు. అయినా అతని సామాజిక స్పృహను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. "మీరు చెప్పింది నిజమే లెండి. కొన్ని ఇళ్ళలో అందరూ ప్రభుత్వోద్యోగులే. కొన్ని ఇళ్లలో అందరూ నిరుద్యోగులే. అన్ని అవకాశాలూ కొందరందించుకొంటూ ఉంటే మరి కొందరు ఏ అవకాశాలూ అందకుండా అనాథ లవుతున్నారు" అన్నాను.

ఆమె పుల్లలు విరిచి పొయ్యి రాజేసి వంటపని మొదలు పెట్టింది. ఇంటి నిండా పొగ కమ్ముకున్నది.

"పుల్లలు మండుతున్నా ఇంత పొగ వస్తున్నదేమిటి! ఈ పొగలో ఎలా వంట చేస్తున్నారు?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఆ తుమ్మపుల్లలు ఇంతేనండి. ఊరినిండా ఈ జపాన్ ముళ్ళ చెట్లే. స్కూలు దగ్గర చూశారుగా! ఊరినిండా అవే. వంట చేసుకునేందుకు ఊళ్ళో

అందరికీ అవే ఆధారం. ఏ పుణ్యాత్ముడు వాటిని నాటాడో! అవి లేకపోతే చాలా కష్టమయ్యేది. కట్టెలు దొరకవిక్కడ.' చెప్పాడు శ్రీనివాసులు.

వాళ్ళకు కావాల్సినంతవరకు వండుకుని పొయ్యి ఆర్పేసి హాయిగా కూచొని ఉన్నదామె. మానుంచి ఆమెకు కష్టం పాపం. ఆ మాటలే ఆయనతో అన్నాను పొగ మింగు కుంటూ. ఇబ్రహీం కళ్ళలో నీళ్ళు కారుతున్నవి ఆ పొగకు. వాళ్ళిద్దరూ బాగా అలవాటు పడ్డట్లున్నారు.

"ఏం పరవాలేదులెండి సార్! ఓ అరగంటలో అయిపోతుంది." అన్నది ఆమె. శ్రీనివాసులు నవ్వాడు. "మీకు పెళ్ళి కాలేదా సార్?" అన్నాడు.

ఇంకా లేదండీ. నేను ఉద్యోగంలో చేరి రెండేళ్ళే అయింది. పోస్టింగే మిడిల్ స్కూల్ హెడ్మాస్టరుగా ఇచ్చారు. కలకడలో ఆర్నెల్ల పాటు నాకు స్కూలు కమిటీకి పెద్ద రాద్ధాంతం జరిగింది, సమితి ప్రెసిడెంటును పట్టుకొని నన్నిక్కడికి వేయించారు. నాకు ఈ గొడవతోనే సరిపోయింది. పెళ్ళి ఆలోచన చేసే అవకాశమే రాలేదు" అన్నాను నవ్వుతూ.

"ఒంటరిగా ఇక్కడ ఉండటం చాలా కష్టం సార్! ఎలా చేస్తారో మీరు. స్కూలుకు వాచ్మన్ ఉన్నాడు గాని వాడో పరమ తాగుబోతు. హెడ్మాస్టరైనా వారానికోసారి వచ్చేవాడు గాని, వాడు మాత్రం జీతం తీసుకునేందుకు మాత్రమే వస్తాడు. మహా పొగరుబోతు. ఎవర్నీ లక్ష్యపెట్టడు. ఎందుకూ పనికిరాడు."

చటుక్కున నా తలలో లైటు వెలిగింది. "మీరు నాకు సహాయంగా ఉంటానని మాట ఇస్తే నేనిక్కడికి ఇంతకు ముందు హెడ్మాస్టరులాగే వస్తుంటానండీ!" అన్నాను.

"ఓ యస్. దాందేముంది సార్! అంతమాత్రం సహాయం చెయ్యలేకపోతే ఎందుకు సార్! రెండు సంవత్సరాలు ఈ స్కూలు వ్యవహారమంతా నేనే చూసుకుంటున్నాను సార్. మీరేం భయపడొద్దు. పాపం ఈ పిల్లవాడినేం చేస్తారు?" అన్నాడు శ్రీనివాసులు ఇబ్రహీం వంక చూస్తూ.

“వాణ్ణి తిరిగి వాళ్ళ ఊరికి పంపించేస్తాను. ఈ నరకంలో నాతోపాటు అతనూ బాధపడటం నాకిష్టం లేదు. నా మూలంగా అతను చదువు పోగొట్టుకోడమెందుకు?” అన్నాను.

ఇంతలోకి ఆమె వంట పూర్తిచేసి పొయ్యి ఆర్పేసింది.కాస్త హాయిగా ఊపిరాడుతున్నది. కాళ్ళు కడుక్కొని విస్తళ్ళ ముందు కూర్చున్నాము. కాస్త పచ్చడి, చారు, నీళ్ళ మజ్జిగ లతో అయినా బాగానే తిన్నాం. పొగకంపు కొట్టింది అన్నం. ఆకలి రుచెరగదన్నారు.

అంతకు మించి పెట్టలేకపోయినందుకు ఆమె చాలా బాధపడింది పాపం. "ఊళ్ళో కూరగాయలు కూడా ఏవీ దొరకవు అన్నయ్యగారూ!" అన్నదావిడ.

“ఏం పరవాలేదమ్మా. ఇక్కడ మాకు శ్రమదీసుకొని ఆతిథ్యమిచ్చిందే పది వేలు. కడుపు నిండా తిన్నాము. కృతజ్ఞతలు తల్లీ!" అన్నాను చేతులు జోడించి, "మేము ఆ స్కూల్లోనే రాత్రి గడిపేస్తాము శ్రీనివాసులుగారూ!" అంటూ ఇంట్లోంచి బయటికి నడిచాము.

ఆయన చాప తీసుకొని మా వెనకాలే స్కూలు దగ్గరికొచ్చాడు.

ఆకాశంలో చంద్రుడున్నాడు గాని మబ్బులు ముసురుకుంటున్నాయి. వెన్నెల మసక మసకగా ఉన్నది. గాలి చల్లగా వీస్తున్నది.

ఇబ్రహీం పెట్టె తెరిచి వాడు తెచ్చుకున్న దుప్పటి, నా దుప్పటి బయటికి తీశాడు. శ్రీనివాసులు ఓ పది నిముషాలపాటు మాతో ఉండి వెళ్ళిపోయాడు ఉదయమే వస్తానని చెప్పి.

ఆ పెంకుటింటి ద్వారం దగ్గర చాప పరుచుకొని అడ్డంగా ఇద్దరం పడుకున్నాము. కాసేపటికే ఇబ్రహీం గాఢనిద్రలోకి జారుకున్నాడు. నాకు మాత్రం నిద్ర పట్టలేదు. మనసు నిండా కందిరీగల్లా కమ్ముకున్నాయి ఆలోచనలు.

నేను చేసిన మంచిని గ్రహించకుండా జిల్లా పరిషత్తు వారు నాకు పనిష్మెంట్ ట్రాన్స్ఫరు ఇచ్చారు. గుర్రాన్ని నీళ్ళదాకా తీసుకుపోగలరు గాని, దాని చేత నీళ్ళు తాగించగలరా? నన్నెవరూ శిక్షించలేరని వాళ్ళు తెలుసుకునేలా చెయ్యాలి. ఆయన వారానికోసారి వస్తే ఏం చేశారు? నేను నెలకో సారి వస్తాను. ఏం చేస్తారో చూస్తాను. న్యాయం, నీతి, ధర్మం ఎటువంటి పరిస్థితుల్లోనూ ఓడిపోదు. వాటికి అవమానం జరగ కూడదు నావల్ల. 'కలకడ'లో నేను చేసిన తప్పేమీ లేదు. నేను చేసిన మంచి పనికి శిక్ష పడింది!

ఇబ్రహీంను తిరిగి పంపించెయ్యడం బాధాకరమే. వాడు చాలా ఆశతో వచ్చాడు పాపం. వాణ్ణి నిరాశపరచటం అన్యాయమే. కాని ఇక్కడ నేను దూరేందుకే సందు లేదు. ఇక వీడినెక్కడ మెడకు కట్టుకోను? వాడు నాతో ఉంటే పనులు చేసి పెడుతుంటాడు నమ్మకంగా. నాకు సౌకర్యంగానే ఉంటుంది. వాడి చదువు నాశనమవుతుంది. వాడు నాతో వచ్చింది బాగా చదువుకోవాలని కాని, నాకు సేవలు చేసేందుకు కాదు. నావల్ల వాడు చెడిపోగూడదు. వాడి చదువు నాశనం కాకూడదు.

చిత్తూరులో నాకు తెలిసిన వాడొకడున్నాడు. ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. నరసింహులు రూము బాడుగకు తీసుకుని ఒంటరిగానే ఉంటున్నాడు. వాడి రూములో ఉండి పోతాను. ఒకరికొకరం తోడుగా ఉంటాము. ఏ పరిస్థితుల్లోనూ ఇక్కడ మాత్రం ఉండను. ఉండలేను. ఉండకూడదు. ఉండాల్సిన అవసరం కూడా లేదు. శ్రీనివాసులు నాకు సహాయం చేస్తానన్నాడు. ఎ గుడ్ ఫెలో.

ఇదే ఆలోచన. నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ మధ్య మధ్యలో గుడ్లగూబల అరుపులు. చల్లని ఈదురుగాలి. ముళ్ళచెట్లలోంచి దూసుకొస్తూ అది చేసే ధ్వని.

ఉదయం అయిదు గంటలకే లేచి కూచున్నాను. ఇబ్రహీంకు మెలకువ రాలేదు.

నేను కాలకృత్యాలు తీర్చుకొని వచ్చాను. ఆలోగా ఇబ్రహీం నిద్రలేచి చాప చుట్టి మూల పెట్టాడు. దుప్పట్లు మడతపెట్టి ట్రంకుపెట్టెమీద ఉంచి, గది బయటికొచ్చి నుంచొని ఉన్నాడు. అతన్నీ కాలకృత్యాలు తీర్చుకొని రమ్మని పంపాను.

స్కూలు ప్రారంభమైందాకా ఉండి పిల్లలనూ, మిగిలిన టీచర్లనూ చూసిపోవటమా? లేకపోతే ఎవరికీ కనిపించకుండా వెళ్ళిపోవటమా? ఇది నా తక్షణ సమస్య. ఆలోచిస్తూ గది గడపమీద కూర్చున్నాను.

ఇంతలో శ్రీనివాసులు ఒక చెంబు, రెండు గ్లాసులు తీసుకువచ్చాడు. చెంబు లోది కాఫీ అని అతను చెప్పకుండానే తెలుసుకొన్నాను. చెంబులోంచి కాఫీ ఒక గ్లాసులోకి వంచి - “చల్లారిపోతయ్ తాగండి!" అంటూ నాకందించాడు.

“ఆ పిల్లవా డేడీ ?" అంటూ దిక్కులు చూశాడు.

“కాసేపట్లో వచ్చేస్తాడు. అలా ఉంచండి” అన్నాను. చెప్పినట్లు చేసి నా ఎదురుగా నుంచున్నాడతను. “మీరిక్కడ కూచున్నారెందుకు? అలా కుర్చీ మీద కూర్చోండి అంటూ కుర్చీ చూపించాడు.

"అది హెడ్మాస్టరు కుర్చీ కదా! ప్రస్తుతానికి దాన్ని మీరే అధిరోహించండి. స్కూలు వ్యవహారాలన్నీ చూడబోయేది మీరే కదా!" అన్నాను నవ్వుతూ.

“అధికారికంగా మీరే హెడ్మాస్టరు. ఆ కుర్చీమీద మీరే కూర్చోవాలి. నేను కూచుంటే మిగతా వాళ్లూరుకుంటారా? లాగి అవతల పారేస్తారు.” అతనూ నవ్వాడు.

ఇబ్రహీం వచ్చేశాడు. అతనికి కాఫీ ఇచ్చాడు శ్రీనివాసులు.

“నన్ను ఇప్పుడే పొమ్మంటారా? స్కూలు బిగినయిన తరువాత వెళ్ళ మంటారా?” సలహా అడిగాను.

“ఇవాళ ఆదివారం కదా! స్కూలు లేదు. మీరు ఇప్పుడే వెళ్ళిపోవచ్చును. రిజిస్టరులో సంతకాలు పెట్టారా?” అడిగాడు శ్రీనివాసులు.

కోపంలో వారాలు, వర్ణ్యాలు కూడా మరచిపోయాను.

“లేదండీ. ఆవిషయమే మరిచిపోయాను. ఇప్పుడు పెట్టేస్తాను" అన్నాను రూము లోపలికి పోయి.

శ్రీనివాసులు గబగబా రూములోకి పోయి అటెండెన్సు రిజిస్టరు మిగతా ముఖ్యమైన రిజిస్టర్లు పట్టుకొచ్చాడు. సంతకాలు పెట్టాల్సిన చోట్లు చూపించాడు. నేను అన్ని చోట్లా చిన్న పెద్ద పేర్లు రాసేసుకున్నాను. "మిగతా టీచర్లతో మాట్లాడిపోతే బాగుంటుం దంటారా?" అంటూ అతనివంక చూశాను.

"ఎందుకు సార్! అనవసరం. అన్నీ నేను చూసుకుంటాను కదా! అంతగా అయితే మీరు వచ్చి పోయారని చెబుతాను' అన్నాడు ధైర్యం చెబుతూ.

“అయితే ఇక నేను బయలుదేరుతాను. దగ్గరతోవ మాకు తెలీదు. ఎవరైనా పిల్లవాణ్ణి పంపితే మాకు తోవ చూపుతాడు. ఆ పెట్టె మోసుకొస్తాడు" అన్నాను.

“ఈ గ్లాసులు, చెంబు ఇంట్లో పడేసి వస్తాను. ఎవర్నన్నా పిలుచుకొండి. మిమ్మల్ని బస్సెక్కించి వస్తాను నేను కూడా" అన్నాడు శ్రీనివాసులు. గబగబా ఇంటికెళ్ళాడు.

నేను, ఇబ్రహీం పెట్టెతెరిచి దుప్పట్లు సర్దేశాము. అప్పుడడిగానతన్ని "ఏమయ్యా ఇబ్రహీం! ఇక్కడ పరిస్థితులు చూశావుగా! ఇలాంటి చోట్ల కూడా హైస్కూళ్ళు, మిడిల్ స్కూళ్ళు ఉంటాయని నేనూ అనుకోలేదు. పాపం నీకూ తెలీదు. నువ్వు కలకడ వెళ్ళి అక్కడే చేరి చదువుకోవటం మంచిదిగాదూ ?"

“మీ ఇష్టం సార్!" అన్నాడు వాడు తలవంచుకుని.

“నా ఇష్టం నిన్ను నాతో ఉంచుకోవాలనే. కాని ఇక్కడి పరిస్థితులు చూశావుగా. నాకిక్కడ ఉండబుద్ధి పుట్టటం లేదు. ఈ నరకంలో నాతో పాటు నువ్వెందుకు బాధ పడటం? నా మాటవిని తిరిగి వెళ్ళిపో. నేను అప్పుడప్పుడూ వచ్చి నిన్ను చూస్తుంటాను. సరేనా?” అన్నాను.

వాడు వంచిన తల పైకెత్తాడు. చెంపలమీదుగా నీళ్ళు కారాయి. కర్చీపుతో తుడిచి వాణ్ణి అక్కున చేర్చుకొని తల నిమిరాను. బుజ్జగించాను. పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకున్నాను. అతను తిరిగి వెళ్ళేందుకు ఒప్పుకునేట్లు చేశాను. వాడు తిరిగి వెళ్ళిపోతే కొందరు టీచర్లు, విద్యార్థులు ఎగతాళి చెయ్యవచ్చును. కాని కొద్ది రోజులకు అన్నీ సర్దుకుంటాయి. నివారించలేని దాన్ని అనుభవించాల్సిందే. తప్పని అనుభవాన్ని సంతోషంతో, చిరునవ్వు తో స్వీకరించటం మంచిది.

శ్రీనివాసులు చొక్కా పాంటు వేసుకొన్న ఒక పొడుగాటి పిల్లవాడిని వెంటబెట్టుకొని వచ్చాడు.

ఆ పిల్లవాడు పెట్టె నెత్తి కెత్తుకున్నాడు.

పెంకుటింటి తాళంచెవి శ్రీనివాసులు దగ్గరే ఉంది. ఆయన తలుపులు మూసి తాళం వేశాడు. ఆ పిల్లవాడు ముందు నడుస్తుంటే మేము ముగ్గురం వాడిననుసరించాము.

శ్రీనివాసులు అక్కడ పనిచేసే టీచర్ల గుణగణాలను వర్ణించి చెప్పాడు తోవ పొడుగునా, నలుగురు టీచర్లకు నాలుగు పార్టీలు. కొంత మంది పిల్లలు తమ అభిమాన టీచరుకు సపోర్టుగా ఉన్నారట. పోటీ అంతా ట్యూషన్ల కోసమేనట. టీచర్లు ఇళ్ళ దగ్గర చదువు చెప్పరట. ఆ పిల్లలను ఇతర టీచర్ల మీద వేగులుగా ఉపయోగిస్తుంటారట. ఆయన గస బోసుకుంటూ చెబుతున్నా నేను వాటిని ఒక చెవిలోంచి మరో చెవి ద్వారా వదిలేస్తున్నాను. నేనక్కడ ఉంటే కదా ఈ గొడవలన్నీ! ఈ హెడ్మాస్టరుకంటే ముందు పని

చేసిన హెడ్మాస్టరు ఈ ట్యూషన్ల వ్యవహారాన్ని ప్రారంభించాడట. ఆయనకు ఆ ఊళ్ళో చాలామంది బంధువులేనట. మొట్టమొదట్లో ఆయన పథకం లాభసాటిగానే సాగినా రాను రాను పరిస్థితులు దుర్భరమయ్యాయట ఆయనకు. ఊరివాళ్ళు, ఆయన బంధువులతో సహా అతని ఇంటిమీదికి దండ యాత్ర చేశారట. ఇక్కడ అలా సంపాదించిందంతా లంచం క్రింద ఇచ్చి అక్కడినుంచి బదిలీ చేయించుకున్నాడట. ఆ తరువాత ఇతగా డొచ్చిం దాకా తానే స్కూలుకు ఇన్చార్జీగా పని చేశాడట. పరిస్థితుల్లో ఏ విధమైన మార్పూ తీసుకురాలేకపోయానని వాపోయాడు పాపం.

ఆ స్కూలు గొడవలన్నీ వింటూ వచ్చాను. త్వరలోనే రోడ్డులోకి చేరాము. శ్రీనివాసులు చెప్పిన స్కూలు పురాణం మార్గాయాసం కలక్కుండా చేసింది.

రోడ్లోకి చేరిన తరువాత ఆధునికతకు చేరువయినట్లు ఫీలయ్యాను. హాయిగా ఉంది మనసు. జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించుకొని గుండె నిండా పొగ పీల్చి వదిలాను. పంజరంలోంచి విముక్తి పొందిన పక్షిలా ఉంది నా పరిస్థితి!

శ్రీనివాసులుకు చిత్తూరులో నా అడ్రసు ఇచ్చాను. అవసరమైతే ఆయన రావడమో, ఉత్తరం రాయటమో చెయ్యమన్నాను. వారం రోజులకు తేదీలు వెయ్యకుండా రాసి సంతకం పెట్టిన లీవు లెటరు ఆయనే నా దగ్గర రాయించి తీసుకున్నాడు. గొడ్డుచాకిరీ చెయ్యటమే తప్ప వృత్తిలో ఉన్న ఈ కిటుకుల్ని నేను నేర్చుకోలేదు. ఇప్పుడు జిల్లా పరిషత్తు వారి పుణ్యాన కొత్త పాఠాలు నేర్చుకుంటున్నాను!

హారన్ మోగించుకుంటూ బస్సు వచ్చింది. పిల్లవాడు పెట్టెను బస్సులోకి చేర్చాడు. నేను, ఇబ్రహీం బస్సులోకి ఎక్కాము. చెయ్యి ఊపుతూ శ్రీనివాసులకు వీడ్కోలు చెప్పాను.

3

పది గంటలకల్లా బస్సు చిత్తూరు చేరింది. మధ్య షోళింగర్లో టిఫిన్ చేశాము కడుపునిండా.

బస్సు దిగి నేరుగా నరసింహులు రూముకు రిక్షాలో వెళ్ళాము. ఆదివారం కాబట్టి నా అదృష్టం కొద్దీ అతను రూములోనే ఉన్నాడు, నన్ను చూసి సంతోషంతో లోపలికి ఆహ్వానించాడు. నా యోగక్షేమాలు విచారించాడు. ఇబ్రహీం గురించి వాకబు చేశాడు. నా విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పాను. చివరికి "పిల్లల దగ్గర డబ్బులు వసూలు చేసుకొని తినేసిన హెడ్మాస్టరుకు ఏవిధమైన శిక్ష వేశారో అదే విధమైన శిక్ష పిల్లల దగ్గర డబ్బులు వసూలు చెయ్యకూడదని చెప్పిన హెడ్మాస్టరుకు కూడా వేశారయ్యా మా జిల్లా పరిషత్తువాళ్ళు! ఏది ధర్మమో, ఏది అధర్మమో, ఏది తప్పో, ఏది ఒప్పో తేల్చుకోలేకపోతున్నాను" అంటూ అతని మంచంమీద వెనక్కు వాలి పడుకున్నాను.

"పిల్లలను మోసం చేసి డబ్బు లాక్కోటమే రైటు. అతనికి కోరిన చోటుకు బదిలీ ఇచ్చారుకదా. ఇప్పుడు మీరు ఏం లంచమిచ్చి ఆ ఊళ్ళోంచి బయట పడతారు? ఆయన దగ్గర ఎలాగోలా సంపాదించిన డబ్బున్నది కాబట్టి కార్య సాధన చేసు కున్నాడు" అన్నాడు నరసింహులు నవ్వుతూ.

“నువ్వూ డెవిల్ వర్షిపర్వేనన్నమాట. పోన్లే. ఆవెధవ ఊరినుంచి వచ్చేశాను కదా! చిత్తూరు విశేషాలేమైనా చెప్పు" అన్నాను హుషారుగా.

అతను ఆ ఊళ్ళో ఉన్న మంచి వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ హోటళ్ళ గురించి, అప్పుడు ఆడుతున్న అరవ తెలుగు సినిమాల గురించి చెప్పాడు.

“ఆ ఊర్నించి బదిలీ అయిందాకా నీరూములోనే ఉంటానయ్యా. రూము రెంటు వగైరాలు మీతో సమానంగా భరిస్తాను.” నరసింహులుతో బాటు రాజేంద్ర అని మరొకతను ఉంటున్నాడట ఆ రూములో. "మీ ఇష్టం ఉన్న న్నాళ్ళు ఉండండి సార్! మాకేం అభ్యంతరంలేదు" అన్నాడు నరసింహులు.

ఇబ్రహీం దగ్గర పెట్టి తెరిపించి అందులోంచి నా గుడ్డలు, పుస్తకాలు తీసుకున్నాను. ఆ గదిలో పడేశాను వాటిని.

రిక్షాలో ఒక మంచి హోటలుకు పోయి భోంచేశాము. అక్కడి నుంచి బస్టాండుకు పోయి ఇబ్రహీంను కలకడకు పోయే బస్సులో కూచోబెట్టాను. అతనికి పది రూపాయలు ఇవ్వబోయాను కాని అతను తీసుకోలేదు. బస్సు త్వరగానే బయలుదేరింది. బాష్ప పూరిత నయనాలతో ఒకరికొకరం మౌనంగా వీడ్కోలిచ్చుకున్నాము.

బరువెక్కిన గుండెతో రూముకు తిరిగొచ్చి మంచంమీద పడుకున్నాను. పాత న్యూస్ పేపరు ఒకటి దొరికితే అది చదువుతూ చదువుతూ నిద్రపోయాను.

నిన్నంతా మానసికంగానూ, శారీరకంగానూ చాలా శ్రమ పడ్డందుకు కాబోలు గాఢంగా నిద్రపట్టింది. నేను లేచేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. నరసింహులు నన్ను లేపకుండానే భోజనానికి వెళ్ళినట్లున్నాడు. రూములో లేడు. రూము తాళంచెవి నా దగ్గరొకటుంది. నేను లేచి ముఖం కడుక్కొని, బట్టలేసుకొని భోజనానికి హోటలుకెళ్ళాను.

నేను భోంచేసి తిరిగి వచ్చేసరికి పది గంటలైంది. నరసింహులు, రాజేంద్ర ఏవో విషయాలు మాట్లాడుకుంటూ ఉన్నారు పడుకొని. నేను వాళ్ళ సంభాషణలో భాగం పంచుకున్నాను. వాళ్ళు త్వరగానే నిద్ర పోయారు. నాకు ఆలస్యంగా నిద్ర పట్టింది.

"ఇలా ఒంటరిగా ఉండేకంటె పెళ్ళి చేసుకొని ఉంటే బాగుండేది. నాదంటూ ఒక ఇల్లుండేది. ఇలాంటి సమయాల్లో 'మనసున మనసై. బ్రతుకున బ్రతుకై'న తోడొకటుంటే ఎంత బాగుండేది! ఆవిడ కూడా ఉద్యోగస్తురాలైతే మరింత బాగుండేది!" ఇలా ఆలోచిస్తూ నిద్రపోయాను.

4

ఉదయం ఆలస్యంగా నిద్ర లేచాను. నేను లేచేసరికి రూము ఖాళీగా ఉంది. రూమ్మేట్సు ఇద్దరూ టిఫినుకు వెళ్ళినట్లున్నారు. నన్ను కూడా లేపి తమతో బాటు తీసుకుపోయుంటే వాళ్ళ సొమ్మేం పోయేదో!

కాలకృత్యాలు తీర్చుకొని టిఫినుకు హోటలు కెళ్ళాను. పేపరొకటి కొనుక్కొని రూముకొచ్చాను. వాళ్ళు అప్పుడే తమ కార్యస్థానాలకు వెళ్ళి పోయినట్లున్నారు. నేను ఒంటరిగానే రూములో మిగిలిపోయాను. పేపరు పేరు మొదలు కొని 'ఎడిటెడ్ ఎండ్ పబ్లిష్డ్ బై' వరకు మొత్తం చదివేశాను. ఎడ్వర్టైజుమెంట్లు చూస్తూ ఎక్కువ కాలమే గడిపాను. వేగంగా చదవటం నాకలవాటు. ఇప్పుడది నా పాలిటి శాపమై కూచున్నది. గంటన్నరకల్లా పేపరు మొత్తం చదివేశాను. చేసేందుకేమీ పని లేదు, మంచంమీద రూము పైకప్పుకేసి చూస్తూ పడుకున్నాను.

నా ఉద్యోగ పరిస్థితులు నన్ను వెంటాడుతున్నాయి. ఆ దరిద్రపు కొంపనుంచి బయట పడటం ఎలా? లంచం ఇచ్చి పని జరిపించుకుందామా - డబ్బేదీ? అసలు అది ఇవ్వటం ఎలాగో తెలీదే! నా కన్యాయం చేసిన వెధవలను కానుకలతో సత్కరిం చటమా? నో, నెవర్. ఐకెన్ నెవ్వర్ బి ఎ డెవిల్ వర్షిపర్! ఎవడయినా రాజకీయ నాయకుణ్ణి పట్టుకుంటే పనవుతుందేమో? మన కులం వాడెవడూ లేడే! కనీసం పది ఓట్లయినా వెయ్యరు నా మాట విని. ఇక ఏ ఆశతో ఏ రాజకీయ నాయకుడు నాకు సహాయం చేసేందుకు ముందుకొస్తాడు? ఆ స్కూలు కమిటీవాళ్ళే మాకీ హెడ్మాస్టరు వద్దని ఆందోళన జరిపేలా చేస్తే సరి! ఆ తాగుబోతుల్లో అంతమాత్రం చైతన్యం కూడానా? జిల్లా పరిషత్తు అధికారులకు మరింత ఆగ్రహం కలిగేలా ప్రవర్తిస్తే? ఎలా ప్రవర్తించటం? మంచి పనులు చెయ్యటం ద్వారా కలిగించ వచ్చునని అనుభవం చెబు తున్నది. అక్కడికి పోయి పని చెయ్యటమా? ఛఛ! ఆ ఊరంటేనే, ఆ స్కూలంటేనే వెగటు పుడుతున్నది! పోలేను. ఉండలేనక్కడ. మరి నేను బయటపడే మార్గమేది? ఏది? ఏది? ఏమో! తెలీదు. తెలీటం లేదు.

ఆలోచనలు. ఎడతెగని ఆలోచన్లతో కుతకుతలాడుతున్నది మనసు. రూము లో ఉండ బుద్ధికాలేదు. పైగా భోజనానికి టైము కూడా అయింది. రూముకు

తాళం వేసి బయటపడ్డాను. బజార్లవెంట కొంతసేపు తిరిగి భోంచేసి రూము కొచ్చాను. పేపరు మరో మారు చదివాను. ఈ సారి మరింత తొందరగా పూర్తయింది. పడుకున్నాను.

మళ్ళీ అవే ఆలోచనలు. కనీసం ఉద్యోగం చేసే పెళ్ళామైనా లేదు నాకు. భార్యాభర్తలను విడదియ్యటం పాపం కాబట్టి వాళ్ళను సాధ్యమైనంతవరకు ఒకేచోట ఉండేటట్లు చూడా లంటూ గవర్నమెంటు ఆర్డరుంది. ఆవిడ మరోచోట పనిజేస్తూ ఉంటే నన్నూ అక్కడికే వెయ్యమని పట్టుబట్టి ఉండ వచ్చును. ఆవిడ టీచరై ఉండకూడదు. ఏ పోస్టలు డిపార్టుమెంటులోనో పని చేస్తూ ఉండాలి. టీచరైతే ఇద్దరూ అక్కడే ఉండండని దయజూపుతారు అధికారులు. అంత చిన్న ఊళ్ళో సబ్ పోస్టాఫీసు ఉండి ఉండదు. బ్రాంచి ఆఫీసు కూడా ఉందో, లేదో.

ఈ ఆలోచనలతోనే నాల్గు గంటలైంది టైము. పట్టణ సంచారానికి బయలు దేరవచ్చును. ముఖ ప్రక్షాళనాదికాలు ముగించుకొని బట్టలేసుకొని బయలు దేరాను. కాఫీ తాగి గిరింపేట దాకా నడిచాను. నడక ఆరోగ్యానికి మంచిదని గాంధీ మహాత్ముడు కూడా చెప్పాడు. తిరిగి వస్తూ తోవలో కనిపించిన సినిమా హాల్లోకి దూరాను టికెట్టు కొనుక్కొని. తీరా అది అరవ సినిమా.

అరవం నాకు బొత్తిగా రాదు. హీరో ప్రతిదానికీ పెద్దపులిలా గాండ్రి స్తున్నాడు. వాడు జేబులు కొట్టే కే.డి.లా ఉన్నాడు కాని నాయకుడిలాగా కనిపించలేదు. పూర్వం హీరో అందగాడుగా, కోమలమైన ముఖం కలవాడుగా ఉండేవాడు. పూర్వపు విలన్లాగా కనిపిస్తున్నాడు ఇప్పటి హీరో. జయమాలిని, జ్యోతిలక్ష్మి డాన్సులు కూడా లేవు. అన్నీ ఫైటింగులే. వాళ్ళెందుకు కొట్టుకుంటున్నారో అర్థమై చావటం లేదు. లేచి పోదామను కున్నాను. పోయి ఏం చేయాలి? డబ్బులు పెట్టి టికెట్టు కొన్న నేరానికి అయిపోయిందాకా చూడాల్సిందే. ముందే అన్నీ చూసుకొని టికెట్టు కొని ఉండాల్సింది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుంటే ఏం లాభం? ఆకలిగా కూడా లేదు. ఈ పూటకు ఒక అరటిపండు తింటే సరిపోతుంది.

సినిమా అయిపోయిందాకా కూచున్నాను. అయిపోయిన తరువాత నడచి పోయి రూము దగ్గర బంకులో అరటిపండు కొనుక్కొని తిని రూముకు చేరాను.

"భోజనమైందా సార్?" ముక్తకంఠంతో అడిగారు నరసింహులు, రాజేంద్ర.

"చేసే వస్తున్నాను." అబద్ధం చెప్పాను.

వర్తమాన రాజకీయాల గురించి కొంతసేపు వాడిగా వేడిగా చర్చించుకొని నిద్ర పోయాము.

కాలం స్తంభించదు. తిరిగి తెల్లవారింది. స్నానపానాలు ముగించుకొని నరసింహులు, రాజేంద్ర వాళ్ళ వాళ్ళ పనులమీద వెళ్ళిపోయారు. నాకేమీ పని లేదు కాబట్టి నిదానంగా లేచాను. కాలకృత్యాలు తీర్చుకొని రూముకు తాళం వేసి బయలుదేరాను. హోటల్లోవీలైనంత ఎక్కువ టైము తీసుకొని టిఫిన్ చేశాను. పేపరు కొనుక్కున్నాను. అక్కడే హెడ్లైన్స్ చూడాలని పించింది. గాని, ఆ కోర్కెను అణచి వేసుకున్నాను. ఇప్పుడే చదివేస్తే రూములో చదివేందుకు ఏమీ ఉండదు. దాన్ని మడిచి చేతిలో పట్టు కున్నాను. కొంతసేపు పట్టణ సంచారం చేద్దామని బయలుదేరాను.

బస్ స్టాండు మీదుగా గిరింపేటకు పోయి వద్దామని బయలుదేరాను. అక్కడో మిత్రుడున్నాడు. అతనితో కాసేపు కాలక్షేపం చేద్దామని ఆలోచన. టైము సరిగ్గా పది గంటలైంది. నిదానంగా నడుస్తూ వెళ్ళాను. జిల్లా పరిషత్తు కార్యాలయం దగ్గర సైకిలుమీద పోతూ డిప్యూటీ సెక్రటరీగారు కనిపించాడు. ఆ మహానుభావుడే నామీద అంత మంది ప్రజల సమక్షంలో ఎంక్వయిరీ జరిపింది. ఆయన నన్ను చూశాడు. చూడనట్లు తలతిప్పేసు కున్నాడు. వృత్తిపరంగా ఆయనా టీచరే. మా క్వాలిఫికేషన్లు ఒకటే. కాని ఆయన యాక్సిడెంటల్గా ఆ సీట్లో కూచున్నాడు. ఆయన అధికారానికి లోబడి నేనున్నాను. జిల్లా పరిషత్తులో విద్యావిషయిక వ్యవహారాలు

చూసేందుకు నియమించిన టెక్నికల్ మాన్. ఆయన టెక్నిక్కంతా ఇంటికి కోళ్లు, పిల్లులు తెప్పించుకోవటానికి, ఎవరి సంక్షేమం చూసేందుకు నియమితుడయ్యాడో వాళ్ళను పీల్చి పిప్పి చేసేందుకు ఉపయోగ పడుతున్నది.

కలకడ వచ్చాడు. నేను చేస్తున్న, చేసిన పనంతా చూశాడు. అంతమంది ప్రజలు నా పక్షాన మాట్లాడారు. ఇంత జరిగినా అతను నా గురించి మెచ్చుకోలుగా ఒక్కమాట మాట్లాడాడా? లేదే! పైగా పోతూ పోతూ ఇంటికొచ్చి కనిపించమని చెప్పాడు. ఎందుకు రమ్మన్నాడో నాకు తెలుసును.

ప్రతిరోజూ ఈ టైములో ఇటు వస్తే అతనికి కనిపించవచ్చు నన్నమాట. స్కూల్లో ఉండాల్సిన టైములో ఇక్కడ తిరుగుతున్నావేమయ్యా?" అని అడుగుతాడేమో చూడాలి! అతగాడిని చూసిన తరువాత ఆగ్రహంతో ఒళ్ళంతా చెమటకారింది. తడిసింది నా గుడ్డలే! అతనికేం. లక్షణంగా వెళ్ళిపోయాడు. ఆపైకి గిరింపేటకు పోయే ఆలోచన మానుకొని తిరిగి రూముకొచ్చేశాను. పేపరు చదివాను కాసేపు. కాసేపు రూము ద్వారం లోంచి బయటికి చూస్తూ పడుకున్నాను. తరువాత భోజనం. నిద్ర. సాయంత్రం సినిమా.

రోజూ ఉదయంపూట జిల్లా పరిషత్తు ఆఫీసు దగ్గర డిప్యూటీ సెక్రెటరీగారికి కనిపిస్తూనే ఉన్నాను. ఆయన చూసీచూడనట్లుగా తల తిప్పేసుకొని పోతున్నాడు. నేనతనికి 'విష్' చెయ్యటం లేదు. బహుశా అందుకు కోపంగా ఉండి ఉంటాడు. ఆ కోపాన్నయినా నామీద ప్రదర్శించవచ్చును గదా! ఎలా ప్రదర్శిస్తాడు? నాకు తనవల్ల అన్యాయం జరిగిందని అతనికి తెలుసు. అతని అంతరాత్మ 'నువ్వు' చేసింది తప్పు అని చెబుతూనే ఉండి ఉంటుంది గిల్టీ కానన్సెస్!

రోజులు ఒకేవిధంగా గడుస్తున్నాయి. చిత్తూర్లో వీధులన్నీ తిరిగి తిరిగి కాళ్ళురుగు తున్నాయి. అక్కడ నాకు తెలిసినవాళ్ళు కూడా బహు కొద్ది మంది మాత్రమే. వాళ్ళను ఈపాటికి నాలుగైదుసార్లు చూశాను. అందరూ

తమ తమ పనులు చేసుకుంటూ ఉత్సాహంగా ఉన్నారు. నేనే ఏ పనీ లేకుండా తిరుగుతున్నది!

పే శ్రీనివాసులు వచ్చాడు రూముకు. టీచర్స్ అటెండెన్సు రిజిస్టరు, పే బిల్సు, మంత్లీ స్టేట్మెంట్లు అన్నీ తీసుకొచ్చాడు నా సంతకాల కోసం.

అన్ని కాయితాలమీదా నా పేర్లు రాసేశాను. ఆయన వాటినన్నింటినీ భద్రంగా కవర్లలో పెట్టి మూసేశాడు. "వీటిని ఇక్కడే జిల్లా పరిషత్తు పోస్టు బాక్సులో పడేస్తాను" అన్నాడు. "మీరేం చేసినా నాకభ్యంతరం లేదు" అని చెప్పాను.

శ్రీనివాసులు ఆ రోజంతా నాతోనే ఉన్నాడు. ఆ ఊరి విషయాలు, ఆ స్కూలు విషయాలు, ఆ స్కూలు టీచర్ల విషయాలు అన్నీ చెప్పాడు.

ఆయన చెప్పిన వాటిలో కొత్తదనం ఏమీ లేదు. నథింగ్ గుడ్ కమ్స్ అవుటాఫ్ నాజరెత్' అన్నట్లు 'నథింగ్ గుడ్ ఎబౌట్ జంబాడ'.

"మీరు చార్జి తీసుకొని పదిహేను రోజులకు పైగా అయింది. మీరొకరోజు వస్తే బాగుంటుంది. పాత హెడ్మాస్టరు వారానికి ఒక రోజు తప్పనిసరిగా వచ్చేవాడు పాపం!' అన్నాడు శ్రీనివాసులు.

"నేనూ వారానికోసారి వస్తే మనం సాధించిన అభివృద్ధి ఏముంటుంది చెప్పండి. 'అతని కంటె ఘనుడితండు' అనిపించుకోవద్దూ?" గట్టిగా నవ్వాన్నేను.

ఆయనకు నవ్వు రాలేదు.

"మీరు వచ్చి ఆఫీసు పనులైనా-అదే సంతకాలు పెట్టటం వగైరాలు అక్కడే చేస్తారను కున్నాను. కాని మీరు రాలేదు. ఇక ఏం చేసేది? అన్నీ నేను మోసుకొచ్చాను"అన్నాడు శ్రీనివాసులు.

కొండ మహమ్మదు దగ్గరి కొచ్చిందన్నమాట నాలో నేననుకున్నాను గర్వంగా ఫీలవుతూ.-

"కొత్త హెడ్మాస్టర్ను ఒక్కసారైనా చూడలేదని టీచర్లు, పిల్లలు అంటున్నారు. ఊరివాళ్ళు కూడా కొందరు అడిగారు నన్ను. "ఆయనకు చిత్తూర్లో చాలా పనులున్నాయట. అవి చూసుకొని వస్తానన్నాడు" అని వాళ్ళకు చెబుతున్నాను".

అవునవును. చిత్తూర్లో నాకు చాలా పనులున్నాయి. లోలోపల అనుకున్నాను.

"స్కూలు కమిటీ ప్రెసిడెంటు, మెంబర్లు మీతో మాట్లాడాలని అన్నారు".

"ఏం మాట్లాడతారట? వాళ్ళు జిల్లా పరిషత్తుకు పోయి మాకీ హెడ్మాస్టరు అక్కర్లేదని చెప్పగూడదూ? ఎవరయినా మంచి హెడ్మాస్టర్ని చూసి వేయించుకోగూడదూ! నా సమాచారం తెలిసిపోయిందిగా! ఇంకా మాట్లాడేదేముంటుంది?" అన్నాను.

"మీరు ఒకసారి వస్తే బాగుంటుంది. అడిగేవాళ్లకు చెప్పటం కష్టంగా ఉన్నది" అన్నాడు శ్రీనివాసులు.

"వచ్చే వారం వీలైతే వస్తానెండి. అలాగే వాళ్ళకు చెప్పండి. ఈలోగా వాళ్లు నన్ను ట్రాన్స్ఫర్ చేయించేందుకు ప్రయత్నిస్తే బాగుంటుంది. మీరు కూడా వాళ్ళకు సలహా ఇవ్వండి." శ్రీనివాసులను చూస్తూ నవ్వాను.

చిత్తూరులో నేను చాలా సంతోషంగా, హాయిగా ఉంటున్నట్లు అతననుకునే లాగే మాట్లాడాను. నేను ఫీలవుతున్న ఒంటరితనం, పడుతున్న మనోవ్యథ మచ్చుకైనా అతనికి కనిపించనివ్వలేదు.

ఆరోజంతా శ్రీనివాసులు నాతోనే ఉన్నాడు. అతను వెళ్ళిపోతానన్నాపోనివ్వ లేదు. అతనికి అతిథి మర్యాదలు చక్కగా చేశాను. నా ఖర్చుతో భోజనం, టిఫిను పెట్టించాను. రాత్రి ఇద్దరం సినిమా చూశాము. అతనూ జేబులోంచి పది రూపాయల కాయితం బయటికి తీశాడు. ప్రతిసారీ నేనతన్ని ఖర్చు పెట్టనివ్వలేదు. రాత్రి అతను పడుకునేందుకు మంచం ఇచ్చి నేను కింద పడుకున్నాను. నరసింహులు తన మంచం నాకిచ్చి తను కిందపడు కుంటున్నాడు పాపం.

మర్నాడు ఉదయం శ్రీనివాసులు సంతోషంగా వెళ్ళిపోయాడు. ఒకసారి రమ్మని మరీ మరీ చెప్పిపోయాడు. త్వరలో వస్తానని మాత్రం చెప్పాను.

వస్తానని చెప్పానేగాని పోలేదు. పోబుద్ధి పుట్టలేదు. పొయ్యేందుకు ధైర్యం చాలలేదంటే బాగుంటుందేమో! ఎవరూ లేనప్పుడు చార్జి తీసుకొని ఎవరికీ కనిపించకుండా వచ్చే శాను. పని చేస్తున్నట్లు దాఖలాగా అటెండెన్సు రిజిస్టరులో సంతకాలు పెట్టాను. నేను చేస్తున్నది తప్పే. తప్పులే ఒప్పులుగా చలామణి అవుతున్న కాలం కదా ఇది. జీతం చెక్కు తీసుకొని వచ్చాడు శ్రీనివాసులు. ఇద్దరం పోయి పుత్తూరులో దాన్ని మార్చాము. నా డబ్బులు నేను తీసుకొని మిగిలింది అతనికిచ్చి పంపించాను. తనతో రమ్మని బలవంతం చేసాడు శ్రీనివాసులు. మరోవారంలో తప్పక వస్తానని చెప్పి పంపించాను నమ్మకంగా.

5

చిత్తూరులో ఒంటరిగా తిరుగుతూ మొనాటనీని ఫీలయ్యేకంటే ఒకసారి జంబాడకు పోయి వస్తే ఏం అనుకున్నానొక రోజున. శ్రీనివాసులు కూడా "మీరొకసారి రండి" అంటూ ఉత్తరాలు రాస్తున్నాడు, వచ్చినప్పుడల్లా చెబుతున్నాడు.

స్కూల్లో ఏమాత్రం పనిచెయ్యకుండానే మూడు జీతాలు తీసుకున్నాను. రోజూ చూస్తున్నా డిప్యూటీ సెక్రటరీగారు అభ్యంతరాలు చెప్పకుండా జీతం చెక్కులు పంపిస్తున్నారు బిల్లులు పాస్ చేసి.

ఆ ఊరు పోవాల్సి వచ్చినప్పుడు పోయి అక్కడి విషయాలు చూసి, ఆ ఊరిని విపరీతంగా అసహ్యించుకున్నాను. ఇప్పుడు అసహ్యం చోట్లోకి భయం వచ్చి చేరి పోయింది. పని చెయ్యకుండానే జీతం తీసుకుంటున్న హెడ్మాస్టర్ను చూసి పిల్లలు నవ్వు కుంటారు. టీచర్లు తేలికగా చూస్తారు. ఊరివాళ్ళు 'దొంగ' అనే బిరుదును ప్రసాదించినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఇదో కొత్త సిచ్యుయేషన్. నాకై నేను కల్పించుకున్నది. దీంట్లోంచి బయట పడాలి. తప్పదు. ఏమైతే అవుతుంది. ఒకసారి ఆ ఊరికిపోయి రావటం మంచిదనిపించింది. మర్నాడు ఉదయమే పోదామని నిశ్చయించుకున్నాను.

ఉదయం ఏడు గంటలకే బయలుదేరాను. తిరుత్తనిలో భోంచేసి జంబాడ చేరేసరికి పన్నెండు గంటలయింది.

నేరుగా స్కూల్లోకి పోయాను. నన్ను చూసిన శ్రీనివాసులు ముఖం చేటంత యింది. ఎదురుగా వచ్చి నన్నాహ్వానించాడు. హెడ్మాస్టరు కుర్చీలో బలవంతాన కూర్చో పెట్టాడు.

స్కూల్లో ఉన్న నలభై మంది పిల్లల్నూ తీసుకొచ్చి - "మన కొత్త హెడ్మాస్టర్రా!" అంటూ పరిచయం చేశాడు. వాళ్లంతా "నమస్తే సార్!" అన్నారు కోరస్ పాట పాడుతున్నట్లు.

స్కూల్లో మిగతా టీచర్లెవరూ లేరు. అందరూ ముందుగానే వెళ్ళిపోయి నట్లున్నారు. వాళ్లేమైనారని అడిగే అధికారం నాకు లేదు. అయినా ఊరికే ఉండలేక - "మిగతా టీచర్లు ఏమైనారండి?" అన్నాను శ్రీనివాసులుతో.

"వంట చేసుకోవాలి గదండీ వాళ్ళు. అందుకని రెండు పిరీడ్లు ముందుగానే వెళ్ళి పోయారు. రోజూ ఇంతే. ఒంటిగంటదాకా నేనే తంటాలు పడు తుంటాను" అన్నాడు శ్రీనివాసులు నవ్వుతూ.

స్కూల్లో పనిచేస్తున్న టీచర్లందర్నీ నాతో సహా తీసేసి అందరి జీతాలూ శ్రీనివాసులుకు ఇవ్వటం ధర్మం అనిపించింది నాకు.

"మీరివాళ ఎలాగో వచ్చారు. మీరు వస్తారని నేననుకోలేదు" అన్నాడతను.

"మాటిమాటికీ మీరు రమ్మంటున్నారు కదా! రాకపోతే మీరు బాధ పడతారని వచ్చాను" అన్నాను. అది నిజం కాదు.

"మీరు వచ్చినందుకు సంతోషంగా ఉంది సార్!" అన్నాడతను. "నాకూ సంతోషం గానే ఉంది" అన్నాను.

అలా అనటానికి కారణం లేకపోలేదు. ఎదరుచూసిన గర్వభంగం జరగలేదు నాకు. టీచర్లు లేకుండా పోవటం కూడా మంచిదే అయింది. ఉంటే వాళ్ళ చూపులు, వ్యాఖ్యానాలు భరించటం కష్టంగా ఉండేది. పిల్లలు కూడా మంచి క్రమశిక్షణలో ఉన్నారు. 'గురువును పూజింపుము', 'పెద్దలను గౌరవింపుము' వగైరా గోడలమీద సూక్తులు వాళ్ళ మస్తిష్కాల్లో గాఢంగా నాటుకొని ఉంటాయి. గురువుగారికి కోపం తెప్పిస్తే కొట్టి చంపుతాడనే భయం నరనరాన ప్రవహిస్తుంటుంది. ఉపాధ్యాయుల సంక్షేమానికి ఇవి చాలా అవసరం. పిల్లలను మంచి డిసిప్లిన్లో ఉంచినందుకు శ్రీనివాసులకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఇంతవరకు బాగానే ఉంది నా పరిస్థితి. కాస్త కుదురుకున్న తరువాత ఎటువంటి ఆఘాతాలనైనా స్థైర్యంతో ఎదుర్కోవచ్చు.

ఒంటిగంటకు మార్నింగ్ సెషన్ పూర్తయింది. గంట మోతవినగానే పాక లోంచి బయటికి దూరి ఇళ్ళకు పరుగులు తీశారు పిల్లలు. గాల్లో కొట్టుకు పోతున్న గుడ్డపేలికల్లా కనిపించారు నాకు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు - అన్నీ ఒక్క పాకలోనే.

భోజనానికి రమ్మంటూ బలవంతం చేశాడు నన్ను శ్రీనివాసులు. నేను తిరుత్తనిలో భోంచేసి వచ్చానని చెప్పాను. చాల నొచ్చుకుంటూ వెళ్ళాడతను.

రెండు గంటలకు మధ్యాహ్నపు స్కూలు ప్రారంభమయ్యేది. ఒక గంటసేపు నేను ఒంటరి గా ఉండాలి. ఆ సమయంలో అటెండెన్సు రిజిస్టరులో సంతకాలు పెట్టాను. కాసేపు గది గోడలను తనిఖీ చేశాను. ఒక మూల కాంపొజిషన్ పుస్తకాల కట్టలు న్నాయి దుమ్ము పట్టి. వాటిలో కొన్ని తీసుకుని చూశాను. పోయిన సంవత్సరం పుస్తకాలివి. ప్రతి పుస్తకంలోనూ మొదటి పేజీలో 'విద్యార్థి విధులు' అనే విషయంగా రాశారు. దాన్ని టీచరు దిద్దలేదు. మిగిలిన పేజీలన్నీ ఖాళీగానే ఉన్నయి. కాసేపు బయటికొచ్చి నుంచున్నాను. పూరిపాక నుంచి చూశాను. చుట్టూ ముసురుకున్న ముళ్ళచెట్లను చూశాను.

పిల్లలు ఒకరొకరుగా స్కూలుకు తిరిగి రావటం మొదలైంది. నేను రూములోకి పోయి కూచున్నాను.

ఒక టీచరు ఈల వేసుకుంటూ హుషారుగా ఆఫీసు రూములోకి వచ్చాడు. అతన్ని చూసి గతుక్కుమన్నాన్నేను. నన్ను చూసి అతను గతుక్కుమన్నాడు. లిప్తకాలంలో ఇద్దరం తేరుకున్నాము. అతనే నవ్వుతూ దగ్గరకు వచ్చి - మీరు కొత్త హెడ్మాస్టరా? నమస్తే సార్!" అన్నాడు.

“ఇంకా కొత్తేమిటీ? మూడు నెలలకు పైగా పాత" అంటూ ప్రతి నమస్కారం చేశాను. “మేము చూసింది ఇప్పుడే కద. మాకు కొత్తే" అన్నాడతను ఇక ఇక్కడే ఉండి పోతారా?"

“ఇక్కడా? ఈ నరకంలో మీరుంటున్నది చాలకనా? ఇక్కడ ఉండే ప్రశ్నే లేదు.

ట్రాన్స్ఫర్ కోసం ట్రై చేస్తున్నాను. త్వరలో వస్తుందనే అనుకుంటున్నాను. తప్పకుండా వస్తుంది." కోతలు కోశాను.

"మీరు అదృష్టవంతులు సార్! హాయిగా స్కూలుకు రాకుండానే ...... అంటూ తన క్లాసు అటెండెన్సు రిజిస్టరు తీసుకొని వెళ్ళిపోయాడు.

నా అదృష్టం నాకేమిస్తున్నదో అతనికి తెలీదు పాపం.

రెండు గంటల అయిదు నిమిషాలకు శ్రీనివాసులు వచ్చాడు. పిల్లవాడి చేత గంట కొట్టించి స్కూలు పని ప్రారంభించాడు.

తరువాత టీచర్లు ఒక్కొక్కరే వచ్చి నాతో వ్యంగ్యంగానే అయినా మాట్లాడి వెళ్ళారు. మొదటమాట్లాడి నతను చంగల్రాయులు. తరువాత వచ్చినవాడు మునసామి నాయుడు, మూడోవాడుగా చంగయ్య శర్మ నాలుగోవాడుగా సుబ్రహ్మణ్యం వచ్చి మాట్లాడి వెళ్ళారు.

వీళ్ళందర్ని గురించి శ్రీనివాసులు నాకు ముందుగానే చెప్పాడు. చంగల్రాయులు చాలా మిశ్చివస్ ఫెలో. మునసామినాయుడు తలబిరుసు మనిషి, చంగయ్యశర్మ రిజర్వుడు టైపు, వంటలు బాగా చేస్తాడు.

సుబ్రహ్మణ్యం డ్రిల్లు మాస్టరు. రౌడీ టైపు. స్కూలుకు హాజరు కంటే గైరుహాజరే ఎక్కువ. శ్రీనివాసులు, మునసామినాయుడు సెకండరీ గ్రేడు టీచర్లు. చంగల్రాయలు తెలుగు పండితుడు. చంగయ్యశర్మ హిందీ పండితుడు. నాకు కనిపించనిది తాగుబోతు వాచ్మన్ ఓబుల్ రాజు మాత్రమే. సుబ్రహ్మణ్యం కూడా తరుచూ తీర్థం పుచ్చుకుంటూ ఉంటాడట. పుచ్చుకున్న రోజున స్కూలుకు రాడు. ఆ రకంగా అతను స్కూల్లో పతివ్రత..

శ్రీనివాసులంటే మిగిలిన అందరికీ గిట్టనట్లున్నది. 'వాళ్ళవాలకం అలా ఉంది. అందుక్కారణం అతను బాగా పని చేస్తున్నాడని కావచ్చును, పరాధికారం పైన వేసుకొని చలాయిస్తున్నాడని కావచ్చును, ఊళ్ళో అందరి ముందూ తను లేకపోతే స్కూలు లేదన్న భావంతో సంచరిస్తున్నందువల్ల కావచ్చును. స్కూలుకు రాకుండా హెడ్మాస్టర్లు తప్పుకు తిరిగేందుకు సహాయపడతున్నాడని కావచ్చును.

టైము మూడు గంటలైంది. "ఇక నేను పోతానండీ!" అంటూ లేచాను.

"మరి కాసేపు కూచోండి సార్! మీరొచ్చారని స్కూలు కమిటీ ప్రెసిడెంటుకు చెప్పాను. ఆయన మీతో మాట్లాడాలన్నాడు. ఆయనకు చెప్పి పంపుతాను" అంటూ ఒక పెద్ద పిల్లవాణ్ణి పిలిచి - కొత్త హెడ్మాస్టరుగారు వెళ్ళిపోవాలట, మిమ్మల్ని త్వరగా రమ్మన్నారని చెప్పరా!" అన్నాడు.

వాడు పరుగుదీస్తూ వెళ్ళాడు.

ఈ కమిటీ ప్రెసిడెంట్లతో వ్యవహారం తేలిక కాదు. కాలకూట విషంలాంటి అనుభవం పొంది ఉన్నాను. ఈ నరకం స్కూలు కమిటీ ప్రసాదమే నాకు. శ్రీనివాసులు ఆ పని నాతో చెప్పి చేసి ఉంటే బాగుండేది. నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది. అలా వచ్చి ఇలా సడీచప్పుడూ లేకుండా వెళ్ళి పోదామనుకున్నాను. ఇప్పుడు వాళ్ళడగడం, నేను చెప్పడం, కోపాలు, తాపాలు, టీచర్ల సకిలింపులు, ఇకిలింపులు. ఎలా అదంతా భరించేది?

శ్రీనివాసులు మీద చాలా కోపం వచ్చింది నాకు.

"నాకు చెప్పకుండా ఈ ఏర్పాట్లు ఎందుకు చేశారండీ?" అని అడిగాను. మెత్తగానే కోపాన్ని దిగమింగుకొంటూ,

"నామీద అంత ఒత్తిడి ఉన్నది సార్! ఇప్పుడు మీరు వచ్చిన విషయం వాళ్ళకి తెలపకపోతే నన్ను ఊళ్లోంచి తరిమేసేట్లున్నారు. అసలు నువ్వే హెడ్మాస్టర్లు ఉండకుండా తరిమేస్తున్నావని నామీద విరుచుకుపడుతున్నారు. అంతా మనవాళ్ళు చేసిన నిర్వాకమే!" అన్నాడతను ముఖం మాడ్చుకొని.

పాపం ఇందులో శ్రీనివాసులు తప్పేమీ లేదని అర్థం చేసుకున్నాను. "సరేలెండి. వస్తే వస్తారు. ఏం మాట్లాడాలో నాకూ తెలుసులెండి" అని అతని రాక కెదురుచూస్తూ కూచున్నాను.

"ఇంటికి పోయి టీ తీసుకురారా!" అని చెప్పి ఒక పిల్లవాణ్ణి తన ఇంటికి పంపించాడు. చాలా సేపటినుంచీ శ్రీనివాసులు నా ఎదురుగా నుంచునే ఉన్నాడు. అతను కూర్చోటానికి సందూకు పెట్టె తప్ప మరోటి లేదు. దాని మీదనే కూర్చోమని నాలుగైదు సార్లు చెప్పాను. "పరవాలేదు లెండి సార్" అంటూ అతను నుంచొనే ఉన్నాడు.

దూరం నుంచి గట్టి గట్టిగా మాట్లాడుకుంటూ మనుషులు రావటం వినిపించింది. నా గుండె కొట్టుకొనే వేగం హెచ్చింది. నా ముఖంలో ఆందోళన కనపడనివ్వకుండా జాగ్రత్తపడుతూ కూచున్నాను. శ్రీనివాసులు గబగబా తలుపు దగ్గరకు, అక్కణ్ణించి బయటికినడిచాడు వాళ్ళను ఆహ్వానించేందుకు.

వాళ్ళందర్నీ లోపలికి నడిపించుకొని వచ్చాడు శ్రీనివాసులు. అందరూ పదిమంది దాకా ఉన్నారు యువకులు, వృద్ధులు. అందరిలోకీ కొంత హూందాగా, దర్జాగా ఉన్న తన్ని ప్రెసిడెంటుగా పోల్చుకున్నాను. మిగిలిన వాళ్ళలో ఇద్దరు ముగ్గురు చొక్కాలు వేసు కోలేదు. అడ్డపంచెలు కట్టుకొని టవలు కప్పుకొని వచ్చారు. నలుగురు యువకులు చొక్కాలు, పాంట్లలో ఉన్నారు మిగిలినవారు పొడుగు చొక్కాలు వేసుకొని పంచెకట్టు కట్టు

కున్నారు. ప్రెసిడెంటుది భారీకాయం. పొడుక్కు తగ్గ లావు ఉన్నాడు. బొద్దు మీసాలున్నాయి.

వాళ్ళను చూసి నేను కుర్చీలోంచి లేవలేదు. శ్రీనివాసులు మరొకరి సాయం తో సందూకు పెట్టెను ఇవతలికి పట్టాడు. దానిమీద ప్రెసిడెంటు, మరొక తను కూచున్నారు. యువకులు నుంచొనే ఉన్నారు. మిగిలినవాళ్ళు ప్రెసిడెంటుకు దగ్గరగా గోడకానుకొని కూచున్నారు.

అయితే నువ్వేనన్నమాట కొత్త హెడ్మాస్టరువు అన్నాడు ప్రెసిడెంట్ కోర చూపు చూస్తూ. నిజానికి వచ్చిన అందరూ కసిగానే చూస్తున్నారు నన్ను. "ఊ!" అని తలెగరేశాను.

"కొత్తేవిటన్నా? ఈపాటికి మూడు జీతాలు తినేశాడు బడికి రాకుండానే" అన్నాడు పాంటు జేబులో చెయ్యి పెట్టుకొని నిల్చున్న యువకుడు.

"మన కంటో బడిందిప్పుడే గదరా!"అన్నాడు ప్రెసిడెంటు పక్కన పెట్టెమీద కూచున్న మనిషి.

అందరూ నవ్వారు.

వాళ్ళ చూపులకు మాటలకు నాకు ఒళ్ళు మండిపోతున్నది. శ్రీనివాసులు భయం భయంగా నన్నూ, వాళ్ళనూ మార్చి మార్చి చూస్తున్నాడు.

"గవర్నమెంటు డబ్బు సిగ్గు, మానం ఉన్న వాళ్ళెవరూ తేరగా తినరు" అన్నాడు మరో యువకుడు కొరకొర చూస్తూ.

నన్ను నేను నిగ్రహించుకోలేక పోయాను. "గవర్నమెంటంటే ఏందో తెలుసునా నీకు? పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావే!" అన్నానతనితో.

"వాడి మాటలకేంలే, అయిందేదో అయిపోయింది. ఇకనుంచయినా బడికి సక్రమంగా వొస్తే బాగుంటుంది." అన్నాడు ప్రెసిడెంటు ప్రశాంతంగానే.

"ఇక్కడ బడి ఉంటే గదండీ! నేను రావటానికీ, పని చెయ్యటానికీ!" అన్నాను.

వాళ్ళ ముఖాలు తెల్లబోయాయి.

"ఇది బడిగాక మరేంటి"? అన్నాడొకరు.

"పిల్లలకు బందెలదొడ్డి, టీచర్లకు జైలు, కాకపోతే నరకం, కాకపోతే పనిష్మెంటు సెంటరు" అన్నాను ఉక్రోషంతో. "జిల్లా పరిషత్తు వాళ్ళు నన్నిక్కడికి పంపింది పని చెయ్యమని కాదు. పనిష్మెంటు అనుభవించమని.

"ఇంతకంటే మంచి బళ్ళు యాడున్నాయి సారూ?" అన్నాడో టవలు మనిషి,

"మీరు ఈ ఊరొదిలి బయటికి పోయి చూస్తేగదా! స్కూలు ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో మీకు తెలీదనిపిస్తున్నది" అన్నాను. టైము గడిచిన కొద్దీ ధైర్యం ఎక్కువవు తున్నది నాకు. వీళ్ళు వచ్చింది బ్రతిమాలేందుకు గాని, బడితెపూజ చేసేందుకు కాదని నమ్మకం కలిగింది నాకు.

"తెలీదు గనకనే ఉండమంటున్నదీ, నేరపమంటున్నదీ" తెలివిగా అన్నాడు ప్రెసిడెంటు.

"మీకు చదువు చెప్పటం నాకేం చేతనవుతుంది? పెద్దవాళ్ళకు చదువులు చెప్పటం నేర్చుకోలేదు నేను" నవ్వుతూ అన్నాన్నేను.

"బడికి రాకుండానే జీతం తీసుకోటం నేర్చుకున్నావు" వెకిలిగా నవ్వాడు ఒక యువకుడు - పాంటు జేబులో చెయ్యి పెట్టుకొని నిల్చున్నవాడు. వాళ్ళ పేర్లేవో నాకు తెలీదు.

"ఈ విద్య మీ ఊరు చూసిం తరవాతనే నేర్చుకున్నాను. అంతకు ముందు బొత్తిగా తెలీదు" అన్నానతన్ని కోపంగా చూస్తూ.

"మా ఊరెంత మంచిదో, మా బడెంత మంచిదో మీకు తెలీదు. శివరాజున్నప్పుడు మమ్మల్నెంత మెచ్చుకునేవాడో!" దీర్ఘాలు తీశాడో పెద్ద మనిషి

"శివరాజెవరు?" అన్నాను ఆశ్చర్యంగా. అతనెవరో తెలుసునాకు. శ్రీనివాసులు అతను చేసిన ఘనకార్యాల గురించి చెప్పాడు.

“ఈ సుకూలు మొదలు బెట్టిందా పుణ్యాతుముడే. రొండేళ్లు పనిజేశాడిక్కడ. ఆయన పోయినాడు.సుకూలుకు శని పట్టుకుంది." అన్నారు ప్రెసిడెంటు.

"మిమ్మల్ని మీ ఊరిని అంతగా మెచ్చుకునే అతన్ని ఎందుకొదిలి పెట్టారు? ఇక్కడే ఉంచుకోలేక పోయారా ?" అన్నాను.

"ఆయన పిల్లల చదువుల కోసం వెళ్ళాడులెండి" నవ్వుతూ అన్నాడు శ్రీనివాసులు. "ఈ స్కూల్లోనే చదివించుకోవచ్చును గదా! పైగా ఆయన హెడ్మాస్టరు కూడానాయె! అన్నాను.

“పోయినోరి మాట లెందుకిప్పుడు?" అన్నారొకరు.

“ఉన్నవారి మాట మాత్రం మీకెందుకు? ఆయనకంతా తెలుసు కాబట్టే వెళ్ళిపోయాడు. మీ పిల్లలు నిజంగా చదువుకొని వృద్ధిలోకి రావాలంటే ఈ స్కూల్ను తక్షణమే మూయించెయ్యండి. ఊళ్లో టీచర్లుండేందుకు వసతుల్లేవు. కనీసం బస్సు సౌకర్యం కూడా లేదు. పిల్లలకు చదువు కునేందుకు, టీచర్లకు చదువులు చెప్పేందుకు వసతుల్లేవు. మా ఊళ్లో కూడా స్కూలుందని చెప్పుకునేందుకు, టీచర్లు చదువులు చెప్పేందుకు కాదు, మీరు నమ్మకంగా ఓట్లేస్తారని చెయిర్మనుగారు మీకో స్కూల్ను పారేశారు. మీకు సుఖమంటే ఏంటో తెలీదు. ఆయనకు కష్టాలేంటో తెలీదు. మీ ఇద్దరూ బాగానే ఉన్నారు. మధ్యలో ఇరుక్కొని ఛస్తున్నది మేము. ఇక్కడ ఈ స్కూలు లేకపోతే నన్ను వేసేవాళ్ళు కాదు. నేను మీ దగ్గర ఇన్ని మాటలు తినేవాణ్ణి కాదు. ఇది మా కోసం కేటాయించిన చెరసాల. దీంట్లో పడేసి మీ పిల్లల భవిష్యత్తు నెందుకు నాశనం చేసుకుంటారు? వాళ్లను వేరే స్కూల్లో చేర్పించండి. ఇక్కడ పిల్లలు లేరని రాసిపారేసి ఈ స్కూలు మూసేస్తాను." ఆవేశంగా చిన్న ఉపన్యాసమే యిచ్చాను.

అఫెన్స్ ఈజ్ ది బెస్ట్ డిఫెన్స్ అన్నారు పెద్దలు. నా వాగ్ధాటి వాళ్లను శాంత పరిచింది. నా ప్రెసిడెంటు నిదానంగా మాట్లాడాడు. "చూడండి. మీకు మా

పరిస్థితులు తెలవ్వు. మేము తెలుగువాళ్ళం. మా చుట్టూ ఉన్నది తమిళనాడు. ఈ సుకూలు లేకపోతే మా పిల్లలు అరవ సదువులు సదవాల. అది మా కిట్టం లేదు. మా పిల్లలు తెలుగే నేరుసుకోవాల. అందుకే మా పిల్లలకు తెలుగు సుకులు కావాలని తెచ్చుకొన్నాం. జిల్లా పరిసత్తుకు పదివేలు కట్టాము. యాపారాలు, ఉద్యోగాలు చేసి సంపాయించింది గా దది తేలిగ్గా. శమటోడిసి సంపాయించింది, రకతం కార్చి సంపాయించింది" పొంగుతున్న ఆవేశాన్నిఆపుకునేందుకేమో ఆయన ఆగాడు. "మీకు యిషటం లేకపోతే ఇక్కడినించి మారిపించుకోండి. మేం అడ్డం సెప్పం. సుకూలు మూయించమని మాత్తరం చెప్పమాకండి.... మేం బీదోల్లమే. మా వూరులో సౌకర్యాలు లేనిమాట కూడా నిజవే! మా సుకూలు కూడా దరిద్దరంగానే ఉంది. అంతకంటే యేమీ సెయ్యలేకుండా ఉన్నాము. మీరు మాకంటె ఎక్కువ సదివినోల్లు. దేశం సూచినోల్లు. తెలివితేటలు గలవోల్లు. మీ తెలివితేటలతో మమ్మల్ని కూడా బాగుసెయ్యాలగాని మీరు మమ్మల్ని, మా దరిద్దరాన్ని అసయ్యించుకుంటా ఉన్నారు. కానీలెండి. మేవంటే యిష్టం ఉన్నవాల్లు వొచ్చిందాకా ఆగుతాము. సుకూలు మాత్తరం మూసెయ్యమనొద్దు" ఆయన కళ్ళలో నీటిపొర మెరిసింది. "మీరు టీశర్లు - అంటే సదువు సెప్పేవోల్లు. మీరు సెప్పాలగాని సెప్పించుకోగూడదు. మీ పద్ధతి మారుసుకోమని సెప్పేందుకొచ్చాము. ఆపైన మీ యిషటం" అంటూ పెట్టె మీది నుంచి లేచాడాయన. .....

ఆయనతోబాటు అందరూ లేచారు. అందరి ముఖాల్లోనూ విషాదంతో కూడిన క్రోధం కనిపించింది నాకు. అందరూ నిశ్శబ్దంగా వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయారు.

తల కిందకి దించుకొని కూచుండిపోయాన్నేను. మర్యాదకోసం లేచి నుంచోనైనా నుంచోలేదు. తాగుబోతులైనా తెలివిగలవాళ్ళే. పటాస్కరు ఎవార్డు ఫలితంగా అరవదేశం మధ్యలో చిక్కుకున్న తెలుగు వాళ్ళు వీళ్ళు. ఎంత భాషాభిమానం ఉన్నది వీళ్ళకు! ఎంత చక్కటి తెలుగు మాట్లాడారు

అందరూ. అరవయాస మచ్చుకయినా లేదు. ఆయనకు నేనేమని సమాధానం చెప్పగలను? చేస్తున్న పనికి సిగ్గుతో తల దించుకున్నాను.

వాళ్ళను సాగనంపి వచ్చాడు శ్రీనివాసులు. “మనుషులు బీదవాళ్ళు గాని, మంచివాళ్ళు సార్ నవ్వుతూ అన్నాడు నా ఎదురుగా నుంచొని.

"బీదవాళ్ళయితే అంత ఖర్చు పెట్టి ఈ మిడిల్ స్కూలు ఎందుకు తెచ్చుకున్నారు? ఉన్న హయ్యరెలిమెంటరీ స్కూలుతో సరిపెట్టుకొని ఉండవచ్చు కదా!" అన్నాను.

"మిడిల్ స్కూలు కాదు వాళ్ళడిగింది. హైస్కూలు కావాలని. ముందు మిడిల్ స్కూలు పెట్టి దాన్ని హైస్కూలుగా మారుస్తామని చెప్పారట క్రమంగా. కాని, ఏం లాభం! వేసిన గొంగళి వేసినచోటే ఉన్నది. మూడేళ్ళ యినా మిడిల్ స్కూల్ మిడిల్ స్కూలుగానే ఉన్నది. వాడు మావాడంటూ పరిగెత్తుకుపోయి శివరాజును హెడ్మాస్టరుగా వేయించు కొచ్చుకున్నారు. ఆయనే దీన్నెత్తిన దుమ్మేసి పోయాడు. స్కూల్లో చేరింది మొదలు ట్యూషన్లు ట్యూషన్లు అని అంగలార్చేవాడు. స్కూల్లో ఉన్న ఎనభైమంది పిల్లల్ని ఉన్న ముగ్గురు టీచర్లూ పంచుకున్నారట. నలభైమంది హెడ్మాస్టరు దగ్గర చేరారు. మిగిలిన ఇద్దరూ చెరో ఇరవైమందిని పంచుకున్నారు. ఆ టీచర్లిద్దరూ కమీషను రూపంలో నెల నెలా హెడ్మాస్టరు కింత అని చెల్లించేవారట. తన సంపాదన తను చూసుకున్నాడు గాని స్కూలు అభివృద్ధిని గురించి పట్టించుకోలేదు. ఊరి మనుషులు ఆలస్యంగా కళ్ళు తెరిచారు. ఆయన్ను తరిమేశారు. తరువాత వచ్చినాయన్ను మీరు చూశారు. ఇప్పుడు మీరు."పళ్ళు కనిపించేలా నవ్వాడు శ్రీనివాసులు.

రిస్ట్వాచ్ టైము చూశాను. నాలుగున్నర అవుతున్నది. స్కూలు టైము కూడా అయిపోవస్తున్నది.

“ఇక నేను వెళ్తానండీ” అంటూ లేచాను నిట్టూరుస్తూ.

“సరే సార్! ఈ మనుషుల దేముందిలెండి? మీరు వర్రీ కావద్దు. నేను చూసుకుంటా గా" అన్నాడు నాతో వస్తూ.

"ఏదో చెయ్యండి” అన్నాను ఆయన ముఖంలోకి చూస్తూ.

ఇంతలోకి బెల్లు కొట్టారు. పిల్లలు ఇళ్లకు పరుగులు దీశారు. టీచర్లు కూడా ఎవరి తోవన వాళ్లు వెళ్ళిపోయారు నాతో మాట్లాడకుండానే.

శ్రీనివాసులు నాతోబాటు రోడ్లో కొస్తానన్నాడు. వద్దని వారించాను. ఇప్పుడు దగ్గరి తోవ బాగా తెలుసు నాకు. అట్టే శ్రమ లేకుండానే రోడ్డును చేరవచ్చును.

తోవలో ప్రెసిడెంటు మాటలే పదేపదే జ్ఞప్తికి రాసాగాయి. మనసును మరో విషయం మీదికి మరలిద్దామంటే సాధ్యం కాలేదు. రోడ్లోకి రాగానే బస్సొచ్చింది. ఎక్కి కూచున్నాను. అవే ఆలోచనలు మనసును తొలుస్తు న్నాయి. చిత్తూరు చేరేసరికి ఎనిమిది గంటలైంది రాత్రి. ఆకలి కాలేదు. ఒక అరటి పండు తిని టీ తాగాను. సరాసరి రూముకొచ్చాను. నరసింహులు - రాజేంద్ర రూములోనే ఉన్నారు. ఏవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. చొక్కా పాంటు వంకెకు తగిలించి, లుంగీ చుట్టుకొని మంచం మీద పడుకొన్నాను ఆలోచిస్తూ.

అయిదు నిముషాలు గడిచిన తరువాత అన్నాడు నరసింహులు."దేన్ని గురించి సార్? చాలా సీరియస్గా ఆలోచిస్తున్నారు?"

"ఇంకేముంటుంది! నా జీవితం గురించే ఆలోచిస్తున్నాను. లైఫ్ అంటేనే బోర్ కొడు తున్నది. ఆ ఊరు మారితేనే నాకు శాంతి, ఉత్సాహం అన్నీ వచ్చేది" అన్నాను పక్కకు తిరిగి.

“దాని కంత బాధపడటమెందుకు? ట్రాన్స్ఫరు కావాలని అప్లికేషను పెట్టండి" అన్నాడు.

“ఆమాత్రం నాకూ తెలుసు. మరెక్కడికైనా సరే ట్రాన్స్ఫరు చెయ్యమని అప్లికేషను అప్పుడే పెట్టాను. అప్లికేషన్లు పనిచేసే కాలాలు వెళ్ళిపోయాయి. అతి ముఖ్యమైన కాయితాల్నే చించి పారేస్తున్నారు. ఇక ఈ అప్లికేషన్లో లెక్కా?" అన్నాను.

“మీరు చెయిర్మన్ను పట్టుకోండి." సలహా ఇచ్చాడు నరసింహులు.

“నాకంటే ముందుగా సమితి ప్రెసిడెంటు పట్టుకున్నాడాయన్ను. చెయిర్మను నన్ను కేర్ చేస్తాడా? అంతగా పోయి అడిగితే 'చూద్దాం పో' అనో, 'అందరూ ఉద్యోగాల్లేక అల్లాడుతుంటే ఈయన ఉద్యోగం చెయ్యలేక అల్లాడుతున్నాడు' అనో నవ్వుతాడు. ఏం చెయ్యాలో తోచటం లేదు" అన్నాను నిట్టూరుస్తూ.

“పోనీ అఫీషియల్ లైనులో ప్రయత్నం చెయ్యండి వాళ్ళ ముఖాన ఏమైనా పారేసి" అన్నాడతను.

“నా దగ్గర డబ్బేదీ? అప్పో సప్పో చేసి వాళ్ళ ముఖాన కొడదామంటే మనసొప్పు కోవటం లేదు. ఆ ఊరివాళ్ళయినా మెడబట్టి నెట్టేస్తారేమో ననుకుంటే అంతటి వాళ్ళెవరూ ఉన్నట్లు లేదు" అన్నాను.

“నాలుగు నెలలు సెలవు పెట్టి వెళ్ళిపోండి మీ ఊరికి" సలహా ఇచ్చాడు రాజేంద్ర.

"సెలవు పెట్టి ఏం చేసేది? భూముల్లేవు వ్యవసాయం చేసేందుకు. అంగళ్ళు లేవు డబ్బు వ్యాపారం చేసేందుకు. లేదు ఖర్చు పెట్టేందుకు. ఆదుకోగల అయిన వాళ్ళెవరూ లేరు. సెలవు పెడితే ఇంతకంటే దారుణంగా ఉంటుంది నా పరిస్థితి" అన్నాను కళ్ళ నీళ్ళ పర్యంతమై.

"ఇక మీకు మిగిలింది చిన్మయస్వామి ఉపన్యాసాలే! ఇలాగే ఉండి రోజూ సాయంత్రం అక్కడికి పోయి కాలక్షేపం చెయ్యండి. ఆయన బ్రహ్మాండంగా మాట్లాడతాడట" అన్నాడు.

"ఇంకా నయం. జోలె పట్టుకొని సన్యాసుల్లో కలిసిపొమ్మని చెప్పలేదు" నవ్వుతూ అన్నాను.

"లేదు సార్! ఆయన చాలా గొప్పగా మాట్లాడుతాడట" అన్నాడు నరసింహులు. "ఆయన మాట్లాడటం గురించి చాలామంది చెప్పారు. నాకూ వినాలనే ఉంది. నువ్వు చెప్పేది నిజమేనా అని అనుమానం."

"నిజంగానే సార్! పి.సి.ఆర్.లో ఇరవై రోజుల పాటు జరుగుతాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు మొదలు. ఊరి గోడలమీద పోస్టర్లు అతికించారే, మీరు చూడలేదా?" అన్నాడు నరసింహులు.

మానవ యత్నాలకు ఆరంభం, అంతం వేదాంతమేనేమో.

చిన్మయస్వామిని గురించి వాళ్ళకు తెలిసిన సమాచారం వాళ్ళు చెప్పారు. ప్రతి సంవత్సరం ఆయన ఉపన్యాసాలు చిత్తూరులో జరుగుతాయట. వాళ్ళు విన్నారట. చాలా గొప్పగా పొగుడుతూ చెప్పారు.

తెల్లవారిన దగ్గర్నుంచి సాయంత్రం ఆరు గంటలకోసం ఎదురుచూడటం ఆరంభించాను.

చిన్మయానంద స్వామి గురించి పేపర్లో చదివాను. తెలిసినవాళ్ళు ఆయన్ను గురించి చెప్పగా విన్నాను. ఆయన్ను చూడాలనీ, ఆయన మాటలు వినాలనీ చాలాకాలంగా కోరిక ఉన్నది. ఇప్పుడు నా కా మహదవకాశం లభించింది. చిత్తూరులో ఉన్నాను కాబట్టి. ఆ దరిద్రపు జంబాడలో ఏమున్నది మానసికంగా కుళ్ళిపోవటం తప్ప!

'ఇండియా ఈజె క్యూరియస్ కంట్రీ వేర్ డిఫరెంట్ సెంచరీస్ కో ఎగ్జిస్ట్' అన్నాడో మహానుభావుడు. అది అక్షరసత్యం. ఈ దేశంలో క్రోమాగ్నన్ మానవుల నుంచి అంతరిక్ష యాత్రికుల వరకు చూడవచ్చును. ప్రాచీన యుగం, మధ్యయుగం, ఆధునిక యుగం పక్క పక్కన సహజీవనం కొన సాగిస్తున్నాయి. ఒక యుగం వారికి మరొక యుగం వారి గురించి

తెలియదు. ఒక యుగం వారు మరొక యగం వారిని గూర్చి పట్టించుకోరు. ఆధునికులు మిగిలిన ఇద్దర్నీ అథఃపాతాళానికి తొక్కుతూ, నింగిలోకి ఎగిసిపోతున్నారు.

పాలకులు వారికి భ్రమలు కల్పించి ఓట్లు గుంజుకొని ఖుషీ ఖుషీగా ఆకాశయానాలు చేస్తున్నారు.

ఆధునికతకు అతి దగ్గరగా ఉంటున్న వారికి సిటీ కాంపెన్సేటరీ అలవెన్సులు! దరిద్ర దేవత ఒడిలో ఆమె శుష్కస్తనాలు చీకుతూ పడిఉన్న వారికి శూన్యహస్తాలు!

నన్ను ఆధునిక యుగంలోంచి మధ్యయుగంలోకి బలవంతంగా విసిరి వేశారు. చెడి బ్రతకవచ్చు గాని, బ్రతికి చెడటం కష్టం! నా పతనంతో నేను రాజీ పడలేక పోతున్నాను.

సాయంత్రం నాలుగు గంటలకే రూము వదిలి తోవలో కాఫీ తాగి అయిదు గంటల కల్లా పి.సి.ఆర్. కాలేజీ ఆవరణలోకి చేరాను. అటూ ఇటూ తిరుగుతూ వాళ్ళు చేస్తున్న పనులు చూశాను. అయిదున్నరకల్లా ఒకరొకరుగా జనం రావటం ఆరంభించారు. అనుకూలంగా ఉండే చోటు చూసుకొని కూచున్నాను. క్రమక్రమంగా సమావేశ స్థలం జనంతో నిండిపోయింది.

చిన్మయస్వామి ఆరున్నరకుగాని రాలేదు. పేపర్లలో ఆయన ఫోటోలు చూశాను ఇంతవరకూ. ఇప్పుడాయనే కనబడుతున్నాడు. ఎర్రగా, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు మనిషి. నల్లటి గడ్డం, మీసాలు, జుట్టు, తేజోవంతమైన నేత్రాలు. కాషాయంబరాల్లో అందంగానే కనిపించాడాయన.

నిర్వాహకుల్లో ఒకరు ఆయన్ను సభికులకు పరిచయం చేశాడు. పూల మాలలతో సత్కరించడం వగైరా ప్రారంభ కార్యక్రమాలు పూర్తయినాయి. ఆరోజు చిన్మయానంద స్వామి భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు.

ఎనిమిది గంటలకల్లా ఆయన ఉపన్యాసం ముగించారు. గంటకు మించి మాట్లాడలేదాయన.

చక్కటి ఇంగ్లీషు - స్పష్టమైన ఉచ్చారణతో, ప్రశాంత గంభీరంగా, భావ స్ఫోరకంగా, అనర్గళంగా మాట్లాడారాయన. ఎంతలేందే అంతగా ప్రశంసి స్తారందరూ! నేను తోవలో భోజనం ముగించుకొని రూముకు చేరాను.

ప్రతిరోజూ ఆయన ఉపన్యాసాలు వినటానికి వెళ్ళాను. ఇద్దరు మహిళలు శ్రావ్యంగా ఒక శ్లోకం చదువుతారు. ఆయన ఆ శ్లోకానికి తనదైన బాణిలో వ్యాఖ్యానం చెబుతారు. వారం రోజులు హాయిగా దొర్లిపోయాయి.

ఒకరోజు ఉపన్యాసం "క్రోధా దృపతి సమ్మోహః" అనే శ్లోకంతో ముగించారు. దాని కాయన చెప్పిన వ్యాఖ్యానం "ఫ్రం డిజైర్ ఎరైజెస్ యాంగర్: ఫ్రం యాంగర్ రిజల్ట్స్ ఎర్రర్ ఆఫ్ జడ్జిమెంట్" అంటూ సవిస్తరంగా వ్యాఖ్యానం చెప్పాడాయన.

జనం ఎవరితోవన వారు పోతున్నారు. నేను నా చోట్లోంచి లేచి వాళ్ళలో ఒకడి నైనాను. తల వంచుకొని ఆలోచిస్తూ నడుస్తున్నాను. మనసులో ఆయన చెప్పిన వ్యాఖ్యానం మెదిలింది.

కోరికల వల్ల కోపం పుడుతుందట. కోపంతో వివేకాన్ని కోల్పోతామట. తీరని కోరికలు కోపానికి కారణభూతమవుతాయన్నమాట. కోరిన కోరికలు తీరక పోతే మనస్సు స్తిమితాన్ని కోల్పోతుంది. స్తిమితం లేని మనస్సు తప్పులు చెయ్యటం ఆశ్చర్యం కాదు. హిట్లర్ ఆర్యజాతి సిద్ధాంతం మీది కోపంతో జెస్సీ ఓవెన్స్ అంతటి క్రీడాకారుడు ఒలింపిక్ క్రీడల లాంగ్ జంప్ ట్రయల్స్‌లో రెండుసార్లు ఫౌల్ చేశాడు!

నాకు కూడా కోపం ఉంది. కలకడలో ఏమేమో చెయ్యాలని కోరుకున్నాను. చెయ్య లేకపోయాను. స్కూలు కమిటీ వాళ్ళు డబ్బులు దండుకోవాలని కోరుకున్నారు. వాళ్ళ కడ్డంగా నేన్నిలిచాను. వాళ్ళకు నామీద కోపం వచ్చింది. వాళ్ళు వివేకాన్ని కోల్పోయారు. నేనేవో ఘనకార్యాలు చెయ్యాలను

కున్నాను. నాకు వాళ్ళు అడ్డంగా నిలిచారు. నన్ను దూరంగా విసిరి పారేయించారు. నాకు కోపం వచ్చింది.

మా మధ్య మధ్యవర్తిత్వం వహించిన జిల్లా పరిషత్తు డెప్యూటీ సెక్రెటరీ వివేకాన్నెందుకు కోల్పోయాడు? మోహం వల్లనై ఉంటుంది. మోహం వల్లనే గదా మనుషులు స్వార్థ పరులయ్యేది!

నా ఈ స్థితికి కారకుడు అతను, అతని పైవారు. నాకోపం అతని మీద ఉండాలి. కలకడ స్కూలు కమిటీ, నేను సమానస్థాయిలోనే ఉన్నాము.

నాకన్యాయం చేసింది జిల్లాపరిషత్తు వాళ్ళు. చేతనైతే వాళ్ళ మీద కక్ష గట్టాలి. పగ సాధించుకోవాలి. అంతేగాని అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు ఈ జంబాడ మీద నా కోపం చూపడమెందుకు? నిజానికి వాళ్ళు నాకేమన్యాయం చేశారు. లోకంలో ఆ ఊరు ఉండటం నేరమా? ఆ మనుషులుండటం తప్పా? కోపంతో నేను వివేకాన్ని కోల్పోయిన మాట నిజం. అందువల్లనే నేను నా కర్తవ్యానికి దూరంగా, చేతగాని వాడిలాగా పారిపోయి, దాదాపు నాలుగు నెలల నుంచి నిరర్థక జీవితం గడుపు తున్నాను! చెప్పలేనంత ఆత్మక్షోభ అనుభవిస్తున్నాను. నేను ఉండాల్సిన చోటు జంబాడ గాని చిత్తూరు కాదు. జీవచ్ఛవంలా ఇక్కడ పడి ఉండే కంటే చైతన్యవంతంగా అక్కడ పని చెయ్యటం ఉత్తమం. జంబాడ నరకమే కావచ్చును. చిత్తూరు స్వర్గమే కావచ్చును. బట్..... బట్ ఐ కెన్ బి ఎ కింగ్ దేర్! హియర్ అయాం వర్స్ దేన్ ఎ స్లేవ్! స్వర్గంలో బానిస కంటే నరకంలో రాజు గొప్పవాడన్నాడు మిల్టన్. అసలు స్వర్గ నరకాలు మన మనసే సృష్టిస్తుందని కూడా చెప్పాడా మహానుభావుడు. చిత్తూరులో ఉండి నేననుభవించిన స్వర్గసుఖాలేమున్నాయి? మానసికంగా ఇన్ని రోజులూ ఎంత నరకయాతన అనుభవించానో!

జంబాడ ఊరు కాదా? అక్కడున్నవాళ్ళు మనుషులు కారా? వాళ్ళు బ్రతకటం లేదా? వాళ్ళు దరిద్రులైనా, జ్ఞానశూన్యులైనా భాషాభిమానం ఎంతగా కలిగి ఉన్నారు! భాషమీది అభిమానంతో ఎంత త్యాగం చేశారా బడుగు జీవులు! ఆ మనుషుల్ని ప్రేమించక పోతే, అభిమానించకపోతే నా జన్మకు సార్థక్యం ఏముంటుంది! లెట్ మి నాట్ స్టే హియర్ ఎనీ లాంగర్ డెడ్. ఐ మస్ట్ గోటు మై ప్లేస్. ఐ మస్ట్ లివ్ అండ్ వర్క్ ఫర్ దేర్ గుడ్. స్థిరంగా నిర్ణయించుకున్నాను.

7

మర్నాడు ఉదయం తెల్లవారుజామునే లేచి గబగబా కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేశాను. నా వస్తువులన్నీ చిన్న సంచీలోకి సర్దుకున్నాను. నరసింహులును, రాజేంద్రను నిద్ర లేపి రూము తాళంచెవి వాళ్ళకి ఇచ్చాను. ఇన్ని రోజులూ ఆశ్రయమిచ్చి నన్నాదరించి నందుకు వాళ్ళకు కృతజ్ఞతలు తెలిపాను. నా నిర్ణయానికి ఆశ్చర్య పోయారు వాళ్ళు. వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ కాలం వృధా చెయ్యదలచు కోలేదు. “అక్కడికి పోయిన తరువాత అన్ని వివరాలతో ఉత్తరం రాస్తా"నని చెప్పి వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని బస్ స్టాండుకేసి నడిచాను.

ఉదయం పదిగంటలకల్లా జంబాడ చేరాను. నేను వస్తాననుకోలేదెవ్వరూ! నన్ను, నా సంచీని చూసి ఆశ్చర్యపోయారు టీచర్లు.

జనవరి నెలలో నా ఉద్యోగ బాధ్యతలను నేను తీసుకున్నాను.

భోజనానికి తన ఇంటికి రమ్మని శ్రీనివాసులు చాలా బలవంతం చేశాడు. నేను పోలేదు. "ఒక క్యారియర్లో కొద్దిగా అన్నం పంపండి. ఇక్కడే తింటాను." అని ఆయన్ని బ్రతిమాలి పంపించాను.

ఊళ్ళోకి పోవటానికి మనస్కరించలేదు నాకు. నాకు వాళ్ళను చూడాలంటే భయం. వాళ్ళు నన్ను చూసినా తట్టుకోవటం కష్టమే. అసహ్యంగా దొంగను

చూసినట్లు చూస్తారు. ఇక ముందు ఏ పరిస్థితిలోనూ తలవంపులు తెచ్చే పనులు చెయ్యగూడదు. ఊరివారి గౌరవానికి, ప్రశంసలకూ పాత్రుడినైన తరువాతనే ఊళ్ళోకి అడుగుపెట్టేది. తిరుగులేని విధంగా మనసులో తీర్మానించుకున్నాను.

ఆ సాయంత్రం స్టాఫ్ మీటింగు పెట్టి "ఇన్ని రోజులూ నేను నా విధి నిర్వహణకు, మీకు, పిల్లలకూ దూరంగా ఉండి చాలా తప్పు చేశాను. అయాం సారీ! గతాన్ని మరిచిపోదాం. వర్తమానంలో చైతన్యవంతంగా పనిచేస్తూ భవిష్యత్తులోకి నడుద్దాం. అందుకు మీరు నాతో పూర్తిగా సహకరించాలి" అంటూ చెప్పాను. టీచర్లందరితోటి ఆప్యాయంగా మాట్లాడాను భుజం మీద చెయ్యి వేసి, ఈ కొత్త అనుభవంతో వాళ్ళకూ కొంత ఉత్సాహం వచ్చింది.

పిల్లల్ని దగ్గరికి పిలిచాను. పేర్లడిగాను. వీపు మీద తట్టి పంపించాను.

ఆ ఊరి పిల్లల్ని పెద్దగా ఉండే వాళ్ళను నలుగుర్ని పిలిచి వాచ్మన్ ఎక్కడ ఉన్నా, ఎట్లా ఉన్నా పిలుచుకు రమ్మని పంపించాను. అతనసలు స్కూలు ముఖమే చూడడట. ఎప్పుడూ తాగి ఏ రూములోనో పడి ఉంటాడని, జీతం తీసుకునేందుగ్గూడా స్కూలుకు రాడని చాలాసార్లు చెప్పాడు శ్రీనివాసులు. అతని పేరు ఓబుల్ రాజు.

ఒక గంటలో పిల్లలు ఓబుల్ రాజును స్కూలు దగ్గరికి పిలుచుకొచ్చారు. చెదిరిన జుట్టు, అస్తవ్యస్తంగా ఉన్న బట్టలు, కైపెక్కిన కళ్ళు - మామూలుగా స్ఫురద్రూపే అయినా - ఇప్పుడు అసహ్యంగా కనిపిస్తున్నాడు.

"కూచో" అని గట్టిగా అన్నాను.

అతను కూచున్నాడు. ఒక గంటసేపు అతన్నలాగే కూచోబెట్టి "చూడు ఓబుల్ రాజూ! జరిగిందేదో జరిగిపోయింది. ఇకమీదట నువ్వు కచ్చితంగా ప్రతిరోజూ స్కూలుకు రావాలి. స్కూల్లోనే ఉండాలి. స్కూలు పనులు

చెయ్యాలి. అంతేకాదు. ఇక్కడ హోటళ్ళు, గట్రాఏమీ లేవు. నువ్వు రెండు పూటలా నాకు అన్నం వండిపెట్టాలి. ఉదయమే కాఫీ కాచి ఇవ్వాలి. నీ పనుల్లో ఏ లోటు కనిపించినా నీకు జీతం ఇవ్వను. ఇంతకు ముందున్న హెడ్మాస్టర్లు, శ్రీనివాసులుగారు చాలా మంచివాళ్ళు. నేను వాళ్ళలాంటి మనిషిని కాదు. నువ్వేమైనా తోక విప్పితే కత్తిరించేస్తాను. నీ జీతం ఇవ్వను. నిన్ను ఉద్యోగంలోంచి తీయించేస్తాను తెలిసిందా?" గట్టిగా చెప్పాను.

'ఉలవలు తింటావా బసవన్నా?' అంటే 'అలాగే'నని బసవన్న తల ఊపినట్లు ఊపాడు ఓబుల్ రాజు.

ఆ సాయంత్రం గూడా శ్రీనివాసులే కారియర్లో అన్నం పెట్టుకొని తీసుకొచ్చాడు. స్కూలు దగ్గరికి. వస్తూ వస్తూ ఒక చాప, దీపం బుడ్డి గూడా తీసుకొచ్చాడు. ఓబుల్ రాజును చూసి ఆశ్చర్యపోయాడు. 'మొత్తం మీద మీరు అసాధ్యులు సార్! వీణ్ణి ఎక్కడి నుంచి పట్టుకొచ్చారు?" అన్నాడు.

“పిల్లల్ని పంపించాను వెతికి తీసుకురమ్మని. వాళ్ళు పట్టుకొచ్చారు. చెప్పాల్సిందంతా చెప్పాను. రేపటి నుంచీ ఇతను సక్రమంగా స్కూలుకు రాకపోతే ఎల్లుండి కొత్త వాచ్మన్ను పెట్టేస్తాను" అన్నాను శ్రీనివాసులుతో.

“అట్లా చేస్తేగాని వీడి రోగం కుదర్దు సార్! ఎప్పుడూ తాగి పడుంటాడు. ఆ సారాయిలో ఏముందోఏం పాడో!" అన్నాడతను నవ్వుతూ.

“దాని మజా ఓబుల్ రాజుకు తెలుస్తుంది గాని మనకెలా తెలుస్తుంది?” ఇద్దరం నవ్వాము.

ఇంత హాయిగా నవ్వి మూడు నెలలకు పైగా అయింది.

ఒక గంటసేపు నేను, శ్రీనివాసులు బాతాఖానీ వేసుకున్నాము. "శ్రీనివాసులుగారు వెళ్ళేంతలో నువ్వు పోయి అన్నం తిని రా. నాకు తోడుగా ఇక్కడే పడుకోవాలి" అని చెప్పి ఓబుల్ రాజును పంపించాను. బుద్ధిగా అన్నం తిని అరగంటలో గానే వచ్చాడు ఓబుల్ రాజు.

శ్రీనివాసులు వెళ్ళిపోయింతరువాత ఇద్దరం ఆఫీసు రూములో నిద్రపోయాము.

8

స్కూలు టైములో పిల్లలకు పాఠాలు చెప్పటం, సాయంత్రం స్కూలు వదిలిన తరువాత పిల్లలతో కలిసి ఆడుకోవటం. ఆ తరువాత టీచర్లందరం కలిసి స్కూలు కెదురుగా ఉన్న చెరువు కట్టమీద కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడు కోడం దినచర్యగా సాగు తున్నది. అందరం వారి వారి జీవితానుభవాలు చెప్పుకొని నవ్వుకుంటూ ఉన్నాము.

ఓబుల్రాజు బుద్ధిగా స్కూలు కొస్తున్నాడు. నాకు పనులు చేసి పెడుతున్నాడు. ఒక కిరోసిన్ స్టవ్, కొన్ని సత్తుగిన్నెలు అతని చేతనే తిరుత్తని నుంచి తెప్పించాను. ఆఫీసు రూములోనే వంట, భోజనం పడక అన్నీ కొనసాగు తున్నాయి.

టీచర్లందరూ నాకు బాగా సన్నిహితులయ్యారు. అరమరికలు లేకుండా మాట్లాడు కుంటున్నారు. స్కూలు టైములో అన్నాలు వండుకునేందుకు ఇళ్ళకు పోవటాలు వగైరాలు బందయినాయి. పరిస్థితులు సంతృప్తికరంగా, సంతోషకరంగా ఉన్నాయి.

ఒకరోజు చెరువు కట్టమీద కూర్చుని మాట్లాడుకుంటున్నాము.

మన స్కూలుకు ఒక రేడియో ఉంటే బాగుంటుంది సార్!" అన్నాడు చంగల్రాయులు. "ఉంటే బాగానే ఉంటుంది కానీ లేదుగా!" అన్నాడు శ్రీనివాసులు.

"పూర్వపు సింద్‌బాద్ లా ఉన్నది మన పరిస్థితి. భూగోళంలోంచి విడిబడెక్కడో ఉన్నట్లుగా ఉన్నది సార్!" అన్నాడు మునసామి నాయుడు.

“అవునండీ! మిగతా ప్రపంచం నుంచి మనం వేరైపోయాము. మన ప్రపంచ మంతా మనమూ, మన వూరి పాకా, ఆ యాభైమంది పిల్లలూ, ఆ ముళ్ళచెట్లూ, ఈ చెరువూ, అంతకంటే ఏముంది?" నవ్వుతూ అన్నాన్నేను.

"ప్రపంచంలో, అందరూ టి.వి.లు, వి.సి.ఆర్.లు, టేప్ రికార్డర్లు ఉపయో గించుకుంటూ ఉంటే మనం రేడియోకోసం దేవుళ్ళాడుతున్నాం" అన్నాడు చంగయ్య శర్మ.

"ఎలాగైనా మనం ఒక రేడియో కొందాం సార్!" మారాం చేశాడు చంగల్రాయులు.

"స్కూల్లో డబ్బు లేదండీ. మీకు తెలియనిదేముంది? వచ్చే సంవత్సరం కొందాము. ఇంకా రెండు నెలల్లో ఈ సంవత్సరం అయిపోతుంది కదా. అప్పుడైనా కొద్దో గొప్పో పిల్లల దగ్గర్నించి వసూలు చెయ్యక తప్పదు" అన్నాను.

"పంచాయతీ బోర్డులో ఒక రేడియో ఉండాలి. దాన్నెవరూ ఉపయోగిస్తు న్నట్లు లేదు. ఆరేడియోను స్కూలు కిమ్మని అడుగుతాను" అన్నాడు శ్రీనివాసులు.

"నువ్వు పూనుకుంటే ఆ పని అయినట్లే!" చంగల్రాయలు మాట్లో వ్యంగ్యం ధ్వనించింది.

"ప్రెసిడెంటునే అడుగుతాను. ఎందుకివ్వరు. మన స్వంతానికేమీ అడగటం లేదుగా" అన్నాడు శ్రీనివాసులు రోషంగా.

చీకటి పడుతూండటంతో సంభాషణలు ముగించి ఎవరి తోవన వాళ్ళం వెళ్ళి పోయాము. నేను స్కూలుకు చేరాను.

ఓబుల్రాజు పొయ్యి ఊదుతూ వంట చేస్తున్నాడు. ఊరికే కరెంటు లేదు. స్కూలుకే ముంటుంది. బెడ్లైటు కాంతిలో సాగుతున్నది వంట. ఏదైనా పుస్తకం చదువుదామన్నా వీలుగాదు. ఓబుల్ రాజు వట్టి మొద్దు. చలాకీ తనం లేదు. తనకై తాను మాట్లాడనే మాట్లాడడు. అడిగిందానికి జవాబు చెప్పటమే ఎక్కువ. ఇప్పటి నుంచి తెల్లవారిందాకా నాలో నేనే మాట్లాడు కుంటూ గడపాలి.

చాప పరుపుగాను, పిల్లల కాంపోజిషన్ పుస్తకాలు దిండుగాను, టవలు బెడ్ స్ప్రెడ్గాను, దుప్పటి కప్పుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. నాకోసం తన ఇంట్లో నుంచి మంచం ఒకటి తెస్తానన్నాడు ఓబుల్రాజు.

ఓబుల్రాజు నాకోసం చాలా శ్రమపడుతున్నాడు. రాత్రి ఎనిమిది గంటల దాకా నా సేవలోనే ఉంటాడు. నాకు అన్నం పెట్టి, ఆకు ఎత్తిపారేసి, నేను పోయి రమ్మని చెప్పిం తరువాత ఇంటికి పోతాడు. తిరిగి నాకు తోడుగా పడుకునేందుకు పదికల్లా వస్తాడు. ఉదయం నాకంటే ముందుగానే లేచి పోయి, పాలు తీసుకొచ్చి కాఫీ తయారుచేస్తాడు. స్నానానికి నీళ్ళు కాస్తాడు. నా స్నానమైన తరువాత ఇంటికిపోయి తొమ్మిదిన్నరకల్లా స్కూలుకు హాజరవుతాడు. స్కూలు జరుగుతున్న టైములో వంట చేస్తాడు. అగ్గిపెట్టె కావాలన్నా, సిగరెట్లు కావాలన్నా అతను ఆర్కాడుకుప్పం పోయి రావాల్సిందే. లోలోపల ఏమనుకుంటున్నాడోగాని బయటికి మాత్రం మామూలు గానే కనిపిస్తు న్నాడు. నే నతని కిస్తున్న డబ్బులు కూడా ఏమీ లేవు. అప్పుడప్పుడు "నువ్వు తిని, నాకేమైనా తీసుకు"రమ్మని ఆర్కాడు కుప్పం పంపిస్తూంటాను. పొగచూరిన అన్నం, పొగ కరిగిన కాఫీ, తింటూ, తాగుతూ జీవయాత్ర సాగిస్తున్నాను. నేను పెట్టిన బెదురు అతని మీద బాగా పనిచేసింది.

ఊపిరాడకుండా పనులు చెబుతున్నందువల్ల ఓబుల్ రాజు తాగుడు చాలా తగ్గించే శాడని శ్రీనివాసులు, మిగిలిన టీచర్లు చెప్పారు. ప్రత్యక్షంగా కాక పోయినా, పరోక్షం గానైనా అతనికి నావల్ల మేలు కలుగుతున్నందుకు సంతోషించాను.

మర్నాడు ఉదయం శ్రీనివాసులు చాలా నిరుత్సాహంగా స్కూలు కొచ్చాడు. "వాళ్ళు రేడియో ఇవ్వమన్నారు సార్!" అన్నాడు నేనడక్కుండానే.

“పోన్లెండి. డోంట్ వర్రీ. మరో రెండు నెలలు పోతే మనమే కొనుక్కుందాము” అన్నాను ఓదార్పుగా.

"ఊళ్ళో మన శ్రీనివాసులు పలుకుబడి ఇంతేనన్నమాట! నాకీ సంగతి ముందుగానే తెలుసు” నవ్వాడు చంగల్రాయలు. ముఖం మాడ్చుకున్నాడు శ్రీనివాసులు.

“వాళ్ళతో అంత పూసుకుని తిరుగుతావుగదయ్యా! బోడి రేడియో సంపాదించ లేకపోయావు!" ఎగతాళి చేశాడు మునసామి.

శ్రీనివాసులు తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని కోరుకుంటాడు. అందు కోసం మిగిలిన టీచర్లతో కలవకుండా ఊరివాళ్ళతోనే ఎక్కువగా తిరుగు తుండేవాడట. అందరితోటీ తాను చాలా సిన్సియర్నని, మహా ఎఫిషియంట్ టీచర్నని చెప్పుకుంటూ ఉంటాడట. అందుకోసమే అతని దగ్గరికి ట్యూషన్లకోసం చాలామంది చేరుతుంటా రట. అందువల్ల ఊరి వాళ్ళు మిగతా టీచర్లను పట్టించుకోరట. శ్రీనివాసులంటే అందుకు మిగతా వాళ్ళకు గుర్రు.

"పోన్లెండి. వాళ్ళు రేడియో ఇవ్వకపోతే మనం మాటలనుకోవడం ఎందుకు? మనమే కొనుక్కుందామన్నాను కదా, కాస్త ఓపిక పట్టండి" అన్నాను వాళ్ళను సర్దుబాటు చేస్తూ. ఆ తరువాత రేడియో గురించి ఎవరూ మాట్లాడలేదు. నేను మాత్రం దాని విషయం మరిచిపోలేదు.

9

“మనం స్కూలు వార్షికోత్సవం జరుపుదాం సార్! స్కూలు పెట్టినప్పటి నుంచి ఒక్కసారి 47 గూడా జరపలేదు" అన్నాడు చంగల్రాయలు.

"జరిపితే బాగుంటుంది సార్' అన్నాడు చంగయ్య శర్మ.

వాళ్ళు ముగ్గురూ ఒక రూములో ఉంటున్నారిప్పుడు. మునసామి నాయుడుకు, చంగయ్య శర్మకు పెళ్ళిళ్ళు కాలేదు.

చంగల్రాయలుకు పెళ్ళయింది. కాని ఒంటరిగానే ఉంటున్నాడు. రేణిగుంట దగ్గర ఒక పల్లె అతని స్వగ్రామం. ఇంతకు ముందు తరచుగా పోయి వస్తుండే వాడట. నేను స్థిరంగా పనిచెయ్యటం మొదలు పెట్టిన తరువాత లీవు పెట్టకుండా వెళ్ళిపోయే వెసులు బాటు లేకుండా పోయింది. "మీరు వచ్చి మమ్మల్ని చెడగొట్టారు సార్! మీరు రాకుండా ఉంటే, మేమూ మా ఇష్టం వచ్చినట్లు వస్తూ పోతుండేవాళ్ళం. ఇప్పుడు చూడండి ఎంత కష్టపడు తున్నామో! పొద్దున్నించి సాయంత్రం దాకా స్కూల్లో ఉండాలి. ఊరొదిలి పోవాలంటే సెలవు పెట్టాలి" అంటూ వస్తాడు లీవు లెటరు చేత్తో పట్టుకొని. మనసులో ఏదీ దాచుకోడు. ఉన్న అందరిలోకీ అతనే కాస్త జీవం, అభిరుచులు ఉన్న మనిషి,

"వార్షికోత్సవం జరపాలంటే డబ్బు కావాలి కదండీ. అన్నిటికంటే ముందు గెస్ట్ నొకాయన్ను పిలవాలి. ఈ లోకంలోంచి ఆ లోకంలోకి పోయి రావా లంటే ఎంత ఖర్చు బస్ ఛార్జీలు, భోజనం ఖర్చులు ఇంకా ఇతర ఖర్చులు. మన దగ్గర ముష్టి మూడొందలు గూడా లేవు. ఎలా జరిపిస్తాం? వచ్చే సంవత్సరం చూద్దాం లెండి." అన్నాను అతన్ని చూస్తూ.

"ప్రతిదీ వచ్చే సంవత్సరం, వచ్చే సంవత్సరం అని పో స్ట్పోన్ చేస్తున్నారు. వచ్చే సంవత్సరానికి ఇక్కడ ఎవరుంటారో, ఎవరుండరో! అందరూ ట్రాన్స్ఫర్ కోసం ప్రయత్నిస్తున్న వాళ్ళే." మారాం చేస్తున్న చిన్నపిల్లాడిలా ముఖం పెట్టాడు చంగల్రాయలు. "మనం ఇక్కడి నుంచి బయటపడటం అంత తేలిక కాదులెండి. ఒకవేళ మీరు తంటాలు పడి ట్రాన్సఫరు తెచ్చుకున్నా నేను మిమ్మల్ని రిలీవు చెయ్యను మీ బదులు మనిషి వచ్చిందాకా. నేను బదిలీ ఇమ్మని అడగను. వాళ్ళే బదిలీ చేసే పరిస్థితులు కల్పిస్తాను. అందాకా మనందరం ఇక్కడ ఉండక తప్పదు. కాబట్టి వచ్చే సంవత్సరం గురించి ఆలోచించటంలో తప్పు లేదు" అన్నాను.

“మీరు జగమొండి సార్! మా మాట ఒక్కటీ ఒప్పుకోరు. అన్నీ మీరు చెప్పినట్లే జరగాలంటారు. ఈసారి వార్షికోత్సవం నామకరణంగా నన్నా జరుపుదాం సార్. మనకు గెస్టులూ, గిస్టులూ వద్దులే. ఆటల పోటీలు జరుపుదాం. పిల్లల చేత ఒకటి రెండు చిన్న నాటికలు వేయిద్దాం" అన్నాడు.

“చేసేదేదో కాస్త ఘనంగానే చేద్దాం. మన దగ్గర డబ్బు లేకపోతే ఊళ్ళో తిరిగి వసూలు చేద్దాం. మన ఖర్చులకేమీ ఇమ్మనటం లేదుగా!" అన్నాడు మునసామినాయుడు.

"వాళ్ళసలే బీదవాళ్ళు. అడుక్కు తినే వాడి దగ్గర గీరుకుతినేవాడు, గీరుకు తినేవాడి దగ్గర నాకి తినేవాడులాగా మనం తయారవగూడదు. ఒకవేళ వాళ్ళ దగ్గర వసూలు చేసినా అది స్కూలుకు శాశ్వతంగా ఉపయోగ పడేట్లుండాలి. అంతేగాని విందులు, వినోదాల కోసం వాళ్ళ దగ్గర వసూలు చెయ్యటం నాకిష్టం లేదు" అంటూ శ్రీనివాసులు వంక చూశాను.

“అంతే సార్ ! ఇప్పుడు వార్షికోత్సవం జరపకపోతే ఏం మునిగిపోతుంది?" అన్నాడు శ్రీనివాసులు.

"నువ్వూరుకోవయ్యా తాన తందానా! ఎప్పుడూ పాఠాలు, పరీక్షలు, పేపర్లు దిద్దటం, వీటితో తల దిమ్మెక్కి పోయింది. ఇక్కడ సినిమాల్లేవు, డ్రామాల్లేవు. కనీసం ఒక రేడియో అన్నా లేదు. మానసికంగా చచ్చిపోతున్నాం సార్! మరీ యాంత్రికంగా ఉండాలంటే నా వల్ల కాదు” అన్నాడు చంగల్రాయలు.

"మీ ఇష్ట ప్రకారమే చేద్దాం. పిల్లలకు ఆటల పోటీలు పెడదాం. వాళ్ళ దగ్గర నాటిక వేయిద్దాం. మీరు గూడా ఒక నాటిక వెయ్యండి బాగుంటుంది” అన్నాను.

"సోషల్ డ్రామా అంటే ఈ ఊళ్ళో పురుగు గూడా రాదు చూసేందుకు” అన్నాడు శ్రీనివాసులు నవ్వుతూ.

"పోనీ పౌరాణికమే వెయ్యండి!"

“పౌరాణికమా? పాటలు, పద్యాలు, కిరీటాలు, డ్రెస్సులు, వాటికే అవుతుంది. వెయ్యి" అన్నాడు చంగయ్యశర్మ.

"అసలు పాటలు, పద్యాలు ఎవరు పాడగలరు ?" అన్నాడు చంగల్రాయలు.

"తెలుగు పండిట్టు! పద్యాలు పాడటం రాదంటున్నాడు!" నవ్వాడు శ్రీనివాసులు. “తెలుగు పండిటంటే పద్యాలు పాడేవాడనా నీ అర్థం?" అన్నాడు చంగల్రాయలు.

"ఇప్పుడు మీకు పద్యాలు రాకపోయినా పరవాలేదు. నేను నేర్పిస్తాను. నేర్చుకోవాలనే ఉత్సాహం ఉంటే చాలు మీకు" అన్నాను.

నేను పద్యాలు, పాటలు బాగానే పాడగలను. స్కూల్లో, కాలేజీలో చదువు కునే రోజుల్లో డ్రామాలు వేశాన్నేను. మా బావగారొకాయన మంచి నటుడు. ఆయన నాచేత పాటలు, పద్యాలు పాడించేవాడు. ఎలా పాడాలో నేర్పించాడు. శ్రుతిలో, రాగయుక్తం గా పద్యం బాగానే పాడగలన్నేను. ఆ ధైర్యంతోనే అన్నాను "డ్రామాలో మీరందరూ పాల్గొనాలి."

“మీరు ఇతర పన్లేమైనా చెబితే చేస్తాం గాని డ్రామాలో వేషం వెయ్యటం మాత్రం మావల్ల కాదు" అన్నారు శ్రీనివాసులు, మునసామినాయుడు, చంగయ్యశర్మ ముక్త కంఠంతో,

“ఇక చంగల్రాయలూ, నేనూనా!"

“ఓబుల్రాజున్నాడుగా - వాడిచేత ఒక వేషం వేయించండి" అన్నాడు చంగల్రాయలు సీరియస్గా, మిగిలిన అందరూ నవ్వారు.

“మీరు పాటలు, పద్యాలు పాడతారా సార్!" అన్నాడు చంగయ్యశర్మ.

"నేను పాడగలను కాని, సినిమా పాటలు రావు. డ్రామాల్లో పద్యాలు, జాతీయ గీతాలు, భావగీతాలు బాగానే పాడగలను" అన్నాను.

“ఒక పద్యం పాడండి సార్!” నా కెదురుగా వచ్చి బాసిపట్లేసుకు కూచొని అడిగాడు చంగ్రాయలు.

అతని ఉత్సాహం నన్ను మురిపించింది. అతనికి కళపట్ల ఆసక్తి, అభిమానమూ, అభిరుచీ ఉన్నాయి.

చటుక్కున జాషువా గారి పద్య పాదం "ఈ లోకమ్మున వృద్ధిగిన యేయే విద్యలల్లాడునో" జ్ఞాపకం వచ్చింది. శ్మశానంలోనే గాదు ఈ పల్లెల్లో గూడా ఎంతమంది కవుల కలాలు, గాయకుల కమ్మని కంఠాలు, చిత్రలేఖకుల కుంచెలు, సరైన శిక్షణ లేక, పోషణ లేక మూగబోయాయో! 'ఎంతతీసి రేణువులయి మృత్తికం గలిసి పోయాయో! కళల కాంతులు విరజిమ్మాల్సిన పల్లెలు నిర్జీవాలయినాయి. కుల కక్షలతో, కుత్సిత రాజకీయాలతో శ్మశాన సదృశాలయినాయి."

"ఇప్పుడెందుకులెండి ? మళ్ళీ ఎప్పుడైనా పాడతాను." తప్పించుకోజూశాను.

"అదేం కుదర్దు. మీరు పాడాల్సిందే. లేకపోతే సత్యాగ్రహం చేస్తాను, ధర్నా చేస్తాను." మొండికేశాడు చంగ్రాయలు.

"పద్యం వినాలని అంత ఉత్సాహపడే మనిషికి కాస్తో కూస్తో పాడటం కూడా వచ్చి ఉండాలి. ముందు మీరు పాడండి" అన్నానతనితో.

"నేను పాడలేను. నాది గార్దభ స్వరం. మీరు పాడండి వింటాము”.

“అదేం పనికిరాదు. అసలు మీరందరూ పాడాల్సిందే. నేను పాడితే వినాలని మీకున్నప్పుడు మీరు పాడితే వినాలని నాకుండదా! మీరు తలా ఒకటి పాడండి. చివరకు నేను పాడతాను.”

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. నా పాటో, పద్యమో వినాలనే కోరిక అందరి ముఖాల్లోనూ ద్యోతకమవుతున్నది.

“మీరు మొదలు పెట్టండి శ్రీనివాసులూ!" అన్నాడు చంగయ్య శర్మ. “ముందు మీరు పాడితే బాగుంటుంది" అన్నాడు శ్రీనివాసులు.

"ఇట్లా లాభం లేదు. నేన్చెబుతా వినండి. ముందు నేను పాడుతా తరువాత శ్రీనివాసులు, మునసామి, చంగయ్యశర్మ అందరూ అయిన తరువాత హెడ్మాస్టరూ, సరేనా?" అంటూ తేల్చేశాడు చంగ్రాయలు.

"అయితే మొదలుపెట్టండి" అన్నాను.

చంగ్రాయలు దగ్గి, గొంతు సవరించుకొని, కళ్ళు గట్టిగా మూసుకొని పద్యం పాడాడు -"భద్రాద్రి రఘురాము భజనకు జనుచుండ బంధు మిత్రుల యాజ్ఞబడయ నేల!" అనే పద్యం రాగయుక్తంగా పాడాడు.

అందరం చప్పట్లు చరిచి మెచ్చుకున్నాము. సిగ్గుపడ్డాడు చంగ్రాయలు.

"ఇక మీరు కానివ్వండి శ్రీనివాసులూ!" అన్నాను.

శ్రీనివాసులు నేలను చూస్తూ పీల గొంతుతో "చెలియా కనరావా నిరాశబూని పోయితివా ?" అంటూ మొదలుపెట్టాడు.

"ఆ యేడుపేదో నేనేడవాలి గాని నీకేం కర్మ శ్రీనివాసులూ! 'టింగురంగా' అని ఒక వంక బంగారం వంటి పెళ్ళాంతో కులుకుతూ ఆ యేడుపేంటి?" అడ్డు తగిలాడు చంగ్రాయలు పగలబడి నవ్వుతూ.

టక్కున ఆపేశాడు శ్రీనివాసులు. ఎంత బ్రతిమాలినా పాడనని మొండి కేశాడు తరువాత,

అడిగించుకోకుండానే మునసామి 'ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు' అంటూ గబగబా పద్యం పాడేశాడు. అందరం నవ్వాం.

చంగయ్యశర్మ హిందీ పండిట్ గాబట్టి హిందీ పాటే ముక్కుతో పాడటం మొదలుబెట్టాడు 'ప్యార్ కియాతో డర్నా క్యా' అని.

'మనచుట్టూ అరవాళ్ళున్నారు స్వామీ! ఎవడన్నా విన్నాడంటే కిరసనాయిలు డబ్బాలతో తరుముకుంటారు మనల్ని" అంటూ అతని నోరు కట్టేశాడు చంగ్రాయలు. అసలు విషయం నేను పాడితే త్వరగా వినాలని.

ప్రేమికుడు ప్రియురాలి మెడలో తాళి కట్టబోతూ సిగ్గుపడినట్లు నేను పాట పాడబోయే ముందు సిగ్గుపడ్డాను. ఆకాశంలోకి చూస్తూ చేతులు రెండూ వెనకానించు కొని 'దేశమును ప్రేమించుమన్నా' అనే దేశభక్తి గేయంలోంచి నాలుగు చరణాలు పాడాను.

"మీరు చాలా బాగా పాడతారు సార్. మీ కంఠంలో తియ్యదనం ఉంది" అంటూ ముక్త కంఠంతో మెచ్చుకున్నారందరూ. మరో పాట పాడమన్నారు. రెట్టించిన ఉత్సాహంతో "ఆనందం అర్ణవమైతే - అనురాగం అంబరమైతే" శ్రీశ్రీగారి గేయం పాడాను. పరవశంతో చేతులు తట్టి అభినందించారు నలుగురూ.

చంగల్రాయలు అంతటితో వదల్లేదు నన్ను. 'ఒక పద్యం పాడండి సార్!' అని పట్టు పట్టాడు.

"నా విద్యలన్నిటినీ ఒక్కసారే చూపెయ్యమంటే ఎలా? ఇప్పటికీ పాటలు చాల్లెండి. పద్యం మరోసారి" అంటూ లేచాను, అక్కడ కూచుంటే వదిలి పెట్టరని.

"మీరు భలేబాగా పాడతారు సార్! నేర్చుకోవాలని నాకు చాలా ఉత్సాహం సార్. కాని ఇదిగో ఇట్లాంటి చోటులో పడి మురిగిపోతున్నాను." బాధగా అన్నాడు చంగల్రాయలు.

"మనందరం ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం. శాస్త్రీయ సంగీతం నేర్చు కోవాలని నాకు చిన్నప్పటి నుంచీ కోరికగా ఉండేది. కానీ ఏం లాభం. చదువుకునేటప్పుడు ఆర్థిక దౌర్భాల్యం, కాస్త ఆర్థిక స్వాతంత్ర్యం లభించిదనుకుంటే ఇలాంటి పల్లెలు! మన రాతలింతే!" అన్నాను నిరుత్సాహంగా.

చంగల్రాయలు అందరితోబాటు వెళ్ళిపోలేదు. నాతోపాటు స్కూలు దగ్గరి కొచ్చాడు. ఓ అరగంటసేపు కూర్చుని సంగీతం చర్చ జరిపాడు. మరో

అయిదారు పద్యాలు పాడాడు. వార్షికోత్సవం విషయం తేల్చి చెప్పమని పట్టుపట్టాడు.

"మిగిలినవాళ్ళకు అంతగా ఉత్సాహం ఉన్నట్లు లేదు. మీరు 'భక్త రామదాసు' డ్రామాలో జైలు సీను ఏకపాత్రాభినయం చెయ్యండి, బాగుంటుంది. అందులో దండకం, మూడు, నాలుగు పద్యాలు, కొన్ని పాటలు, వచనం - అన్నీ ఉన్నాయి" అన్నాను.

"మీరు నాకు ట్రైనింగిస్తామంటే వేస్తాను సార్!" అన్నాడు ఉత్సాహంగా.

అతని ఉత్సాహం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. పూర్వం ఉపాధ్యాయులు నాటక కళను అభిమానించి పోషించేవారు. ఇప్పటి వారికి చాలా వరకు దానిపట్ల ఆసక్తి లేదు. చంగల్రాయలుకు నాటకం పట్ల అభిమానం ఉన్నందున అతన్ని అభినందించాను.

ఆటల పోటీలు నిర్వహించే పనిని మునసామికి అప్పగించాను. చంగయ్య శర్మను పిల్లలకు నాటిక నేర్పించమని కోరాను. చంగల్రాయలుతో తిరుపతి నుంచి కాని, మరెక్కడి నుంచైనాగానీ 'భక్త రామదాసు' పుస్తకం తెచ్చుకోమని చెప్పాను. ఆ యా పనులు చేయడానికి ఆ అందరూ అంగీకరించారు.

వార్షికోత్సవ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయినాయి.

10

చంగల్రాయలు పుస్తకం తెచ్చుకున్నాడు. అందులో జైలు సీనంతా కంఠస్థం చేసుకోమని చెప్పాను. చంగయ్య శర్మ తన రూములోనే పిల్లలకు నాటిక నేర్పిస్తున్నాడు.

వార్షికోత్సవం వ్యవహారంలో తనకు ఏవిధమైన ప్రాముఖ్యం ఇవ్వనందుకు శ్రీనివాసులు చిన్నబోయినట్లున్నాడు. అతనికి కూడా ఏదో ఒకటి చెయ్యమని చెబుదా మనుకున్నాను గాని చెప్పలేదు. అన్ని కార్యక్రమాలనూ అజమాయిషీ చేసే పని పెడదామనుకున్నాను.

అయితే దాని కింకా సమయం రాలేదు.

అతను స్కూల్లో చాలాకాలంపాటు ప్రముఖమైన పాత్ర నిర్వహించాడు. ఇప్పుడు కొద్దిగా ఆ అవకాశం ఇతరులకు ఇచ్చాను. అంత మాత్రానికే తను బాధపడాల్సిన అవసరం లేదు. తనను అశ్రద్ధ చేశారని భావించు కోనవసరం లేదు. కాని ఇప్పుడతను ఇంతకు ముందులా సన్నిహితంగా ఉండటం లేదు. అంటీ అంటనట్లు ఉంటున్నాడు. సాయంత్రాలప్పుడు మాతో రావటం లేదు. ఒకటి రెండు సార్లడిగితే ఏవో సాకులు చెప్పాడు. ఇప్పుడతన్ని నేను పెద్దగా పట్టించుకోవటం లేదన్నమాట యదార్థం. అందుక్కారణం మిగిలిన వారు నాకు మరింత చేరువగా రావటమే ననుకుంటాను.

సాయంత్రం ఏడున్నరకల్లా భోజనం ముగించుకుని మునసామి నాయుడిని వెంట బెట్టుకుని స్కూలుకు రావటం ఆరంభించాడు చంగల్రాయలు. ఎనిమిది గంటలకు నా భోజనం పూర్తి కానిచ్చి అతనిచేత రిహార్సల్ చేయించటం ప్రారంభించాను. మొదటి నాలుగు రోజులూ అతను నోటికి నేర్చుకున్నదంతా అప్పజెప్పించుకున్నాను.

వార్షికోత్సవం, నాటకం, చంగల్రాయలు నటన ఎలా ఉన్నా నాకు మాత్రం రాత్రిపూట ఒంటరితనం బాధ తప్పింది. రాత్రి పదిన్నర దాకా రిహార్సలు చేయిస్తున్నాను. మునసామి వీలైనంత సేపు కూచుని తరువాత చాపమీద నడుం వాల్చి నిద్రపోతాడు.

చంగల్రాయలు చేత మళ్ళీ చెప్పిందే చెప్పిస్తూ బాగా బాదుతున్నాను.

ఓబుల్రాజు ముసిముసి నవ్వులు నవ్వుతూ మూల కూచుని మమ్మల్ని చూస్తూ తన్మయుడవుతున్నాడు.

జైలు సీను టెక్స్ట అంతా నాకూ కంఠోపాఠం అయిపోయింది. దండకం, పాటలు, పద్యాలు, తాదాత్మ్యం చెంది పాడుతున్నాను. నే నింత బాగా

పాడగలనా! అని నాకు నేనే ఆశ్చర్యపోతున్నాను! చంగల్రాయలు నాకు సాక్షాత్తు శిష్యుడే అయినాడు.

ఊళ్ళో నా నటనా సామర్థ్యం గురించి, సంగీతజ్ఞత గురించి బాగా ప్రచారం జరిగింది. లాంతర్లు పట్టుకుని ఊరి జనం రిహార్సలుకు రావటం మొదలు పెట్టారు. మొదట నలుగురైదుగురితో ప్రారంభమైంది. బయట దూరంగా నాకు తెలీకుండా కూర్చునే వారు. క్రమంగా వారి సంఖ్య పెరిగింది. మొదట పెంకుటింటి ముందు కూర్చునేవారు. తరువాత రూము లోపలికే వచ్చి కూర్చోవటం ఆరంభించారు.

పొద్దుగూకంగానే కలిగింది తిని నిద్రపోయే మనుషులు రోజూ రాత్రి పదకొండు దాకా మేల్కొని ఉంటున్నారు. నిద్రాణంగా ఉండే మనుషుల్ని జాగృతం చేస్తున్నది మా నాటకం. నాటకం ఎంత శక్తివంతమైన సాధనమో అర్థమైంది నాకు.

వార్షికోత్సవ ప్రసక్తిని, నాటకం ప్రసక్తిని తీసుకొచ్చినందుకు చంగల్రాయల్ను మనసులోనే చాలాసార్లు అభినందించాను. అతనితో కూడా నాలుగైదు సార్లన్నాను.

ఆనందంతో పరవశించాడతను. "ఈ జనానికి నాటకమంటే ఇంత వెర్రి ఉందని నేనెన్నడూ అనుకోలేదు సార్!" అన్నాడతను.

"మానసికోల్లాసం మనకే కాదు బ్రదర్, వాళ్ళకూ కావాలి ఇక్కడ సినిమాలు న్నాయా, టి.వి.లున్నాయా? రేడియోలు కూడా లేవు. ఇంతకాలం పాటు విధిలేని పరిస్థితుల్లో నిద్రాణంగా ఉన్నారన్న మాట. ఇప్పుడు మీవల్ల ఈ పని జరుగుతున్నది. అందుకు మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అన్నాను" ఎమోషనల్గా.

“నన్ను విపరీతంగా పొగిడి అన్యాయం చేస్తున్నార్ సార్! ఇందులో నేను చేస్తున్నదేమీ లేదు. అంతా మీ ప్రభావమే. నేను పాటలు పద్యాలు పాడితే

వినేందుకు మనుషుల మాట దేవుడెరుగు! గాడిదలు కూడా రావు" అన్నాడు చంగల్రాయలు.

రోజులు గడిచేకొద్దీ ఊరిలోని ఆబాలగోపాలం స్కూలు దగ్గరికి చేరటం మొదలైంది. ఒకరోజు రాత్రి రిహార్సలు ముగిసింది. ఒకతను నాదగ్గరకు వచ్చాడు. యాభయ్యేళ్ళకు పైగానే ఉంటాయతనికి. పొడుగాటి తెల్లటి గడ్డం ఉన్నది. జుట్టు గూడా పొడుగ్గా ఉంది. ఎం.ఎల్.ఏ. బార్డరు ఖద్దరు పంచ లుంగీలా కట్టుకున్నాడు. ముతక ఖద్దరు జుబ్బా వేసుకున్నాడు. దృఢంగా, పొడుగ్గా ఉన్నాడు. నా రెండు చేతులూ పట్టుకొని "ఇంత కాలానికి మా ఊరికి వెలుగొచ్చింది. మీ నటన చాలా బాగుంది. పద్యం పాడటం, దండకం చదవటం అద్భుతంగా ఉన్నాయి. నేను చాలా దేశం తిరిగాను. చూచాను. కాని మీలాగా పద్యం పాడినవాళ్ళు, అభినయించిన వాళ్ళు నాకు కనిపించలేదు. మిమ్మల్ని ఎలా సత్కరించాలో నాకు తెలియటంలేదు" అంటూ ఆర్ధనయనాలతో నన్ను ప్రశంసించాడు.

అప్పుడు నేను పొందిన ఆనందాన్ని, ఆత్మతృప్తిని వర్ణించలేను. వసిష్ఠ మహర్షిలా కనిపిస్తున్న అతనికి నమస్కారం పెట్టాను. మిగిలిన జనం మా ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూశారు.

మర్నాడు చంగల్రాయల్ని అడిగాను "రాత్రి నాతో మాట్లాడిన గడ్డం మనిషెవరండీ ?"

"ఆయనో పెద్ద గ్రంథసాంగుడు. కొంతకాలం రాజకీయాల్లో తిరిగి ఆస్తిపాస్తుల్ని తగలేసుకున్నాడు. ఇప్పుడు బుద్ధి తెచ్చుకుని కొడుకు దగ్గరుంటున్నాడు గుట్టు చప్పుడు కాకుండా. ఎప్పుడూ టూర్ మీదే ఉంటాడు మనిషి. పరమ తాగుబోతు. సారాయి, గంజాయి, నల్లమందు మూటికీ అలవాటుపడ్డాడు. ఎప్పుడూ నిషాలోనే ఉండేవాడు. ఇలాంటి వాళ్ళందరిదీ ఓ ముఠా ఉంది ఊళ్ళో. అందరూ వీళ్ళను 'బంగిమఠం' అని పిలుస్తూ ఉంటారు. రాత్రి ఎందుకొచ్చాడో, ఎట్లా వచ్చాడో తెలీదు. పేరు

గంగరాజు. పరమ దరిద్రుడు" అంటూ వివరాలు సమగ్రంగా చెప్పాడు. "అతను స్కూలు దగ్గరకు రావటం గొప్ప విషయమే. అదీ తాగకుండా!"

అప్పుడు నా కనుమానం వచ్చింది. "రాత్రి అతను తాగి ఉన్నాడా? మామూలుగానే ఉన్నాడా?" అని జ్ఞాపకం చేసుకున్నాను. అతని దగ్గర మురికికంపు ఉన్నది కాని, సారాకంపు కొట్టిన జ్ఞాపకం లేదు. యెవరైతే యేం? అతను ఎలాంటివాడైతే యేం! నన్ను మెచ్చుకున్నాడు. పైగా ఈ రోజుల్లో రాజకీయాల్లో అందరూ డబ్బు సంపాదించు కుంటున్నారు. ఈ దౌర్భాగ్యుడు పోగొట్టుకున్నాడట! పాపం సామాజిక స్పృహ, త్యాగబుద్ధీ ఉన్నవాడే అయి ఉండాలి. చేసేందుకు ఇతరత్రా ఇష్టమైన పనులేమీ లేనందువల్ల తాగుబోతై ఉంటాడు అనుకున్నాను.

మొత్తంమీద గంగరాజు నామీద సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు! ఊళ్ళో సగానికి సగం మంది తాగుబోతులేనట. ఆడవాళ్ళు కూడా ఒళ్ళు తెలియ కుండా తాగుతారట. ఊరి దరిద్రానికి కారణం తాగుడేనని టీచర్లు చెప్పారు.

"కల్లు మానండోయ్ బాబూ కళ్ళు తెరవండోయ్!" అని ఊళ్ళో ప్రచారం చేస్తే చాలా మార్పు రావచ్చునని శ్రీనివాసులు నాతో చాలా సార్లు చెప్పాడు. ఇలాంటి విషయాల్లో నీతిబోధలు పనిచెయ్యవని చెప్పాను. ఊపిరాడని పనివాళ్ళ కిష్టమైన పని కల్పిస్తేగాని దీనికి విరుగుడుండదని చెప్పాను మహా తెలిసిన సిద్ధాంతిలాగా.

శ్రీనివాసులు ఎటువంటివాడైనా ఆరోగ్యవంతమైన సమాజం మధ్యలో హాయిగా బ్రతకాలనే కోరిక బలంగా ఉన్నవాడు. అందుకుతన్ని అభినందించక తప్పదు. ఈ విషయంలో మా దృక్పథాలు వేరుకాదు. మా ఇద్దరికీ సామాజిక స్పృహ ఉన్నది.

తనకంటే హీనంగా, దీనంగా, దరిద్రంగా బ్రతుకుతున్న వారిని గురించి ఆలోచించ కుండా, పైగా వారినే పీక్కుతింటూ, అంతా మాకే ఇంకా ఇంకా

కావాలని అంగలార్చు తున్న విద్యావంతులు ఎందరు లేరు దేశంలో! శ్రీనివాసులు అలాంటివాడు కాదు. తన కిందిస్థాయిలోని వారిని గురించి ఆలోచిస్తాడు, వాళ్ళ మంచిని కోరుతాడు.

ఈ నాటకంతో నాకు తెలియకుండానే, నా ప్రయత్నం లేకుండానే ఊళ్ళో జనానికి నామీద విపరీతమైన అభిమానం పెరిగిపోయింది. నేను ఊళ్ళోకి పోలేదు. ఊరే నా దగ్గరికొస్తున్నది.

ఒకరోజు స్కూలు కమిటీ ప్రెసిడెంటు తన పరివారంతో స్కూలు దగ్గరి కొచ్చాడు. "ఆ రోజు మేము మిమ్మల్ని తెలిసో తెలియకో ఏవో మాట లన్నాము. వాటిని మనసులో ఉంచుకోవద్దు. మీరు ఇంత గొప్ప వాళ్ళని మాకు తెలీదు. మా గంగరాజన్నయితే ఇరవై నాలుగు గంటలూ మీగురించే చెబుతున్నాడు మాతో...చాలా పశ్చాత్తాపంతో మాట్లాడా డాయన.

ఆరోజు ఆయన నాతో అన్నమాటలు నామీద బలంగా పని చేశాయని చెప్పాలను కున్నాను కాని చెప్పే ధైర్యం లేకపోయింది. తలవంచుకుని ఆయన మాట్లాడిన మాటలన్నీ విన్నాను.

"స్కూలు ఇలా పూరి గుడిసెలో ఉంటే ఏం లాభం లేదండీ! అది పిల్లలకూ బాగుండదు. మాకూ బాగుండదు. స్కూలంటే అందరినీ ఆకర్షించే స్థలంగా ఉండాలి కాని, అసహ్యం పుట్టించేలా ఉండగూడదు. ఈ స్కూలు చూచి ఇక్కడ పని చెయ్యాలని పించలేదు నాకు. దూరంగా పారిపోవాలని పించింది. అందుకే వెళ్ళిపోయాను. మీరు స్కూలుకు భవనం నిర్మించే ప్రయత్నం చేయాలి. లేకపోతే దీని కథ ఎప్పుడూ ఇలాగే ఉంటుంది" అన్నాను.

ప్రెసిడెంటు నన్ను వెంట తీసుకొనిపోయి హైస్కూలు కని జిల్లా పరిషత్తు పేర రిజిష్టరు చేయించిన భూమిని చూపించాడు. అది అతనిదేనట పూర్వం. బిల్డింగులు కట్టించాలని వేయించిన ఇటుక బట్టీలు రెంటిని చూపించాడు.

ఆ స్థలంలోనే ఉన్నాయి. "అన్నీ బాగా చెయ్యాలనే మా కోరిక కూడా. కాలం, కర్మంకలసి రావటంలేదు" అన్నాడు బాధగా.

నేనేమీ మాట్లాడలేదు. అక్కడి నుంచి తిరిగి ఆఫీసు రూములోకొస్తూ "మీకు మంచి ఇల్లిస్తాం. ఊళ్ళోకి వచ్చి ఉండండి. ఇక్కడ ఒంటరిగా ఉండటం ఎందుకు?" అన్నాడాయన.

"ఊళ్ళో మంచి ఇళ్ళు కూడా ఉన్నాయా? ఇక్కడ బాగానే ఉందిలెండి. ఎలాగో కాలం గడుస్తున్నది" అన్నాను.

"మీరు మధ్యలో ఉంటే మాకు బాగుంటుంది. మీ నుంచి మేము ఎక్కువగా నేర్చుకోవచ్చును" అన్నాడాయన.

ఒక గంటసేపుండి వెళ్ళిపోయాడాయన.

ఆ మనుషులందర్నీ పోగేసుకుని గంగరాజే తీసుకొచ్చాడని ఆ తరువాత తెలిసింది. స్కూలు సాంవత్సరిక పరీక్షలు ముగిశాయి. క్లోజింగ్ డే నాడు వార్షికోత్సవం. స్కూలు కమిటీ ప్రెసిడెంటే అధ్యక్షత వహించాడు. ఆటల పోటీల్లో గెలిచిన పిల్లలకు ఆయనే బహుమతులు పంచి పెట్టాడు. పిల్లలు నాటిక బాగానే వేశారు. చివర్లో చంగల్రాయులు రామదాసు జైలు సీను ఏకపాత్రాభినయం చేశాడు. చక్కగా ఉంది అతని నటన. ఊరిజనం అంతా వచ్చి చూశారు. స్కూలు ఇక ముందు సాధించాల్సిన అభివృద్ధిని గురించి నాలుగు మాటలు చెప్పాను. చంగయ్య శర్మ వందన సమర్పణ చేశాడు.

11

సెలవుల్లో శ్రీనివాసులు తప్ప మిగిలిన అందరూ ఊళ్ళ కెళ్ళిపోయారు. నేనూ ఊరికి పోవాలి. స్కూలు కమిటీవాళ్ళతో మాట్లాడి స్కూలుకు తొమ్మిదో తరగతి ప్రారంభించేందుకు పర్మిషన్ తెచ్చుకోవటం, భవన నిర్మాణం వగైరాల గురించి ఏర్పాట్లు గట్టిగా చెయ్యాలని ఉండిపోయాను. మధ్యలో ఒక వారం రోజులు ఊరికిపోయి వద్దామనుకున్నాను.

శ్రీనివాసులు ఇంతకు ముందులాగా మనస్ఫూర్తిగా మాట్లాడటం లేదు.

స్కూలు మూసిన కొద్ది రోజులకే శ్రీరామనవమి వచ్చింది. ఊళ్ళో భజన మందిరం ఉందట. అక్కడ తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయట. ప్రతిరోజూ భజన, దేవుడి ఊరేగింపు చేసి ప్రసాదాలు పెడతారట. ఆ ఊళ్ళో కాస్త సందడిగా జరిగేది ఆ ఉత్సవమేనట, ఓబుల్ రాజు చెప్పాడు. ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజులైంది. మాట్లాడేందుకు మనుషులు దొరకటం లేదు.

నాలుగోరోజు రాత్రి అన్నం తిని ఓబుల్ రాజు తెచ్చిన మంచం మీద పడుకుని నిద్రపోతున్నాను. రాత్రి పది గంటల ప్రాంతంలో నన్ను నిద్ర లేపాడు గంగరాజు. లేచి కూచుని ఆయన్ను కూడా కూచోమన్నాను. ఆయన నా చేతిలో ఒక పొట్లం ఉంచి కొన్ని మల్లెపూలు ఇచ్చాడు. “దేవుడి ప్రసాదం! తిను" అన్నాడు.

మల్లెపూలు వాసన చూచి “ఏముంది దీంట్లో?” అన్నాను పొట్లం వంక చూస్తూ. “చెప్పానుగా దేవుడి ప్రసాదం సుండలు. బాగుంటాయి తిను" అన్నాడు చిరునవ్వుతో.

“నా భోజనమైపోయింది. రేపు తింటానులెండి" అని పక్కన పెట్టాను.

ఆ పొట్లం తన చేతిలోకి తీసుకుని - "వీటిని ఇప్పుడు తినాల్సిందే. నేనెంత ప్రియంగా తెచ్చానో తెలుసా?" అంటూ పొట్లం విప్పి నా చేతిలో పెట్టాడు.

తినక తప్పలేదు నాకు. ఆయన నన్ను ఏకవచనంలో సంభోధిస్తున్నా ఆయన కనబరుస్తున్న ఆప్యాయత ఆకట్టుకున్నది.

చాలా రుచిగా ఉన్నాయి సుండలు. ఓబుల్ రాజు వంటలో రుచీపచీ ఉండదు. గతి లేనమ్మకు గంజే పానకం అన్న విధంగా కాలం వెళ్ళదీస్తున్నాను. పైగా నేను ఆలోచిస్తున్నది ఎక్కువగా తిండి గురించి కాదు.

స్కూలు గురించి. బ్రతికేందుకు తినాలి అన్న సూత్రం ఆచరణలో పెడుతున్నాను.

ఒక్క గింజ కూడా మిగల్చకుండా అన్నీ తినేశాను. “ఇంకాసిని తీసు కొస్తాను” అంటూ లేవబోయాడు గంగరాజు. “వద్దు వద్దు మీరు కూర్చోండి" అని ఆయన్ను బలవంతాన కూచోబెట్టాను. ఆయనే లేచి వెళ్ళి కుండలో నీళ్ళు లోటాలో తెచ్చి ఇచ్చాడు.

“నువ్వు ఇక్కడ ఒంటరిగా ఉండటం ఏమీ బాగాలేదు. ఊళ్ళో మంచి ఇల్లు చూశాను. బాడుగ కూడా తక్కువే. అయిదు రూపాయలు. బాడుగ లేకుండా చేద్దామని చూశాను గాని ఆ పిసినారి వెధవ ఒప్పుకోలేదు. నీకు బాగుంటుంది. ఇల్లు, ఓబులుగాడు అక్కడే వండి పెడుతుంటాడు. వాడికీ కష్టం తగ్గుతుంది. మాకూ బాగుంటుంది,” బ్రతిమాలు తున్నట్లు అన్నాడు.

“ఏం? అతను మీతో చెప్పాడా చాలా కష్టపడుతున్నానని?"

"ఛ ఛ! అదేం లేదు పాపం. మీరొచ్చింతరువాత తాగుడు వదలిపోయిందని వాడు సంతోషిస్తున్నాడు. నేనే అంటున్నాను" అన్నాడు గంగరాజు.

"ఇంటికేం గాని ముందు స్కూలు విషయం చూడండి. తొమ్మిదో తరగతి శాంక్షన్ చేయించుకురండి, బిల్డింగు కట్టే ప్రయత్నం చేయండి అన్నాను.”

"ఈ పనులన్నీ ఎట్లా చేయాలో నాకు తెలీదు. మా ప్రెసిడెంటు తెలివిగలవాడే కాని చొరవ తీసుకుని పనులు చేసుకురాలేదు. నువ్వు ఇట్లా చెయ్యమని చెప్పు. మేము చేస్తుంటాము. అంతేగానీ అన్నీ చేస్తామని మాటలు చెప్పి ఏమీ చెయ్యకుండా తప్పించుకోవటం నాకు గిట్టదు" అన్నాడు.

“అందుకే మీరు రాజకీయాల్లో రాణించలేకపోయారు” నవ్వాన్నేను.

“నా సంగతులన్నీ తెలుసుకున్నట్లున్నావే! ఆశ్చర్యంగా అన్నాడతను. “అన్నీ వయసులో ఉన్నప్పుడు తిరిగిన తిరుగుళ్ళు. నాకు ఒక్కడే కొడుకు. వాడి అదుపాజ్ఞల్లో ఉంటున్నాను. వాడు కూచోమంటే కూచోటం, నుంచోమంటే

నుంచోటం, ఆర్థికంగా నాకు స్వతంత్రం లేదు. వాడికి నేను మిగిల్చింది కూడా పెద్దగా ఏమీ లేదు."

“అయిపోయిందేదో అయిపోయింది. మంచి పనులు చేయాలని మనసుంది మీకు. అది చాలు. ఊరి మనుషులకు చెప్పండి ఈ విషయాలు. అందరిలో సంచలనం కలిగితే ఇదెంత? ఇప్పుడు వాతావరణం కూడా బాగుంది” అన్నాను.

"నువ్వు ఊళ్ళో ఉంటే మనుషులకు దగ్గరగా ఉంటావు. మన పనులు తేలిగ్గా చేసుకోవచ్చును" అన్నాడు గంగరాజు.

“రేపు స్కూలు తెరిచినప్పటి నుంచీ అలాగే చేస్తానులెండి”. అన్నాను.

“అందాకా కుదరదు. ముందుగానే వచ్చేయ్యాలి" అని చెప్పి లేచిపోయాడు.

'రామదాసు' జైలు సీను నాకు ఒంటరితనం నుంచి విముక్తి కలిగించింది. ఇప్పుడు ఒంటరిగా ఉండాలన్నా వీలు కావటం లేదు. పిన్నలు, పెద్దలు నాతో మాట్లాడుతూ కూచుంటున్నారు. నాతో మాట్లాడగలగటమే గొప్పగా అనుకుంటున్నారు.

భజనమందిరంలోకి వచ్చి పాటలు పాడమని చాలా బలవంతం చేశారు కాని నేను పోలేదు.

శ్రీరామనవమి ఉత్సవాల ఆఖరిరోజు. నేను రోజూ మాదిరిగానే భోంచేసి మంచం మీద పడుకున్నాను సిగరెట్టు కాలుస్తూ. ఇంటికి పోయిన ఓబుల్రాజు ఇంకా రాలేదు.

అతను ఊరేగింపంతా అయిన తరువాత గాని రాడు.

గంగరాజు పదిమంది మనుషుల్ని వెంటబెట్టుకు వచ్చాడు. వాళ్ళలో ప్రెసిడెంటు కూడా ఉన్నాడు. అందరూ నాకు నమస్కారం పెట్టారు కోలాహలంగా.

"ఇవాల్టితో శ్రీరామనవమి ఉత్సవాలు పూర్తవుతాయి. ఇవాళ పట్టాభిషేకం జరుగు తుంది. మంచి మేళగాళ్ళను పిలిపించాము. పట్టాభిషేకం, ఊరేగింపు ఇవాళ మీరు రావాలి. మాతోపాటే ఉండాలి" అంటూ అందరు పట్టుబట్టారు.

"రోజూ జరిపినట్లే ఇవాళ కూడా జరిపెయ్యండి. మధ్యలో నేనెందుకు? అన్నాను బెట్టుసరిగా.

"అదంతా కుదరదు. మీరు రావాల్సిందేనంటూ పట్టుబట్టారు.

అంతమంది వచ్చి పిలుస్తుంటే పోకపోవటం బాగుండదని చొక్కా తొడుక్కుని వాళ్ళతోబాటు నడిచాను. చాలా సంతోషించారు వాళ్ళు.

జపాన్ తుమ్మపొదలు దాటుకొని, గుంటలు, మిట్టలు దాటుకుంటూ వాళ్ళతో నడుస్తున్నప్పుడు "నదీనదాలు, అడవులు, కొండలు, ఎడారులా మన కడ్డంకి!" అన్న శ్రీశ్రీ గారి మాటలు జ్ఞాపకం వచ్చాయి. నాలో నేను నవ్వుకున్నాను.

నా పక్కన ఉన్నవాళ్ళు ఈ ఇల్లు ఫలానా వారిది, ఈ ఇల్లు మాది, అది ప్రెసిడెంటు గారిది అని చూపుతున్నారు. అన్నీ పూరి గుడిసెలు, పెంకుటిళ్ళు ప్రెసిడెంటుగారిది మాత్రం పెద్ద డాబా ఇల్లే. మరో మూడు నాలుగు డాబా ఇళ్ళున్నాయి. మేము నడుస్తుంటే ఆడవాళ్ళు వాకిళ్ళలోకి వచ్చినుంచు న్నారు మమ్మల్ని చూస్తూ. అదో పెద్ద సంరంభంలా తోచింది నాకు. అదో అపూర్వానుభవం.

ఒక మామూలు బడిపంతులుకు ఇంతటి అసాధారణ గౌరవ మర్యాదలు ఎందుకు జరుగుతాయి? ఎప్పుడు జరుగుతాయి? అదీ ఈ కాలంలో?

తోవలో మాతో ఇంకా చాలామంది చేరారు. యువకులు, వృద్ధులు. అందరం భజనమందిరం దగ్గరికి చేరాము. అక్కడ నాకో కుర్చీ వేసి కూచో బెట్టారు. నా పక్కన రాతి అరుగు మీద గంగరాజు కూచున్నాడు. అతని పక్కన ప్రెసిడెంటు కూచున్నాడు.

పూజారి మంత్రాలు చదువుతూ పట్టాభిషేక మహోత్సవం పూర్తి చేయించే సరికి ఒకగంట పట్టింది. అవతల ఊరేగింపుకు సిద్ధమైనారు. పట్టాభి రాముడి చిత్రపటాన్ని అందుకై పూలతో అలంకరించిన బండి మీద ఉంచారు. ముందు మేళగాళ్ళు, వారి వెనక భజన బృందం, వారి వెనుక మేము, మా వెనుక యువకులు లాగుతున్న బండి. దాని వెనుక ఆడ, మగ జనం. ముందు నాలుగు పెట్రోమాక్సు లైట్లు వెలుగుతున్నాయి. వాటిని నలుగురు మనుషులు తలల మీద పెట్టుకొని మోస్తున్నారు. దేవుడి పటం ఉన్న బండికి రెండు పక్కలా కాగడాలు పట్టుకుని ఇద్దరు మనుషులున్నారు.

"కానివ్వండి. ఇక బయలుదేరండి" చేతులూపుతూ ప్రెసిడెంటు ఆజ్ఞ జారీ చేశాడు. మేళగాళ్ళు త్యాగరాజు కీర్తన వాయిస్తున్నారు. భజన బృందం రామదాసు కీర్తన ప్రారంభించారు. జనంలోంచి ఒకరు "శ్రీరామచంద్ర మూర్తికీ!" అంటూ పెద్దగా అరిచారు. "జై" అన్నారు మిగతా అందరూ.

ఇంతలో గంగరాజు పెద్ద మల్లెపూల దండ నా మెళ్ళో వేసి "మన స్కూలు హెడ్మాస్టారుకూ" అని అరిచాడు. చేతులు తడుతూ అందరూ “జై” అని అరిచారు.

దిగ్భ్రమ చెందాన్నేను. సిగ్గు, ఆశ్చర్యాలతో ఉక్కిరి బిక్కిరయ్యాను. మెడలో నుంచి దండ తీసెయ్యాలని ప్రయత్నించాను కాని వాళ్ళు నన్నా పని చెయ్యనివ్వలేదు.

ఏ "ఏమిటిదంతా? నన్ను ఏ దేవతకైనా బలిఇవ్వబోతున్నారా ?" అన్నాను నా పక్కనే ఠీవిగా నడుస్తున్న గంగరాజుతో.

“మమ్మల్ని అడివి మనుషుల కింద జమ కడుతున్నావా? పట్టణాలకు, నగరాలకు దూరంగా ఉన్నా మాకూ నాగరికత తెలుసు. మేమేం నరభక్ష కులం కాదు. నిన్ను ఇలా గౌరవించాలనుకున్నాం. గౌరవిస్తున్నాం. నువ్వు మాతోపాటు ఊరంతా తిరగాల్సిందే” అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

పాటలు పాడుతూ, లయానుగుణంగా అడుగులు వేస్తూ భజన బృందం వారు చాలా నెమ్మదిగా ముందుకు కదులుతున్నారు. ముఖ్యమైన వాళ్ళ ఇళ్ళ ముందు రెండు మూడు నిముషాలు ఆగి మళ్ళీ కదులుతున్నారు.

ఊరి రెండు వీధులూ తిరగటం పూర్తయ్యేసరికి దాదాపు ఒంటిగంట అయింది.

అందరం భజనమందిరం దగ్గరికి చేరిన తరువాత నా మెడలోంచి పూలమాల తీసిచేత్తో పట్టుకున్నాను. లేత కొబ్బరిబోండాం కొట్టించి నీళ్ళు గ్లాసులో పోసి ఇచ్చారు తాగమని. తాగాను. పొట్లంలో కట్టి ప్రసాదం ఇచ్చారు. ఆత్రంగా సుండలు తిన్నాను. భజన మందిరానికి ఇరవై గజాలు ఇవతలగా ఉన్న పెంకుటింటికి తీసుకుపోయి "ఇదే నీ కోసం మాట్లాడిన ఇల్లు. నీ మంచం, గుడ్డలు అన్నీ ఇక్కడికే తెప్పించేశాము. ఇక నుంచి దీంట్లోనే ఉండాలి నువ్వు" అన్నాడు గంగరాజు ఇంటి లోపలికి నన్ను తీసుకుపోతూ.

అంతకు ముందుగానే ఇంట్లో పెట్రోమాక్స్ లైటు పెట్టించాడు. పల్లె మనుషులైనా మంచి ప్లాన్ వేశారు. నన్ను ఘనంగా ఊళ్ళోకి తీసుకొచ్చారు. వాళ్ళను వ్యతిరేకించ దలచుకోలేదు.

ఇల్లు దీర్ఘచతురస్రాకారంలో ఉన్న ఒక గది మాత్రమే, రెండు తలుపులున్నాయి. కిటికీలు లేవు. ఇంటిముందు, వెనుక కొద్దిగా ఖాళీ స్థలం ఉన్నది. ఇంటి లోపలికి గాలి బాగా వస్తున్నది. బాగానే ఉన్నదనిపించింది.

ఇంటి లోపల కలియజూచాను. నా వస్తువులన్నీ ఇక్కడికి చేరిపోయాయి. ఇక నేనిప్పుడు స్కూలు దగ్గరికి పోనవసరం లేదు. ఓబుల్ రాజు కూడా ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నాడు నవ్వుతూ.

మంచం మీద కూచున్నాను నాతోపాటు గంగరాజు కూచున్నాడు. మాకెదురుగా నలుగురైదుగురు కూచున్నారు. వాళ్ళలో ఒకాయన ఇంటి యజమాని నరసరాజు. అరవై ఏళ్ళకు పైబడిన వృద్ధుడు.

"అక్కడ ఒంటిగా పడుండే కంటే ఇది మంచిదిగాదూ?" అన్నాడు నరసరాజు నవ్వుతూ. "నీతో మాకు పనున్నా, మాతో నీకు పనున్నా ఇక్కడయితే సౌకర్యంగా ఉంటుంది" అన్నాడు గంగరాజు.

"ఏమేం చేస్తారో చెయ్యండి. ఒంటరిగా దొరికిపోయాను మీకు. ఇక మీ దయ" అంటూ నవ్వాను.

కాసేపు ఊరేగింపు విశేషాలు మాట్లాడి అందరూ వెళ్ళిపోయారు. లైటు ఆర్పేయించి నేనూ పడుకున్నాను.

ఎక్కడో పుట్టి పెరిగిన నేను ఇక్కడ ఈ విధంగా ఆదరణ పొందటం! నిజంగా ఇది నా పూర్వజన్మ సుకృతమే ననుకుంటూ పడుకున్నాను. ఇంత మంచి మనుషులకు నేను నాకు చేతనైనంత మంచి చెయ్యాలనుకున్నాను.

ఊరేగింపులో శ్రీనివాసులు లేడు. ఒకరిద్దర్ని విచారించాను. ఊళ్ళో లేడని చెప్పారు. అతని ఇల్లు సరిగ్గా గుర్తుపట్టలేకపోయాను ఆ గుంపుల మధ్యలోంచి.

12

మర్నాడు ఉదయం నేను నిద్రలేచి ముఖం కడుక్కోగానే ఇంటి యజమాని పెద్ద గ్లాసునిండా చిక్కని మజ్జిగ తెచ్చాడు నేను తాగేందుకు. ఆటంకం చెప్పకుండా గ్లాసందుకుని తాగేశాను. చాలా రుచిగా ఉన్నాయి మజ్జిగ.

"ఇంత పొద్దుకాడ మజ్జిగెవరన్నా యిత్తారా నరసమావా? నీకు తెలీదు. ఒహరు సెబితే యినవు" అంటూ నలభై ఏళ్ళకు పైబడిన స్త్రీ ఒకామె కాఫీ గ్లాసు తీసుకుని వచ్చింది నా ముందుకు. ఆమె ముతక నేతచీర కట్టుకున్నది. జుట్టు దువ్వి కొప్పు పెట్టుకున్నది. ముఖం మీద రూపాయంత బొట్టు పెట్టుకున్నది. పొడుగ్గా, అటు లావూ, ఇటు సన్నమూ కాకుండా ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా ఉన్నదామె. మెళ్లో రెండు వరసల చంద్రహారం ఉంది. చెవులకు కమ్మలు, ముక్కుకు బేసరి, కలిగిన ఇంటి మనిషిలాగే కనిపించింది.

"ఇది మా పక్కింటి నరసమ్మ. మా దాయాదులే. మొగ పిల్లల్లేరు. ఒకతే కూతురు. దాని పేరు సంపూర్ణ. మీ స్కూల్లో ఎనిమిదో తరగతి సదివిందే అదే. దీని మొగుడు అంత లెక్కకొచ్చినోడు గాదు పాపం. కాత్త జరుగుబాటు బాగా వుండాల్లే. ఏం లాభం! అంతా వొచ్చేవోడు కొట్టేసుకు నెల్లిపోతాడు" క్లుప్తంగా ఆమెను గురించి చెప్పాడు నరసరాజు. ఆయ నా మాటలు చెబుతుంటే సిగ్గుతో వంకర్లు తిరిగిపోయింది నరసమ్మ చాలాసార్లు చీర సవరించుకున్నది.

"ఎవరినెట్లా సూసుకోవాలో దీనికి బాగా తెలుసు. కాఫీ తాగు. తీసుకో" అన్నాడు ముసలాయన. ఆమె చేతిలోంచి గ్లాసందుకుని నాకు ఇచ్చాడు. సంకోచిస్తూ అందుకున్నాను. ఈ మనిషి అప్పుడే నన్ను ఏకవచనంతో సంబోధిస్తున్నాడు. తన ఇంట్లో చేరినంత మాత్రాన తనకు నామీద సర్వహక్కులూ ఏర్పడ్డాయనుకుంటున్నా డేమో పాపం!

అతి కష్టం మీద ఆవిడ తెచ్చిన కాఫీ తాగాను. అది బెల్లం పానకంలా ఉంది గాని కాఫీలా లేదు. మొత్తం మీద ఈ మనుషుల అభిమానం భరించలేనంత ఎక్కువగా ఉన్నది.

శ్రీనివాసులు నాతో సన్నిహితంగా ఉండటం లేదు. ఊళ్ళో ఉన్నా నన్ను కలుసుకోటం లేదు. రెండుసార్లు రమ్మని చెప్పి పంపితే ఒకసారి మాత్రం వచ్చి ముభావంగా మాట్లాడిపోయాడు.

ఒకరోజు గంగరాజు, ప్రెసిడెంటు నా దగ్గరికొచ్చారు సాయంత్రంగా. ముగ్గురం కలిసిపోయి స్కూలు భవననిర్మాణం ఎక్కడ చెయ్యాలో ఆ స్థలాన్ని నిర్ణయించాము. మొత్తం అయిదు గదులు కట్టాలని అనుకున్నాము. ఉన్న ఇటుకలు గోడలకు సరిపోతాయి. కప్పుకు సిమెంటు రేకులు వెయ్యాలని తీర్మానించాము.

స్కూలు తెరవకముందే పని ప్రారంభింపజేస్తామని మాట ఇచ్చారు వాళ్ళు.

"మీరు రెండు మూడు రోజుల్లో చిత్తూరు పోయి తొమ్మిదో తరగతి ప్రారంభించేందుకు పర్మిషన్ తీసుకురావాలి. ఈ స్కూలుతో ప్రారంభించిన స్కూళ్ళు ఎప్పుడో పూర్తి హైస్కూళ్ళయిపోయాయి" అన్నాను.

"మేము పోయి పర్మిషను తెస్తాము గదా! దాన్ని గురించి ఆలోచనే వద్దు" అన్నాడు గంగరాజు.

"అది వచ్చిందాకా నాకు దాన్ని గురించే ఆలోచన. ఇప్పటికే మన పిల్లలు చాలామంది అరవ స్కూల్లో చేరిపోయారు ఎనిమిదో తరగతి అయిపోయిం తరువాత. ఎస్సెల్సీదాకా మన స్కూల్లోనే ఉంటే మన పిల్లలు బాగుంటారు. మన స్కూలూ పెద్దదవుతుంది. అన్నిటికీ బాగుంటుంది" అన్నాను.

"అట్టాగే, అట్టాగే. ఈసారి ఏమైనాసరే ఆ పని చేస్తాము". అన్నాడు ప్రెసిడెంటు.

నేను జిల్లా పరిషత్తువారికి ఇక్కడ తొమ్మిదో తరగతి ప్రారంభించాల్సిన అవసరం చాలా ఉందని చాలాసార్లు రాశాను. మనం ఏం రాసినా వాళ్ళు ఉలకరు, పలకరు. మంచి పనులకు రెస్పాన్సు ఉండదు వాళ్ళ దగ్గర్నుంచి. ఏ ఆకాశరామన్నగాడో పిటీషన్లు పెడితే మాత్రం పరుగులమీద వస్తారు ఎంక్వయిరీల పేరుతో పీక్కు తినేందుకు! మా డెప్యూటీ సెక్రటరీకి ఒక ఉత్తరం కూడా రాశాను మీరు ఎంక్వయిరీ జరిపారు. దాన్లో మీరు తేల్చిన నిజానిజాలేమిటో నాకు తెలుపకుండానే పనిష్మెంటు ట్రాన్స్ఫర్ ఇచ్చారు. దానివల్ల మీకు సంతోషం కలిగిందనే అనుకుంటున్నాను. కాని ఇది నాకు మీరనుకున్నట్లు –

పనిష్మెంటుగా పరిణమించలేదు. ఇక్కడే నేను ఎంతో గౌరవంగా దర్జాగా ఉన్నాను. నా మాట వేద వాక్కుగా చలామణి అవుతున్నది. ఇంతటి గౌరవాభిమానాలు నేనింతకు ముందెన్నడూ అనుభవించలేదు. ఇలాంటి చోటుకు వేసిన మిమ్మల్ని, వేయించిన ఆ సమితి ప్రెసిడెంటును అభినందిస్తున్నాను. మీరొకసారి వచ్చినేనెలా ఉన్నానో చూసి పొండి"

అంటూ పెద్ద ఉత్తరమే రాశాను. ఏం రాస్తే ఏం లాభం? ఎనుబోతుమీద వాన కురిసినట్లు!

గంగరాజుకు, ప్రెసిడెంటుకు చెప్పాల్సిందంతా చెప్పి ఊరికెళ్ళాను. సెలవులన్నీ అయిపోయిన తరువాత వచ్చినందుకు అమ్మా, అక్కయ్యా చాలా నొచ్చుకున్నారు. అమ్మకు అలవాటు ప్రకారం రెండు రూపాయల నోట్లకట్టలు రెండిచ్చాను. "నేనున్నది ఈ డబ్బు కోసమేనట్రా ?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. "దేశం కాని దేశంలో ఏం తింటున్నావో, ఎట్లా ఉంటున్నావో! పెళ్ళి చేసుకోరా అంటే మా మాట వినవు" అంటూ చాలా బాధ పడింది.

“మనవళ్ళు! మనవరాళ్ళు చాలమందే ఉన్నారు గదమ్మా నీకు!! ఇప్పుడు నేను చేసుకోలేదనే బాధ ఎందుకు నీకు? మంచి ఊరికి బదిలీ అయిన తరువాత తప్పకుండా చేసుకుంటాను. నా గురించి నువ్వేమీ బాధపడొద్దు, నేను ఎంతో బాగున్నాను. నేనెంత గౌరవ మర్యాదలు అనుభవిస్తున్నానో చూసి ఆనందించేందుకు నువ్వు నా దగ్గర లేవు. అదే నా కొరత! నువ్వు, నాతో రామ్మా! నా దగ్గర ఉందువుగాని!" అన్నాను.

“అంత దూరం వీళ్లందరినీ వదిలిపెట్టి నేను రాలేనులే నాయనా!” అన్నది అమ్మ. “నువ్వు నా దగ్గరకి రావు. నేను నీ దగ్గర ఉండేందుకు వీల్లేదు. ఇది ఇట్లా జరగాల్సిందే!” అన్నాను.

అన్నయ్యలు, వదినలు, అక్కయ్యలు, బావగార్లు, వాళ్ళ పిల్లలు అందర్నీ కలుసుకుని వాళ్ళ మధ్యలో పదిరోజులు హాయిగా గడిపాను. నాక్కావల్సిన వంటలు అడిగి చేయించుకుని తిన్నాను. నాలుకకు మళ్ళీ రుచంటే ఏమిటో తెలిసింది.

ఇంతదూరంలో ఇక్కడ ఉన్నా తరచు అక్కడి విషయాల గురించే ఆలోచన. వాళ్ళు ఏం చేశారో, ఏం చేయలేదో? చిత్తూరు పోయి వచ్చారో, లేదో?

ఇంట్లో అందరినీ సినిమాకు తీసుకుపోయా నొకరోజు. నేను ఒంటరిగా మూడు సినిమాలు చూశాను. మరో రెండు రోజులకు స్కూలనగా బయలుదేరి వెళ్ళాను తిరిగిజంబాడ.

13

ఊళ్ళోకివచ్చే తోవలోనే చూశాను. బిల్డింగు పని ప్రారంభం కాలేదు. ఎక్కడివక్కడే ఉన్నవి. ఇంటికి పోతూనే గంగరాజును పిలిపించాను.

"ఏమండీ! అన్నీ చేస్తామంటిరి. ఒక్కటి కూడా చెయ్యలేదు. కనీసం నేలమీద సున్నమన్నా వేయించలేదు కదండీ! మీ మాటలు నీళ్ళమూటలని ఇప్పుడర్థమైంది" అన్నాను కోపంగా.

"బిల్డింగు పనెత్తుకునేందుకు వీలు కాలేదు. ప్రెసిడెంటుగాడికి ఏవేవో పనులు. వాణ్ణి చిత్తూరు పట్టుకుపోయి పని చేసుకొచ్చేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. తొమ్మిదో తరగతికి పర్మిషను తెచ్చాము" అంటూ కాయితం నా చేతిలో పెట్టాడు.

నేనది తెరిచి చదివాను. సంతోషంతో ముఖం విప్పారింది.

"ఇప్పటికైనా కోపం తగ్గిందా?" అన్నాడు గంగరాజు గడ్డం దువ్వుకుంటూ.

"పర్మిషను తెచ్చారు సరే. రేపటినుంచీ ఆ పిల్లల్ని ఎక్కడ కూచోబెడతారు?" అన్నాను ఆయన్ను చూసి నవ్వుతూ.

"ఎక్కడ కూచోబెడతావో! పర్మిషను తెమ్మన్నావు, తెచ్చాము" అన్నాడు.

"బిల్డింగు కూడా కావాలన్నాను"

"దాని పనీ చూస్తాము. కాస్త తట్టుకో. పరుగులమీద పన్లు గావాలంటే కుదర్దు" అన్నాడాయన.

స్కూలు తెరిచిన రోజున టీచర్లందరికీ ముందుగా చెప్పాను తొమ్మిదో తరగతి ప్రారంభించేందుకు పర్మిషనొచ్చిందని. అందరూ సంతోషించారు, శ్రీనివాసులు తప్ప. ఇంతకు ముందు అన్నీ అతని ఆధిపత్యంలోనే

జరుగుతుండేవి. ఇప్పుడతను అందరితో సమానుడైనాడు. అది అతనికి బాధాకరంగా ఉంది. అతన్ని సముదాయించాలనే ఆలోచన మనసులో ఉంది. కాని అది అమలు జరగటం లేదు. అతను నాకు చాలా సహాయం చేశాడు పని చేయని రోజుల్లో!

వారం రోజులు దాటినా బిల్డింగు నిర్మాణం గురించి జరిగిన ప్రయత్నమేమీ లేదు.

తొమ్మిదో తరగతి పిల్లల్ని ఆఫీసురూములోనే తాత్కాలికంగా కూచోబెడు తున్నాము. స్కూలుకు కొత్తగా ఒక బి.ఇడి టీచర్ను వేశారు. అతనింకా రాలేదు. డ్రాయింగు మాస్టర్ను కూడా వేశారంటూ వార్త తెచ్చాడు మునసామినాయుడు. ఆర్డరు ఇంకా రాలేదు. అన్నిటినీ మించి ఎకామడేషను పెద్ద సమస్య అయి కూచున్నది.

శ్రీనివాసులుతో అన్నాను - "సెలవుల్లోనే అన్నీ చేస్తామన్నారు. ఏమీ చెయ్యలేదు. మీరైనా వాళ్ళను తొందరపెట్టి ఉండకూడదుటండీ!"

“ఇప్పుడు నన్ను, నా మాటను ఎవరు పట్టించుకుంటున్నారు సార్! అన్నిటా మీరే అయి ఉన్నారుగా! మీమాటే విననివాళ్ళు నన్ను లెక్కబెడుతారా?” అన్నాడు శ్రీనివాసులు తలదించుకొని.

బిల్డింగు విషయంలో ఎలాగైనా అతన్ని ఇన్వాల్వు చెయ్యాలని ఉంది నాకు. అతనితో ఏమీ మాట్లాడలేదు.

ఓబుల్రాజును పిలిచి ప్రెసిడెంటుగార్ని పిల్చుకు రమ్మన్నాను.

"ప్రెసిడెంటు ఊల్లో లేడు సార్! వారం రోజులైంది. ఏదో ఊరెల్లాడు. వాల్లవాల్ల కెవురికో బాగాలేదంట" అన్నాడతను.

ఆయన వచ్చిన తరువాతనే ఇక ఆ విషయం ఆలోచించాలి.

మర్నాడు ప్రార్థనా సమావేశంలో - "మన స్కూలుకు తొమ్మిదో తరగతి వచ్చింది. దాంతోపాటు మనం ఒక రేడియో కూడా కొనుక్కుంటే బాగుంటుంది. రేడియోలో పాటలతో పాటు స్కూలు ప్రోగ్రాములు కూడా

వస్తున్నాయి. మీ తరగతి పుస్తకాల్లోని పాఠాలు కూడా రేడియోలో చెబుతున్నారు. మన ఫీజులో ఎక్కువ డబ్బు లేదు. దానికి తోడు మీరు కూడా తలా రూపాయో, రెండు రూపాయలో ఇస్తే రేడియో కొనుక్కొస్తాము. మీరందరూ మూడు నాలుగు రోజుల్లో మీ వాళ్ళకు చెప్పి తీసుకురండి" అని చెప్పాను. పిల్లలందరూ ఒప్పుకున్నారు.

ప్రార్థన అయిపోయిం తరువాత చంగల్రాయులు నా దగ్గరికి పరుగెత్తు కుంటూ వచ్చాడు. "మీరు రేడియో విషయం మర్చిపోలేదు గద సార్!" అన్నాడు ఆశ్చర్యంతో సంతోషాన్ని మిళితం చేస్తూ.

"ఎందుకు మర్చిపోతానండీ! మరచిపోయే వయసా నాది. మనం అనుకున్నాము కదా!" అన్నాను.

"మీరు భలేవాళ్ళు సార్!" అంటూ వెళ్ళిపోయాడతను.

నాలుగు రోజులు తిరక్కుండానే పిల్లలు తెచ్చిచ్చారు.

స్కూలుకు రేడియో కొనబోతున్నారన్న వార్త దావానలంలా వ్యాపించింది. ఊళ్ళో తోవలో ఎదురుపడ్డ ప్రతివాడూ - "ఇసుకూలుకు రేడియో కొనబోతున్నారంటగా" అని ఆరాలు తియ్యటమే.

గోరంతలు కొండంతలు చెయ్యటం పల్లెల్లో అలవాటే. ఎవరింటికైనా చుట్టం వస్తే కూడా అది పెద్ద విశేషమే అవుతుంది పల్లెటూళ్ళో !

మంచిరోజు చూసుకొని రేడియో తెచ్చేందుకు ప్రయాణమయ్యాను.

ఇంతలో ఓబుల్రాజు వచ్చి - "కొత్త రేడియో ఎందుకు? మన పంచాయతీ బోర్డు రేడియో ఇద్దాం! అంటున్నారు సార్ వూల్లో" అని వార్త అందించాడు.

"ఇంతకు ముందడిగితే ఇవ్వమని అన్నారు గదయ్యా!" అన్నాను ఆశ్చర్యంగా.

“ఇప్పుడిస్తావన్నారు సార్. కొత్త రేడియో కొనగూడదంట!” అన్నాడు ఓబుల్ రాజు. “వాళ్ళేం ఆర్డరేస్తున్నారా? ఎవరున్నారేంటి? ప్రెసిడెంటు ఊళ్ళో లేడంటివిగా!” అన్నాను.

“గంగరాజు, యంకట్రమనన్న సెప్పమన్నారు.”

వెంకట్రమణెవరు ?"

“పంచాయతీ బోర్డు వైస్ ప్రెసిడెంటు" అంటూ తల వంచుకున్నాడు ఓబుల్ రాజు. “వాళ్ళకు చెప్పు పోయి. హెడ్మాస్టరు కొత్త రేడియోనే కొంటాననంటున్నాడని" అని నేను ద్వారందాకా నడిచాను.

గుడ్డలో రేడియో చుట్టి చంకలో బెట్టుకొని తీసుకొచ్చాడు గంగరాజు. తలుపు వెయ్యబోతున్న వాడినల్లా రూములో కొచ్చి మంచంమీద కూలబడ్డాను. “వూళ్ళో ఉంచుకోకుండా దాన్నెందుకు తెచ్చారు?" అన్నాను.

"ఎవడింటున్నాడు ఊళ్ళో! ఇప్పుడు కొత్త రేడియో ఎందుకు? దీన్నే ప్రస్తుతానికి ఉపయోగించుకుంటే సరిపోతుంది" అంటూ రేడియో కింద బెట్టి నా పక్కన కూచున్నాడు. గంగరాజు.

"ఇదిక్కడెందుకు? స్కూలుకు తీసుకుపోదాం పదండి. దీని బ్యాటరీ ఏది ?" అన్నాను. "అక్కడే ఉంది. దాన్ని తీసుకొని పంచాయతీ బోర్డు ఆఫీసులో ఉన్న బ్యాటరీ కూడా తీసుకొని స్కూలుకు పోరా!” అని ఓబుల్రాజుతో అన్నాడు గంగరాజు.

"మీరూ స్కూలుకు రండి పోదాం" అన్నాను.

“నాకు పనుందిలే, సాయంత్రం వస్తా" అని పోబోయాడు. ఆయన్ను వెంబడి బెట్టుకొని స్కూలుకు తీసుకుపోయాను.

పిల్లలందర్నీ సమావేశపరిచి ఆ రేడియో స్కూలుకు ఎలా వచ్చిందో చెప్పి, గంగరాజు చేత స్విచాన్ సెరిమనీ జరిపించాను. పిల్లల, ఉపాధ్యాయుల కరతాళధ్వనుల మధ్య స్కూల్లో రేడియో మోగింది మొట్టమొదటిసారి.

“కొత్త రేడియో కొనకుండానే సరిపుచ్చారు గద సార్!” అన్నాడు చంగయ్య శర్మ. "నేను బయలుదేరేలోపలే ఆయన రేడియో తీసుకొచ్చేశాడు. నేను కొత్తది తీసుకొద్దామనే అనుకున్నాను. మనం అనుకున్నవి అనుకున్నట్లుగా జరగవు గదండీ!” అన్నాను నవ్వుతూ.

“ఇది కావాలని మనం అనుకున్నదేగా! దీని ఘనత అంతా మీదీ! అప్పుడు ఇవ్వమని అన్న మనుషులే ఇప్పుడు తీసుకొచ్చి పెట్టిపోయారు" అన్నాడు చంగల్రాయులు. "ది హోల్ క్రెడిట్ షుడ్ గో టు అవర్ శ్రీనివాసులు" అన్నాను నేను. “ఇందులో ఆయన చేసిందేముంది?" అన్నాడు మునసామినాయుడు. “అసలు ఈ ఐడియా మనకిచ్చింది ఆయనే గదండీ!” అన్నాను.

“ఐడియా మాకూ ఉంది. ఆయన ముందుగా బయటపెట్టాడు. అంతే!” అన్నాడు మునసామి.

“అందుకైనా అతన్ని అభినందించాల్సిందేగా !"

“ముందుగా మీరే అడిగి ఉంటే ఈవరకది మన స్కూల్లో పాతబడి ఉండేది. ఆయన్నుపంపించారు. ఇన్ని రోజులు పట్టింది" అన్నాడు చంగల్రాయులు నవ్వుతూ.

"మరీ అంత తేలిక చెయ్యకండి ఆయన్ను. అతని సిన్సియారిటీని మనం సందేహించ గూడదు" అంటూ లేచాను.

చెరువు నిండా నీళ్ళున్నాయి. గట్టు మీది రావిచెట్టు నీడ సన్నగా కదులు తున్న అలలమీద కదులుతున్నది. నాలుగైదు కొంగలు ఒంటికాలి జపం చేస్తున్నాయి లోతు తక్కువగా ఉన్నచోట.

సాయంత్రపు వాహ్యాళి ముగించుకొని రూముకు చేరేసరికి గంగరాజు ఇంట్లో కూచుని ఉన్నాడు వంట చేస్తున్న ఓబుల్రాజుతో మాట్లాడుతూ. ఓబుల్రాజు కాఫీ కాచి తయారుగా ఉంచాడు. ఆ పొగనీళ్ళు కొన్ని గంగరాజు కిచ్చి, కొన్ని నేను తాగాను. సిగరెట్టు కాల్చటం పూర్తయిన తరువాత - “ప్రెసిడెంటు ఊరి నించి వచ్చాడు. పోయి మాట్లాడి వద్దామా? ఇంట్లోనే ఉన్నాడు" అన్నాడు గంగరాజు.

“ఆయన కోసమే ఎదురు చూస్తున్నాన్నేను. పోయి వద్దాం పదండి" అంటూ బయలుదేరాను.

ఇంట్లో సుఖాసీనుడై ప్రెసిడెంటు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. మమ్మల్ని చూసి - “రండి రండి” అని ఆహ్వానిస్తూ మాకెదురొచ్చాడు.

“ఊరికెళ్ళారట. ఎప్పుడొచ్చారు? ఎవరికో బాగాలేదట. ఇప్పుడు బాగున్నారా?" అంటూ ఆయన్ను మాట్లాడించాను.

“మధ్యాన్నమొచ్చానండీ! మా అక్క కూతురికి బాగాలేదని మనిషొచ్చాడు. హాస్పిటలులో జేరిపించారు పిల్లను. ఇప్పుడు బాగున్నది" అన్నాడాయన.

"ఏమిటి జబ్బు ?”

“ఏం జబ్బో యేంపాడో! మనకు తెలిసిందంతా జరం, తలనొప్పి, కడుపు నొప్పి. ఇప్పుడన్నీ కొత్త రోగాలు. పేర్లు చెప్పేందుకూ్కడా నోరు తిరగదు. ఏదయితే యేంలే. ఇప్పుడు బాగానే ఉంది. ఇంటికి తీసుకొచ్చారు. బాగా తిరుగులాడుతున్నది" అన్నాడు ప్రెసిడెంటు.

అందరం కూచున్నాము. వద్దని వారిస్తున్నా కాఫీ పెట్టించి ఇచ్చాడాయన.

"పంచాయతీ బోర్డు రేడియో స్కూలుకిచ్చారు. మీకు తెలుసనుకుంటాను" అన్నాను. "ఆ! నేనే అన్నకు చెప్పాను ఇమ్మని" అన్నాడాయన గంగరాజును చూపుతూ.

"రేడియో కోసం నేను పిల్లల దగ్గర డబ్బు వసూలు చేశాను. మొత్తం రెండు వందల ముప్పై రెండు రూపాయలుంది. ఆ డబ్బులు మీకిమ్మంటారా, పిల్లలకు తిరిగి ఇచ్చెయ్యమంటారా?" అన్నాను.

"రెండూ చెయ్యవద్దు. మీ దగ్గరే ఉంచుకోండి. బిల్డింగు కట్టిద్దామను కుంటున్నాంగదా. పునాదులకైనా అవుతుంది. మీ దగ్గరే ఉంచండి" అన్నాడు.

అంతకూ కాకపోయినా రెండు మూడు రోజుల కూలికయినా సరిపోతుంది లెమ్మనుకున్నాను.

"ఇంతకూ కట్టడం ప్రారంభించేదెప్పుడు? ఇప్పటికే చాలా ఆలస్యమైంది" అన్నాను. "నేనొచ్చేశానుగదా! రేపు తాపీమేస్త్రిని రమ్మంటాను. గుర్తులేసి మొదలు బెట్టేద్దాము" అన్నాడు ప్రెసిడెంటు.

ఆయన దగ్గర సెలవు తీసుకొని వచ్చాము మేము. ఇంటి బయటిదాకా వచ్చి సాగనంపాడు మమ్మల్ని. నేను, గంగరాజు తిరిగి రూముకు చేరాము. గంగరాజు నాతో రహస్యం చెప్పినట్లు చెప్పాడు.

"స్కూలు బిల్డింగు కోసమని ముందు కొంత డబ్బు వసూలు చేశారు. అందులో కొంత ఖర్చు చేసి ఇటుక బట్టీలు వేయించారు. అవతల అడిగే నాథుడు లేకపోవటంతో వీడు దిగమింగి కూచున్నాడు. నువ్వు గట్టిగా పట్టుబట్టకపోతే పని జరగదు. వీడిట్లాగే వాయిదా వేస్తూ ఉంటాడు. రేపు మేస్త్రీని పిలిపించి వాడొచ్చాడా సరేసరి. లేకపోతే ఓబులుగాణ్ణి పంపించు. ఇది నీవల్లనే అవుతుంది" అంటూ చెప్పాడు.

ఇది ప్రతి స్కూల్లోనూ ఉన్న కథే. ప్రారంభంలో నీతిగానే ఉంటారు. కాలం గడిచేకొద్దీ చెడిపోతారు. చిత్తూరు ఆ పనికీ, ఈ పనికీ తిరిగేందుకు ఇంతింత ఖర్చయిందని లెక్కలు చూపుతారు. దాంతో తగాదా మొదలు. హోటల్లో అంత తినాల్నా, అన్నిసార్లు తినాల్నా లాడ్జిలో రూం బాడుగలు అంతనా, ఆటోలో ఎందుకు తిరగడం - వగైరా చిన్న విషయాల దగ్గర పేచీలు మొదలై అవే పెద్దవై కమిటీ సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయిన

సంఘటనలు కొల్లలు. వర్గ వైషమ్యాలలో టీచర్లు పావులు కావటం, స్కూలు గుంటపూలు పూయడం చాలా సాధారణమైన విషయాలు. ఇక్కడ కథ ఇంకా ముదిరి పాకాన పడలేదు.

గంగరాజు ఊళ్ళో ఉన్న నలుగురైదుగురు ధనవంతుల గురించి కూడా చెప్పాడు. అవన్నీ నాకు ఇంటరెస్టు లేని విషయాలంటూ అతన్ని కొనసాగించనివ్వలేదు.

14

ప్రెసిడెంటు చెప్పిన రేపులు పదిదాకా దొర్లిపోయాయి గాని పని మాత్రం ప్రారంభం కాలేదు.

ఒకరోజు గంగరాజే తాపీమేస్త్రీని వెంటబెట్టుకొని వచ్చాడు. స్కూలు భవనానికి నిర్దేశించిన స్థలంలో సున్నంతో గీతలేశాము కొలతలు పట్టి. 'యు' ఆకారంలో మొత్తం అయిదు గదులు నిర్మించాలని సంకల్పం. ఒక పూటంతా శ్రమపడి గీతలు గీసి సున్నం వేశాము. ప్రెసిడెంటుకు చెప్పి పంపించాము, మేము చేసిన పనిని గురించి. పునాదులు తవ్వేందుకు వెంటనే మనుషుల్ని పంపుతానన్నాడు కాని నాలుగు రోజులైనా పంపలేదు.

సాయంత్రం నేను, మునసామి, చంగల్రాయలు, చంగయ్య శర్మ చెరువు కట్టమీద కూచొని మాట్లాడుకుంటున్నాము. శంకర్ అనే బి.ఇడి. టీచరు, దొరసామి అనే డ్రాయింగు టీచరు కొత్తగా స్కూల్లో చేరారు. శంకర్ జంబాడకు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న విజయపురం అనే గ్రామానికి చెందినవాడు. దగ్గరి ఊరు కాబట్టి సైకిలు మీద రోజూ పోయి వస్తుంటాడు. దొరసామికి తెలుగు బొత్తిగా రాదు. నగరికి దగ్గర పుదుపేట అతని స్వగ్రామం. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. చిన్న గుడిసె అద్దెకు తీసుకొని అందులో ఉంటున్నాడు. పెళ్ళయి మూడు సంవత్సరాల యిందేమో ముగ్గురు పిల్లలు. ఎప్పుడూ వాళ్ళతో సతమతమవుతూ

ఉంటాడు. “నువ్వు కూడా మాతో రాకూడదయ్యా” అంటే "ఇంద పనంగళ్ ఎనకు విడువమాట్టాతలైవరే” అంటాడు. పైగా అతను టైలరు పని కూడా నేర్చుకొని ఉన్నాడు. ఆ పన్లో కూడా తలమునకలవుతుంటాడు.

మా మాటల్లో గంగరాజు ప్రస్తావన వచ్చింది.

“గంగరాజు మనకు కనిపిస్తున్నంత మంచివాడు కాదు సార్? భంగి మఠం మనిషి,

మీరాయన్ని నెత్తికెక్కించుకుంటున్నారు" అన్నాడు చంగల్రాయలు.

"నన్ను కూడా మఠంలోకి ఈడ్చుకుంటాడేమోనని భయమా ?

"ఏమో ఆర్నెల్లు సావాసం చేస్తే వీరు వారవుతారన్నారు" నవ్వాడు.

"ఏం నేనంత బలహీన మనస్కుడిననుకున్నారా?" అన్నాను నవ్వుతూ. చంగల్రాయలు. "అట్లాగని కాదు. ఎందుకైనా మంచిదని చెబుతున్నాము."

“నాతో చేరితే వారు వీరు కావాల్సిందే గాని వీరు వారవటం అనేది ఎన్నటికీ జరగదు” అన్నాను చేత్తో చూపుతూ. “ఓబుల్రాజును చూస్తున్నారు కదా! వాడిచేత నేను సారాయి సీసాలు మోయించుకొని ఉండొచ్చును, కాని వాడిచేత తాగుడు మాన్పించాను. ఇప్పుడు చూడండి వాడెంత శుభ్రంగా స్కూల్లో పని చేస్తున్నాడో !"

“వాడు మీ చేతిలో మనిషి, మీరు వాడిని బెదిరించవచ్చును. గంగరాజు అట్లా కాదే!” అన్నాడు మునసామి.

“గంగరాజు వ్యక్తిగతంగా చాలా బలహీనుడే, నేను కాదనను. కాని నా దగ్గరికి నిషాలో ఎన్నడూ రాలేదు. అలా వచ్చి ఉంటే ఎప్పుడో తన్ని తగిలేసేవాడిని. కాని అతను మనకు ఉపయోగపడుతున్నాడు. బలహీనతలకు ప్రాముఖ్యం ఇచ్చే వ్యక్తినే తీసిపారెయ్యటం మంచిది కాదు. గంగరాజులో స్ట్రాంగ్ పాయింట్స్ కూడా ఉన్నాయి. అతనికి మంచి సోషల్ ఎవేర్నెస్ ఉంది. ఇతరులలోని మంచిని గుర్తించే సుగుణం ఉంది. మంచి పనులు చేసేవారికి

సహాయపడాలనే మంచి గుణం ఉంది. తన గ్రామం బాగుపడాలనే కాంక్ష ఉంది. అతను మనకు ఎన్ని విషయాల్లో తోడ్పడుతున్నాడో మీరు చూస్తూనే ఉన్నారు. అతన్ని మనం ఉపయోగించుకోవాలి గాని అతని బలహీనతల్ని పట్టుకొని వేలాడితే ఎలా!" అన్నాను.

"మీ ఆలోచనే మీదిగాని మా మాటలు ఎప్పుడు పట్టించుకున్నారు, ఊరికే ఉండలేక మేం చెప్పటమేగాని!" చప్పరించాడు చంగల్రాయలు.

పెద్దగా నవ్వాన్నేను. "మీరు నామీద పెద్ద అభాండం వేస్తున్నారు. నేను చేస్తున్నవన్నీ మీరు చెప్పిన పనులే కాని నా స్వంత ఆలోచనలు కాదు. మీ మాటలు ఏవి వినలేదు నేను? చెప్పండి. స్కూలుకు రేడియో కావాలన్నారు. తెప్పించాను. యానివర్సరీ డ్రామా అన్నారు. డ్రామా వేయించాను. ఇన్ని చేసినా మా మాటలు వినటంలేదంటే నేనేం చేసేది చెప్పండి ?" అన్నాను.

"అవున్రెండి. చచ్చి సున్నమై, మీరు చెప్పిందంతా చేసి డ్రామా వేసింది మేము. పేరొచ్చింది మీకు! ఒక్క వెధవన్నా వచ్చి 'మీరు బాగా నటించారండీ, మీరు చాలా బాగా చేశారు' అన్నాడా? అందరూ మీకు బ్రహ్మరథం పట్టేవాళ్ళే. కష్టం మాది, ఫలితం మీది! మా కర్మకు మీరేం చేస్తార్లెండి" అన్నాడు చంగల్రాయలు, అందరం నవ్వాము.

"అంత అసూయ మంచిది కాదు చంగల్రాయలూ! ఒక మంచి కార్యం కోసం మనం దరం పాటుబడుతున్నాం. మనం కలిసికట్టుగా ఉన్నందు వల్లనే ఎంతో కొంత అభివృద్ధిని సాధించగలుగుతున్నాం. నాకు మంచి పేరు రావటం మంచిదే కదా! నేనూ మీలో ఒకణ్ణి. నాకు మంచి పేరొస్తే మీకూ వచ్చినట్లే. హిందీలో ఒక సామెత ఉంది-"లడే సిపాహీ నామ్ సర్దార్" అని. "తాజ్మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు?" అంటూ మహాకవి ప్రశ్నిస్తాడు. ఎవడు? ఎందరు? ఎవడికి తెలుసు? ప్రయత్నించినా తెలుసుకోలేము. తాజ్మహలు ఎవరు కట్టించారు? అంటే టక్కున జవాబు చెబుతాము షాజహానని. బహుశా అతడు ఒక్క రాతిని కూడా ముట్టుకొని

ఉండదు. అందాకా ఎందుకు! మన శరీరంలోని అతి ముఖ్యాంగాలన్నీ బయటికి కనపడకుండా లోపల్నే భద్రంగా ఉంటాయి. అంత మాత్రంతో వాటిని విస్మరించ గలమా? అవి లేకుండా బ్రతగ్గలమా? మేమూ అన్నిటిలాగే కనిపించాలని అవి బయటపడే ప్రయత్నం చేస్తే అసలు మనం మనగలమా?!" గాలి గట్టిగా పీల్చి వదిలాను. "అందరూ నన్ను పొగిడిన మాట నిజమే. నేను మిమ్మల్ని అభినందించాను గదా?"

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

'ఈచ్ డాగ్ విల్ హేవ్ హిజ్ డే' అన్నారు. దిసీజ్ మై డే! టుమారో మే బి యువర్ డే! హూ నోస్? కొంత ఓర్పు ఉండాలి."

"మిమ్మల్ని చూసి మేము ఏడవడం లేదు సార్. మెచ్చుకొంటున్నాము" అన్నాడు చంగల్రాయలు.

"మనం వేరు వేరు రూముల్లో ఉండటం ఎందుకు? మీరు నా రూముకు వచ్చెయ్యండి. అందరం కలిసి ఉందాము" అన్నాను.

"మేము ఇంత మాత్రం మీకు సన్నిహితంగా ఉన్నందుకే శ్రీనివాసులు ఏడుస్తున్నాడు.

మేము మీ రూములో చేరితే అతని గుండె పగిలిపోతుంది" అన్నాడు మునసామి. "అంత ప్రమాదం ఏమీ జరుగదులెండి" అన్నాను.

"నేను రాను" అన్నాడు చంగల్రాయలు.

"ఏం? ఎందుకని ?" అన్నాను.

"నా భార్యను తీసుకురావాలనుకుంటున్నాను. ఒంటరిగా ఉండటం చాలా కష్టంగా ఉంది మా ఇద్దరికీ. తిండి కూడా సరిగా అమరటం లేదు నాకు. అక్కడ ఆవిడా దిగాలుతో చిక్కి శల్యమవుతోంది" అన్నాడు చంగల్రాయలు.

"అబద్ధాలెందుకయ్యా? మొన్న వచ్చేటప్పుడు ఆమె వెంటబడిందిట సార్! ఒంటరిగా ఉంటూ ఈయన యేమేం ఘనకార్యాలు చేస్తున్నాడోనని ఆమెకు

అనుమానమంట! అందుకే నేనూ నీతో పాటే ఉంటానని బయల్దేరిందట!" అన్నాడు మునసామి నవ్వుతూ.

"నవ్వటం ఎందుకయ్యా? ఎవడి పెళ్ళాం వాడితో ఉండాలనుకోవటం తప్పా? నా పెళ్ళాం నాతో వస్తానంది. ఎవడి పెళ్ళామో కాదుగా!" అన్నాడు చంగల్రాయలు.

“ఓబుల్ రాజు వంటతో మొహం మొత్తింది. మీరు బాగా వంట చేస్తారట. మీ వంట రుచి నాక్కూడా చూపండి శర్మగారూ! మీరూ మునసామీ రండి. ఇప్పుడు మీరుంటున్న రూము చంగల్రాయలుకు వదిలెయ్యండి" అన్నాను.

“బాబ్బాబు! ఆ పని చెయ్యండి. నాకూ మరో ఇల్లు వెదికే శ్రమ తప్పుతుంది. అంత మాత్రం ఇళ్ళు కూడా లేవిక్కడ". బ్రతిమాలాడు చంగల్రాయలు.

నా రూములో చేరిపోయేందుకు ఆ ఇద్దరూ ఒప్పుకున్నారు. మర్నాడే వాళ్ళిద్దరూ నా రూములో చేరిపోయారు. రూములో సందడి ఎక్కువైంది. ఓబుల్ రాజు నీళ్ళు తెచ్చి పెట్టటం, గిన్నెలు కడగటం, వగైరా పనులు చేస్తున్నాడు. ఇప్పుడు మనుషులు ఎక్కువైనందువల్ల అప్పుడప్పుడు ఓబుల్ రాజు కూడా మాతో పాటు తినే ఏర్పాటు చేశాను.

ఆరోజు సాయంత్రం గంగరాజు వచ్చాడు. మేం ముగ్గురం ఒక రూములోకి చేరినందుకు సంతోషించాడు.

“మనం గుర్తులు పోయించి వారం రోజులకు పైగా అవుతున్నది. గుర్తులు చెరిగిపోతున్నాయి గాని పని ప్రారంభం కాలేదు" అన్నాను ఆయనతో.

"మా ప్రెసిడెంటు ఎందుకో ముఖం చాటు జేసుకుంటున్నాడు. నేను రోజూ హెచ్చరిస్తూనే ఉన్నాను. అదుగో ఇదుగో అని దాటేస్తున్నాడు. తను పూనుకోకపోతే పని జరగదను కుంటున్నాడేమో! నేనే మనుషుల్ని మాట్లాడి పునాదులు తవ్వించే వాడినే. డబ్బుకోసం వెనకాడుతున్నాను" అన్నాడు.

"మీకున్న శ్రద్ధ ఎవరికీ లేదండీ! అసలు జనంలో ముందున్న ఉత్సాహం కనిపించటం లేదు" అన్నాను.

“మన వాళ్ల ఉత్సాహమంతా అంతే. సోడా గ్యాసు. స్కూలు పెడతామని ఊరూరా తిరిగి డబ్బు వసూలు చేశారు. స్కూలు తెచ్చారు. దాని మాట మరిచిపోయారు. ఇప్పుడు నువ్వు చెవ్వు మెలిబెడుతున్నా తప్పించుకు తిరుగుతున్నారు.”

“నా దగ్గర రేడియో కోసమని వసూలు చేసిన డబ్బుంది. దాంతో ప్రారంభిద్దాం పని” అన్నాను.

“నేను మనుషుల్ని మాట్లాడుతా!” అంటూ లేచిపోయాడు గంగరాజు.

మర్నాడు ఉదయం పనిచేసేందుకు మనుషులు రాలేదు. బహుశా ఆయన మాటలు నమ్మి ఎవరూ ఒప్పుకొని ఉండరు.

యథాప్రకారం సాయంత్రం మేం నలుగురం చెరువుకట్ట మీదికి చేరాము. సూర్య కిరణాలు నీటిమీద ప్రతిఫలిస్తూ ఉన్నాయి. అక్కడక్కడ ఎర్రఎర్రగా, పచ్చపచ్చగా కనిపిస్తున్నవి నీళ్ళు - ఎవరో కుంకుమ, పసుపు చల్లినట్లు. అక్కడక్కడ తామరపూలు కూడా ఉన్నాయి. తామరాకుల మీది నీటి బిందువులు ఇంద్రధనుస్సుల కాంతులు వెదజల్లుతున్నాయి.

“మన చేతులమీదుగా మనమే ప్రారంభం చేస్తే పోతుంది" అన్నాను నాతో ఉన్న మిగతా ముగ్గురితో.

“మనమే పనికి ప్రారంభోత్సవం చేద్దాం పదండి" అంటూ లేచాడు మునసామి నాయుడు.

అందరం లేచి మార్కింగ్స్ వేసిన స్థలం దగ్గరికి చేరాము. పోసిన సున్నం చాలా భాగం గాలికి కొట్టుకొని పోయింది. చంగల్రాయలు పోయి ఓబుల్ రాజును పిలుచు కొచ్చాడు. గడ్డపార, పార తీసుకురమ్మని అతన్ని

పంపించాను. ఎక్కడన్నా దొరికితే టెంకాయ, పసుపు, కుంకుమ తీసుకు రమ్మన్నాము. అతను వెళ్ళాడు.

ఓబుల్ రాజు తిరిగి వచ్చిందాకా అక్కడే కూచున్నాము.

ఒక గడ్డపార, పార తీసుకొచ్చాడు ఓబుల్రాజు. టెంకాయ తేలేదు. పసుపు, కుంకుమ తీసుకొచ్చాడు. ఒక సాంబ్రాణి కడ్డీ కూడా తీసుకొచ్చాడు. ఆ స్థలం మీదంతా పసుపు, కుంకుమ చల్లాడు చంగయ్య శర్మ. నేను గడ్డపార తో మూడు నాలుగు నిముషాల సేపు తవ్వాను. ఓబుల్ రాజు పారతో మట్టి తీసి పక్కన పోశాడు. మార్చి మార్చి అందరం అరగంట సేపు తవ్వాము. అలవాటులేని పని. అప్పటికే చేతులు నొప్పి పుట్టాయి. ఓబుల్రాజు మరికాసేపు తవ్వుతా నన్నాడు గాని అతనొక్కడే ఎక్కువసేపు చెయ్యటం భావ్యంగాదని వద్దని చెప్పాము.

ఎలాగైతేయేం? ఫౌండేషన్ వర్కు ప్రారంభమైంది. రేపు కనీసం ఇద్దరు మనుషుల్ని తవ్వేందుకు పిల్చుకొస్తా నన్నాడు ఓబుల్ రాజు.

పదినిముషాలసేపు అక్కడే ఉండి మేము చేసిన పనిని చూసుకొని గర్వపడ్డాము. తరువాత ఓబుల్ రాజు గడ్డపార భుజంమీద పెట్టుకొని దానికి శలగపార తగిలించుకొని ముందు నడుస్తుంటే మేం నలుగురం అతని వెనక ఊళ్ళోకి నడిచాము శ్రమవీరుల్లా!

భజనమందిరం దగ్గర పదిమంది మనుషులదాకా చేరారు. గంగరాజు కేకలేస్తూ మాట్లాడుతున్నాడు. ఓ పక్కగా నరసమ్మ కూడా నుంచొని ఉన్నది. వాళ్ళు మనూరు కొచ్చింది గడ్డపారలు, శలగపారలు పట్టి పన్లు జేసేందుకుట్రా వాళ్ళొచ్చిందెందుకు? పిల్లలకు చదువు చెప్పేందుకు. మన పిల్లలకు చదువు చెప్పేందుకురా! వాళ్ళ పని సక్రమంగా చేసేందుకు మనం సౌకర్యాలు చెయ్యాల. ఆ పూరిపాకలో చదువులు చెప్పటం సాధ్యం కావటం లేదని ఆయన ఎన్ని రోజుల బట్టో చెబుతా ఉన్నాడు. మన

ప్రెసిడెంటుకు తల కెక్కలేదు. మనం అసలే పట్టించుకోవటం లేదు. అందుకే వాళ్లు సాయంగా పూనుకున్నారు. మనం జెయ్యాల్సిన పని వాళ్లు జెయ్యటం యేందిరా? రేపు మనమంతా మళ్ళుకుంటే ఎంత పనిరా అది?" అంటూ మాట్లాడుతున్నాడాయన. మేము నడక వేగం తగ్గించి ఆయన మాటలు వింటూ వచ్చాము. మమ్మల్ని చూసి అరుపులు ఆపేశాడు గంగరాజు.

మేము భజనమందిరం సమీపించగానే మమ్మల్ని చూసి లేచి నుంచున్నాడాయన.

అక్కడికి రమ్మని మమ్మల్ని పిలిచాడు. మేం నలుగురం భజనమందిరంలోకి నడిచాము. "రేపొక్క రోజు రాండిరా! సాయంకాలానికంతా పనయిపోతుంది" అన్నాడాయన.

"అట్టాగే వొత్తామని చెప్పండిరా!" అన్నది నరసమ్మ సన్నని గొంతుతో.

"వత్తాంలే గంగిమాఁవాఁ! మమ్మల్ని బయల్దేరదీసి నువ్వు మటంలోకి దూరుకో గూడదు. నువ్వూ మాతోపాటు రావాలి" అన్నాడొకడు నవ్వుతూ.

"సరేలేరా యదవా! మీ అందరికంటే ముందు నేనే వొస్తానురా!" అన్నాడు గంగరాజు. "మీరు పూనుకుంటే ఎంతపని ?" అన్నాన్నేను.

"రేపు మళ్ళీ యేషాలెయ్యొద్దు. పొద్దున్నే అన్నాల్దిని వచ్చెయ్యండి" అని చెప్పి కూచున్న చోట్లోంచి లేచి మాతోపాటు రూముకొచ్చాడు గంగరాజు.

చంగయ్యశర్మ, మునసామినాయుడు స్టౌ వెలిగించి కాఫీ కాచారు. చంగల్రాయల్ను కాఫీ తాగందే పోనివ్వలేదు. రేపు తను ఊరికి పోయి భార్యను తీసుకొస్తాడు. ఆ రాత్రికి మాతోపాటే భోంచెయ్యమని చెప్పాము. అతను అంగీకరించాడు.

15

యుగ ధర్మమో, ఏమో గాని నేటి యువకులు తమ శక్తిని నిర్మాణాత్మకంగా కాక, వినాశాత్మకంగా వినియోగిస్తున్నారు. పెద్దల మాటలకు పెడర్థాలు

లాగుతున్నారు. అధికారం కోసం రాజకీయ నాయకులు ఆడే చదరంగంలో పావులవుతున్నారు.

దేశంలో ఇంకా ఉత్సాహం పూర్తిగా చచ్చిపోలేదని నిరూపించారు ఈ జంబాడ యువకులు. గవర్నమెంటు బడిని గవర్నమెంటే కట్టిస్తుంది లెమ్మని నిశ్చైతన్యంగా కూచోలేదు వాళ్ళు. అన్నమాట ప్రకారం గడ్డపారలు, పారలు తీసుకుని ఉదయమే పనిలోకొచ్చారు.

మేము గూడా ప్రభుత్వమే కావాల్సిన వసతులన్నీ కల్పించాలని కాళ్ళు జాచుకొని కూచోలేదు. మా శక్తియుక్తుల నుపయోగించి, కావాల్సిన సౌకర్యాలను మాకు మేమే కల్పించుకోవాలని కృషి చేస్తున్నాము. మా ఆశయాలు నెరవేరేందుకు గ్రామస్తులు హృదయ పూర్వకంగా సహకరిస్తున్నారు.

ఉత్సాహంతో అందరూ పనిచేస్తున్నారు. గంగరాజు, మా ఇంటి ఓనరు నరసరాజు అందరిమీదా అజమాయిషీ చేస్తున్నారు. నరసమ్మ పెద్ద బానలో నీళ్లు తెచ్చి పెట్టింది. కావాల్సిన వాళ్లు తాగేందుకు. ఎటు చూసినా ఆనందంగా ఉంది. అంతా కోలాహలం.

“మీరు ఏం చేసినా గమ్మత్తుగా ఉంటుంది సార్!” అంటూ వచ్చాడు మునసామి నాయుడు. “నాటకం అన్నారు ఊరంతటినీ మీ దగ్గరికి నడిపించుకున్నారు. నిన్న గడ్డపార పట్టుకొని ఐదు నిమిషాలు తవ్వారు. ఇవాళ అందరూ పనిచేసేందుకు పరుగుల మీద వచ్చారు." -

“ఇవాళ మన చంగల్రాయలుంటే బాగుండేది. చాలా సంతోషించేవాడు. శ్రీనివాసులు ఈ పక్కకే రాలేదు!” అన్నాను. “ఇదంతా వాళ్ల మంచినతమే గాని నా గొప్పదనం ఏ మాత్రం గాదు.”

ఆరోజు సాయంత్రానికి పునాదులు తవ్వే కార్యక్రమం పూర్తయింది. దాదాపు నలభై మంది మనుషులు పనిచేశారు. కాయకష్టం చెయ్యటం అలవాటైన వాళ్లే వాళ్లందరూ.

పని పూర్తయిన తరువాత శ్రమవీరులందరూ అమితోత్సాహంతో ఊళ్ళోకి నడిచారు. 'కావాలి, కావాలి' అనుకున్న పునాదులు తవ్వే కార్యక్రమం అతి తేలికగా పూర్తయింది. అనుకున్నంత సేపు పట్టలేదు పూర్తవటం! కానీ ఖర్చు లేదు.

ఇక పునాదుల్లో ఒక అడుగు ఎత్తు వరకు ఇసుకపోసి దానిమీద నీళ్లు పొయ్యాలిట. తరువాత కట్టడం ప్రారంభించాలని చెప్పారు. వాళ్ళు.

స్థలానికి ఇరవై బారల దూరంలో ఇసుక ఉంది. ఎదురుగా చెరువు ఉంది నిండుగా. రేపు, లేకపోతే ఎల్లుండి వచ్చి ఆ పని కూడా పూర్తిచేసి పెట్టండని కోరాను వాళ్ళను. ఒప్పుకున్నారు కూడా. పనులు జరిగేట్లయితే అలా క్షణాల మీద జరుగుతాయి. మొండికేస్తే అంతే కథ! పనిచేసే వాళ్లకు ప్రారంభించిన పని త్వరగా పూర్తి కావాలనే ఆరాటం ఉండాలి, తపన ఉండాలి.

మగవాళ్ళు ఇసుక పోస్తుంటే ఆడవాళ్ళు నీళ్ళు తెచ్చి పొయ్యాలి. అదీ ఒప్పందం. ఆడవాళ్ళను మొబిలైజ్ చేసే పనికి నరసమ్మ ఒప్పుకున్నది. గంగరాజు మగవాళ్ళను తీసుకొచ్చేందుకు ఒప్పుకున్నాడు.

అనుకున్న రోజులు గడిచిపోయాయి గాని పని చేసేందుకు మనుషులు రాలేదు!

గంగరాజు కనిపించలేదు. ఒక్క నరసమ్మతోనే మాట్లాడటం సమంజసం కాదను కున్నాను. ఆదివారం స్కూలుకు సెలవు. శ్రీనివాసులు అసలు నాకు అందటమే లేదు. వాళ్ల ఇంటికి పోయి అతనితో మాట్లాడాలనిపించింది.

ఉదయం పది గంటలప్పుడు బట్టలేసుకొని శ్రీనివాసులు ఇంటికి బయలు దేరాను. అంతకు ముందు చూసిన గుర్తుంది.

ఇంటి ముందుకు పోయేసరికి వంటచేస్తున్న శ్రీనివాసులు భార్య నన్ను చూసింది. చేస్తున్న పని ఆపేసి నాకెదురొచ్చి "రండి రండి అన్నయ్యగారూ! దోవ తప్పినట్లున్నారు" అని చాలా సంబరపడుతూ ఆహ్వానించింది నన్ను. "కూర్చోండి" అంటూ కుర్చీవేసింది నాకు.

శ్రీనివాసులు చాపమీద పడుకొని నిద్రపోతున్నాడు. అతన్ని లేపింది. ఎదురుగా నన్ను చూసి శ్రీనివాసులు అప్రతిభుడయ్యాడు. కొంతసేపటికి తేరుకొని "నమస్తే సార్! రాక రాక వచ్చారు" అన్నాడు.

"నేను రావాలనే వచ్చాను గాని, ఈ వేళప్పుడు నిద్రేమిటండీ?" అన్నాను నవ్వుతూ. "ఆదివారం గద సార్! పనేముంది? అందుకే పడుకున్నాను." అన్నాడు అతనూ నవ్వుతూ.

పని లేకేమండీ? బోల్డంత పని ఉంది. మీరు కల్పించుకోటం లేదు ఎందుకో. పట్టీపట్టనట్లు ఉండిపోతున్నారు. అది కనుక్కుందామనే ఇవాళ వచ్చాను" అన్నాను. అతనేమీ మాట్లాడలేదు.

"పునాదులు తవ్వే పని పూర్తయింది ఎలాగో - ఇసుక నీళ్ళు పోస్తామని చెప్పారు గాని ఎవరూ రాలేదు. ఏం చేయాలో తోచక ఇట్లా వచ్చాను. మీరు నిద్రపోతున్నారు" అన్నాను.

"నాదేముంది సార్! మీరేం చెబితే అది చేసేవాడిని. మీరు చెప్పిన పని ఏది చెయ్యలేదు చెప్పండి? అన్నిటికీ ముందుండి చేశాను. మీరే ఎందుకో నన్ను దూరంగా ఉంచుతున్నారు" అన్నాడు బాధగా.

"కావాలని మిమ్మల్ని దూరంగా ఉంచలేదు శ్రీనివాసులూ! అందరికీ అవకాశాలిద్దా మనే ఆలోచనలో అందర్నీ దగ్గరకు తీసుకున్నాను. నన్ను మీరు అపార్థం చేసుకొని దూరంగాఉంటున్నారు."

"మీరు స్కూలుకు రాకముందు, అంతకు ముందు నేనెంత సిన్సియర్గా పనిచేశానో మీకు తెలీదు. ఇప్పుడు కూడా ఈ చంగల్రాయలు, మునసామి నాయుడు నన్ను ఎంతగా ఆటలు పట్టించేవాళ్ళో మీకు తెలీదు. చంగయ్య శర్మ మాత్రం తక్కువవాడా? కాలాంతకుడు. వాళ్లకు కీ ఇచ్చి తనకేమీ తెలియనట్లు ఉండేవాడు. నేనంటే వాళ్లకు గిట్టదు. ఇప్పుడు మీకు అత్యంత సన్నిహితులు! రూములోకి కూడా తెచ్చి పెట్టుకున్నారు. నా పరిస్థితి ఎలా

ఉంటుందో ఊహించండి. అన్నిటికీ వాళ్లనే అందలం ఎక్కిస్తున్నారు గదా! వాళ్లచేతనే అన్ని పనులూ చేయించుకుంటార్లెమ్మని నా పాటికి నేను దూరంగా ఉంటున్నాను. వాళ్ళు నన్ను చూసి చేసే ఇకిలింపులు, సకిలింపులు మీకేం తెలుసు? నా తప్పేమైనా ఉందేమో మీరే చెప్పండి" అన్నాడు శ్రీనివాసులు.

ఇలా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడే వాళ్లంటే నాకు చాలా ఇష్టం. శ్రీనివాసులు బాధ నాకర్థమైంది. కాని స్కూలన్న తరువాత ఎన్నో రకాల మనస్తత్వాలున్న వాళ్ళుంటారు. అందర్నీ కూడగట్టుకొనిపోవాలి. శ్రీనివాసులు నిజంగానే నాకెంతో సహాయం చేశాడు. అతనికి ఎప్పుడూ నేను కృతజ్ఞుడినై ఉండాల్సిందే. అలాగని అతన్నే నెత్తికెక్కించుకుని మిగతావాళ్ళను అశ్రద్ధ చేస్తే స్కూల్లో ప్రశాంతత ఉండదు. ఎప్పుడూ ఏవో గొడవలుంటాయి. ఉన్న నలుగుర్లోనే గ్రూపు లేర్పడతాయి. ఊరి జనాలకు స్కూలు, స్కూల్లోని టీచర్లు కాలక్షేపం వస్తువులవుతారు. వాళ్ళ ముందు తేలికవుతారు. పాఠాలు చెప్పటం, స్కూలు అభివృద్ధి గురించి ఆలోచించటం మృగ్యమవుతాయి. పనికిరాని సమస్యలు కాలాన్ని మనుషుల వివేకాన్ని నమిలి మింగేస్తాయి. స్కూలు నరకమవుతుంది. వృత్తి నవ్వుల పాలవుతుంది.

“మీరు నాకు దూరం కావాలని వాళ్ళు నాకు దగ్గరయ్యారేమో నాకు తెలీదు గాని, మిమ్మల్ని దూరం చేసుకోవాలని మాత్రం వాళ్లను దగ్గరకి తీసుకోలేదు శ్రీనివాసులూ! మీ మధ్య ఉన్న సంబంధాల గురించి నేను ఆలోచించలేదు. మీరు చూస్తూనే ఉన్నారుగా. ఎప్పుడూ స్కూలుకు అది చెయ్యాలి, ఇది చెయ్యాలి అనే నా ఆలోచనంతా. మీరు నాకు చాలా సహాయం చేశారు. అయాం రియల్లీ థాంక్ఫుల్ టు యూ! ఈ స్కూల్లో అడుగు పెట్టిన రోజే మిమ్మల్ని చూశాను. మీరు వర్క్ మైండెడ్ అని కూడా నాకు తెలుసు.

మీరు నా మనిషిగా ఎప్పుడూ ఉంటారని భావించుకున్నాను. వాళ్లు మొదట్లో నన్ను కూడా ఎగతాళి భావంతో తేలికగానే చూశారు. తప్పు నాది కాబట్టి భరించాను. వాళ్ళను కూడా పనిలో నిమగ్నులయ్యేలా చెయ్యాలనే

నా ప్రయత్నం. అందులో సఫలీకృతుడినయ్యాను. అయితే నా వారనుకున్న మీరు దూరమవుతున్నారు." నిట్టూర్చాను.

“మీరు నన్నపార్థం చేసుకోవద్దు. ప్లీజో కో ఆపరేట్! ఈ స్కూలు మీది. నాది కాదు. ఈ సంవత్సరం తొమ్మిదో తరగతి ప్రారంభించాం. వచ్చే సంవత్సరం పదో తరగతి వస్తుంది. స్కూలు అప్ట్ అవుతుంది. మరో క్వాలిఫైడ్ హెడ్మాస్టరు వస్తాడు. నన్నెక్కడికో మారుస్తారు, అసిస్టెంటుగానో, మరో మిడిల్ స్కూలు హెడ్మాస్టారుగానో! ఆ వచ్చే ఆయనకు, మీకు, ఇక్కడి పిల్లలకు, ప్రజలకు ఓ మంచి స్కూలు ఇవ్వాలనే నా ప్రయత్నం. ఇక్కడేదో తవ్వితలకెత్తుకోవాలని గానీ, మీలో మీకు కీచులాటలు పెట్టి తమాషా చూడాలని గానీ, ఒకర్ని పెంచి మరొకర్ని తుంచాలని గానీ కాదు నా ఉద్దేశం. ప్లీజ్ అండర్స్టాండ్ మి, ఐ వాంట్ యువర్ కో ఆపరేషన్ ఫర్ ది గుడ్ ఆఫ్ ది స్కూల్." ఈ మాటలంటున్నపుడు నా గొంతు గాద్గదికమైంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ముఖం తిప్పేసుకుని నన్ను నేనే స్థిమిత పర్చుకుంటూ కుర్చీలోంచి లేచాను.

చలించిపోయాడు శ్రీనివాసులు. “మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోయాను సార్! అయాం సారీ! మీరు కూచోండి. లేచారెక్కడికి? ఈ పూట మీరు మా ఇంట్లో భోం చెయ్యాల్సిందే” అన్నాడు నా చెయ్యి పట్టుకొని.

భోజనానిదేముంది? ఇంతకు ముందు తినలా? మరెప్పుడైనా వస్తాను. నేనిక్కడ వాళ్ళు కాచుకొని ఉంటారు" అని లేవబోయాను.

అతను నన్ను కదలనివ్వలేదు. “ఈ పూట ఇక్కడ భోంచెయ్యండి. అంతగా అయితే నేను పోయి వాళ్లకు చెప్పొస్తాను.” అన్నాడు.

తరువాత స్కూలు విషయాలు మాట్లాడుకున్నాము. "పునాదుల్లో ఇసుక పోసి, నీళ్ళు పొయ్యాలి. అంతేగదా. అదేం పెద్ద పని ?" అన్నాడు శ్రీనివాసులు.

“పెద్దదో, చిన్నదో అది అయిన తరువాతనే గదా తరువాత పని మొదలయ్యేది?" అన్నాను నవ్వుతూ.

"వంటయిపోయిందన్నా కూచోండి పెట్టేస్తాను" అన్నది శ్రీనివాసులు భార్య ఇంతలో. ఇద్దరం కూర్చొని భోం చేశాము. నవ్వుతూ ఊరి గురించి ఊరి వారి గురించి మాట్లాడుకున్నాము భోంచేస్తూ. ఇతర విషయాలు మాట్లాడేందుకేమీ లేవు. మాదో చిన్న ప్రపంచం. ఎంతసేపు మాట్లాడినా దాన్ని గురించే మాట్లాడాలి.

భోజనం ముగించుకుని "ఇక నేను వస్తానండీ శ్రీనివాసులూ" అని బయలుదేర బోయాను. వక్కలు, తమలపాకులు ఇచ్చి వేసుకోమన్నాడు. తాంబూల సేవనం కూడా ముగించి రూముకు చేరేసరికి ఒంటిగంటయింది.

“తాంబూలం గూడా దట్టించారే! ఎక్కడ సార్ విందు భోజనం?" అడిగాడు చంగయ్యశర్మ.

“శ్రీనివాసులు ఇంటికి పోయానండీ. భోజనం చెయ్యందే ఆయన వదల్లేదు. మీరింకా భోం చేసినట్లు లేదు. కానివ్వండి.” అని నేను మంచంమీద పడుకున్నాను.

“ఏం సార్ విశేషం! శ్రీనివాసు లింట్లో ఏమైనా స్పెషలా?" అడిగాడు మునసామి నాయుడు.

“ఏం లేదండీ! ఇక్కడ ఏమీ తోచక అటు పోయాను. తినందే రానివ్వలేదు వాళ్ళు. అంత కంటే ఏమీ లేదు.” అన్నాను. అంతకు మించి వాళ్లతో ఏమీ చెప్పలేదు.

వాళ్ళు మాట్లాడుకుంటూ అన్నం తింటుంటే నాకు నిద్రపట్టింది.

దాదాపు మూడుగంటల ప్రాంతంలో చంగయ్యశర్మ నన్ను నిద్రలేపాడు. బయట ఏం జరుగుతున్నదో చూడండి!” అన్నాడు నవ్వుతూ.

“ఏం ఎవరైనా కొట్లాడుకుంటున్నారా?"

“అదేం కాదు. శ్రీనివాసులు, ఆయన భార్య బిందె, తట్ట తీసుకొని బయలుదేరారు. వాళ్లతో బాటు చాలమంది ఆడవాళ్ళు, మగవాళ్ళు పారలు, బిందెలు, తట్టలు, తీసుకు బయలుదేరారు. “మీరేమో ఇక్కడ నిద్రపోతున్నారు" అన్నాడు చంగయ్య శర్మ.

"శ్రీనివాసులుకు ఏమైనా మంత్రం వేసి వచ్చారా ఏం సార్?" అన్నాడు మునసామి నవ్వుతూ.

"మంత్రమూ లేదు, తంత్రమూ లేదు గాని మనం కూడా పోదాం పదండి." అంటూ బయలుదేరాము.

"మనకు తట్టలు, బిందెలు ఏమీ లేవే! ఏం తీసుకుని పోదాం మనం?" అన్నాడు చంగయ్య శర్మ.

"ఉత్త చేతులతోనైనా పోదాం! అక్కడ వాళ్ళవి తీసుకుని మనమూ కొంత పని చేద్దాం!" అంటూ బయలుదేరాను. రూము తలుపులు వేసుకుని వాళ్ళిద్దరు కూడా వచ్చారు. శ్రీనివాసులు మీద నా మాటలు బాగా పనిచేసినాయ్. నేను చెప్పకుండానే, నాతో చెప్పకుండానే కార్యోన్ముఖుడైనాడు. నాకు చాలా సంతోషమేసింది.

స్కూలు దగ్గరికి చేరేసరికి పని జరుగుతున్నది. ఆడవాళ్ళు, మగవాళ్ళు వరుసల్లో నుంచుని ఇసుక అందుకొని పునాదుల్లో పోస్తున్నారు. కొంత మంది స్త్రీలు చెరువునించి నీళ్ళు తెచ్చి పోస్తున్నారు. చక చకా పని సాగి పోతున్నది. శ్రీనివాసులు ఇసుక తట్టలు అందుకుంటుంటే, అతని భార్య నీళ్ల బిందె అందుకుంటున్నది.

ఎంతో ఆహ్లాదకరంగా ఉంది సన్నివేశం. ఈ దృశ్యాలను ఫోటోలు తీస్తే బాగుంటుంది అనిపించింది. కాని కెమేరా ఎవరి దగ్గరుంది? ఫిలిమ్ ఎక్కడి నుంచి తీసుకొస్తాము? మనోపటలంలో నిక్షిప్తం కావాల్సిందే ఈ ముద్రలు! ఇప్పుడు వార్తాపత్రికల్లో ప్రముఖంగా కనిపిస్తున్నవి మృతదేహాలు, క్షత

గాత్రులు, కూలిపోయిన వంతెనలు, పడిపోయిన రైలుబండ్లు, బస్సులు! ఇలాంటి కార్యక్రమాలకు ఎందువల్ల ప్రచారం లభించడంలేదో మరి!

సాయంత్రం ఆరు గంటలకంతా పని పూర్తయింది. గలగలమని మాట్లాడు కుంటూ విజయగర్వంతో అందరూ ఇంటిదారి పట్టారు. వారిలో యువకులు, యువతులు, వృద్ధులు, బాలురు, బాలికలు అందరూ ఉన్నారు.

అందరితో బాటు శ్రీనివాసుల్ని పోనివ్వలేదు. అతన్ని చెయ్యి పట్టి నిలేశాను. ప్రేమ పూర్వకంగా ఆలింగనం చేసుకున్నాను. “మీరు పూనుకోకపోతే ఈ పని ఇంత తేలిక గా అయ్యేది కాదు శ్రీనివాసులూ!” అన్నాను. “మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియటం లేదు.” నా నేత్రాలు ఆర్థమైనాయి.

"నాదేముంది సార్! నేను మీకంటే ముందు నుంచి కూడా ఉన్నానిక్కడ. ఏం 'చెయ్య గలిగాను? ఈ చైతన్యమంతా మీరు వచ్చిం తరువాత వచ్చిందే. ప్రేరణ మీది. ఫలితం అందరిదీ. మేము ఊరికే మీరు ఆడిస్తే ఆడుతున్న బొమ్మలం!" అన్నాడు శ్రీనివాసులు సిగ్గు పడుతూ తలవంచుకుని.

“మీరు నన్నింతగా పొగడాల్సిన పనిలేదు, బ్రదర్! మీలో మంచితనం ఉంది. మంచి చెడ్డలు అర్థం చేసుకునే విచక్షణ ఉంది. అది పని చేస్తున్నది గాని ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు" అన్నాను వినయంగా.

ఇద్దరం చెట్టపట్టా లేసుకుని ఊళ్ళోకిపోయాము. గంగరాజు ఎటు పోయాడో ఏమో, ఇవాళ ఈ మనుషుల్లో కనిపించలేదు.

16

పిల్లల దగ్గర వసూలు చేసిన డబ్బు నా దగ్గరుంది. స్కూలు బిల్డింగు కట్టించేందుకు ఖర్చు చెయ్యమని చెప్పాడు ప్రెసిడెంటు. ఇంత వరకు ఒక్క పైసా కూడా ఖర్చుకాలేదు దాంట్లోంచి. ఇంతవరకు ఉచితంగానే అంతా జరిగిపోయింది ఊరివాళ్ళ పుణ్యాన.

వాళ్ళు పనిచేస్తున్నప్పుడు కాఫీయో, టీనో ఇప్పిస్తే బాగుంటుందనిపించింది. కాని హోటళ్లేవి? కనీసం టీ బంకు కూడా పెట్టుకోలేదెవరూ!

అందరూ నిధులు చాల్లేదు అని అల్లాడిపోతూంటారు. నా దగ్గరున్న నిధి తరక్కుండా అలాగే ఉంది! పని మాత్రం జరుగుతున్నది! ప్రజలు చైతన్య వంతులయితే నిధులకు కొరత ఉండదనుకుంటాను. వాళ్ళను భాగ స్వాములను చెయ్యకుండా కూచోబెట్టి పనులు జరపాలంటే వీలవుతుందా? నిధులు ఎలా చాల్తాయి? ఈ మధ్య గంగరాజు కనిపించలేదు. ప్రెసిడెంటు కూడా ఊళ్ళో లేనట్లున్నది. అప్పుడప్పుడు వీళ్ళలా అంతర్ధాన మవుతూ ఉండడం మామూలేనట.

ఇప్పుడు స్కూల్లో టీచర్లందరం ఒక్కతాటిమీద నడుస్తున్నాము. సంఘీ భావంతో చెయ్యలేని పనేముంటుంది ?

పునాదుల్లో వేసేందుకు బండరాళ్ళు తోలించాము, కట్టుబడికి పనికి వచ్చే మట్టి తోలించాము. చాలావరకు డబ్బివ్వకుండానే ఈ పనులు చేశాము. జరుగుబాటులేని వారికి మాత్రం డబ్బిచ్చాము. డ్రిల్లు క్లాసుల్లో సిద్ధంగా ఉన్న ఇటుక బట్టీల్లో నుంచి ఇటుకలు తీయించి పునాదుల చుట్టూ పిల్లల చేత పేర్పించాము.

అన్నీ సిద్ధం చేసి తాపీ మేస్త్రీ గోపాల్కు చెప్పి పంపించాము. అతను మంచివాడు. గోపాల్ కొడుకొకడు స్కూల్లో చదువుతున్నాడు. కాబట్టి అతని కీ స్కూలు మీద ఇంటరెస్టే,

అతను నలుగురైదుగురు మనుషుల్ని వెంటబెట్టుకుని పనిలో కొచ్చాడు. వారం రోజుల్లో నేల మట్టానికొచ్చింది పునాది గోడ. అంతవరకు నా దగ్గర ఉన్న డబ్బు ఇచ్చాను వాళ్ళ కూలికింద.

జరుగుతున్న పనిని ప్రెసిడెంటు వచ్చి చూశాడు. చాలా సంతోషించాడు పాపం. “డబ్బెలా చేశా”రని అడిగాడు. అంతవరకు జరిగిన పని వివరమంతా

చెప్పాను. ఆయన గోపాల్తో ఇకనుంచి రోజూ కూలి డబ్బులకు తన దగ్గరికొచ్చి తీసుకోమని చెప్పాడు. అతనందుకు ఒప్పుకున్నాడు.

గోపాల్, మరి ఇద్దరు కూలీలను తీసుకొని పనికొచ్చాడు పునాదులు ఒక వారం రోజులు ఆరింతరువాత. కూలీలు మట్టి కలిపివ్వడం వగైరా పనులు చేశారు. మిగతా అన్ని పనులూ పిల్లలూ, మేమూ చేశాము. పదిహేను రోజులు నిర్విరామంగా పనిజేసి గోడలు పూర్తి చేశాము.

ఒకరోజు చుక్క తెగిపడినట్లు గంగరాజు ఊడిపడ్డాడు నాముందు.

“ఇప్పుడు అయిదు ట్రెస్సులన్నా తయారు చేయించాలి. ప్రెసిడెంటు దగ్గర కొయ్య ఉంది. వడ్రంగం వాడితో మాట్లాడి ఆ పని చెయ్యాలి ముందు” అన్నాడు.

“రేకులు గూడా కావాలి గదా! ఇటుక బట్టీలు తయారుగా ఉన్నాయి కాబట్టి గోడలు తేలికగానే కట్టేశాము. గోడ కట్టేందుకయిన కూలీగూడా ఎక్కువేమి గాదు. ప్రెసిడెంటును కూచోబెట్టుకుని ఆ విషయం గూడా మాట్లాడాలి. త్వరగా మూత వెయ్యాలి. లేకపోతే గోడలు తడిసిపోతాయి. మట్టితో కట్టాము. అవి పడిపోయే ప్రమాదం కూడా ఉంది" అన్నాను.

“ట్రెస్సులు తయారుగానీ రేకుల సంగతి ఆ వెంటనే చూద్దాము" అన్నాడు గంగరాజు. ఆరోజు మధ్యాహ్నం ఎండలో పడుతూ లేస్తూ ఒకతను మా రూము దగ్గరికొచ్చాడు.

భుజానికి ఒక సంచీ తగిలించుకున్నాడు. అతని ప్యాంటు, షర్టు బాగా నలిగిపోయి ఉన్నాయి, వయసు చిన్నదే అయినా తలమీద వెంట్రుకల్లేవు. ఆపసోపాలు పడుతూ రూములో కూలబడ్డాడు.

చంగయ్యశర్మ మంచినీళ్ళిచ్చాడు. అతను కొన్ని నీళ్ళు ముఖం మీద చల్లుకున్నాడు. ముఖం తుడుచుకోకుండానే రెండు గ్లాసుల నీళ్ళు గటగటా తాగేశాడు. కాస్త ప్రాణం కుదుటబడిం తరువాత చెప్పాడు.

"నే నీ ఏరియాలో మలేరియా వర్కరుగా పనిజేస్తున్నా మాస్టారూ! ఉదయం నుంచి సాయంత్రం దాకా ఊళ్ళ వెంట తిరుగుతూ గోడల మీద రాస్తూ ఉంటాను. ఇవాళ ఎండకు ప్రాణం కడబట్టింది. ఇక్కడికొచ్చి పడిపోయాను."

"మీ మకాం ఎక్కడ?" అన్నాడు మునసామి.

"శివగిరిలో. రోడ్డు కాస్త దగ్గరగా ఉంటుందని అక్కడుంటున్నాను." "మీరు మాలాగే ఒంటరిగానే ఉంటున్నారా? సంసారం పెట్టారా?" అడిగాన్నేను.

"ప్రస్తుతానికి ఒంటరిగానే ఉంటున్నానండీ. దేశదిమ్మరి ఉద్యోగం. ఈ పల్లెల్లో వాళ్ళను ఒంటరిగా వదిలివెళ్లే ధైర్యం లేదు నాకు. అందుకే వాళ్ళను మా స్వగ్రామంలోనే వదిలి వచ్చాను" అన్నాడతను.

"మంచిపని చేశారు. ఈ పల్లెల్లో మీతోబాటు వాళ్లు గూడా కష్టపడటం ఎందుకులెండి" అన్నాను.

"ఇంతకూ మీ స్వగ్రామమేది?" అడిగాడు చంగయ్య శర్మ.

"శింగరాయకొండ. ప్రకాశం జిల్లా."

"చాలా దూరం వచ్చేశారు" అన్నాడు మునసామి.

"ఏం చేస్తామండీ కడుపాత్రం! ఏదో జీవనాధారం దొరికింది. వాళ్ళిక్కడ పడేశారు. వచ్చేశాను" అన్నాడతను.

"ఇంతకూ మీ పేరు చెప్పారు గాదు." చంగయ్యశర్మ.

"సత్యనారాయణ అండీ! మీరు సత్యం అనండి చాలు" అతనన్నాడు. "ఇంతకూ మీరు భోంచేశారా సత్యంగారూ? లేకపోతే రండి భోంచేద్దురు గాని" అన్నాడు.

"నేను రోజూ పొద్దునపూట భోంచేసే బయలుదేరుతానండీ" ఇవాళ గూడా తినే బయలుదేరాను" మొహమాటపడుతూ చెప్పాడతను.

"పొద్దున గదా తిన్నది. ఇప్పటికి అరిగిపోయి ఉంటుంది. కాస్త మజ్జిగన్నం తినండి" అన్నాడు మునసామి.

“చాలా అలసిపోయినట్లున్నారు. కొద్దిగా తినికాసేపు పడుకోండి. చల్లబడిం తరువాత పోదురుగాని" అన్నాన్నేను.

అతను లేచి కాళ్ళు, చేతులు కడుక్కొని భోజనానికి కూచున్నాడు. మునసామి ఆకు వేశాడు. చంగయ్యశర్మ ఓపిగ్గా వడ్డించాడు. ఆవురావురు మంటూ తిన్నాడతను. పైగా ఆ రోజు మామిడికాయల ముక్కలతో పప్పు వండాడు చంగయ్య శర్మ. అది చెయ్యటంలో స్పెషలిస్టు అతను. కడుపు నిండా తిని లేచాడు. “ఇలా కడుపునిండా తిని ఎన్నాళ్లయిందో! రోజూ ఏదో వెధవ పొళ్ళు వేసుకొని ఏదో తినాలని తినటమే” అన్నాడు సత్యనారాయణ చెయ్యి కడుక్కుంటూ.

ఇంతకు ముందు ఇద్దరు ముగ్గురు మలేరియా వర్కర్లను చూశాను. ఇతనిలా కష్టపడే వాళ్లు కాదు. వారంలో ఒకరోజు అలా షికారు కెళ్లినట్లు వెళ్లి వచ్చే వాళ్ళు. ఇంట్లో కూచొని డైరీలు రాసి పంపుతూ ఉండేవాళ్ళు.

మా సూపర్‌వైజరు మరీ ఛండాలుడు మాస్టారూ! పనిచేసేవాళ్లను మరీ ఏడ్పించి చంపుతాడు. జీతాలు, టి.ఏ.లు, ఇంక్రిమెంట్లు అన్నిటికీ వాడి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడాలి. చేసే పనిలో ఏ కొంచెం లోటు కనిపించినా ఉగ్రుడైపోతాడు. అసలు తప్పులు వెదకటమే వాడి పని. వాడి ఇంటికిపోయి కానుకలు సమర్పించుకుంటూ, వాడి పిల్లల్నెత్తుకొని ఆడిస్తూ, ఇంటిపనులు చేసిపెడుతూ ఉండే వాళ్ళను ఏమీ అనడు. ఆ పనులు చెయ్యకుండా డ్యూటీకే ప్రాముఖ్యం ఇచ్చే నాబోటిగాళ్ళను కాల్చుకు తింటాడు. వాడి కాళ్ళు పట్టటం నాకు సుతారమూ ఇష్టం లేదు." తన ఉద్యోగ పరిస్థితుల గురించి చెప్పుకొచ్చాడు సత్యం.

"మొత్తం మీద మీ ఉద్యోగం చాలా కష్టమైందే!” అన్నాడు చంగయ్యశర్మ.

"ఉద్యోగాల్లో కష్టమైనవి, సుఖమైనవి అంటూ ఉండవు శర్మగారూ. కష్టం, సుఖం చేసేవాడి సిన్సియారిటీ మీద ఆధారపడి ఉంటాయి. ఎంత సిన్సియ రయితే అంత కష్టం.

ఎంత ఇన్సిన్సియరయితే అంత సుఖం. ఒచ్చిన చిక్కంతా ఒక్కటే. మన వాళ్ళు సిన్సియారిటీని శిక్షిస్తున్నారు. ఈన గూడా వాడి ఇంట్లో పనులుజేస్తుంటే యీ బాధలుండేవి కాదు గదా?" అన్నాను.

"మరి చెయ్యాల్సిన పనిమాటో!" అన్నాడు మునస్వామి.

"పనిమాట దేవుడు చూసుకుంటాడు. చెయ్యని పనులు గూడా చేసినట్లు డైరీలు రాసెయ్యటం లేదూ! డైరీలో రాసేసిం తరువాత పని అయిపోయినట్లే లెక్క" అన్నాను నవ్వుతూ. "ఇప్పుడు మనకూ వచ్చింది డైరీల రోగం! నువ్వు లెస్సన్ ప్లాన్ సిద్ధంగా రాసి పెట్టుకొని ఉంటే చాలు. నువ్వు మంచి టీచరు కిందనే లెక్క! నువ్వు క్లాసులోకి పోయినా, పోకపోయినా, పాఠం చెప్పినా చెప్పక పోయినా ఫరవాలేదు. ఆయనకు కావాల్సింది పిల్లలు చదువు నేర్చుకోవటం గాదు, నువ్వు లెస్సన్ ప్లాను తయారు చెయ్యటం. మన వాళ్ళు మహా గొప్ప మేధా సంపన్నులండీ! పరుగు పందెంలో నువ్వు పరిగెత్తితే ఓడిపోతావు. పరిగెత్తి నట్లు నటించు బహుమానం నీదే!"

వాళ్ళెవరూ ఏమీ మాట్లాడలేదు. నేనే కొనసాగించాను.

"కలకడ నుండి నేను ఈ ఊరు బదిలీకావటం పనిచెయ్యనందువల్లగా దండీ! పరీక్షలో తప్పిపోయిన వాణ్ణి పాసు చెయ్యనందుకు! బడిలో చేరే పిల్లల దగ్గర్నుంచి బిల్డింగు ఫీజు వసూలు చెయ్యకూడదని ప్రభుత్వం రూలు పాస్ చేసింది. ఆ రూల్ను అమలు జరిపి తీరాలన్నందుకు! నా విషయం పక్కన బెట్టండి. నాకు ముందున్న హెడ్మాస్టర్ను ఈ ఊరు ఎందుకు మార్చారో తెలుసా? పిల్లల దగ్గర డబ్బులు వసూలు చేసుకొని తినేసినందుకు! పిల్లల్ని పీడించిన వాడికి, పిల్లల్ను పీడించవద్దన్న వాడికి ఒకటే శిక్ష! ఇంత చక్కని అడ్మినిస్ట్రేషను ఏ దేశంలో ఉంటుంది చెప్పండి!" అంటూ నవ్వాను. "అవన్నీ

ఎందుకు లెండిప్పుడు. మీరుంటున్న శివగిరి ఇక్కడికెంత దూరం?” అని అడిగాను సత్యాన్ని.

“ఎంతండీ! ఒకటిన్నర మైలుంటుంది. పదికొంపల పల్లె. రోడ్డుకు కాస్త దగ్గరగా ఉంటుందని అక్కడ చేరాను. ఊళ్ళో అందరూ రెక్కాడితే గాని డొక్కాడని వాళ్ళే. పాపం పచ్చడి కాస్త పెట్టండి, మీరు చేసే పొడి బాగుంటుంది. కాస్త పెట్టండి' అని నా దగ్గరి కొస్తుంటారు. కాసేపు కూచుని హాయిగా మాట్లాడుదామంటే మనిషి దొరకడు. మానసికంగా,

శారీరికంగా చచ్చిపోతున్నానండీ బాబూ! ఈ ఉద్యోగం గాదు గాని నా ప్రాణం పోయేట్లున్నది." నవ్వాడతను. "ఇంత మాత్రం నవ్వి ఎంత కాలమైందో!" అన్నాడు.

"మీరెంత వరకు చదువుకున్నారు?" అడిగాడు చంగయ్యశర్మ. "బి.ఎస్సీ. డిస్ కంటిన్యూ చేశానండి" అన్నాడు.

“అయ్యో మధ్యలో ఎందుకాపేశారు? పూర్తి చేస్తే బాగుండేది గదూ ?” అన్నాడు శర్మ.

“బాగుండేదే! కాని ఇంటరు పూర్తిచేసే సరికే తాతలు కనిపించారు. ఇంటరుతో సరిపెట్టుకొమ్మని మావాళ్లు ఉపదేశం చేశారు. నాకు నేనే మొండికేసి చేరాను బి.ఎస్సీలో. చివరకు మొండి చెయ్యితోనే బయటపడాల్సి వచ్చింది. ఈ ఉద్యోగం ఇప్పించి పుణ్యం గట్టుకున్నాడో పెద్దమనిషి, దాన్ని పట్టుకుని ఇలా గోడల మీద రాసుకుంటూ ఊళ్ళ వెంట తిరుగుతున్నాను” అన్నాడు.

"మీ సర్వీసెంత? మీ ఉద్యోగంలో ప్రమోషను అవకాశాలేమైనా ఉన్నాయా?" అడిగాన్నేను.

“ఐదేళ్ళ సర్వీసుందండి! సూపర్వైజరుగా ప్రమోషను వస్తుంది. అది మనకు దక్కనిస్తారా! నన్ను చూస్తే చాలు మా సూపర్వైజరు, వాడికదేం పోయే కాలమో 'నిన్ను సస్పెండు చేస్తాను, డిస్మిస్ చేయిస్తాను' అంటూ గంగ వెర్రులెత్తి పోతాడు. ఉద్యోగం ఊడకుండా ఉంటే చాలా భగవంతుడా అని

రోజూ వెయ్యి దేవుళ్ళకు మొక్కు కుంటూ ఉంటాను". నిట్టూర్చాడతను. అతని మాటలు వింటుంటే జాలి కలుగు తున్నది. సూపర్‌వైజరు కనిపిస్తే పట్టుకొని నాలుగు తందామనిపించింది. అయితే ఇది సినిమా కాదుగా, జీవితం !

“మిమ్మల్ని చూస్తే ప్రాణం లేచి వస్తున్నది. మీరందరూ ఒంటరి వాళ్ళేగా. నేను గూడా మీతో ఉంటానండీ! ఆ ఊర్నించి వచ్చేస్తాను. మీలో ఒక మనిషిగా బ్రతుకుతాను. అన్ని పనుల్లోనూ మీకు సహాయం చేస్తాను. మీకే విధమైన ఇబ్బంది కలిగించను. మీరు ఊఁ! అంటే రేపు ఉదయమే వచ్చి దిగిపోతాను". ప్రాధేయపడ్డాడతను.

“మా వాళ్ళిద్దరికీ ఇష్టమైతే నాకేమీ అభ్యంతరం లేదండీ! నా భారాన్ని గూడా వాళ్ళే మోస్తున్నారు పాపం!” అన్నాను మునస్వామినీ, చంగయ్యనూ చూస్తూ. వాళ్లు తమకేమీ అభ్యంతరం లేదని చెప్పారు.

మర్నాడుదయం పది గంటలకల్లా తన చిన్న ట్రంకు పెట్టెతో, మలేరియా మాత్రల డబ్బాలతోనూ రూములోకొచ్చి చేరాడు సత్యం. ఇన్ని రోజులూ మాకు చర్చనీయాంశం మా స్కూలు వ్యవహారాలే. ఇప్పుడు మలేరియా నిర్మూలన కార్యక్రమం గురించి గూడా తెలుసుకోగలుగుతున్నాము సత్యనారాయణ ద్వారా.

"నేను గూడా మీలాగా టీచర్నయితే ఎంత బాగుండేది సార్!” అన్నాడు సత్యం ఒకరోజు. “ఏం? మేమంత సుఖపడుతున్నా మనుకుంటున్నారా?" అన్నాను.

"ఇలా ఊళ్ల వెంట కాళ్లరిగేలా తిరగాల్సిన పని లేదుగా మీకు!” అన్నాడతను.

“మీకు మా లాగా రోజూ చూచిన మనుషుల్నే చూచుకుంటూ ఉండాల్సిన అవస్థ లేదుగా! మీరు హాయిగా రోజుకో ఊరు తిరుగుతుంటారు. ఎందరితోటో మీకు పరిచయాలేర్పడుతుంటాయి. బాధపడుతున్న వారికి సహాయం అందిస్తూ ఉంటారు! వాళ్ల ఆరోగ్యం కుదుటబడితే మిమ్మల్ని అభినందిస్తుంటారు. అవీ యివీ ఇస్తుంటారు!' అన్నాడు చంగయ్య శర్మ. "

“మనకూ ఈ మలేరియా వర్కరు ఉద్యోగం వస్తే ఎంత బాగుండేది! ఈ పిల్లలతో వేగలేక బాధపడుతున్నాము అని మాకు అనిపిస్తున్నది.” అన్నాడు మునస్వామి.

“పొరుగింటి పుల్లకూర ఎప్పుడూ రుచిగానే ఉంటుంది లెండి! ఎవరు చేస్తున్న పని వాళ్ళకు కష్టంగానే ఉంటుంది. మీ సిన్సియారిటీని మీ సూపర్‌వైజరు గుర్తించడం లేదు గాబట్టి మీరు బాధపడుతున్నారు. ఆయన మీ పనిని మెచ్చుకుంటూ నాలుగు మాటలు మాట్లాడితే పొంగిపోరూ! లోపం పై అధికారుల్లో ఉంది. ఉద్యోగంలో లేదు. నిరక్షరాస్యతను నిర్మూలించ డానికి మేము కృషి చేస్తుంటే, మలేరియా రోగ నిర్మూలనకు మీరు కృషి చేస్తున్నారు. మేము మానసిక ఆరోగ్యానికి పాటుబడు తున్నాము. మీరు శరీర ఆరోగ్యానికి పాటుబడుతున్నారు. మనుషులు ఆరోగ్యంగా ఉంటేనే కదండీ మా చదువులు అవసరమయ్యేది? మీరు చేస్తున్న పని చాలా గొప్పది. అంత గొప్ప పని చేస్తున్నందుకు సంతోషించండి. మీ ఉద్యోగాన్ని మీరు తక్కువ జేసుకో గూడదు" అన్నాను.

“ఎంత పని చేసినా ప్రయోజనం లేనప్పుడు తక్కువ చేసుకోక ఏం జేస్తామండీ? మా సూపర్‌వైజరు మహా కర్కోటకుడు. వేధించి చంపు తున్నాడు" అన్నాడతను విరక్తి భావంతో.

"అతన్ని చూచి భయపడుతున్నారు గాబట్టి మరింత భయపెడుతున్నాడేమో! మిమ్మల్ని అన్యాయంగా వేధిస్తే తిరుగుబాటు చెయ్యండి. ఉద్యోగం ఊడుతుందే మోనని పిరికి మందు తాగొద్దు. బ్రతుకుదెరువుకు సవాలక్ష మార్గాలున్నాయి. తెంపరి తనానికున్న చలామణీ డబ్బుక్కూడా లేదండీ ఇప్పుడు... వుయ్ ఆర్ సబార్డినేట్ ఓన్లీ టు అవర్ డ్యూటీ! మనం ఇప్పుడు ఉత్తరాల్లో 'యువర్స్ ఒబీడియంట్లీ' అని రాయటంలేదు చూడండి. 'యువర్స్ ఫెయిత్‌ఫుల్లీ' అని మాత్రమే రాస్తాము. వుయ్ ఆర్ ఫెయిత్ఫుల్ టు అవర్ డ్యూటీ ఎండ్ వాట్ వుయ్ సే ఎబౌట్ అవర్ డ్యూటీ!” అని చిన్న ఉపన్యాసం ఇచ్చాను.

“ప్రాక్టీస్ ఈజ్ మోర్ డిఫికల్ట్ దేన్ ప్రిసెప్ట్" అంటూ నవ్వాడతను.

నా కంఠ శోషనంతా ఒక్క మాటలో కొట్టిపారేశాడు. నాకూ నవ్వొచ్చింది.

సత్యం తక్కువ వాడేం కాదు. కళాభినివేశం గూడా ఉన్నదతనికి. రాజకీయ నాయకుల ఉపన్యాసాలు చక్కగా ఇమిటేట్ చెయ్యగలడు.

అప్పుడప్పుడు అతని చేత మిమిక్రీ చేయించుకొని ఆనందిస్తున్నాము. సత్యానికి ఉత్సాహం ఎక్కువైనప్పుడు "జండాపై కపిరాజు" అంటూ పద్యం అందుకుంటాడు. అతను పద్యం పాడటం తమాషాగా ఉంటుంది. కళ్ళు గట్టిగా మూసుకొని, చెవికి చెయ్యి అడ్డంగా పెట్టుకొని పాడుతాడు. అతని పద విభజన అంతా 'రాముని తోక పివరుండిట్లనియె' లాగా ఉంటుంది. మొత్తం మీద అతని వల్ల మాకు మంచి ఎంటర్టైన్మెంట్ దొరుకుతున్నది. వంట పనిలో గూడా చక్కగా సహకరిస్తున్నాడు. సత్యం మాతో కలిసినందు వల్ల మాకు లాభమేగాని నష్టం ఏ మాత్రం లేదు.

17

కొయ్యలన్నిటినీ స్కూలు బిల్డింగు మొండిగోడల మధ్యకు చేర్పించాడు గంగరాజు. కార్పెంటర్ను మాట్లాడి అతనిచేత పని చేయించటంలో నిమగ్నమయినాడు.

ప్రెసిడెంటు గూడా అప్పుడప్పుడు వచ్చి చూచి పోతున్నాడు. ట్రెస్సుల పని త్వరలోనే పూర్తవుతుందని నమ్మకం కుదిరింది. సిమెంటు రేకులదే సమస్యంతా. ప్రెసిడెంటు ఏమంటాడో? నా దగ్గర డబ్బులేదని చేతులెత్తేస్తే ఇబ్బందే! ఇప్పటినుంచే దాన్ని గురించి తల బ్రద్దలు చేసుకోవటం ఎందుకు? సమస్య ఉత్పన్నమయినప్పుడు ధైర్యంగాఎదుర్కోడమే దానికి పరిష్కారం.

ఊళ్ళో కొందరు యువకులు "నాటకం వేస్తాం నేర్పించండి" అంటూ తొందర పెడుతున్నారు. "ఇదిగో అదిగో" అని వాయిదాలు వేయిస్తున్నాను. సత్యం పాడుతున్న 'జండా పైకపిరాజు' వాళ్ళను మరింత తొందర పెడుతున్నది.

పెళ్ళాన్ని తీసుకొచ్చుకున్న తరువాత చంగల్రాయలు స్కూలు టైములో తప్ప ఇతరత్రా బయట కనిపించడం లేదు. శ్రీనివాసులు బాగున్నాడు. తరుచుగా మాతో కూచొని మాట్లాడుతున్నాడు.

శంకర్ విజయపురం నుంచి రోజూ వచ్చి పోతున్నాడు. 'దొరసామి టైలరింగు, సంసారాలతో సతమతమవుతున్నాడు.

చంగయ్యశర్మకు నగరిలో సంబంధం కుదిరింది. మునసామి కూడా "అదిగో ఇదిగో" అంటున్నాడు.

వాళ్ళిద్దరూ పెళ్ళిళ్ళు చేసుకుని భార్యలతో కాపురాలు మొదలు పెడితే రూములో నేను, సత్యం మాత్రం మిగిలేట్లున్నాము. చంగయ్య, మునసామి ట్రాన్స్ఫర్ల కోసం రహస్యంగా ప్రయత్నాలు చేస్తున్నారని కర్ణాకర్ణిగా తెలిసింది. చంగల్రాయలు గూడా ఊరికే ఉన్నట్లు లేదు.

ఒంటరిగా దొరికినప్పుడల్లా సత్యం నన్ను ఇబ్బంది పెడుతున్నాడు. "తిరుపతిలో మంచి సంబంధం ఉంది. పెళ్ళి జేసుకో. నువ్వు ఊఁ అంటే చాలు. నేను అన్నీ మాట్లాడు తాను" అన్నాడు. అతనికి నాతో చనువేర్పడ్డది.

"ఏమేం మాట్లాడుతావు?" అన్నాను.

"కట్నం, కమామిషు - అన్నీ మాట్లాడుతాను."

"కట్నం ఇచ్చేవాళ్ళు లేక ఇంతకాలం పెళ్ళి చేసుకోకుండా ఉన్నానను కున్నావా?" "ఏమో. నీ ఆంతర్యం నాకేం తెలుస్తుంది. నేను కొత్తవాడిని గదా!" "నేనిప్పుడే పెళ్ళి చేసుకోదలుచుకోలేదు."

ఏం? ఎందుకు? ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇంకా ఆలస్యం చేస్తే తరువాత పశ్చాత్తాపపడుతావు." సీరియస్గా ముఖం పెట్టి అన్నాడు సత్యం.

"పెళ్ళికి అంత తొందరపడటం లేదు నేను."

"ఎవర్నయినా ప్రేమించావా? భగ్న ప్రేమికుడివా?"

" నో నో అదేం లేదు. అంతంత ఘనాకార్యాలు చేసే సాహసమే ఉంటే నేను ఇలా ఎందుకుంటాను? అవన్నీ ఏమీలేవు. అయితే నేను శుకమహర్షిని మాత్రం కాదు. అందమైన అమ్మాయి ఎదురయితే తనివితీర చూస్తాను. నాకు కాబోయే భార్య ఇంత అందమైందిగా ఉండాలని కోరుకుంటాను. నా చూపులన్నీ ఎదుటివారు చూడకుండా ఉండేంతవరకే. ఆ మనిషి కళ్ళెత్తి చూస్తే నా చూపులు ఎటో మళ్ళించేసుకుంటాను. నీకు తెలీదు. నేను చాలా పిరికివాణ్ణి" అన్నాను సిగ్గుపడుతూ.

"ప్రేమించడానికి ధైర్యం ఎందుకయ్యా బాబూ, పిరికితనంతో ఎన్నాళ్ళని మానసిక వ్యభిచారం చేస్తావు" అన్నాడతను.

నాకు కోపం వచ్చింది. "పెద్ద పెద్ద మాటలు ప్రయోగిస్తున్నావు. మానసిక వ్యభిచార మంటే యేంటి?" అన్నాను.

"అదే కంటికి నచ్చిన వాళ్ళతో మానసికంగా రమించడం."

"మానసికంగా రమించడం, శారీరకంగా రమించడం అనే పద్ధతులు రెండున్నాయన్న మాట రమించడానికి! నాకు నువ్వు చెప్పేంతవరకు తెలీదు ఈ విషయం. కళ్ళున్నవి గాబట్టి చూస్తాము. మనిషిగాని, వస్తువుగాని ఎంత అందంగా ఉంటే అంత ఎక్కువ సేపే చేస్తాము. వికృతంగా ఉన్నాగూడా ఎక్కువసేపే చూస్తాము. వస్తువో, మనిషో బాగున్నంత మాత్రాన, బాగున్న దనుకున్నంత మాత్రాన మానసికంగా వ్యభిచరించి నట్లేనా? సినిమాలు చూచే వారందరూ మానసిక వ్యభిచారులే నన్నమాట నీదృష్టిలో, ఏవో కొన్ని చిలక పలుకులు నేర్చుకుని వాటిని వల్లించుకుంటూ ఉండటం మంచిది గాదు సత్యం. నాశబ్దార్థ చంద్రికలో ఆ మాటకు అర్థంలేదు" అన్నాను సీరియస్గా.

"పెళ్ళి చేసుకోవయ్యా మహానుభావా అని బ్రతిమాలుతుంటే నాకు ఉపన్యాసాలు చెబు తున్నావు. నీతో యేం చెయ్యాలో తెలీటంలేదు."

“అర్థం పర్థం లేని మాటలు నాతో మాట్లాడకుండా ఉంటే అదే పదివేలు.

“అందరూ పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. మరో నెలలో చంగయ్యశర్మ ఓ ఇంటి వాడవుతాడు. తరువాత కొద్ది రోజుల్లో మునసామినాయుడు. నీకేం తక్కువని నువ్వు సంసార సుఖానికి దూరంగా ఉండాలి?... నా మాట విను నీకు మంచి సంబంధం కుదురుస్తాను. వాళ్ళుచాలా మంచివాళ్ళు. అమ్మాయి ఎస్సెల్సీ పాసయింది. వాళ్ళ అన్నయ్య కాలేజీలో లెక్చరరుగా ఉన్నాడు కట్నం కూడా బాగానే ఇస్తారు. మంచి సంప్రదాయం ఉన్న కుటుంబం. భవిష్యత్తులో కూడా నీకు చాలా అండగా ఉంటారు.” ఉత్సాహంగా చెప్పాడు.

“నీకు పెళ్ళయింది గదూ సత్యం?” అన్నాను.

“అయింది. యేం. ఒక పిల్లాడు కూడా వున్నాడు.”

“వాళ్ళని నీతో ఉంచుకోకుండా సంసార సుఖానికి దూరంగా ఉన్నా వెందుకు?”

"ఈ పల్లెల్లో కష్టపడటం నాకు ఎటూ తప్పదు. వాళ్ళను కూడా బాధించడం ఎందుకని, వాళ్ళను తీసుకురాలేదు. పైగా పిల్లవాడు పసివాడు. అవసరమైతే మందో మాకో ఇక్కడెక్కడ దొరుకుతుంది?”

"నేనూ పెళ్ళి వాయిదా వేసుకుంటున్నది అందుకేనయ్యాబాబూ అన్నాను నవ్వుతూ. “నాకూ నీకూ పోలికేంటి? నేను ఉదయం లేస్తే ఊళ్ళ గోడలు పట్టుకొని తిరగాలి. నీ పరిస్థితి అది కాదే, హైస్కూలు హెడ్మాస్టరువు. నీ చేతిలో జవాన్లుంటారు. పైగా ఈ ఊళ్ళో జనం నువ్వంటే పడిచస్తున్నారు. నీ పెళ్ళాన్నీ సుఖపెడతావు. నువ్వూ సుఖ పడతావు. నా మాటవిను.” బ్రతిమాలాడాడు సత్యం.

“ఇలా ప్రపోజల్సు చాలాకాలం నుంచి వస్తున్నాయి బ్రదర్ నేనే పట్టించుకోటంలేదు. ప్రస్తుతం నా తక్షణ సమస్య పెళ్ళిగాదు. ఈ స్కూలు భవన నిర్మాణం పూర్తిగావటం, ఇక్కడికి పదో తరగతి రావటం. దాంతో పాటు కొత్త హెడ్మాస్టరు రాక. ఈ ఊర్నుంచి మన మహాభినిష్క్రమణం

కట్నం తీసుకోవాలనే కాంక్ష బొత్తిగాలేదు. నా స్వశక్తి మీద నాకు నమ్మకం ఉంది. పెళ్ళి చేసుకోవాలనే కోరిక ఉంది. చేసుకుంటాను తప్పకుండా. నువ్వెక్కడున్నా ఇన్విటేషను పంపిస్తాను. సరేనా" అన్నాను హుషారుగా. "ఈ మారు మూల గ్రామానికి మరో ప్రాణిని తీసుకురావటం ఇష్టంలేదు. దయచేసి ఇప్పటికి ఆ ప్రస్తావన ఆపు."

అంతటితో గురించిన మా సంభాషణ ఆగిపోయింది.

ఈ రాత్రి గంగరాజు మా రూము కొచ్చాడు. నన్ను కొన్ని పద్యాలు పాడమని బలవంతం చేశాడు. మూడ్ రాందే నేను పాడలేనని చెప్పాను. సత్యంచేత ఇమిటేషన్ పొలిటికల్ స్పీచ్ చెప్పించుకొని కాసేపు నవ్వుతూ కూర్చున్నాడు గడ్డం దువ్వుకుంటూ. తరువాత "ఊళ్ళో పిల్ల లందరూ నాటకం నేర్చుకోవాలని ఉత్సాహంగా ఉన్నారు. నేర్పరాదూ?" అన్నాడు.

"నన్నుకూడా ఒకటి రెండుసార్లడిగారు. వేయిస్తా లెమ్మన్నాను." "

మరింకేం మొదలు బెట్టించగూడదూ?"

"మీకేం. మొదలు బెట్టించమంటారు. యే నాటకం వేయించాలి? దాని కయ్యే ఖర్చెంత? అన్నీ ఆలోచించవద్దూ?"

"ఏదో పాటలు, పద్యాలుండే మంచి నాటకం జూడు బాగుంటుంది."

"పాటలు, పద్యాలు ఉండాలంటే పౌరాణిక నాటకమే వెయ్యాలి. డ్రెస్సులకు. హార్మోనిస్టుకు బోల్డెంత ఖర్చవుతుంది" అన్నాను.

మా మాటలు వినిపించాయి గాబోలు మా ఇంటి ఓనరు నరసరాజు రూములో కొచ్చి స్టూలు మీద కూచున్నాడు. "ఎంతవుద్దేం? అయేకరుసు యేసాలేసేవోల్లనే పెట్టుకో మంటే సరిపోద్ది. తలా కాస్త యేసుకుంటారు" అన్నాడు.

"అంతేసారూ, యేదో ఒహటి నేర్పించండి" అన్నది గోడ నానుకొని బయట కూచున్న నరసమ్మ. ఆవిడ అక్కడికి నరసరాజుతోబాటే వచ్చినట్లున్నది.

"మా నరసికి గూడా నాటాకాలంటే బలే ఇష్టం" అన్నాడు గంగరాజు నవ్వుతూ. “తప్పేవుంది మావా, నాకే యేం? నీ కిష్టంగా?” అన్నది నరసమ్మ.

“దీనిగ్గూడా ఓ యాషం యియ్యి. మనిషి గూడా బాగుంది" అన్నాడాయన.

“నీ పోసికోలు మాటలకేం మావా నువ్వూరుకో. నేను సారుతో మాట్లాడతా ఉండా." కోపాన్నభినయిస్తూ అన్నది నరసమ్మ.

“మీరందరూ నా మీదకి దండయాత్ర కొచ్చారన్నమాట. మీరు ఇంతమంది అడుగు తుంటే వేయించకుండా ఎట్లా ఉండేది. తప్పకుండా వేయిస్తాను" అన్నాను.

“సేసే దేదో తొందరగా జెయ్యి" అన్నాడు నరసరాజు.

“అలాగే ఈ రాత్రికంతా ఆలోచించి రేపు జెపుతాను" అన్నాను. తరువాత కొంచెంసేపు

కూర్చుని వెళ్ళిపోయారు.

18

ట్రెస్సుల పని మరో రెండు రోజుల్లో అయిపోతుంది. ప్రెసిడెంటు తన దగ్గర డబ్బాయి పోయిందని చెప్పాడు. ఇప్పుడేం చెయ్యాలి? అని ఆలోచిస్తున్నాను.

సాయంత్రం ఏడు గంటలప్పుడు గంగరాజు, నరసరాజు, నరసమ్మ ముగ్గురూ నా రూము దగ్గర చేరారు. తరువాత జరగాల్సిన కార్యక్రమం గురించి చెప్పాను.

“అప్పుడు వసూలు జేసిన డబ్బంతా అయిపోయిందంటనా" ఆశ్చర్యంగా అడిగింది నరసమ్మ.

“ప్రెసిడెంటును లెక్కలు సెప్పమని అడుగుదాం" అన్నాడు నరసరాజు.

“లెక్కలకేం కాయితాల మీద వేసి చూపుతాడు" అన్నాడు గంగరాజు.

“అప్పుడు శానా వసూలు జేశారు గదా మావా అంతా యేమైపోయింది?" అన్నది నరసమ్మ.

“ఏవేవో ఖర్చులైపోలేదా. జిల్లా పరిషత్తుకు కొంతకట్టాము. ఆ కొట్టం యేయించేందుకు కొంతైంది. గోడలు, ట్రెస్సులు ఊరికే మాటల్తో అయిపోయినయ్యా! వాడింకా మంచివాడు గాబట్టి అంతమాత్రవన్నా ఖర్చు బెట్టాడు" అన్నాడు గంగరాజు.

“మరయితే యిపుడేం జేత్తా?” అన్నాడు నరసరాజు.

“ఊళ్ళో వసూలు జేయాల్సిందే. మరో మార్గంలేదు" అన్నాడు గంగరాజు.

“పాత లెక్కలు సూపకుండా మల్లా యిమ్మంటే ఎవురిత్తారు మావా?” అన్నది నరసమ్మ. “లెక్కల్దేముంది లేవే. రేపే మీటింగు పెట్టి చెప్పమంటాను. వాడితో చెబుతాలే. ‘ఊళ్ళో అందరూ లెక్కలు జూపమంటున్నార్రా' అని” అన్నాడు గంగరాజు.

"ఇప్పుడదంతా యే మొద్దు. ఆ పెద్దమనిషిని దోషిలా నుంచోబెట్టి లెక్కలడగడం మంచిదిగాదు. ఆయన మనసు కష్టపడుతుంది. ఆయనకు మనమంటే అయిష్టం గూడా కలగొచ్చు. అది ఊరికి, స్కూలుకి కూడా మంచిదిగాదు. ఆయన డబ్బయి పోయిందన్నాడు గదా. ఆయన మాటలు మనం నమ్ముదాము. మన మనిషిమీదనే మనకు నమ్మకం లేకపోతే

ఎలా? ఇలాంటి చిన్ని చిన్న విషయాలే పెద్దవై పల్లెలు కురుక్షేత్రాల వుతున్నాయి. వద్దు. ఆయన్ను లెక్కలు, గిక్కలు యేమీ అడగొద్దు" అన్నాను.

"అయితే ఆడు తింటే తిన్నాడనుకోమంటావు" నవ్వాడు నరసరాజు. "లోకుల సొమ్ము తినేందుకు ఆడెవడూ?"

"నిజంగా తిన్నాడో, లేదో దైవానికెరుక. ఆయన అసలేమీ లేదు పొమ్మన కుండా కట్టుబడి కూలీలకు డబ్బిచ్చాడు. ద్వారబంధాలు, కిటికీలు చేయించాడు. ఇప్పుడు ట్రెస్సులు చేయించాడు. అంతకుముందే ఇటుక బట్టీలు వేయించాడు. గవర్నమెంటుకు స్కూలు తెచ్చేందుక్కట్టాల్సింది కట్టాడు. వసూలయిన డబ్బు నిజంగా అయిపోయి ఉండవచ్చు. ఒకవేళ పదో పరకో

మిగిలితే దాంతో ఆయనేం మహారాజైపోడు లెక్కలడిగి ఆయన తో తగాదా కొనుక్కోటం మంచిదిగాదు" అన్నాడు.

"లెక్క లడిగితే తప్పేముంది సారూ?" అన్నది నరసమ్మ సీరియస్ గా ముఖం పెట్టి, "ఆయనమీద, ఆయన మాటమీద నమ్మకం లేదనేగా మనం లెక్క లడగడమంటే అంతమాత్రం తెలుసుకోలేడా ఆయన" అన్నాను.

"మరి పని పూర్తయే దెట్టా?" అన్నాడు నరసరాజు.

"అయన్నే చెప్పమందాం" అన్నాను.

"అంతేలే. వాడినే అడుగుదాం. పనిమటుకు ఆగకూడదు. వానలొస్తే గోడలు కూల్తాయి. అంతా నష్టమవుతుంది" అన్నాడు గంగరాజు గడ్డం దువ్వకుంటూ.

ఇదట్టావున్నీ నాటకం మాట జెపుతానన్నావు, యేం జెప్పలేదు. ఆల్లు నన్ను బట్టుకొని అడుగుతా ఉండారు" అన్నాడు నరసరాజు.

"రేపందర్నీ భజన మందిరం దగ్గర చేరమనండి. చెబుతాను" అన్నాను.

"వాళ్ళతో జెబుతా" అంటూ వెళ్ళాడాయన. నరసమ్మ అతన్ననుసరించింది. గంగ రాజు మరి కాసేపు కూచొని వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం పోస్టులో నాకో కవరు వచ్చింది. దాన్ని విప్పి చూశాను. దాంట్లో ఒక ఉత్తరం దాంతోపాటు ఒక అమ్మాయి ఫోటో ఉన్నాయి. "మీ గురించి మాకు రామకృష్ణ గారు చెప్పారు. మా ఇంట్లో ఒక అమ్మాయి ఉంది. ఆమె ఫోటో దీంతో పంపుతున్నాము. మీకు నచ్చితే ఒకసారి వచ్చి చూచి పోండి" అని క్లుప్తంగా రాశారు. ఫోటోలో ఉన్న అమ్మాయి అందంగానే ఉంది. ఇలాంటి ఉత్తరం వస్తుందని నేను ఎన్నడూ అనుకోలేదు. సత్యం ప్రారంభించిన సమయప్రభావం అనుకొని ఉత్తరం, ఫోటో జేబులో పెట్టు కున్నాను. అంతకుమించి ఆ విషయంగా ఆలోచించలేదు.

సాయంత్రం ఆరు గంటలకు భజనమందిరం దగ్గర అందరూ చేరారు కోలాహలంగా. చంగల్రాయలు, శ్రీనివాసులు, మునసామి, దొరసామి గూడా ఉన్నారు. చంగయ్యశర్మ పెళ్ళి పనుల్లో తిరుగుతున్నాడు.

గంగరాజు వచ్చి నన్ను పిల్చుకుపోయాడు. సత్యం ఇంకా రూముకురాలేదు. నేను పోయి నాకు ప్రత్యేకించిన చోట్లో కూచున్నాను.

చాలాసేపు నిశ్శబ్దం. “చెప్పండి సార్" అన్నాడు చంగల్రాయలు. మనిషి ఉంటే ఊరికే ఉండడు.

“యేం చెప్పేది? యే డ్రామా వేస్తారో చెప్పండి" అన్నాను.

“అది తెలిస్తే ఇంత బ్రతిమాలడ మెందుకు మిమ్మల్ని” అన్నాడతను. నవ్వాన్నేను. “మీరే చెప్పండి కొన్ని నాటకాల పేర్లు. వాటిలోంచి ఒకదాన్ని సెలెక్ట్ చేసుకుందాము” అన్నాను.

"హరిశ్చంద్ర, చింతామణి, బాలనాగమ్మ, శ్రీకృష్ణరాయబారం, గయోపాఖ్యానం, రంగూన్ రౌడి” అంటూ చాలా పేర్లు చెప్పారు. వాటిలో ఎక్కువ పేర్లు చెప్పినవాడు గంగరాజే. ఆయనకు నాటకాలంటే మంచి అభిమానం ఉన్నట్లుంది. వీటిలో యేదైతే బాగుంటుంది అని నేను కొంతసేపు ఆలోచించాను. చివరకు “గయోపాఖ్యానం వెయ్యండి" అన్నాను.

'గయోపాఖ్యానం' నాటకమంటే నాకు చాలా ఇష్టం. అందులో పద్యం, గద్యం సమ స్థాయిలో నడుస్తాయి. నటనకు బోలెడంత అవకాశం ఉంది. అభినయం ప్రయత్న పూర్వకంగా చెయ్యనవసరం లేదు, దానంతటదే వస్తుంది.

అందరూ తమ అంగీకారం తెలిపారు

కృష్ణుడు, బలరాముడు, వాళ్ళ చెలికాడు, గయుడు, అతని మంత్రి, ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడు, నారదుడు వగైరా అన్ని వేషాలకూ మనుషులు కుదిరారు.

గంగరాజును అ క్రూరుడి వేషం వెయ్యమన్నాను. అందర్లోకి వయో వృద్ధుడైనా బలంగా ఉన్నాడు బాలరాజు, ఆయన్ను బలరాముడి వేషం వెయ్యమన్నాను.

“ముసలోల్లకు మాకూ యేసా లెందుకు?" అంటూ నవ్వాడు బాలరాజు. "ముసలీ లేదు. ముతకా లేదు. మీరు ఇద్దరూ ఆ వేషాలు వెయ్యాల్సిందే" అన్నాను.

"నేనిప్పుడే వెళ్ళిపోతా" అంటూ లేచిపోబోయాడు గంగరాజు.

ఆయన్ను పట్టుకొని ఆపేశారు మిగిలిన వాళ్ళు. “యువతరం, వృద్ధతరం అని రాజకీయ నాయకులు స్వార్థబుద్ధితో చేసే తరాల అంతరాలను మనం పాటించ గూడదు. ఇది మనం మన సంతోషంకోసం చేసుకుంటున్న పని. సమాజ జీవితంలో పిల్లలు మొదలు వృద్ధుల వరకూ అందరూ ముఖ్యమైన వారే. వృద్ధులు అనుభవజ్ఞులు, ఆలోచనాపరులు యువకులు అనుభవ శూన్యులు, ఆవేశపరులు. వాళ్ళకు కళ్ళేలువేసి ఆపాల్సినవారు వృద్ధులే... యువకులయితే ఆలోచనా రాహిత్యంతో వాళ్ళ మాటలకు ఉద్రేకపూరితులై వాళ్ళు పన్లు చేసి పెడతారని రాజకీయ నాయకుల దురాశ. ఎన్నికల్లో కన్నూ మిన్నూ కానకుండా తిరిగి ప్రచారం చెయ్యడానికి, అవసరమైతే దొంగ ఓట్లు వేసి రిగ్గింగు జరుపడానికి యువకులయితే చక్కగా పని కొస్తారనే దురాలోచన. పెద్దలు వాళ్ళు ఆడమన్నట్లల్లా ఆడరు. వాళ్ళకు మంచేదో చెడేదో తెలుసు. అందుకే యువకు లను పావులుగా ఉపయోగించు కుంటున్నారు, రాజకీయ నాయకులు. వృద్ధ తరానికి నల్లరంగు పూసి వికృతం చేసి చూపుతున్నారు. మన పార్లమెంటులో, శాసనసభల్లో, మునిసిపల్ కౌన్సిలు మీటింగుల్లో, ఆఖరికి పంచాయతీ బోర్డు మీటింగుల్లో సైతం ఆవేశంతో అరుచుకోవడం, మైకులు విరగ్గొట్టి విసురుకోవడం, స్త్రీలకు వస్త్రాపహరణం చెయ్యడం, దెబ్బలాడుకోడం చూస్తున్నాం, వింటున్నాం... వారి ఉపన్యాసాలలో గాని, చర్యల్లోగాని యేమైనా ఆలోచన కనబడుతున్నదా? మన సమాజంలో చోటుచేసు కొనేందుకు అరాజకత్వం, దౌర్జన్యం, విశృంఖలతే కారణం... చను

స్వార్ధపరుణ్ణి కాదు. నాకు మీరందరూ కావల్సిన వాళ్ళే. మన గ్రామమంతా సంతోషించాలి. మనందరం సంతోషించాలి.., కాబట్టి బాలరాజుగారు, గంగరాజుగారు ఆ వేషాలు వేస్తే నేను చాలా సంతోషిస్తాను. మిగిలిన అందరూ గూడా సంతోషిస్తారు" అన్నాను.

"వాళ్ళు వెయ్యాల్సిందేనని పట్టుబట్టారు. మిగిలినవాళ్ళు. "ఇంతకూ అసలు వేషం అర్జునుడు ఎవరు వేస్తారు?" అన్నాడు చంగల్రాయలు.

"ఇదీ ఊరి వాళ్ళతోనే చేద్దాం. అన్ని వేషాలు వాళ్ళచేతనే వేయిద్దాం. మీరు నాకు సహాయంగా ఉండండి" అన్నాడు.

"అసలు విషయం తేల్చండి, ఇంతకూ అర్జును డెవరు?" అన్నాడు చంగల్రాయలు. నేను చుట్టూ చూచాను. అక్కడ చేరిన వాళ్ళలో కాస్త కనుముక్కు తీరు చక్కగా ఉన్నతన్ని చూపిస్తూ "అతనిచేత వేయిద్దాం. నీ పేరేమిటయ్యా" అన్నాను. అతను సిగ్గుతో ముడుచుకుపోతూ "వెంకట్రాయలు" అన్నాడు.

"నిన్ను నే నెప్పుడూ చూడలేదయ్యా! నువ్వు వెయ్యి అర్జునుడు వేషం" అన్నాను. అతన్ని చూస్తూ.

సరేనంటూ తల ఊపాడతను.

"పట్టాల్సినవాడినే పట్టావులే" అన్నాడు గంగరాజు.

“యేం ఏంటి విశేషం?” అన్నాను.

“వాడు ఈ ఊళ్ళోకల్లా మోతుబరి కొడుకు, ఖర్చుగూడా వెనకాడడులే” అన్నాడాయన. “కొత్త పెళ్లికొడుకు గూడాలే” అన్నాడు నరసరాజు.

“సంవత్సరం దాటతావుంటే ఇంకా యేం కొత్తలే మావా" అన్నాడు జనంలోంచి ఒకడు. తరువాత తెలిసింది నాకు వెంకట్రాయలు తాగు బోతుల సంఘంలో సభ్యుడని. భార్యను సక్రమంగా చూచుకోడని. అతన్ని

ఎలాగైనా నా ప్రభావానికి లోనయ్యేట్లుగా చేసుకొని అతనిలో పరివర్తన వచ్చే లాగా చేస్తే బాగుంటుందనుకున్నాను.

అదృష్టం కొద్దీ 'గయోపాఖ్యానం' నాటకం పుస్తకం స్కూలు లైబ్రరీలోనే ఉంది. అందులో తీసేసిన భాగాలు గుర్తుపెట్టి మీ మీ పోర్షన్లు రాసుకోండని, పుస్తకం ముందుగా కృష్ణుడి వేషానికి ఎన్నిక చేసి నతని చేతిలో పెట్టాను. అతనెవరో కాదు. మా ఇంటి ఓనరు నరసరాజు కొడుకే. తన కొడుక్కు మంచి వేషం దొరికినందుకు ఉబ్బిపోయాడు తండ్రి. "ముందుగా నువ్వు నీ పోర్షను రాసుకొని తరువాత వాళ్ళకివ్వు. వారం పది రోజుల్లో మీరందరూ రాసుకునే పని పూర్తి కావాలి" అని అతనితో చెప్పాను.

నాటకం రిహార్సల్సు ప్రారంభమైతే రాత్రి పది పదకొండుదాకా ఊరు సందడిగా ఉంటుంది. ఊరి జనానికి ఇది అయిపోయిందాకా ఇదో ముఖ్యకార్యక్రమమవుతుంది. నాలో నేననుకొని నవ్వుకున్నాను.

వెంకట్రాయలు అర్జునుడి వేషం వెయ్యడానికి ఒప్పుకుంటాడనుకోలేదు: ఏధ్యాసలో ఉన్నాడో టక్కుమని ఒప్పుకున్నాడు అడిగిందే తడవుగా:

ఊళ్ళోని పన్నేండేళ్ళ పిల్లవాడి మొదలు డెబ్బయి అయిదేళ్ళ వృద్ధుడిదాకా నాటకంలో పాత్రధారణ చేస్తున్నారు. అందరూ రంగస్థలానికి కొత్తవారే: మొదట వాళ్ళకు ధైర్యం చెప్పాలి. పద్యాలు పాడడం, వచనం చెప్పటం నేర్పించాలి. నటన నేర్పించాలి. నాటకం బాగుంటుందో, బాగుండదో అన్న అనుమానం నాకు రాలేదు. ఉత్సాహంగా పది మంది కలిసి చేసిన ప్రయోజనకరమైన పని ఏదైనా బాగుంటుందనే నా నమ్మకం. నాటకం వేసేవాళ్ళు, చూసేవాళ్ళు ఊరిమనుషులే. వాళ్ళు ప్రతి రోజూ క్రమం తప్పకుండా రిహార్సల్సుకు వస్తారు. ఎవరేరకంగా నటిస్తారో రోజూ చూస్తూనే ఉంటారు. నాటకం రోజున ఈ మనుషుల్నే రంగుల్లో చూస్తారు. అంతకంటే యేమీ ఉండదు. బహుశా వేసేవాళ్ళకంటె చూచేవాళ్ళకే నాటకం ఎక్కువ కంఠస్థ మవుతుంద నుకుంటాను ఆ రోజుకు!

19

ట్రెస్సులు, పర్లింగులు తయారైనాయి. వాటిని గోడలమీది కెక్కించడం, సరిగా సరి పోతాయో, లేదో చూడడం వగైరా పనులన్నీ పూర్తయినాయి. ఇక రేకులు తెచ్చి బిగించడమే తరువాయి. గోడలకు సిమెంటు, ఫ్లోరింగు నిదానంగా చేయించుకోవచ్చు ననుకున్నాము. కుంటిదో, గుడ్డిదో వసతంటూ ఒకటి ఏర్పడాలి ముందు. గుడిశలోంచి స్కూలు దాంట్లోకి మారాలి. అది హైస్కూలు కావాలి.

ఇవన్నీ జరిగితే-నే నిక్కడ ఉండే వీలుండదు. మరో హెడ్మాస్టరు వస్తాడు.

ఉండకపోతే ఏం? ఈ స్కూలు, దీంతోపాటు ఈ ఊరు, ఈ ఊరి భవిష్యత్తు బాగుండాలి. మంచికోసం పాకులాడుతున్న నాకు కూడా మంచే జరుగుతుంది. ఇంత మంచి మనుషుల్ని వదలిపోవటం కష్టంగానే ఉంటుంది. కాని తప్పదు. నేను మరో ఊరికిపోతాను. అది ఈ ఊరి కంటే మంచిదే కావచ్చును.

అయినా ఈ మనుషులు ఎల్లకాలమూ నా మీద ఇలాంటి అభిమానమే చూపుతారని నమ్మకమేమున్నది? ఫెమిలియారిటీ బ్రీడ్స్ కంటెంప్ట్ అన్నారు.

ఈ అభిమానం, ఈ గౌరవభావం ఈ మనుషుల్లో ఇలాగే నిలిచిపోవాలంటే బహుశా

నేనిక్కడ మరింతకాలం ఉండకూడదేమో: ఇది పూర్తి స్థాయి హైస్కూలయితే ఇక్కడి నా పని పూర్తవుతుంది. మరో అనుభవజ్ఞుడైన ప్రధానోపాధ్యాయుడు వస్తాడు అతని నేతృత్వంలో మరింత అభివృద్ధి చెందుతుంది స్కూలు.

గంగరాజు, నేను, ప్రెసిడెంటుగారి ఇంటికెళ్ళాము - ఇకముందు జరగాల్సిన కార్య క్రమం గురించి ఆలోచించేందుకు. ఆయన ఇంట్లోనే ఉన్నాడు. సాదరంగా లోపలికి ఆహ్వానించాడు. విషయం కదిలించాడు గంగరాజు.

“వసూలైన డబ్బంతా కర్చుజేశాను ఇక నా దగ్గిరేం లేదు" అన్నాడు ప్రెసిడెంటు.

"ఆమాట ఇప్పటికి పదిసార్లు చెప్పావురా: ఇది పదకొండోసారి. 'లేదు, లేదు' అని జపం చేస్తూ కూచుంటే ఏమైనా వస్తుందిట్రా? ఇప్పుడు నీ దగ్గరి కొచ్చింది నిన్ను డబ్బిమ్మని అడగడానికి కాదురా. రేకులు తీసుకురావడం ఎట్లాగో చెప్పు. ఆ గోడలు మూతపడకుండా అట్లాగే ఉంటే కూలిపోతాయి" అన్నాడు గంగరాజు.

“చెప్పేందుకేముంది? జనాన్ని తలా ఇంత ఇమ్మని అడగాల్సిందే. స్కూలు కొచ్చే పిల్లల లిస్టు రాసుకొని వాళ్ళ అమ్మ నాన్నల్ని పిలిపించి విషయం చెబుదాం. కనీసం ఏడెనిమిది వేలన్నా కావాలి" అన్నాడు. నా వంకకు తిరిగి - "మన స్కూల్లో ఎంతమంది పిల్లలున్నారండీ?" అన్నాడు.

"డెబ్బయ్యారుమంది ఉన్నారు” అన్నాను.

"అయితే యింకేం? వాళ్ళందర్నీ స్కూలుకాడికి రమ్మని చెప్పి పంపండి. తలా ఒక వంద ఇమ్మందాం” అన్నాడు.

“ఇట్లా చేస్తే నాలుగేళ్ళయినా మనం రేకులుకొనలేము" అన్నాను నవ్వుతూ.

"ఏం? ఎందుకు?” అన్నాడు ప్రెసిడెంటు.

“మనం పిలవంగానే వాళ్ళు వస్తారా? వచ్చినా అడిగిందే తడవుగా ఇస్తారా? పైగా కొందరికి ఇద్దరేసి పిల్ల లుండవచ్చు. ఇలా చేస్తే వసూలు చెయ్యటం మనవల్లగాదు. పైగా పిల్లల్ని బడికి పంపుతున్నందుకు మాకు ఇది శిక్షా?' అని అంటే యేం చెబుతాం?" అన్నాను.

“యేం జెయ్యాలో చెప్పరాదూ: ఈ నాన్పుడెందుకు?" అన్నాడు గంగరాజు విసుగ్గా.

"రాత్రికి ఊరి పెద్ద లందర్నీ సమావేశపరుద్దాం" అన్నాను.

“ఈ ఊరికంతకీ వీడే పెద్ద ఇంకా ఊరిపెద్ద లెవరున్నారు?” అన్నాడు గంగరాజు నవ్వుతూ.

"ఇంటి పెద్దల్లే: ఒక్కో ఇంటి యజమానిని" అన్నాను నేను నవ్వుతూ.

అట్లాగే చెద్దాంలెండి. ఊళ్ళో సాటింపు వేయిద్దాం సాయంకాలం ఏడు గంటలకు ఊళ్ళో ఉన్న పెద్దమనుషులందరూ భజనమందిరం కాడ సమావేశం కావాలని" అన్నాడు ప్రెసిడెంటు.

ఊళ్ళో చాటింపు వేయించాడు ప్రెసిడెంటు. అందరూ చేరేసరికి రాత్రి ఎనిమిదయింది. కొంతమంది రాలేదు. అటువంటి వాళ్ళను గంగరాజు మరి కొందరు పోయి లాక్కొచ్చి కూచోబెట్టారు.

అందరూ కూచున్న తరువాత వాళ్ళందర్నీ ఎందుకు సమావేశపరిచామో చెప్పమని శ్రీనివాసుల్ని అడిగాను.

ఓ అరగంటసేపు శ్రీనివాసులు ఇప్పటికి జరిగిన పనిని గురించిచెప్పాడు. ఇకముందు జరగాల్సి ఉన్న పని గురించి చెప్పాడు. అంతా అయిం తరువాత నన్ను చూశాడు. చెప్పిందంతా బాగుందని సైగలద్వారా అతనికి తెలియజేశాను.

తరువాత ప్రెసిడెంటు అంతకుముందు వసూలైన డబ్బెంతో చెప్పాడు. వసూలైన డబ్బంతా ఖర్చయింది. మిగిలిన పని జరగాలంటే తిరిగి వసూలు జెయ్యాల్సిందే అన్నాడు.

"మొత్తం ఏడెనిమిది వేలన్నా గావాలి” అన్నాడు గంగరాజు.

“అంతా మన నెత్తినే ఎందుకేసుకోవాలి? కోసలనగరం, పాతార్కాడు, విజయపురం, ఇంకా శానా ఊళ్ల నించి పిల్ల లొత్తా ఉండారుగా? ఆడగూడా వొసూలు జెయ్యండి" అన్నారు జనంలోంచి ఒకరు.

“అవసరమైతే ఆల్లనూ అడుగుదాం. స్కూలున్నది మనూల్లో, అన్నింటికీ మనూరు ముందుండాలి” అన్నాడు ప్రెసిడెంటు.

“ఆ పిల్లోలు మాత్తరం రాటంలా? ఆల్లనెందు కడగ్గూడదంట?" అన్నారు ఇంకోరు. “అన్ని ఊళ్ళ నుంచీ మన స్కూలుకు పిల్లలు రావాలి. మన స్కూలు పెద్దది కావాలి.

స్కూలు పెద్దదయినందువల్ల లాభం మన ఊరికే కదా: ఇంటి అద్దెలు పెంచుకోవచ్చు. పాలమ్ముకోవచ్చు. కూరగాయలు, పిల్లలు తినే మిఠాయిలు, పుస్తకాలు, కలాలు, పెన్సిళ్ళు అమ్మవచ్చు. లాభాలు సంపాదించుకోవచ్చు. స్కూలు వల్ల హెచ్చు లాభాలు మీకే. కాబట్టి అన్నిటికీ మీరే ముందుండాలి" అన్నాన్నేను. "మీరు మీ దుబారా ఖర్చులు కాస్త తగ్గించుకుంటే తేలిగ్గానే ఇవ్వవచ్చును."

దుబారా ఖర్చు అని నేను దేన్నన్నానో వాళ్ళలో చాలామందికి అర్థమైంది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

“ఇంటికో నూరిస్తే మన పని తేలిగ్గా అవుతుందిరా. నూరుకు తగ్గకుండా ఎంతయినా సరే మన హెడ్మాస్టరు దగ్గర వారంలోగా చేర్చెయ్యండి. తరువాత పోయి రేకులు వేసుకొస్తాము" అన్నాడు గంగారాజు సీరియస్ గా ముఖం పెట్టి, గడ్డం దువ్వుకుంటూ.

సమావేశం ముగిసేసరికి రాత్రి పది గంటలైంది.

మర్నాడు ఉదయం నేను స్కూలుకు బయలుదేరబోతున్నంతలో నరసరాజు, నరసమ్మ నా రూము దగ్గరికి వచ్చి చెరో వంద నా చేతిలో పెట్టారు.

“మీరు మరో యాభై అయినా ఎక్కువిస్తే బాగుండేది. ఆయనా, మీరూ ఒకే మాదిరి ఇవ్వటం బాగాలేదు" అన్నాను నేను నరసమ్మను చూచి నవ్వుతూ.

"ఏం : ఎందుకియ్యాలసారూ? నా కూతురుందనా?” అన్నది సిగ్గుపడుతూ.

“ఎందుకైనా అనుకోండి” అన్నాను.

“ఇది సాల్లే సారూ:” అంటూ వెళ్ళిపోయింది.

వారం తిరక్కుండానే ఎనిమిది వేల నాలుగొందలు వసూలయింది. పక్క ఊళ్ళ వాళ్ళను కూడా కొందర్ని పిలిపించి డబ్బిమ్మని అడిగాను, విషయం వివరించి చెప్పి. కొందరు సంతోషంగానే ఇచ్చారు. వాళ్ళిచ్చిన డబ్బులు సక్రమంగా ఖర్చు చేసి ఫలితాలు సాధిస్తుంటే మళ్ళీ అడిగినప్పుడు ఇచ్చేందుకు బాధపడరు మనుషులు. ఇది ఈ మనుషులతో నా అనుభవం.

ప్రెసిడెంటును, గంగరాజును స్కూలు దగ్గరికి పిలిపించి వసూలయిన డబ్బు మొత్తం వాళ్ళ చేతుల్లో పెట్టాను. ఇచ్చిన వాళ్ళ పేర్ల జాబితా కూడా వాళ్ళకిచ్చాను. వాళ్ళు డబ్బు తీసుకొని జాబితా నా దగ్గరే వదిలేశారు.

రేకులు తెచ్చేందుకు ప్రెసిడెంటు, గంగరాజు మద్రాసు వెళ్ళారు. నాలుగు రోజులు దాటిపోయినా వాళ్ళు రేకులతో తిరిగి రాలేదు. అందరూ తలోరకంగా అనుకోవటం మొదలుపెట్టారు.

మా ఇంటి యజమాని పనిగట్టుకొని వచ్చి కూచున్నాడు. నరసరాజు ఊళ్ళో పరమలుబ్ధుడని పేరెన్నిక గన్నవాడు. ఆయన వందరూపాయలు అవలీలగా ఇచ్చాడు. అందుక్కారణం తన కొడుక్కు నాటకంలో ప్రముఖపాత్ర లభించినందువల్ల కావచ్చు. నేను తన ఇంటిలో ఉండటం కావచ్చును. లేదా నిజంగానే అవసరం ఆయన్ను ప్రేరేపించి ఉండవచ్చును.

తలుపు దగ్గర స్టూలు మీద కూచుని అన్నాడు. “నువ్వు పోక ఆల్లనెందుకు పంపించావు? ఇద్దరూ ఇద్దరే: తాగి యే మూల పడుండారో:

“నేనుపోతే స్కూలు డ్యూటీ ఎవరు చేస్తారు? పైగా మీ ఊరు పని మీరు చేసుకోవాలి గాని నే నెందుకు చెయ్యాలి?" అన్నాను.

"ఆల్ల నెట్టా నమ్మావయ్యా నువ్వు? అన్నాడాయన.

"ఏం. ఎందుకు నమ్మకూడదూ?"

"ఆల్ల సంగతి నీకేం తెల్సు. డబ్బు దొరికితే సాలు. తాగితందనా లాడతారు." "ఊళ్ళో అందరూ తాగేవాళ్ళేనట. ఇక ఎవర్ని నమ్మేది?"

"అందరూ తాగే వాల్లేనంటావా ఎవురయ్యా నీకు సెప్పింది? ఊళ్ళో అందరూ తాగేవాళ్ళే అయితే ఊరిట్టా ఉంటుందా? గిట్టనో డెవుడో నీకు జెప్పాడు" అన్నాడాయన కోపంగా. "మీ ఊరి సంగతులు నాకేం తెలుస్తాయండీ: ఎవరన్నా చెబితే వింటమేగా:" అన్నాన్నేను.

"ఆ సెప్పినో డెవుడో తాగుబోతే అయ్యుంటాడు."

"కాదు. పాపం. అతను మంచివాడే."

"ఇప్పుడు జూడు. డబ్బంతా ఆల్ల సేతుల్లో బెడితివి. నిన్ను జూసి ఇచ్చాంగాని వాల్లడిగితే పైసాగూడా యిచ్చుండం."

"ఇప్పుడేమైందని మీరు బాధపడుతున్నారు?"

"ఇంకా యేం గావాలయ్యా? ఊరోల్లు డబ్బుతో ఆల్లు తాగితందనా లాడతా ఉండారు: నువ్వన్నా బోయి రా మద్రాసు."

"ఇప్పుడు చంపారు నన్ను. నేనెక్కడని తిరిగి వాళ్ళను పట్టుకునేది. నాకు అరవం బొత్తిగా రాదు" అన్నాను.

"అయితే అనుబగించు. ఆల్లు రారు. జనం నిన్నొద్రలు" అన్నాడాయన సీరియస్గానే. "మీరు మరీ నన్ను హడలగొట్టేస్తున్నారు. మన మనుషుల్ని మనమే నమ్మకపోతే ఎలా?" అన్నాను. నాకు నిజంగానే లోలోపల భయంగా ఉంది. మేకపోతు గాంభీర్యంతో మాట్లాడుతున్నానంతే. ఇలా నలుగురు ముసురుకుంటే చాలు నా కథ సమాప్తమౌతుంది.

"ఆల్లతో బాటు నువ్వుపోంది శానా తప్పు. ఆ దగుల్బాజీలు ఏం జేస్తున్నారో యేవో:" నిట్టూర్చాడు ముసలాయన.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర కూడా పట్టలేదు. ఉదయం స్కూలుకు పోయే ముందు నరసమ్మ వచ్చింది. ఆవిడ గూడా ముసలాయన ధోరణిలోనే మాట్లాడుతుందేమో అని హడలిపోయాను.

కాని ఆమె-“ముసలాయన మాటలకేం సారూ! నరసిమావ ఎప్పుడూ అంతే. రాక యాడికి బోతారు? ఈడ ఇల్లూ, బూవులూ ఉండ్లా?" అంటూ నాకు ధైర్యం చెప్పి నవ్వింది. "మీకున్నపాటి నిగ్రహం ఆయనకు లేదు చూడండి. నన్ను మహాభయపెడు తున్నాడు” అంటూ నేను స్కూలుకు నడిచాను.

స్కూల్లో టీచర్లు కూడా ఈ విషయంగానే మాట్లాడారు. పోయిన ఇద్దరు మనుషుల గురించి అనేక కథలు చెప్పారు. వాళ్ళు చెప్పిందంతా వినడం తప్ప నేనేమీ మాట్లాడలేదు.

సాయంత్రందాకా ఎదురు జూసి రూము కొచ్చాను. రూములో మనుషులు పల్చబడి పోయారు. మునసామి, చంగయ్యశర్మ ఎక్కువగా లీవులు పెడుతున్నారు. సత్యం ఉదయం పోతే సాయంత్రం ఏడుకో, ఎనిమిదికోగాని తిరిగిరాడు. ఇప్పుడు ఓబుల్రాజే తరుచుగా వంటచేస్తున్నాడు.

సాయంత్రం ఆరున్నరకు ఓబుల్రాజు రొప్పుతూ రోజుతూ పరిగెత్తుకొచ్చాడు. ఏం కొంప మునిగిందో ననుకున్నాను. వినకూడని దుర్వార్త వింటానే మోనని భయపడ్డాను. ఓబుల్ రాజు "రేకులొచ్చేసినయ్ సార్:" అంటూ విషయం చెప్పాడు.

పట్టరాని సంతోషంతో నేను స్కూలుకు వడివడిగా వెళ్ళాను. లారీలో నుంచి రేకులు జాగ్రత్తగా దించుతున్నారు. "ఇసురుగా దించమాకండి. రేకులు పగిలిపోతాయ్: పెంట్లూ, పోతులూ జాగర్తగా దించండి" అని అరుస్తున్నాడు గంగరాజు.

వాళ్ళ గుడ్డలు బాగా మాసిపోయాయి. ముఖాలు పీక్కుపోయి ఉన్నాయి. ఇద్దరూ బాగా అలసిపోయారు. బక్కచిక్కిన స్వరాలతో మద్రాసులో రేకులమ్మే వాళ్ళను, వాళ్ళ దగ్గర పనిచేసే కూలివాళ్ళను బండబూతులు తిడుతున్నారు.

నేను వాళ్ళ దగ్గరికి పోయి - పెంట్లూ, పోతులూ యేంటి?" అన్నాను నవ్వుతూ.

"ఎన్నుగాడికి కప్పే వాటిని అట్లా అంటారట, కిందవేసే రేకును పెంటి అని, పైన వేసే దాన్ని పోతు అని అంటారట. ఆ దొంగనా... లు చెప్పారు" అన్నాడు గంగరాజు.

"ఇన్ని రోజులు పట్టిందేం?" అన్నాను.

"వాడు డబ్బు దీసుకున్నాడు గాని డెలివరీ ఇవ్వలేదు. వాడి దగ్గర నిలవ లేవట రేకులు. వాడికొచ్చిం తరువాత లారీ కుదుర్చుకొని కూలీలను మాట్లాడుకుని వచ్చేసరికి ఇన్ని రోజులు పట్టింది. మధ్యలో నేను చచ్చి సున్నమైనాననుకో." అన్నాడు గంగరాజు. "అది మద్రాసయ్యా బాబు:"

ఎలాగో కష్టపడి రేకులు తెచ్చినందుకు ప్రెసిడెంటు, గంగరాజు లిద్దర్నీ అభినందించాను. ఊరి మనుషులు, నరసరాజు అన్న మాటలు వాళ్ళకు చెప్పలేదు.

అందరం ఊళ్ళో కొచ్చాము. నరసరాజును, నరసమ్మను పిలిచి చెప్పాను "రేకులు తెచ్చేశా"రని కనిపించిన ప్రతి మనిషికీ చెప్పాను, ప్రెసిడెంటు, గంగరాజు చాలా కష్టపడి రేకులు తెచ్చేశారని.

ఆ రాత్రి చన్నీళ్ళతోనే తలస్నానం చేసి హాయిగా నిద్ర బోయాను.

20

రేకులు బిగించే పని రెండు రోజుల్లో పూర్తయింది. స్కూలుకు కొత్త భవనం అసమగ్రంగానే అయినా పూర్తయింది. ఇంకా ఫ్లోరింగు, గోడలకు సిమెంటు చేయించాలి.

స్కూలు టైములో పిల్లలచేత స్కూలు ఆవరణలో ఉన్న ముళ్ళ చెట్లన్నింటినీ కొట్టి వేయించాము. చాలా ఉత్సాహంతో పనిచేశారు పిల్లలు, వేళ్ళతో సహా పెకిలించి పారేశారు.

స్కూలు గార్డెనుకు లే అవుట్ ప్లాన్ తయారు చేసుకున్నాము. ఇటుకలు నాటించి వాటి మధ్యలో మన్ను పోయించి రకరకాల పూలమొక్కలు, క్రోటన్ మొక్కలు నాటించాము. గ్లైడోసీడియా మొక్కలు సంపాదించి ఎదురెదురుగా రెండు వరసలు నాటాము. చెరువులో నుంచి రోజూ నీళ్ళు తెచ్చి పోస్తున్నాము. మొక్కలు ఏపుగా పెరుగు తున్నాయి. స్కూలు ఇప్పుడు చూసేందుకు ఆకర్షణీయంగా ఉంది.

స్కూలు పనులతో నేను తీరికగా లేని రోజుల్లో ఒక రోజు కృష్ణవేషధారి కనిపించాడు. "ఏమయ్యా శ్రీ కృష్ణుడా: అప్పుడేమో నాటకం, నాటకం అని ప్రాణం తీశారు. తీరా అన్నీ చేసిం తరువాత అసలు కనిపించడమే మానుకున్నారు. పోర్షన్లు అందరూ రాసుకున్నారా?" అడిగాను.

"అందరూ రాసుకున్నట్టే"సార్: నాకే భయంగా ఉంది. ఇంత పెద్ద పోర్షను నాకు వస్తుందా అని. చాలా ఎక్కువగా ఉంది సార్: కొంత తగ్గించనన్నా తగ్గించండి. లేకపోతే ఇది వేరేవాళ్ళకిచ్చి నాకువేరే చిన్న పోర్షను ఏదైనా ఇవ్వండి" అంటూ మొదలు పెట్టాడు.

"ఇప్పటికే చాలా తగ్గించేశానయ్యా: ఇంకా తగ్గిస్తే అసలు అర్థం పర్థం ఉండదు నాటకానికి. అతుకుల బొంతవుతుంది. పైగా ఆ వేషానికి నువ్వయితేనే సరిపోతావు. కష్టమో, సుఖమో నువ్వే వెయ్యాలి ఆ వేషం" అన్నాను.

తల గీరుకుంటూ "సరే సార్:" అన్నాడు.

"ఇంతకూ నువ్వు రాసుకున్నావా అంతా?" అడిగాను.

"అంతా రాసుకున్నాను సార్: కొద్ది కొద్దిగా నేర్చుకున్నాను కూడా: ఆ మాటలు నోరు తిరిగి చావటంలేదు" అన్నాడు.

"రిహార్సల్సులో అన్నీ వస్తాయిలే, భయపడొద్దు. నేను నేర్పిస్తానుగా. వెంకట్రాయలు ఏమంటున్నాడు?" అన్నాను.

“ఏమంటాడు: దిగులుపడి కూచున్నాడు. ఇంత వేషం నావల్ల కాదంటున్నాడు. వాడట్లా ఉంటే బాలరాజు తాత 'ఈ వయసులో నేను నాటకం యెయ్యటవేందిరా' అంటున్నాడు. మీరు అందర్నీ పిలిపించి మాట్లాడితే గాని పని జరిగేట్లు లేదు" అన్నాడతను.

మా మాటలన్నీ గోడ అవతల నుంచి విన్నట్లు నరసమ్మ- 'మీరు మొదలుబెట్టండి సారూ: అందరి రోగాలూ కుదురుకుంటాయి. మొదట మొదట అట్లాగే అంటా ఉంటారు. ఉట్టి పిరికిసన్నాసులు" అన్నది గోడ అవతలినుంచే.

“నీకేం. నువ్వు ఎన్నయినా చెబుతావులే. మోసేవోడిగ్గదా బరువు తెలిసేది:" అన్నాడతను.

"ఒక్క యేసం యేసేందుకు నీ కంత కట్టంగా ఉండదే. అన్ని యేసాలు జెప్పించాలంటే ఆయన కెంత కష్టమో ఆలోసించావంటరా? అన్నది నరసమ్మ.

“ఆయనకేం. అన్నీ వొచ్చు. సులువుగానే అన్నీ నేర్పిత్తాడు. మాకేమన్నా ముందనుభవం ఉందాయేంటి?" అన్నాడతను.

“దిగితే గదయ్యా లోతు తెలిసేది: ఒడ్డుమీద నుంచొని అంచనాలు వేసుకుంటే ఏం లాభం?” అన్నాను నవ్వుతూ. “సాయంత్రం పుస్తకం తీసుకొని అందరూ చేరండి.”

“నేను చెప్పినట్లు ఆ రోజు సాయంత్రం భజన మందిరం దగ్గర ఎవరూ చేరలేదు. అందరి ఉత్సాహం నీరుగారిపోయిందనుకున్నాను. ఆ విషయం గా నేనేమీ ఆలోచించ లేదు. మామూలుగా భోంచేసి సత్యంతో మాట్లాడుతూ పడుకున్నాను. ఇంతలో గంగరాజు రూములో కొచ్చాడు. “భజన మందిరం దగ్గర అందరూ చేరారు. వాళ్ళను రమ్మని చెప్పి నువ్విక్కడ పడుకుంటే ఎట్లా? లేలే పోదాం" అంటూ తొందర పెట్టాడు.

నేను తొందరపడలేదు. మరో పదిహేను నిముషాలు ఆయన్ను రూములోనే కూచోబెట్టాను. "ఇంతకూ మీరు మీ పోర్షను రాసుకున్నారా: ఏమైనా కంఠస్థం చేశారా" అన్నాను.

"మా వాడిచేత రాయించుకున్నాను. రెండు మూడుసార్లు అంతా చదివాను. అంతా అగమ్యగోచరంగా ఉంది. నువ్వు పద పోదాం. మరీ ఆలస్యమైపోతే వాళ్ళు వెళ్ళిపోతారు'' అన్నాడు.

"పోతే పోనీండి, కాసేపు కూచునేందుకు ఓపిక లేనివాళ్ళు నాటకం ఏం వేస్తారు?" అన్నాను.

"వాళ్ళకు దాని రుచి చూపించాలయ్యా: రుచితగిల్తే ఇక వాళ్ళు వొదిలి పెట్టరు. మనం యేమీ చెయ్యకుండానే వాళ్ళను నిష్ఠురపెడితే ఎట్లా?" అన్నాడు గంగరాజు.

"మనం చూపిస్తే గాని తెలీదా రుచి: వాళ్ళేం చిన్నపిల్లలు కారు" అన్నాను.

"వాళ్ళకు తెలిసిన రుచులు వేరే ఉన్నాయిలే. అదెందుకు గాని పోదాం పద."

"ఆ రుచులు మీకు కూడా బాగా తెలుసునటగదా:" అన్నాను నవ్వుతూ.

నే నన్నది ఏ రుచు లనుకున్నావేంటి?" అన్నాడు గంగరాజు అదోలా ముఖం పెట్టి. "అవే కల్లు, సారాయి, గంజాయి దమ్ములు: మీకు బాగా అలవాటన్నారు" ఆయన కళ్ళలోకి చూస్తూ అన్నాను.

"నీకు అన్నీ తెలుసు నన్నమాట:"

"పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతుంటే ఇక ఎవరూ చూడకుండా ఉంటారా, చెప్పకుండా ఉంటారా?"

"ఇంతకు ముందు శానా ఎక్కువగా ఉండిన మాట నిజమే: నీతో జేరిం తరువాత చాలా తగ్గించేశాను. ఇంతకుముందు ఎప్పుడూ నిషాలోనే

ఉండేవాడిని... నా దగ్గర ఎప్పుడైనా సారా కంపుకొట్టిందా నీకు? పనీపాటా లేనప్పుడే అవన్నీ ఎక్కువయ్యేది. ఇప్పుడు నీ ధర్మాన ఊపిరాడకుండా పని తగులుతున్నది. నీతో ఇంత చనువుగా మాట్లాడుతున్నా. నువ్వంటే భయమే నాకు. నువ్వు వచ్చావు. మాకు, మా ఊరికి కొత్త ప్రాణం వచ్చిందయ్యా:

"నువ్వు అర్జునుడి వేషం ఇచ్చావే వెంకట్రాయలు, వాడు కలిగిన బిడ్డే. తాగుడుకు వంద లొందలు తగలేసేవాడు. పెళ్ళాన్ని కూడా సరిగా యేలుకొనేవాడు గాదు. ఇంట్లో ఉండేవాడు గాదు. అట్లాంటివాడిప్పుడు ఇల్లు వదలకుండా పోర్షను నేర్చు కుంటున్నాడు. ఆ పిల్లది ఎంత సంతోషపడు తున్నదో నీకు తెలీదు. మా బాబ్రాజు అప్పు డప్పుడు మాతో చేరేవాడు. అదంటేనే అసహ్యం పుట్టింది వాడికి. నీ నుంచి ఊళ్ళోశానా మంది బాగుపడుతున్నారు. మామూలు రోజుల్లో అయితే ఎనిమిది వేలు చేతికి చిక్కితే ఎంత మజా చేసేవాడినో, నీకు సంవత్సరం తిరిగినా కనిపించేవాణ్ణి గాదు. ఎంత భయం లేకపోతే అంత కష్టపడి రేకులు వేసుకొచ్చాననుకున్నావు: మా నరిసికి తాగుబోతులంటే పరమ అసహ్యం. ఇదంతా జూసే అది నాటకం నాటకం సారూ- అని అల్లాడుతున్నది. ఈ కథలకేంలే. నువ్వులే పోదం" అంటూ లేచాడాయన.

"అసలు దాని జోలికి పోనని మాట ఇస్తే బయలుదేరుతా:" అన్నాను.

"నువ్వు చెప్పాల్సిన అవసరం లేకుండానే ఆపని జేస్తున్నాంగా: ఇంతకు ముందున్నట్లు లేన్నేను. నా కొడుకు నడుగు చెబుతాడు. నేనెంత మారిపోయానో: మనలో మాట నువ్వంటే ప్రెసిడెంటుగ్గూడా భయమే" అన్నాడు నా మీదకి వంగి.

"నన్ను మునగచెట్టు ఎక్కిస్తున్నారు. మీరు కిందికి తొయ్యాల్సిన పని లేదు" అన్నాను నవ్వుతూ.

"ఆ డాల్లంతా కూసోనుంటే నువ్వీడ బాతాకానీ యేసుకున్నావా నీతో ఎప్పుడూ ఉన్నదేగా" అంటూ వచ్చాడు నరసరాజు.

“మా నరిసిగాడు పరమ లోభ. మురిక్కాలువలో పైసా పడితే నాలుకతో అయినా సరే బయటికి తీస్తాడు. వాడి దగ్గర అయిదు రూపాయలు వసూలు జెయ్యాలంటే ఎవడబ్బ తరమూ గాదు. వాడు అందరి కంటే ముందు నీకు వంద రూపాయ లిచ్చాడంటే...

“నిన్ను జూసి కాదులే:” మధ్యలోనే అడ్డొచ్చాడు నరసరాజు. "నీ బోటోడికి సందాలిత్తే నెత్తిన గుడ్డేసుకుపోవాల్సిందే. పద పద. పద సార్:" అంటూ తొందరపెట్టాడు నన్ను.

ఆలస్యం చేస్తే అందరూ ఒక్కొక్కరుగా ఇక్కడికి వచ్చేట్లున్నారు: మంచం మీదనుంచి లేచి చొక్కా తొడుక్కొని వాళ్ళతో వెళ్ళాను, సత్యం కూడా వచ్చాడు మాతో.

భజన మందిరం దగ్గర పాత్రధారులతోబాటు ప్రేక్షకులు కూడా ఉన్నారు. చేసేవాళ్ళ కంటే చూసేవాళ్ళు ఎక్కువగా ఉన్నారు. భజన మందిరంలో నా మామూలు చోట్లోకి పోయి చూసే జనానందర్నీ దూరంగా కూచో బెట్టాను నటులనుండి వేరుజేసి.

“పరాబ్రహ్మ పరమేశ్వర” అంటూ ప్రార్ధన పాడారు. నటులందరూ గుంపుగా నుంచొని. ప్రార్ధన అయిం తరువాత ముఖ్యపాత్రదారు లందర్నీ తలా ఒక పద్యం పాడ మన్నాను. రాగాలు తీస్తూ ఎవరి శక్తికొద్దీ వాళ్ళు పద్యాలు పాడారు. వాళ్ళ ఉత్సాహం సంతృప్తికరంగానే ఉంది.

“బాలరాజుగారూ: మీరెంతవరకు వచ్చారు?" అన్నాను.

“నాది చిన్న యేసమేగా నువ్వు చెబుతుంటే నేరుసుకుంటాలే" అన్నాడు.

ప్రెసిడెంటు తప్పించి ఇప్పుడు ఊళ్ళో ఉన్న నాకంటే పెద్దవాళ్ళందరూ నన్ను ఏక వచనంతోనే సంబోధిస్తున్నారు. నాకూ అలవాటై పోయింది. విశేషమేమంటే ఆ ఊళ్ళో నూటికి తొంభైమందికి పైగానే మనుషులకు చదవడం, రాయడం వచ్చును. అక్కడ పనిచేసిన ప్రాథమిక ఉపాధ్యాయులు

అభినందనీయులు. వారా మారుమూల పల్లెలో చాలా శ్రద్ధగా చదువులు నేర్పి ఉంటారు. పెద్ద చదువులు చదివి పట్నాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారెవరూ లేరు నాకు తెలిసినంతలో ఆ ఊళ్ళో.

"రేపు మొదటి సీనుతో రిహార్సల్సు ప్రారంభిద్దాము. కృష్ణుడు, బలరాముడు, కౌసికుడు, సాత్యకి ఉంటారు. ఆ నలుగురూ వాళ్ళ పోర్షన్లు బాగా చదువుకొని రావాలి" అంటూ చెప్పాను.

"సుభద్ర, చిత్రరేఖ పాత్రలకు ఎవరినీ పెట్టలేదు. వాళ్ళుకూడా ఉండాలి గదా?" అన్నాడు గంగరాజు.

"ఆ వేషాలు ఎవరైనా ఆడపిల్లల చేత వేయిస్తేనే బాగుంటుంది" అన్నాను. "మా నరిసిని ఒక వేషానికేసేయ్" అన్నాడు గంగరాజు అక్కడ కూచొని ఉన్న నరసమ్మను చూస్తూ.

"నీ పరాచికాలు సాల్లే మావా? ఊరుకున్నకొద్దీ ఉట్టికెక్కుతున్నావు" అన్నది నరసమ్మ అక్కణ్ణించి లేచిపోబోతూ

"నే ననంగానే నీకు వేషమియ్యరులేవే. కూచో పోతావెందుకు? అన్నాడు గంగరాజు నవ్వుతూనే.

"నరసమ్మగారు కాదు గాని వాళ్ళమ్మాయి సంపూర్ణను వెయ్యమందాము. సన్నగా పొడుగ్గా బాగుంటుంది. ఆ పిల్లచేత చిత్రలేఖ వేషం వేయిద్దాము. సుబ్బరాయుడుగారి కూతురు సుభద్రను సుభద్ర వేషం వెయ్యమందాం" అన్నాను. "వాళ్ళను దృష్టిలో ఉంచుకొనే ఆ పాత్రలకు ఎవర్నీ ఎంపిక చెయ్యలేదు. వాళ్ళ పెద్ద వాళ్ళేమంటారోమరి." నరసమ్మ వంక చూస్తూ అన్నాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"రోజూ ఆడపిల్లలు యీడకు రావడం బాగుండదు. వాళ్ళ సదువులు గూడా పాడవుతయ్" అన్నాడు బాలరాజు.

"ఇందులో ఆడోల్లెందుకులే. మొగపిల్లల సేత యేయిత్తే సరిపోతుంది" అన్నాడు నరసరాజు.

వాళ్ళవేం పెద్ద పోర్షన్లు గాదులెండి. అయిదు నిమిషాల కంటే ఎక్కువ ఉండదు. వాళ్ళు రోజూ ఇక్కడికి రానవసరంలేదు. వాళ్ళు ఉండాల్సిన టైములో ఉంటేచాలు. వాళ్ళకు ఏ విధమైన ఇబ్బందీ కలక్కుండా నేను చూస్తానుగా. మీరు భయపడాల్సిన అవసరం లేదు" అని హామీ ఇచ్చాను.

నరసమ్మ మౌనం అంగీకార సూచకంగానే భావించాను. సుబ్బరాయుడు లేడక్కడ. ఈమె ఒప్పుకున్నది కాబట్టి అతన్ని ఒప్పించటం కష్టంకాదు. ఇద్దరు పిల్లలూ స్కూల్లో తొమ్మిదో తరగతిలో ఉన్నారు. ఆ సమస్య తేలిగ్గానే పరిష్కారమైంది.

"రేపు ఏడు గంటలకు కలుద్దా" మని చెప్పి అందర్నీ పంపేశాను. నేను సత్యంతోపాటు రూముకొచ్చాను.

స్కూలు టైములో స్కూలు పని. సాయంకాలాల్లో రాత్రి పొద్దుపోయిందాకా నాటకం రిహార్సలు. చాలా బిజీగా ఉంటున్నాను. అలా తీరికలేని పనులుంటే హాయిగా ఉంటుంది నాకు. ఎప్పుడూ బిజీగా ఉండాలి. ఒక పనిలోంచి మరో పనిలోకి మారు తుండడమే విశ్రాంతి. అప్పుడు చిత్తూరులో ఏ పనీ లేకుండా ఎలా ఉండగలిగానో, ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యమేస్తుంది:

మారుమూల పల్లెల్లో ఉన్నా, మొనాటనీ ఫీలవటంలేదు నేను. ఎంటర్టైన్మెంటుకు తక్కువేమీ లేదు. సినిమాలులేనిలోటు కనిపించటం లేదు. అక్కడ కూచొని చూచి ఆనందిస్తే ఇక్కడ చేసి చూపి ఆనందిస్తున్నాను. 'పాసివిటీ' కంటే 'యాక్టివిటీ'నే మంచిది.

21

రాబోయే సంవత్సరం ఈ స్కూల్లో పదవ తరగతి, ఆ తరువాత సంవత్సరము లో యస్సెల్సీ ప్రారంభించాల్సిన అవసరం చాలా ఉందనీ, పది మైళ్ళ చుట్టు కొలతలో మరో తెలుగు స్కూలు ఎక్కడా లేదనీ: అదనపు తరగతుల నిర్వహణకు వసతి ఉన్నదనీ, జిల్లా పరిషత్తు వారికి చాలాసార్లు రాశాను.

రాయగా రాయగా స్కూలు కమిటీవాళ్ళు జిల్లా పరిషత్తుకు చెల్లించాల్సిన డబ్బు పూర్తిగా చెల్లించలేదనీ, అది చెల్లిస్తేగాని పై తరగతులు ప్రారంభించటం వీలుకాదనీ వారు రాశారు.

దానికి జవాబుగా స్కూలు కమిటీవారు జిల్లా పరిషత్తుకు డబ్బు చెల్లించేందుకు మారుగా స్కూలు భవనం నిర్మించి ఇచ్చారనీ, దానికి గాను ఖర్చు చేసిన డబ్బును జిల్లా పరిషత్తుకు చెల్లించినట్లుగా భావించి పై తరగతులు ప్రారంభించాలని రాశాను.

దానికి వారు కమిటీ వారు నిర్మించిన భవనం కొలతలు, ప్లాను, వగైరాలు పంప వలసిందిగా ఆదేశించారు. ఆ ప్రకారమే అన్నిటినీ పంపించాను. అందుకు అంగీకరించారో, లేదో తెలీదు. విషయం అంత వరకూ వచ్చి మూలపడింది.

జిల్లా పరిషత్తు వారి యాజమాన్య పద్ధతులు గమ్మత్తుగా ఉన్నాయి. నా అనుభవం వరకే చెబుతాను. నేను పనిచెయ్యకుండా తిరుగుతున్నప్పుడూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఒళ్ళువంచి పనిచేస్తున్నప్పుడూ పట్టించుకోడం లేదు. నెల నెలా జీతం మాత్రం పది రోజులు అటూ ఇటూగా పంపు తున్నారు. మనం నూరు కాయితాలు రాస్తే ఏ ఒక్కదానికో జవాబు వస్తుంది - పుణ్యకాలం తీరిపోయిం తరువాత. అవసరం లేని కాయితాలు మాత్రం కట్టలు కట్టలుగా వస్తుంటాయి.

అప్పుడప్పుడు మేమూ ఉన్నా మంటూ జిల్లా విద్యాధికారిగారి నుండి కూడా కాయితా లొస్తుంటాయి. ఈ స్కూలు పెట్టిం తరువాత ఇంతవరకు

ఇన్స్పెక్షను జరిగిన దాఖలాలు లేవు. పది ప్రదేశాలు, స్కూళ్ళు తిరిగి తనిఖీలు జరిపే అధికారులు, మారుమూల స్కూళ్ళకు పోవటం, ఇతర చోట్లలో వారు చూసిన మంచి విషయాలను వీరికి తెలపటం, ఇక్కడ చూసిన ఇతర విషయాలను అక్కడ చెప్పటం, పని చేసే వాళ్ళకు మరింత బాగా పనిచేసేందుకు సలహాలివ్వటం, పనిచెయ్యనివాళ్ళు చేసేలా చూడటం వగైరా పనులేమీ చెయ్యరు. రాకరాక ఎవడైనా వస్తే వాడు ఆకలిగొన్న పులిలా వస్తాడు. ఎన్నడూ తిండి ముఖమే ఎరగని గర్భదరిద్రుడిలా వస్తాడు. వీళ్ళ ఈ ప్రవర్తనతో పనిచేసే నిజాయితీ పరుడికి శిక్ష. వీడిని మేపి పీడ వదిలించుకునే లౌకికుడికి రక్ష! వీళ్ళ కారణంగానే టీచర్లు పని చెయ్యటం మానుకున్నా రంటే అతిశయోక్తి కాదు.

నాటకం రిహార్సలు రోజూ జరుగుతున్నది. ప్రతిరోజూ బోలెడంత హాస్యం, అపహాస్యం చవిచూస్తున్నాను.

రూములో జనాభా తగ్గిపోతున్నది, చంగయ్యశర్మ వేరుకాపురం పెట్టాడు. మునసామి గూడా పెళ్ళికొడుకయ్యాడు. ఎక్కువ రోజులు సెలవులు పెడుతున్నాడు. రూములో ఎక్కువగా నేను, సత్యం మాత్రమే ఉంటున్నాము. సత్యం ఉదయం పోయి ఒక వేళంటూ లేకుండా ఉసూరుమని వస్తుంటాడు. అతన్ని వంట పనితో బాధించడం బాగుండదు. ఓబుల్రాజు చేతనే వంటపని చేయిస్తున్నాను. నాకు వంట చెయ్యటం బొత్తిగా చేతకాదు. నేను మామూలుగా తెల్లబట్టలు ధరిస్తుంటాను. చొక్కా మార్చినప్పుడల్లా జేబులోని వస్తువులు మారుతుంటాయి. నేను మదనపల్లె నుంచి వచ్చిన ఉత్తరం, ఫోటో జేబులోనే పెట్టుకు తిరుగుతున్నాను.

ఆరోజు ఉదయం నేను బడికి బయలుదేరుతున్నప్పుడు నా చొక్కా జేబుమీద సత్యం దృష్టి పడింది.

జేబులో ఫోటో ఉన్నట్లున్నది. ఎవరి దేమిటి?" అంటూ నిలేశాడు.

అప్పుడు చూసుకున్నాను చొక్కా జేబులోంచి బయటికి కనిపిస్తున్న ఫోటోను. నాలిక్కరుచుకుంటూ ఫోటో అతని చేతిలో పెట్టి- "పిల్ల బాగానే ఉన్నట్లున్నది చూడు” అంటూ విషయమంతా చెప్పాను.

సత్యం ఫోటోలో అమ్మాయిని నిశితంగా చూచాడు. చప్పరిస్తూ ఫోటో నాకు తిరిగి ఇచ్చేశాడు. “నువ్వు దీనికే మురిసిపోతూ జేబులో పెట్టుకొని తిరుగుతున్నావు. తిరుపతి అమ్మాయి చాలా బాగుంటుంది. నీకు అన్ని విధాలా సరిపోతుంది” అన్నాడు.

“నేనేం మురిసిపోయి జేబులో పెట్టుకోలేదులే. వచ్చిన ఉత్తరం జేబులో పెట్టుకున్నాను. దాన్ని డ్రాయర్లో పడెయ్యకుండా జేబులు మారుస్తున్నాను. అంతే” అన్నాను.

"రేపు శనివారం వస్తామని తిరుపతి వాళ్ళకు రాస్తాను. పోయొద్దాం పద. అందరూ పెళ్ళిళ్ళు చేసుకుంటూ ఉంటే నువ్వు ఒంటరిగా ఉండటం ఏం బాగాలేదు" అన్నాడు.

“పోదాంలే, శనివారం ఎందుకు? ఏదైనా ఆదివారం చూడు. పోయి వద్దాం" అన్నాను. “బట్ నాట్ ఇన్ ది ఇమీడియట్ ప్రెజెంట్.”

“అదేం కుదరదు. రేపు శనివారమో, అవతలి శనివారమో పోదాం" అన్నాడు సత్యం. నేనేం మాట్లాడకుండా స్కూలు కెళ్ళాను.

సాయంత్రం భోజనమైం తరువాత నాతో పాటు సత్యం గూడా రిహార్సల్సుకు వచ్చాడు. ఆ నాటకంలో వచనం, పద్యాలు ఎంతసేపు నేనరచినా వాళ్ళ నోరు తిరగటం లేదు. చాలావరకు నవ్వులతోనే గడిచిపోయింది కాలం. మొదటి సీన్లో పది మాటలు గూడా ముందుకుపోలేక పోయాం. బాలరాజు బలరాముడుగా ప్రాబ్లమే అయినాడు. ఆయన గొంతు వణుకుతుంది పాపం. మాటలు సక్రమంగా పలకలేదు. పది మాటలు, ఒక చిన్న పద్యం మాత్రం ఉంచా నతనికి. అదే కష్టంగా ఉంది. మిగిలిన ముగ్గురూ యువకులే,

అయినా వాళ్ళ పరిస్థితి కూడా అలాగే ఉంది. "నువ్వు రోజూ వచ్చి కూచోమంటే కూచుంటాను గాని, ఈ యాసం మాత్రం వద్దు" అన్నాడు నన్ను బ్రతిమాలుతున్నట్లు బాలరాజు.

"మొదటిరోజునే మీరు భయపడిపోతే ఎలా? నాలుగు రోజులు పోతే వాళ్ళకంటే మీరే బాగా చెబుతారు" అంటూ ఆయన్ను సముదాయించాను.

రూము కొచ్చిం తరువాత మళ్ళీ మొదలుబెట్టాడు సత్యం. "రేపు శనివారం వస్తున్నానని వాళ్ళకు రాశాను" అన్నాడు.

"నేనిప్పుడే వద్దన్నాను గదయ్యా: అంత తొందరెందుకు?" అన్నాను కొద్దిగా చిరాకు కనబరుస్తూ.

"యేదో రాయాలనిపించింది. రాశాను. మనం పోకపోతే నా పరువు దక్కదు" అన్నాడు. "రాసేదేదో ఆదివారం అని రాయక శనివారం అని ఎందుకు రాశావు? శనివారం సెలవు పెట్టొద్దూ?" అన్నాను.

"సెలవులన్నీ మురగబెట్టుకోకుండా ఒక్క రోజయినా ఉపయోగించుకో. శనివారం సెలవు పెడితే భూకంపాలు రావు. ఈ జంబాడ ఎటూ కొట్టుకొని పోదు" అని నవ్వాడు సత్యం.

"ఒకరోజు అనవసరంగా సెలవు పెట్టటమెందుకని" అన్నాను.

"పెళ్ళిచూపులకు పోతూ అనవసరమంటా వేమిటయ్యా? నీ రూములో ఉన్న చంగయ్యశర్మ, మునసామినాయుడులను చూశయినా నేర్చుకో. పెళ్ళికోసమని వాళ్ళు ఎన్ని సెలవులు ఉపయోగించుకున్నారో చూడు" అన్నాడతను.

సరే అని ఒప్పుకోక తప్పలేదు.

శనివారం ఉదయం ఇద్దరం బయలుదేరాము, నరసమ్మగూడా ఈ విషయం తెలిసి నట్లున్నది. మాకు ఎదురుగా వచ్చింది. "శామంగా పోయి లాభంగా రండి సారూ:" అన్నది.

“శకునం గూడా మంచిదే అయింది. ఇక సారు లాభంగా రాకుండా ఎలా ఉంటాడు నవ్వుతూ అన్నాడు సత్యం.

తోవ పొడుగునా మేం పోబేయే ఇంటివారి మంచిని గురించి, మర్యాద గురించి, సంప్రదాయం గురించి, నాకు సమకూరబోయే అదృష్టాన్ని గురించి చెప్పాడు సత్యం. అంత మంచి ఇంటి సంబంధం దొరకటం అదృష్టంగానే నేను లోలోపల సంతోషించాను బయటికి అనకపోయినా.

మేము తిరుపతి చేరేసరికి ఉదయం పదకొండు గంటలైంది.

సత్యం అంత గొప్పగా చెప్పిన పెళ్ళికూతురు అందచందాలు చూడాలని నాకు చాలా ఉత్సుకతగా ఉంది. మనసు సంతోషంతో గంతులు వేస్తున్నది.

తిరుపతిలో బస్సు దిగిం తరువాత "చంద్రగిరి బస్సు ఎక్కుదాం పద" అంటూ తొందరజేశాడు సత్యం.

“చంద్రగిరి ఎందుకయ్యా మహానుభావా: తిరుపతిలోనే నంటివి గదా:” అన్నాను. చంద్రగిరి పోవాలని సత్యం నాతో ముందుగా చెప్పలేదు.

“వాళ్ళ మేనమామ చంద్రగిరిలో ఉన్నాడు. అతను శానిటరీ ఇన్స్పెక్టర్గా పని చేస్తున్నాడు. పెళ్ళి విషయాలన్నీ పిల్ల మేనమామే మాట్లాడుతాడు. అమ్మాయి, వాళ్ళ నాన్న అక్కడే ఉంటున్నారు” అన్నాడు సత్యం.

“వాళ్ళ అన్న తిరుపతిలో పనిచేస్తున్నాడని చెప్పావు గదయ్యా" అన్నాను.

“అతనక్కడే పన్జేస్తున్నాడు. వీళ్ళు మాత్రం ఇక్కడ ఉంటున్నారు. పిల్ల పెళ్ళయిం తరువాత ముసలాయన కొడుకు దగ్గరికే చేరుతాడు. పాపం పిల్లకు తల్లి లేదు" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. చంద్రగిరి చేరేసరికి పన్నెండున్నర అయింది. సందులు గొందులు తిప్పి వాళ్ళ ఇంటికి చేర్చాడు నన్ను.

ఇల్లు బాగానే ఉంది. డాబా ఇల్లు.

సాదరంగా మమ్మల్ని ఆహ్వానించారు వాళ్ళు. స్నానం చేయమన్నారు. భోజనానికి ఏర్పాట్లు చేశారు. చాలా మర్యాద చేశారు.

ఆ అమ్మాయి కోసం నా కళ్ళు వెతికాయి. ఆ మేనమామ భార్య. వాళ్ళ చిన్న పిల్లలు కనిపించారు గాని పెళ్ళీడు ఉన్న ఆడపిల్ల కనిపించలేదు. బహుశా ఏదైనా గదిలో కూచోబెట్టి ఉంటారనుకున్నాను.

మేం భోజనాలు ముగించేసరికి ఒంటిగంట దాటింది. ఒక గదిలో మంచం వేసి పడుకోనున్నారు. అన్ని ఏర్పాట్లు సత్యం పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి.

పెళ్ళిచూపుల కొచ్చి గదిలో పడక వెయ్యటం సమంజసంగా అనిపించలేదు నాకు.

కాని ఏం జేస్తాం: అస్వతంత్రుణ్ణి నేనక్కడ, సత్యం ఏం చెబితే అది చేస్తున్నాను. నేను మంచంమీద పడుకొని తాపీగా ఆలోచిస్తున్నాను. సత్యం వచ్చి నా మంచంమీద కూర్చున్నాడు.

"పెళ్ళిచూపుల కొచ్చిన వాళ్ళం పని చూసుకొని వెళ్ళిపోవాలి గాని ఈ పవళింపు సేవలేమిటి, సత్యం:" అన్నాను నవ్వుతూ.

“అమ్మాయి నిన్న వాళ్ళ అన్నయ్యగారింటి కెళ్ళిందట. ఇవాళ రావాల్సిందిట గాని ఇంకా రాలేదు. ముసలాయన వెళ్ళాడు తీసుకురావడానికి - గంటా గంటన్నరలో వచ్చేస్తారు. అందాకా పడుకొని హాయిగా రెస్టు తీసుకో” అన్నాడు.

“ఇక్కడ ఏం కష్టపడ్డాం గనుక రెస్టు దీసుకోను:” అన్నాను.

"అదేనయ్యా బాబూ: ప్రయాణం బడలిక" అన్నాడతను.

అతను నా దగ్గర్నించి వెళ్ళిపోయాడు. మరి కొంతసేపటికి మాగన్నుగా నిద్ర పట్టింది నాకు.

సత్యం నన్ను లేపేసరికి నాలుగు గంటలై ఉంటుంది. పెళ్ళి కూతుర్ని చూడబోతున్న ఉత్సాహంతో లేచి కూచున్నాను.

ఏడుపు ముఖంపెట్టి మంచంమీద నా పక్కనే కూచున్నాడు సత్యం. "ఆ అమ్మాయి ఇవాళ ఉదయమే బయట కూచున్నదట. బయటున్నప్పుడు పెళ్ళిచూపులు ఎలా? వచ్చే వారం రమ్మన్నారు" అన్నాడు సత్యం నిదానంగా.

మళ్ళీ వచ్చేవారం ఎక్కడొస్తాం? మనమే తిరుపతి పోదాంపద. బయట ఉన్నది కాబట్టి అలంకారాలు చేసి చూపించరు. అంతేకదా: అట్లా మేకప్పుయిన మనుషుల్లో నాకు అందం కనిపించదు. అలాగే చూద్దాం. నాచురల్గా, ఉన్న మనిషి ఉన్నట్లు కనిపిస్తుంది. వాళ్ళ అన్నగారింటికే పోదాం పద" అన్నాను తొందరపడుతూ.

"పిచ్చి కుదిరింది, రోకలి తలకు చుట్టమన్నాడట నీబోటివాడెవడో: అంతా నీ ఇష్టమేనా వాళ్ళకు సెంటిమెంట్లుంటాయి. వాటిని వాళ్ళ ఇంట్లో నయినా మనం పాటించాలి."

నేను చాలా నిరుత్సాహపడ్డాను.

"వచ్చే వారం వద్దాం పద" అంటూ నన్ను బయలుదేరదీశాడు. వాళ్ళు ఫలహారాలు, కాఫీ అంటూ పట్టుబట్టారు. మరి కాస్తసేపు కూచోక తప్పలేదు. కాఫీ, ఫలహారాలు ముగించుకొని "వస్తామండీ" అంటూ బయలుదేరాము.

"వచ్చే వారం తప్పకుండా వస్తారుగా?" అన్నాడు ముసలాయన ఆశతో.

"తప్పకుండా రండి వచ్చేవారం. ఇది అన్‌క్స్‌పెక్టెడ్ గా పుఅనెక్స్పెక్టెడ్గా జరిగింది. ఏమీ అనుకోకండి. మీ కోసం ఎదురుచూస్తుంటాము" అని చెబుతూ మమ్మల్ని కొంత దూరంసాగనంపాడు పిల్ల మేనమామ.

"తప్పకుండా, నేను తీసుకొస్తాగా" అంటూ హామీ ఇచ్చాడు సత్యం.

"అలాగే వస్తాం లెండి" అన్నాను. నేను.

జరిగిందానికి పిల్ల మేనమామ, తండ్రి చాలా నొచ్చుకున్నారు పాపం. సత్యం బాధ వర్ణనాతీతం.

వాళ్ళ ఇల్లు వదలి దూరంగా వచ్చేసింతరువాత అన్నాడు సత్యం "వినాయకుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలేనట: నువ్వు ఎలాగో రావటానికి ఒప్పుకున్నందుకు సంతోషపడుతూ తీసుకొచ్చాను. తీరా వస్తే ఇది:" అని నవ్వాడు సత్యం.

“నరసమ్మ శకునం గూడా పనిచెయ్యలేదు. నాకిది పెద్ద డిజప్పాయింట్మెంటే?" అన్నాను.

“కానీలే వచ్చేవారం వద్దాం. ట్రై ఎండ్ ట్రై అన్నారు" అన్నాడు సత్యం.

చంద్రగిరి నుంచి తిరుపతి పోయే బస్సు వచ్చింది. దాన్నిండా జనం. సందులేకుండా ఇరుక్కొని ఉన్నారు. ఇద్దరం ఎలాగో సందు జేసుకొని బస్సులోకి దూరాము. మా కర్మ: తిరుపతి పొలిమేరల్లోకి చేరేసరికి బస్సు ముందు చక్రం పంక్చరయింది. అందరం దిగాము. బస్ స్టాండులోనే దిగి బస్సు మారి వెళ్ళిపోవాలని మా ఆలోచన. కాని ఇప్పుడిలా జరిగింది.

మార్గమధ్యంలో కాకుండా ఊరి ముందు పంక్చరయింది. ఇది కూడా మంచిదేలే అనుకుంటూ ఊళ్ళోకి నడక సాగించాము.

మేము మునిసిపల్ ఆఫీసు సమీపించేసరికి హారన్ మోగించుకుంటూ మదనపల్లె బస్సు వచ్చి ఆగింది. ఇద్దరు ముగ్గురు మనుషులు బస్సు లోపలికి వెళ్ళారు. తళుక్కున నా మనసులో ఆలోచన వచ్చింది.

"సత్యం: ఇక్కడ ఇలా అయింది గదా: పాపం ఆ మదనపల్లె వాళ్ళు ఉత్తరం రాసి చాలా రోజులైంది. పనిలో పని ఆ పిల్లనయినా చూసేద్దాంరా:" అంటూ అతని చొక్కా పట్టుకొని లాగాను,

సత్యం అయిష్టంగానే ఒప్పుకొన్నాడు. పరుగునబోయి బస్సులో ఎక్క బోయాము ఇద్దరం. కండక్టరు "ఇద్దరికి సీట్లు లేవు సార్: ఒక రయితే రావచ్చు" అన్నాడు.

"నేను పోయొస్తాలే సత్యం. వచ్చి నీకు అన్ని విశేషాలు చెబుతాను. రేపు ఆదివారం సెలవేగదా. రేపు సాయంత్రానికల్లా ఊరికి చేరుతాను" అంటూ గబగబా అతనికి చెప్పి బస్సు లోపలికి పోయి కూచున్నాను.

పాపం, సత్యం చిన్నబుచ్చుకొని ఉంటాడు. బస్ స్టాండుకుపోయి తరువాత బస్సులో వెళ్ళి ఉండవచ్చును మదనపల్లె. "నేను అనవసరంగా తొందర పడ్డాను. ఇలా వచ్చి ఉండకూడదు. పైగా పెళ్ళిచూపులకు ఒంటరిగా పోవటం ఏమిటి? అసలు వాళ్ళు పిల్లను చూపిస్తారో, లేదో: నన్ను దొంగ పెళ్ళి కొడుక్కింద జమకట్టి అనుమానంతో అవమాన పరుస్తారేమో: చాలా తొందర పడ్డాను. సత్యం గూడా వెంట ఉంటే బాగుండేది" అని మధనపడుతూ కూచున్నాను.

బస్సులో కూచున్న మూడు గంటలసేపూ ఇదే ఆలోచన.

బస్సు మదనపల్లె చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది టైము. ఊరు నాకు పరిచయమైనదే. ఇంతకు ముందు అయిదారుసార్లు వచ్చాను.

చలిగా ఉంది. దానికి తోడుసన్నగా చినుకులు కూడా పడుతున్నాయి.

ఒక వీథిలైటు దగ్గర నుంచొని జేబులోంచి వాళ్ళు రాసిన ఉత్తరం బయటకి తీశాను. వీథి పేరు, ఇంటి నంబరు రాశారు వాళ్ళు. తోవలో పోతున్న ఒకర్ని వీథి పేరు చెప్పి త్రోవ చూపించమని అడిగాను.

"నేను పోతా ఉంది అటుగానే. నాతో రండి సూపుతా" అన్నాడతను.

అతని వెంట నడిచాను. ఎక్కువ దూరం నడవాల్సిన పని లేకుండానే ఆ వీథిలోకి వచ్చాము. అతనికి థాంక్సు చెప్పి వీథి లైట్ల వెలుగులో ఇంటినంబరు వెతుకుతూ మరో అయిదు నిముషాల్లో పట్టేశాను.

అదో చిన్న డాబా ఇల్లు. ముందు వసారా ఉంది. ఇంటి తలుపు మూసి ఉంది. వసారా లోపలికి నడిచాను. ఇంటి లోపలినుంచి మాటలు వినిపిస్తున్నాయి. భోంచేస్తున్నట్లు న్నారు. తలుపు తట్టబోయాను. ఒళ్ళంతా చెమట పడుతున్నది అంత చలిలోనూ. కర్చీఫ్తో ముఖం తుడుచుకున్నాను. చేతి వేళ్లతో జుట్టు సవరించుకున్నాను.

తలుపు దగ్గరికి పోయి - "తలుపు తియ్యండి" అంటూ నెమ్మదిగా తట్టాను. ఒక అర నిముషం అయిం తరువాత - ఎవరో తలుపు తడుతున్నట్లున్నారు చూడవే" అన్నదో ఆడ గొంతు లోపల. తరువాత కొన్ని సెకన్లలో తలుపు తెరుచుకుంది.

చేతిలో అన్నం పళ్లెం పట్టుకొని “ఎవరండీ మీరు? ఏం కావాలి?” అంటూ నిలేసింది ఫోటోలోని అమ్మాయి.

నేనేమీ సమాధానం చెప్పలేదు. కళ్ళార్పకుండా ఆ అమ్మాయినే చూస్తు నుంచున్నాను. ఎర్రగా, బొద్దుగా, అటు పొడుగూ ఇటు పొట్టీ కాకుండా, చక్కని కనుముక్కు తీరుతో, జాకెట్టు, పరికిణీ, ఓణీలతో కళ్లనిండా కనిపిస్తున్న బొమ్మను పది పదిహేను సెకన్ల పాటు చూశాను. ఆమె కూడా నన్ను చూసింది.

“ఎవరో తెలీదు అమ్మమ్మా:" అంటూ తన పనిలో నిమగ్నమైంది.

అయిదారుగురు యువకులు వరసగా కూచుని భోంచేస్తున్నారు. నా రాకతో వాళ్ళ మాటలు నిలిచి పోయాయి. గబగబా భోంచేస్తున్నారు వాళ్ళు.

“పెద్ద కుటుంబమే.” అనుకున్నాను మొదట. “ఇంతమంది ఒకే వయసుగల యువకులు ఒక్క యింట్లోనే ఎలా ఉంటారు?" అనుమానం వచ్చింది తరువాత. బహుశా వీళ్ళు మెస్సేదయినా నడుపుతున్నారేమో ననుకున్నాను.

ఒక పెద్ద ముత్తయిదువు “ఎవరు నాయనా: ఏం కావాలి?" అని అడిగింది భయం భయంగా.

ఆమె కెదురుగానే ఒంటిమీద చొక్కాలేకుండా బట్టతల ముసలాయన కూచుని ఉన్నాడు. ఆయనకు నశ్యం అలవాటున్నట్లున్నది. ముక్కు కిందనల్లగా మెరుస్తున్న చార కనిపించింది.

నేను చుట్టూ కలయజూస్తూ నుంచున్నాను. ఆ అమ్మాయి ఖాళీ పళ్లెం తీసుకొని లోపలికి వెళ్ళింది.

ఆమె ప్రశ్న విని - "మాది జంబాడండీ:" అన్నాను.

నెత్తిన పిడుగు పడినంత గాభరా పడిపోయాడు ముసలాయన. ఏదో అనాలని నోరు తెరిచాడు కాని మాట బయటికి రాలేదు. పెద్ద ముత్తయిదువు పమిట సర్దుకుంటూ లేచి నుంచున్నది.

"మీరా అప్పా: కూచోండి" అన్నది భయంతో కూడిన నవ్వు నవ్వుతూ, గబగబా వంటింట్లోకి పోయి అన్నం పళ్లెంతో బయటికొచ్చింది పెద్దామె. లోపలికి పోయిన అమ్మాయి తిరిగి వస్తుందన్న నాచూపులు ఆవేపే నిలిపాను.

"కూచోండప్పా:" అంటూ లేచి నుంచున్నాడు ముసలాయన.

"నేను కూచుంటాను. మీరు లేవటమెందుకు, కూచోండి" అన్నాను.

ముసలాయన తుండు గుడ్డతో ముక్కు తడుచుకుంటూ వంటయింటి గదిదాకా పోయొచ్చాడు.

అక్కడ పరిచి ఉన్న చాపమీద కూచున్నాను దిక్కులు చూస్తూ.

ఆ యువకులు అన్నం తినటం ముగించుకొని వెళ్ళిపోయారు.

"మీరు మెస్సేదయినా నడుపుతున్నారా?" అన్నాను ముసలాయనతో.

"అబ్బే లేదండీ? ఈ పిల్లలంతా వేరే మెస్సులో భోంచేస్తూ ఉండేవాళ్ళు. అకస్మాత్తుగా దాన్ని మూసేశారు. మరోచోటు చూసుకున్న దాకా కాస్త అన్నం పెట్టమని మమ్మల్ని ప్రాధేయపడ్డారు. మూడు రోజులుగా వచ్చి తింటున్నారు. రెండ్రోజుల్లో చెప్పేస్తాను, ఎక్కడైనా చూసుకోండని" అన్నది పెద్దావిడ.

అబద్ధం చెబుతున్నదని తెలుసు. 'చాలా తెలివైన మనిషి' అనుకున్నాను. ఇంటి పెత్తనం ఈవిడదేనని ఎవరైనా తేలిగ్గానే తెలుసుకోవచ్చును.

"ఆయన మంచినీళ్ళేమయినా తాగుతారేమో ఇవ్వవే:" తన అధికారం చలాయించ బోయాడు ముసలాయన.

నా మనసులోని మాట ఆవిడే అనేసింది "ఇప్పుడు మంచినేళ్లేంటి? కాఫీ పెట్టాను."

"మీరిట్లా చెప్పా పెట్టకుండా అకస్మాత్తుగా వస్తారనుకోలే దప్పా:" అన్నదావిడ.

"నేనూ అనుకోలేదు. తిరుపతిలో ఒక అమ్మాయిని చూద్దామని వచ్చాను, అక్కడ వీలు కాలేదు. ఎటు దిరిగీ ఊరు వదిలి వచ్చాంగదా పనిలో పనిగా మీ ఇంట్లో కూడా చూసి పోదామని వచ్చానండీ:" అన్నాను నవ్వుతూ. "అసలిక్కడికి రావాలని బయలు దేరలేదు."

"మీరు రారనే అనుకున్నా మప్పా: మా పిల్లదాని అదృష్టం మీరు వచ్చారు" అన్నాడు ముసలాయన ముక్కు శుభ్రం చేసుకుంటూ.

పెద్దామె లోపలికి పోయి కాఫీ గ్లాసు పట్టుకొని వచ్చింది- "తీసుకోండప్పా:" అంటూ నా చేతికి అందించింది.

కాఫీ ఈవిడ కాచలేదు. వంటింట్లో అమ్మాయే కాచి ఇచ్చి ఉంటుందను కుంటూ తాగాను. బలే రుచిగా ఉంది కాఫీ.

"ఆయనకు భోజనం..." అంటూ దీర్ఘం తీశాడు ముసలాయన.

"టిఫిను తెచ్చి పెడతాలెండి" అంటూ ఆయన వంక చూచింది కళ్ళు పెద్దవి చేసి, ఆయన మరి మాట్లాడలేదు.

తమ ఇంటి వ్యవహారాలన్నీ చెప్పుకొచ్చింది పెద్దావిడ. అమ్మాయికి తల్లి లేదు. తండ్రి ఉన్నా లేనట్లే. ఉట్టి అప్రయోజకుడు. అమ్మాయి తన చెల్లెలి

బిడ్డ. చిన్నప్పటినుంచీ తానే పెంచింది. అమ్మాయికో అన్న ఉన్నాడు. పెద్దగా చదువుకోలేదు. సినిమాహాల్లో టిక్కెట్లు అమ్ముతుంటాడు. పూర్వీకుల ఆస్తి కొద్దిగా ఉంది. ముసలాయన తాలూకాఫీసులో జవానుగా పనిచేస్తున్నాడు. వాళ్ళకో పెళ్లయిన కొడుకున్నాడు. అతనికి అనారోగ్యం. కనీసం రెండు గంటలసేపు అన్ని విషయాలు చెప్పుకొచ్చిందావిడ.

ఆవిడ చెప్పేదంతా ఊ కొడుతూ విన్నాను. ఆమాటలన్నీ వినాలని నాకు ఉత్సాహం లేదు. వినక తప్పదు గాబట్టి విన్నాను. వాళ్ల ఇంటి పరిస్థితులతో నాకేం పని? నాక్కావల్సింది వాళ్ల అమ్మాయి.

నే నా అమ్మాయి రూపాన్నే మననం చేసుకుంటూ మరొక్కమారు కనిపిస్తే బాగుంటుందను కుంటూ కూర్చున్నాను.

సినిమా వదిలిపెట్టిం తరువాత అమ్మాయి అన్న వచ్చాడు. అతన్ని సరికి పిల్చుకుపోయి చెప్పాల్సిన మాటలు చెప్పింది. అతను టిఫిను కొను క్కొచ్చేందుకు వెళ్ళాడు. మరో పదిహేను నిముషాల్లో అతను తిరిగి వచ్చాడు. ఒక ప్లేటులో వాటిని పెట్టి" తీసుకోండప్పా:" అంటూ నా కందించింది. నేను తీసుకొని వాటిలో కొద్దిగా తిన్నాను.

తినటం ముగించి, నీళ్ళు తాగి, "మీ విషయాలన్నీ చెప్పారు. నేను మీ ఇంటికొచ్చి కాపురం చెయ్యనుగా? కాబట్టి వాటితో నా కవసరం లేదు. మీ అమ్మాయి మా యింటికి రావాలి. నాతో సంసారం చెయ్యాలి. కాబట్టి నా సమాచారం చెబుతా వినండి" అన్నాను. "నన్ను మీరు చూస్తున్నారు. నాకు ఉద్యోగం తప్ప వేరే ఆస్తిపాస్తు లేమీ లేవు. నా ఉద్యోగం మారుమూల పల్లెటూళ్లో, అక్కడ సినిమాలు గినిమాలు ఏమీ ఉండవు. కాఫీ హోటళ్లు కూడా లేవు. నేనుంటున్నది ఒకేగది ఉన్న పెంకుటింట్లో. ఊరికి బస్సు లేదు. కొంతదూరం నడిచిపోవాలి. ఇంట్లో వస్తువులు కూడా ఏమీలేవు. నాకు తల్లి, అక్కలు, అన్నలు ఉన్నారు. వాళ్ళుంటున్నది చాలా దూరంలో, రెండు జిల్లాల అవతల. అక్కణ్ణించి నాకొచ్చేదేమి లేదు. నాకు మీరేమీ కట్న

కానుకలు ఇవ్వనవసరంలేదు. మీ అమ్మాయికి సొమ్ములు పెట్టలేను. పెళ్ళి మీరే జరిపించాలి. పెళ్ళికి మా వాళ్లెవరూ రారు, దూరం కాబట్టి. వస్తే మా అన్నయ్య, వదినె రావచ్చును. మీ అమ్మాయిని నా ముందుకు పిలవండి" గబగబా నా స్వవిషయాలన్నీ చెప్పేశాను.

"మీరీ ఇంట్లో అడుగు పెట్టగానే చూసింది దాన్నే నప్పా:" అన్నది పెద్దావిడ నవ్వుతూ. "అలాగా:అప్పుడు హడావుడిలో అంత బాగా చూడలేదు. నా ముందుకు పిలవండి చూస్తాను. ఉదయం చూద్దామంటే కుదరదు. నేను పొద్దున్నే వెళ్ళిపోవాలి. ఉండేందుకు వీల్లేదు" తొందర పెట్టానామెను.

పాపం ఆవిడ సిగ్గుపడ్డది. లేచి లోపలికి పోయింది.

నేను చాపమీదనుంచి లేచి బయటి వసారాలోకి వచ్చి సిగరెట్టు వెలిగించు కున్నాను. వాన చినుకులు నిలిచిపోయాయి. గాలి చల్లగా వీస్తున్నది. రోడ్డు నిర్మానుష్యంగా ఉన్నది. తారు రోడ్డుమీది తడి వీథి దీపపు కాంతిలో మెరుస్తున్నది. అయిదు నిముషాల్లో సిగరెట్టు కాల్చటం ముగించి లోపలి కొచ్చి కూచున్నాను.

ముసలాయన అక్కడే కూచొని ఉన్నాడు కునికిపాట్లు పడుతూ. టిఫిను తెచ్చి ఇచ్చి నతను సెకండ్ షోకు పొయినట్లున్నాడు. ఆ దంపతుల కొడుకు, భార్య కనిపించలేదు నాకు. బహుశా ఏదయినా ఊరు వెళ్ళి ఉంటారనుకున్నాను.

పెద్దావిడ మళ్ళీ నా ముందు కొచ్చింది.

"తీసుకురండి మీ అమ్మాయిని." అధికారికంగా అన్నాను.

"వస్తున్న దప్పా :" అని ఆమె చెప్పటం, మెరుపు మెరవటం

రెండూ ఒకసారే జరిగాయి. "ఇలారా : వచ్చి కూచో" అన్నాను ఎదురుగా చూపుతూ.

ఆ అమ్మాయి తల వంచుకొని వచ్చి కూచున్నది నా ఎదురుగా.

"సరిపోయింది. తల వంచుకొని కూచుంటే నిన్ను నేను చూచేదెట్లా? నన్ను నువ్వు చూసే దెట్లా? తల పైకెత్తు" అన్నాను. తల వంచుకొని కళ్ళు మాత్రం పైకెత్తి చూచింది. - 'నీ అధికారం అంతా ప్రదర్శిస్తున్నావే:ఎవరిచ్చా రీ స్వతంత్రం' అని అడుగు తున్నట్లుగా ఉన్నవా చూపులు.

నేను స్వరం తగ్గించి మెల్లగా అన్నాను - "నువ్వు బాగున్నావు నీ ముఖం మరీ మరీ చూడాలనిపిస్తున్నది. తల బాగా పైకెత్తి కూచో : నన్ను కూడా చూడు. నీకు నచ్చానేమో చెప్పు. నువ్వు నచ్చలేదంటే నేనేం బాధపడను. తిరుపతిలో మరో సంబంధం ఉంది. వాళ్ళతో వచ్చే వారం వస్తామని చెప్పాము. కాబట్టి నిర్భయంగా చూడు. నిర్భయంగా మాట్లాడు. నా విషయాలన్నీ మీ పెద్దమ్మగారికి ఇంతకుముందే చెప్పాను. నువ్వూ వినే ఉంటావు" అన్నాను.

ఆ అమ్మాయి తలెత్తి నా కళ్ళలోకి చూచింది. ఆ కళ్ళు నవ్వుతున్నాయి. నాకు ఆనందమైంది"

"నీ పేరేంటి?" అడిగాను.

"విజయలక్ష్మి."

"ఎంతవరకు చదువుకున్నావు?"

"ఏడో తరగతివరకు."

"తరువాత ఎందుకు చదువుకోలేదు?"

"పాటలు పాడతావా ఏమైనా?"

"పాటలు ఎన్నో వచ్చు నప్పా : బాగా పాడుతుంది" అన్నది వాళ్ళ పెద్దమ్మ. "ఒక పాట పాడమనండి."

"పాడవే. ఎప్పుడూ కూనిరాగాలు తీస్తావే. ఇప్పుడు పాడు ఆయన వింటాడు" అన్న దామె.

అమ్మాయి ముఖం పక్కకు తిప్పుకుంది.

“పాడవే. చిన్న పాట పాడు" అన్నది ఆమె.

అమ్మాయి పలకలేదు.

“పాటలంటే నాకు చాలా ఇష్టం. నేనూ పాటలు పాడుతాను. కాని నన్ను పాడమనొద్దు. పెళ్ళి చూపుల్లో పెళ్ళికూతురు పాడటమే ఆనవాయితీ :” అన్నాను.

“పాడమ్మా. ఒక పాట పాడు” అన్నాడు ముసలాయన ముక్కు తుడుచుకుంటూ. పాపం ఆయనకు నిద్ర ముంచుకొస్తున్నది.

కొంతసేపు బ్రతిమాలించుకున్న తరువాతపాట పాడింది అమ్మాయి.

“చల్లగాలిలో యమునా తటిపై శ్యామసుందరునీ మురళీ:” అనే నాకుచాలా ఇష్టమైన రాజేశ్వరరావు పాట పాడింది. బాగానే పాడింది.

“పాట బాగేనే ఉంది. బాగానే పాడావు. సినిమాలు ఎక్కువగా చూస్తావా?" అడిగాను.

“వారానికి ఒక్కటైనా చూస్తుందప్పా: సినిమా పిచ్చి జాస్తి" అన్నది పెద్దావిడ.

“అయితే గియితే ఆ ఊళ్లో సంవత్సరానికి ఒక సినిమా కూడా చూసే వీలుండదు” అన్నాను నవ్వుతూ.

అమ్మాయి ముఖంలో నవ్వు చిందులాడింది.

"సరే ఇక ఆలస్య మెందుకు? నాకు మీ అమ్మాయి నచ్చిందండీ: నేను నచ్చానో, లేదో చెప్పమనండి మీ అమ్మాయిని" అన్నాను.

“ఆడపిల్లలు అంత తొందరగా చెబుతారా అప్పా:" అన్నది పెద్దావిడ.

“మీరు కనుక్కొని చెప్పండి. మీ అమ్మాయికి ఇష్టమైతే వేలికి ఈ ఉంగరం తొడిగి పోతాను ఉదయమే. ఇష్టం కాకపోతే ఇప్పుడు టైము కూడా రెండు దాటింది. నేరుగా బస్ స్టాండుకు పోతాను" అన్నాను ఆ అమ్మాయిని చూస్తూ.

అమ్మాయి నవ్వింది.

"ముందు మీకు ఇష్టమో, కాదో చెప్పండి" అన్నాను.

"ఇంత మంచి మనిషితో సంబంధం మాకు ఇష్టం గాకుండా ఉంటుందా అప్పా: ఇంత చదువు చదివినవాళ్ళు ఉద్యోగం చేస్తున్న వాళ్ళు ఈ రోజుల్లో కట్నం లేకుండా దొరుకుతారా అప్పా:" అన్న దావిడ సంతోషం వ్యక్తం చేస్తూ.

"నా ముందు కొచ్చి కూచో" అని ఆ పిల్లను పిలిచాను. పిల్లిలా వచ్చి కూచుంది.

"చెయ్యి చాపు" అన్నాను.

ఎడమ చెయ్యి చాపింది. నా వేలికున్న ఉంగరం తీసి ఆమె వేలికి తొడిగాను. "నీ కిష్టం లేకపోతే నా ఉంగరం నా కిచ్చెయ్యి. ఇష్టం ఉంటే ఉంచుకో" అన్నాను.

నా ముందునుంచి లేచి వెళ్ళిపోయింది ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

"ఇంకేమండీ:మీ అమ్మాయి కూడా ఇష్టపడింది. మే మిద్దరం ఒకటైనట్లే. త్వరగా ముహూర్తం పెట్టించి పెళ్ళి జరిపించండి" అన్నాను.

"పెళ్ళి వెంటనే చెయ్యటానికి వీలుగాదు నాయనా : నాలుగు నెలల వ్యవధి కావాలి' అంటూ వచ్చింది మరో ముసలామె. ఈమె ముసలాయన చెల్లెలట. నిద్రబోతున్న మనిషిని లేపుకొచ్చారు. "ముందు మంచిరోజు చూచి తాంబూలాలు పుచ్చు కుందాము. అప్పుడే ముహూర్తం గూడా నిర్ణయించు కుందాము" అన్న దావిడ.

ఈ మాటలన్నీ పూర్తయ్యేసరికి రాత్రి మూడు గంటలైంది. తరువాత వాళ్ళు పడు కున్నారు. నేనూ పడుకున్నాను గాని నిద్ర పట్టలేదు. 'మేరీ ఆంఖోంమే బస్ గయా కోయిరె: హాయ్ మై క్యాకరూం:" ఆ అమ్మాయి రూపం కళ్ళలో కూచున్నది.

ఉదయం అయిదు గంటలకల్లా లేచి కూచున్నాను. "ఇక నేను వస్తానండీ. మీదే ఆలస్యం" అన్నాను ముసలాయనతో.

“ఏఁవేఁ: ఆయన వెళ్ళుతారట : లోపలికి కేకవేసి చెప్పాడు.

"అప్పుడే బయలదేరారా అప్పా : టిఫిన్ చేసుకొని పోండి" అన్నది.

"టిఫిన్ దేముందిలేండి. తోవలో ఎక్కడైనా తింటాను. మీరు తాంబూలాలు పుచ్చు కునేందుకు ఫలానా రోజు రండి అని రాయండి వస్తాను. వీలైనంత తొందరలో పెళ్ళి జరిపించెయ్యండి" అంటూ లేచాను.

"తాంబూలాలు పుచ్చుకునేందుకు మీ వాళ్ళు ఎవరైనా వస్తారాప్పా:" అన్న దామె. “ఎవరూ రారండీ. నే నొక్కడినే వస్తాను" అని చెప్పాను ఖచ్చితంగా.

వాళ్ళందరితోటీ “వస్తానండి" అని చెప్పి బయలుదేరాను. ఆ అమ్మాయి కనిపిస్తుందే మోనని చాలా చూశాను గాని కనిపించలేదు.

ముసలాయన చెల్లెలుగారు బయటికొచ్చి కనబడకుండా కట్టడి జేసిందని తరువాత చెప్పింది.

నేను జంబాడ చేరేసరికి సాయంత్రం అయింది. రూములో ఓబుల్ రాజున్నాడు. సత్యం తిరుపతి నుంచి రాలేదట. ఓబుల్ రాజును కాఫీ పెట్టి ఇమ్మని అడిగాను. అత నా పనిలో నిమగ్నమవుతున్నంతలో నరసమ్మ కాఫీ గ్లాసుతో వచ్చింది. నేను కాఫీ తాగుతుండగా నరసరాజు వచ్చాడు.

నేను మంచం మీద కూచున్నాను. నరసరాజు స్టూలు మీద కూచున్నాడు. నరసమ్మ తలుపు నానుకొని నేలమీద కూచున్నది. ఓబుల్ రాజు కాఫీ పని మానేసి వంట పని చూస్తున్నాడు.

పోయిన పనయిందా సారూ?" అన్నది నరసమ్మ.

తిరుపతిలో జరిగిందంతా చెప్పాను.

"అంత దూరమూ పోయి వృధాగా వచ్చారన్నమాట" అన్నదామె నిరుత్సాహంగా. "మేం బయలు దేరేటప్పుడు మీరు ఎదురుగా వచ్చారు. అది మంచి శకునమని అనుకున్నా నప్పుడే. దానిఫలితం ఊరికే పోలేదు"

అని ఆమెను మెచ్చుకోలుగా చూసి మదనపల్లెలో జరిగిందంతా చెప్పాను. మహా ఉత్కంఠతో విన్నారిద్దరూ.

"పెళ్ళి సూపులకు వొకడివే పోయి అన్నీ మాట్లాడుకొని వచ్చావన్నమాట:" అన్నాడు నరసరాజు నవ్వుతూ.

"ఎవురి కేడ రాసి పెట్టుంటదో ఆడనే అవుతుంది. తిరుపతిలో కాకపోవడ మేంది: మదనపల్లెలో కుదరట మేంది. అంతా బగవంతుని మాయ:" అన్నది నరసమ్మ.

"ఎవరి కేడ రాసిపెట్టుంటే ఆడవుద్ది" అన్నాడు నరసరాజు.

"పెళ్ళి జన్మజన్మల బంధంట. నా మనిషి అక్కడ పుట్టి పెరిగింది" అన్నాను నవ్వుతూ. "అయినా నీకు బలే దయిర్నం సారూ:" అన్నది నరసమ్మ.

"ధైర్యం గాదూ, పాడూ గాదు. ఆడవాళ్ళతో మాట్లాడాలంటేనే భయం నాకు. నాకు తెలీకుండానే అట్లా అంతా జరిగింది" అన్నాను నవ్వుతూ.

"దించిన తల ఎత్తవు. ఈడ జూతున్నాంగా" అన్నది నరసమ్మ నవ్వుతూ.

"ఇదంతా సత్యం ప్రోద్బలంతోనే జరిగింది. అతను నిన్ననే రావాల్సింది. ఇంకా రాలేదే" అన్నాను.

"యాడబోయినాడో పాపం. ఆయన కిదేం దెలీదుగా " అన్నాడు నరసరాజు.

"ఇంతకీ పెల్లెప్పుడు?" అన్నది నరసమ్మ.

"నాలుగు నెలలు ఆగా లన్నారు. వాళ్ళ కేవో ఇబ్బందులున్నాయట" అన్నాను.

ఇంతలో ఎవరో వచ్చి-"బజన మందిరం కాడ అందరూ జేరారు రికార్సలుకు రావాలంట" అని చెప్పారు.

"ఇవాళ రానని చెప్పు. రేపట్నుంచీ చేద్దామని అన్నాడని చెప్పు" అని అతనికి చెప్పి పంపించాను.

కాసేపయిం తరువాత నరసమ్మ, నరసరాజు వెళ్ళిపోయారు. నేను స్నానం చేసి, భోజనం ముగించుకొని, మదనపల్లెలోని సన్నివేశాలను తలుచు కుంటూ పడు కున్నాను. అంత ధైర్యంగా అక్కడ ఎట్టా మాట్లాడగలిగానో నాకే ఆశ్చర్యంగా ఉందిప్పుడు. మూడు రోజులకు ముందు నేననుకోలేదు ఇంత త్వరగా నేనో ఇంటి వాడి నవుతానని. అందుకే అన్నారేమో - కళ్యాణ మెచ్చినా, కక్కొచ్చినా ఆగదని.

మరి కాసేపటికి నరసరాజు వచ్చి కూచున్నాడు. అమ్మాయి కులం, గోత్రం, డబ్బు, సొమ్ములు, వాళ్ళ స్థితిగతులు, అన్ని విషయాలూ అడిగాడు. ఉన్నదున్నట్లు ఆయనతో చెప్పాను.

"నీ కేమన్నా పిచ్చా యేవఁయ్యా: లచ్చనంగా గవర్మెంటుద్యోగం జేత్తుండావు. కట్నం, కానుకలు యేమీ లేకుండానే పెల్లి జేసుకుంటావా? వేలకు వేలు కట్నాలిచ్చి పిల్ల నిచ్చే వోల్లుంటారు. ఏందిది? నీకేం సదువు తక్కవా? తెలివితేటలు తక్కవా? నీ అసుమంటోడు దొరకటం ఎంతదురుట్టం: ఇట్టాలేనోల్ల సమ్మందం జేసుకోవటం నాకేం యిట్టంలేదు" అన్నా డాయన.

"వాళ్ళ డబ్బు, సొమ్ములు మన కెందుకండీ: అదృష్టం ఉంటే అన్నీ మనమే సంపాదించుకుంటాం. లక్షణంగా ఉద్యోగం జేస్తున్నాను. ఆ అమ్మాయి అదృష్టవంతురాలు. ఆమె నాతో చేరితే అదృష్టం నా ఒళ్ళో వాలినట్లే:" తన్మయత్వంతో అన్నాను.

"అదృష్టవంతురాలని నువ్వుజెప్పకుండానే తెలుస్తా వుందిలే. యీ యిసయాలన్నీ మీవోల్లకు రాయి" అన్నా డాయన.

"రేపే రాస్తాను. ఆ అమాయి ఫోటో గూడా పంపుతాను" అన్నాను.

"ఫోటో గూడా తెచ్చావా? యేదీ సూద్దాం. ఇటు సూపు" అన్నాడు నరసరాజు.

"ఫోటోవాళ్ళు పంపి చాలా రోజులైంది అంటూ మంచంమీది నుంచిలేచి జేబులో ఉన్న ఫోటో తీసి ఆయన చేతిలో పెట్టాను.

ఆయన గుడ్డి దీపం వెలుతుర్లో దాన్ని నిశితంగా చూశాడు. "పిల్ల బాగానే ఉందిగాని కట్నం లేకపోటమే యేం బాగాలేదు" అన్నాడు.

"ఫోటోలో కన్నా బాగుంటుంది పిల్ల" అన్నాను అమ్మాయి రూపాన్ని మననం జేసుకుంటూ.

“తలుసుకొని తలుసుకొని మురిసిపోతా వుండావులే" అంటూ నవ్వి, లేచి పోయాడు ముసలాయన.

ఆ పెద్దావిడ మాటి మాటికీ 'అప్పా' అని నన్ను సంబోధించటం ఇప్పుడు జ్ఞాపకం వచ్చి నవ్వొచ్చింది. ముసలాయన పాపం భార్యా బాధితుల సంఘ అధ్యక్ష స్థానానికి కావాల్సిన అర్హతలన్నిటినీ సంపూర్ణంగా కలిగి ఉన్నట్లు న్నాడు. వాళ్ళను తలుచుకొని చాలాసార్లు నవ్వుకున్నాను.

22

సత్యం ఏమైనాడో తెలీలేదు. అసలతను తిరిగి రూముకురాలేదు. సెలవు పెట్టాడేమో ననుకున్నాను. నాటి మాట ప్రకారం అతను నన్ను తిరిగి తిరుపతి తీసుకుపోవాలి. నేను పోను. అయినా అతని కిదంతా తెలీదు గదా: అసలు మనిషే అడ్రసు లేకుండా ఉన్నాడు.

మునసామి పెళ్ళి ప్రయత్నాలో స్థాయికి చేరాయి. త్వరలో అతను పెళ్ళి చేసుకుంటాడు. ముందుగానే రూము మాట్లాడుకొని అందులోకి మారి పోయాడు. రూములో నేనొక్కడినే మిగిలిపోయాను. నేను చూసి వచ్చిన సంబంధం గురించి మా వాళ్ళకు ఉత్తరం రాశాను. పెళ్ళి కూతుర్ని బాగా వర్ణించి రాశాను. ఫోటో గూడా ఉత్తరానికి జత చేసి పంపించాను. త్వరలో తాంబూలాలు పుచ్చుకునే కార్యక్రమం గూడా పూర్తి చేస్తానని రాసాను. తాంబూలాలు పుచ్చుకునేందుకు ఎప్పుడు రమ్మంటారంటూ మదనపల్లెకు ఉత్తరం రాశాను. దాంతోపాటే ఆ అమ్మాయి కో ఉత్తరం కూడా రాశాను. సమాధానం రాయమని కోరాను.

ఒక రోజు నేను స్కూల్లో ఉన్నప్పుడు సత్యం వచ్చి తన వస్తువులన్నీ తీసుకొని వెళ్ళిపోయాడట. నా ప్రవర్తనతో అతను అఫెండయి నట్టున్నాడు. నాకు మాట మాత్రం గూడా చెప్పలేదు. వెళ్ళిపోతున్నట్లు. నా పెళ్ళి ప్రయత్నానికి మూల కారకుడతను. అతని బలవంతం లేకపోతే నేనీ పని చేసి ఉండేవాడిని కాదు. ప్రయత్నం అతనిది. ఫలితం అతనికి దక్కలేదు. అంటే అతననుకున్నలా జరగటంలేదు. అతని కిది పెద్ద డిజప్పాయింట్మెంట్. అందుకే నాతో చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఆ రోజు ఆ అమ్మాయి బయటజేరి ఉండకుండా ఉంటే కథ మరోకలాగా ఉండేదేమో! అనుకున్న దొకటీ, అయిందొకటీ. అందుకే అన్నారేమో 'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని.

జీవితం రొటీన్ గా సాగిపోతున్నది. పగలు స్కూలు, రాత్రి డ్రామా. ఓబుల్ రాజు వండి పెడుతుంటే భోంచెయ్యడం, పడుకోవటం. పాపం నరసరాజు, నరసమ్మ నాకు మంచి కంపెనీ ఇస్తున్నారు. పెళ్ళి విషయాల గురించే వారి మాటలన్నీ. మొత్తం మీద ఒంటరి తనం ఫీలవటంలేదు నేను.

మునసామినాయుడు పెళ్ళి చిత్తూరులో జరిగింది. చాలా ఆడంబరంగానే చేశారు. అందరం పోయి వచ్చాము. స్కూలు స్టాపు తరపున ప్రెజెంటేషను కూడా ఇచ్చాము.

నా మనసు మాటి మాటికీ మదనపల్లె వైపు పరుగులు తీస్తున్నది. అక్కడ రెక్కలు కట్టుకొని వాలుదా మనిపిస్తుంది. పోతే వాళ్ళేమంటారో, అను కుంటారో అని భయం. వాళ్ళు ఉత్తరం గూడా రాయలేదు. ఇంతకు ముందు స్త్రీని గురించి, ఆమె అందించే సుఖాన్ని గురించి ఆలోచించేవాడిని గాదు. సంసారం సాగరం, దుఃఖం అనే వేదాంతంలో ఉండే వాడిని. చదువంతా కో-ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్లో జరగలేదు కాబట్టి ఆడపిల్లల్ని చూడటం, వాళ్ళ అందచందాలను గురించి కామెంట్ చెయ్యటం వంటి పనులు నేను చేసేందుగ్గాని, చేసేవాళ్ళను చూసేందుగ్గాని అవకాశం దొరక లేదు. ఇప్పుడిది పట్టుకున్నది. మనసు స్థిమితంగా ఉంటంలేదు. ఏ పనీ సక్రమంగా చెయ్యలేక

పోతున్నాను. డ్రామా రిహార్సలుకు కూడా బలవంతంగా పోతున్నానుగాని, ఇష్టపూర్వకంగా పోవటంలేదు.

ఇంటి నుంచి ఉత్తరం వచ్చింది. "నీ ఇష్టం" అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు.

మదనపల్లె నుంచే ఉత్తరం రాలేదు. నాలో సహనం చచ్చిపోయి రామకృష్ణ గారికి ఉత్తరం రాశాను. నేను మదనపల్లె పోవటం, పిల్లను చూచి రావటం, వగైరా విషయాలన్నీ రాశాను. "తాంబూలాలు పుచ్చుకునేందుకు ముహూర్తం నిర్ణయించి రాస్తామన్నారు. ఇంతవరకూ రాయలేదు. మీరు పోయి విషయం కనుక్కొని నాకు ఉత్తరం రాయండి. ఒక వేళ వాళ్ళకు నా సంబంధం ఇష్టం లేకపోతే నాకు తెలియ జెయ్యండి. ఆ ఆలోచన మానుకుంటాను' అని గూడా రాశాను.

నాలుగు రోజులకు రామకృష్ణగారి దగ్గర్నించి సమాధానం వచ్చింది. కవరు చించి ఆత్రంగా చదివాను. ఆ ఉత్తరం నిండా ఆ సంబంధం వదులుకోమని సలహాలు రాశాడు. వాళ్ళు మంచివాళ్ళు గాదన్నాడు. ఇంటి మగవాళ్ళు ఎందుకూ కొరగాని దద్దమ్మలని రాశాడు. తనదగ్గర పెళ్ళికూతుళ్ళు ఫోటోలతో సహా సిద్ధంగా ఉన్నారట. లాయర్ల కూతుళ్ళు, డాక్టర్ల కూతుళ్ళు, టీచర్లుగా పనిజేస్తున్న వాళ్ళు చాలా మంది ఉన్నారట. ముప్పై, నలభై వేలకు తక్కువ గాకుండా నీకు కట్నం వచ్చే ఏర్పాటు చేస్తాను. పైగా వాళ్ళది, మీది వేర్వేరు శాఖలు. ఆ విధంగా శాఖా సంకరం జరగడం నా కిష్టంలేదు. అసలు వాళ్ళ కేముందని ఈ సంబంధం ఒప్పుకున్నావు? నువ్వు నా దగ్గరికి రా. అతి త్వరలో మంచి సంబంధం చూచి పెళ్ళి జరిపించేస్తాను. అశ్రద్ధ చేయవద్దు. వాళ్ళ సంబంధానికి అసలు అంగీకరించ వద్దు. నీ శ్రేయోభిలాషి రామకృష్ణ" అంటూ ముగించాడు.

ఈ భూ ప్రపంచంలోనే నొకడి నున్నానని వాళ్ళకు సమాచారం అందించింది ఈ మహాను భావుడే! ఇతని ప్రోద్భలంతోనే వాళ్ళునాకు ఉత్తరం రాసి, ఫోటో పంపించారు. అప్పటి మంచివాళ్ళు ఇప్పుడు చెడ్డవాళ్ళు ఎందుకైనారో అర్థం కాలేదు.

“వాళ్ళతో మాట్లాడి తొందర పెట్టవయ్యా మహానుభావా" అంటే "అసలు వాళ్ళతో సంబంధమే” వద్దని హితబోధ చేస్తున్నాడు. వాళ్ళు ఉత్తరం రాయకుండా ఆలస్యం ఎందుకు చేస్తున్నారు? నేను తొందరపడి తప్పు చేశానా? వాళ్ళు నన్ను తేలిక భావంతో చూస్తున్నారా? వాళ్ళకు కూడా ఈ రామకృష్ణ నా గురించి చెడుగా చెప్పాడేమో! ఉట్టి పుణ్యానికి ఉంగరం పోగొట్టుకున్నాను. రకరకాల ఆలోచనలతో బుర్ర వేడెక్కి పోతున్నది. ఏం జెయ్యాలో అర్థం గావటంలేదు.

ఉదయం తొమ్మిది గంటలైంది. స్కూలుకు పోయేందుకు సిద్ధమవుతున్నాను.

ఇంతలో ఒక పిల్లవాడు పరుగెత్తుకుంటూ రూము దగ్గరి కొచ్చాడు. “గవర్నెంటు జీపు ఇస్కూలు కాడి కొచ్చింది సార్ " ఎవురో ఆపీసరు మిమ్మల్ని రమ్మంటావుండాడు" అని చెప్పాడు వాడు.

“వస్తున్నాను పద” అంటూ వాడి వెనుక వడివడిగా నడుస్తూ పోయాను.

నేను పోయేసరికి ఆయన ఆఫీసు రూములో నేను కూచునే కుర్చీలో కూచొని ఉన్నాడు.

ద్వారంలో నుంచే “నమస్తే సార్!” అన్నాను.

“అయాం జిల్లా పరిషత్ సెక్రెటరీ! ఇక్కడ హెడ్మాస్టరువు నువ్వేనా?” అన్నాడాయన. ఆయన ఏకవచన సంబోధనం నాకు బాధ కలిగించింది. ఎంతయినా ఆయన పెద్ద ఆఫీసరు. మా ఇద్దరి చదువు ఒకటే అయినా.

“అవును సార్!” అన్నాను వినయంగా.

“ఇక్కడ స్టాఫంతా ఉన్నారా? ఇంకా ఎవరన్నా కావాలా?" అడిగాడాయన. ఇప్పుడందరూ ఉన్నారు సార్! వచ్చే సంవత్సరం మీరు పదోతరగతి శాంక్షన్ చేస్తే అవసరమవుతారు" అన్నాను.

"అయామ్ ఆస్కింగ్ ఆఫ్ ది ప్రెజెంట్. యూ ఆర్ టాకింగ్ ఎబౌట్ ది ఫ్యూచర్! అంటూ నవ్వాడాయన. సిగ్గుపడ్డాన్నేను.

ఇంతలో ఓబుల్రాజు గంటకొట్టాడు. ఇంతవరకూ ఆఫీసు రూము చుట్టూ తిరుగుతున్న పిల్లలు తమ తమ గదుల్లోకి దూరారు పాకలో.

టీచర్లు ఒకరి తరువాత ఒకరు వచ్చి సెక్రెటరీగారికి నమస్కారం పెట్టి అటెండెన్సు రిజిస్టర్లో సంతకం పెట్టి క్లాసు రిజిస్టర్లు తీసుకొని వెళ్ళిపోయారు. వచ్చిన వారిని వచ్చినట్లు నే నాయనకు పరిచయం చేశాను.

"తొమ్మిదిన్నరకా స్కూలు మొదలయ్యేది?" అడిగాడాయన.

"అవును సార్! మరో అయిదు నిముషాల్లో ప్రార్థనా సమావేశం జరుగుతుంది. మా ప్రార్థనా సమావేశంలో మీరేమైనా మాట్లాడండి సార్!" అడిగాను వినయంగా నవ్వును తెచ్చుకుంటూ.

"ఆల్ రైట్. దాందేముంది? ఐ షల్ స్పీక్. యూ అరేంజ్ ఫర్ దట్" అన్నాడాయన కర్చీపుతో ముఖం తుడుచుకుంటూ.

ఇంతలో ఓబుల్రాజు కాఫీ తీసుకొచ్చాడు. అతని చేతిలోంచి గ్లాసు తీసుకొని ఆయన కందించాను. ఆముదం తాగినట్లు తాగాడాయన కాఫీ.

"అబ్బా ఏం కాఫీనయ్యా ఇది? ఎలా తాగుతున్నారు మీరు?" ఆశ్చర్యంతో అడిగా డాయన. "అలవాటు పడిపోయాం సార్, ఇంతకుమించి మంచికాఫీ దొరకదు సార్!" అన్నాను పళ్ళికిలిస్తూ .

"మద్రాసు పోయే పని పడింది ఈ దారిలో. మీ స్కూలుంది గదాని చూచిపోవచ్చాను. నేను మధ్యాహ్నం వెళ్ళిపోతాను" అన్నారు. అంటే మధ్యాహ్న భోజనానికి ఏర్పాటు చెయ్యాలన్నమాట. ఆయనతో బాటు ప్యూను, డ్రైవరు ఉన్నారు.

ఓబుల్రాజును పక్కకు పిలిచి - "నరసమ్మగా రింటికి పోయి ముగ్గురు మనుషులకు భోజనం కావాలని చెప్పు" అన్నాను.

“స్కూలుకు ఎవురన్నా వోస్తే ప్రెసిడెంటుగారింట్లోంచి తెస్తాం సార్" తలగీరుకుంటూ అన్నాడతను

“సరే నీ ఇష్టం. ఎక్కణ్ణించయినా సరే. ముగ్గురు మనుషులకు భోజనం తీసుకురావాలి మరో గంట గంటన్నరకల్లా. ఆయన మధ్యాహ్నానికి వెళ్ళిపోతాడట" అన్నాను.

“సరే సా. పెసిడెంటుగారింటి నించే తెత్తాను” అంటూ వెళ్ళాడు.

శ్రీనివాసులుతో "సెక్రెటరీగారు మన ప్రార్థనా సమావేశంలో మాట్లాడుతారు. టేబులు, కుర్చీవేయించండి” అన్నాను.

మేము రూములో ఉండగానే శ్రీనివాసులు వచ్చి "అంతా రెడీ సార్!" అన్నాడు. - “రండి సార్ పోదాము" అంటూ ఆయన్ను రూములోంచి బయటికి తీసుకుపోయాను. ఇద్దరం ప్రార్థనా స్థలానికి చేరాము. నేను సెక్రెటరీగార్ని పిల్లలకు పరిచయం చేసి ఆయన్ను నాలుగు మాటలు చెప్పాల్సిందిగాకోరాను.

గొంతు సవరించుకొని ఆయన - "నేటి బాలురే రేపటి పౌరులు, మీరు మంచి డిసిప్లిను అలవాటు చేసుకోవాలి. పాఠాలు బాగా చదవాలి. మంచి మార్కులతో పరీక్షలు పాసు కావాలి. మీరే కాబోయే ప్రెసిడెంట్లు, మంత్రులు, ప్రధానమంత్రులు, కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు. అందుకు మీరు బాగా చదవాలి...." అలా సాగింది ఆయన ఉపన్యాసం. పది పదిహేను నిముషాలు మాట్లాడా డాయన.

ఆయన మాటలు వింటూ - 'దేశానికి కావాల్సింది ప్రెసిడెంట్లు మంత్రులు, డాక్టర్లు, యాక్టర్లు గాని మరెవరూ కానట్లుంది' అనుకున్నాను.

ఆయన ఉపన్యాసం పూర్తి కాగానే పిల్లలు చేతులు తట్టారు. నేను సెక్రెటరీగారికి ధన్యవాదాలు తెలిపాను. జాతీయగీతం పాడిం తరువాత పిల్లలు క్లాసుల్లోకి పోయారు.

సెక్రెటరీగారు నాతో బాటు ఆఫీసు రూములో కొచ్చారు. రూము కప్పుకేసి చూస్తూ - "ఫ్యాను పెట్టించుకోలేదా రూములో?" అన్నారు.

“ఈ ఊరి కింకా కరెంటు రాలేదు సార్!" అన్నాను నవ్వుతూ.

కాసేపు సేదదీరింతరువాత -" ఐ వాంట్ టు సీ యువర్ క్లాసెస్" అన్నారు. నేను వెంట బెట్టుకొని బయలుదేరాను. అన్ని రూముల్లోనూ టీచర్లు పాఠాలు చెబుతున్నారు.

ఆ పాకలోకి బాగా వంగి పోవాలి. ఆఫీసరు దర్జా ఆయన్ను వంగనివ్వలేదు. లోపలికి పోబోయిన అతని నుదురుకు వెదురుబద్ద గుచ్చుకున్నది. నుదుటిని చేత్తో పట్టుకొని - “ఛఛ! ఇవేం క్లాసు రూములయ్యా? ఇక్కడెలా పని జేస్తున్నారు మీరు? ఐ నెవ్వర్ సా సచె డర్టీ స్కూల్. చూచింది చాల్లే. లెటజ్ గో' వెనక్కు తిరిగి ఆఫీసు రూములోకి వచ్చాడు.

ఏడవాలో నవ్వాలో అర్థం కాలేదు నాకు. ధుమ ధుమ లాడుతూ కుర్చీలో కూచున్నాడు. ఆయన ముఖం వంక చూశాను. ఎర్రగా కందింది గాని గాయం కాలేదు. గ్లాసులో మంచినీళ్ళు తీసుకుపోయి ఇచ్చాను. ఆయన తాగాడు. దాని పుణ్యానికి గాయం కాలేదు. అయిఉంటే చచ్చి ఉండేవాళ్ళం. ప్రథమ చికిత్స చేసేందుగ్గూడా ఏమీలేదిక్కడ. టించరయోడిన్, బోరాక్స్ పౌడరు కావాలంటే ఎనిమిది మైళ్ళు నడవాల్సిందే.

ఆయన బాధలోంచి తేరుకున్న తరువాత “స్కూలు కమిటీ వాళ్ళు స్కూలుకోసం కొత్త భవనాలు నిర్మించారు. చూద్దురు గాని రండి" అని ఆయన్ను ఆహ్వానించాను. ఏ లోకా నున్నాడో వచ్చేందుకు ఒప్పుకున్నాడు. మాతో పాటు ఖాళీగా ఉన్న టీచర్లు గూడా వచ్చారు. “గార్డెన్ గూడా పెట్టించినట్లున్నారే! బాగుంది. ఇంకా స్కూలు ఆ షెడ్డులోనే ఎందుకుంచారు?ఇక్కడికి షిఫ్ట్ చేసి ఉండొచ్చును గదా! అన్నాడు.

"ఇంకా ఫ్లోరింగు జరగలేదు సార్" అన్నాను.

“ఆయన అన్ని రూములూ చూశారు. దీనికి త్వరగా ఫ్లోరింగు చేయించమనండి. గోడలకు సిమెంటు గూడా చేయించమనండి” అన్నాడు “వాళ్ళు మీ మాట వినరనుకుంటే స్కూలు కమిటీ ప్రెసిడెంటును పిలిపించు. ఐ షల్ టాక్ టు హిం.”

ఆఫీసు రూములో కొచ్చాము.

“ప్రెసిడెంటుగార్ని పిలిపిస్తాను సార్!” అన్నాను.

“నీ సర్వీసెంత?” అన్నారు.

“ఏడు సంవత్సరాలు సార్”

“వాట్! ఏడు సంవత్సరాలు సర్వీసు పెట్టుకొని ఇలాంటి స్కూల్లో పడున్నావా! వాటే మేన్ యూ ఆర్? రెండు సంవత్సరాల సర్వీసున్న వాళ్ళందరూ టెస్టు పాసయి హైస్కూళ్ళ హెడ్మాస్టర్లయిపోతుంటే ఏడు సంవత్సరాల సర్వీసు పెట్టుకొని ఇక్కడ పడున్నావా? రియల్లీ పిటీ యూ!" అంటూ కుర్చీలోంచి లేచా డాయన.

బయటి ప్రపంచంలో ఏం జరుగుతున్నదో తెలుసుకోటంలేదు నేను. ఆయన మాటలకు నా తల తిరిగిపోయింది. నాకంటే తక్కువ సర్వీసున్నవాళ్ళు నాకంటే ఎక్కువ హోదా అనుభవిస్తూ, ఎక్కువ జీతాలు తీసుకుంటున్నారు!

"టెస్ట్ పాసు కావయ్యా మొద్దు పంతులూ! యువర్ వర్క్ డోంట్ పే యూ దీజ్ డేస్!... ఆల్ రైట్. నేను పోతాను. జీపు స్టార్ట్ చెయ్యమని డ్రైవరుకు చెప్పు" అంటూ ప్యూనుకు జారీ చేశాడు. అతను అతి వినయంగా పరుగుదీశాడు.

“భోజనం చేసి పొండి సార్! ఏర్పాటు చేయించాను" అన్నాను దీనంగా ముఖం పెట్టి. "ప్రెసిడెంటుగారితో మాట్లాడతా మన్నారు" అన్నాను.

"నో నో! ఐ డోంట్ వాంట్ టు ట్రబుల్ యు. మధ్యలో ఎక్కడో తింటాములే. వస్తాను" అంటూ జీపులో కూచున్నారాయన. వెనక సీట్లో బంట్రోతు కూచున్నాడు.

"వుయ్ షల్ డూ దట్ నెక్స్ట్ టైమ్! యూ పాస్ ది టెస్ట్" అంటూ వెళ్ళిపోయా డాయన.

ఇక్కడ నేను బిల్డింగు, డ్రామా అని కొట్టుకుంటూ కూచున్నాను. అక్కడ నాకంటే తక్కువ సర్వీసున్న వాళ్ళు నిచ్చెన పై మెట్లెక్కేస్తున్నారు. అయా మె ఫూల్-అనుకొని చాలా బాధపడ్డాను. టెస్టు కట్టాలని దృఢంగా నిర్ణయించుకున్నాను.

ఇలా మారుమూల పల్లెల్లో ఉన్నందుకు అన్నీ నష్టాలే. హౌస్ రెంట్ అలవెన్సులు లేవు. కాంపెన్సేటరీ అలవెన్సులు లేవు. జీవితంలో పైకొచ్చే అవకాశాల్లేవు. పరీక్షలు పాస యేందుకు ఆవగింజంత సహాయం దొరకదు. ఆధునిక జీవిత సౌకర్యాల మాట దేవుడెరుగు!

ఆయన పాపం నా కీ వార్త చెప్పటానికే వచ్చినట్లున్నాడు.

ఆయన చెప్పకుండా ఉంటే మరో నాలుగైదేళ్ళు నే నిలాగే ఉండిపోయే వాణ్ణి. బెటర్ లేట్ దేన్ నెవ్వర్! ఇప్పటికైనా మేల్కొనాలి. వెంటనే అకౌంట్ టెస్టుకు కట్టాలి. ఇప్పటికే చాలా నష్టం జరిగిపోయింది. నా తెలివితక్కువతనానికి చాలా నొచ్చుకున్నాను. నా కళ్ళు తెరిపించిన సెక్రెటరీగారికి కృతజ్ఞతలు మనసులోనే చెప్పుకున్నాను.

జీవితం పరుగులో నేను వెనుకబడిపోయాను. స్కూలు మంచి కోసం, ఊరి మంచి కోసం పనిజేస్తూ నేను నష్ట పడ్డాను. స్వప్రయోజనాలను మరిచిపోయి పని చెయ్యటం నేరం. ఆయన చాలా చక్కగా చెప్పాడు. "యువర్ వర్క్ వోంట్ పే యూ దీజ్ డేస్" అని, అది ప్రత్యక్షర సత్యం.

ఎంతసేపూ ఊరి పనీ, స్కూలు పనీ చేస్తూ ఉండటమే గాదు, నీ అవసరాల గురించి, నీ పురోభివృద్ధిని గురించి కూడా ఆలోచించాలి. ఆయన రాక నా కీ పాఠం నేర్పింది.

ఆయన భోంచేసి పోయి ఉంటే బాగుండేది. ఆయనకు మంచి కాఫీ అయినా ఇవ్వలేక పోవటం నిజంగా దురదృష్టం.

ఆ అమ్మాయి కాఫీ బాగా తయారు చేస్తుంది!

అవునూ, స్వవిషయాలను గురించి ఆలోచించేవాడు ఇతర విషయాలను గురించి ఆలోచించగలడా? తన పురోభివృద్ధిని గురించి ఆలోచించేవాడు ఇతరుల అభివృద్ధికి పాటుబడగలడా? ఈ ప్రశ్నలకు ఈ వ్యవస్థే సమాధానం చెప్పాలి!

ఆయన వెళ్ళిపోయిన గంటకు ఓబుల్ రాజు చెమట కార్చుకుంటూ వచ్చాడు." భోజనం రెడీగా వుందిసా!" అని చెప్పాడు.

"ఆయన వెళ్ళిపోయాడయ్యా. నువ్వు పడిన శ్రమంతా వృథా అయింది" అన్నాను నవ్వుతూ.

అతని ఉత్సాహం నీరు గారింది.

"సెక్రెటరీ అప్పుడే వెళ్ళిపోయారేంసార్?" అంటూ వచ్చారు? టీచర్లు.

"ఆయనకు ఇక్కడ ఉండబుద్ధి పుట్టినట్లు లేదు. ఏలాగో తోవ తప్పి వచ్చారు. మంచి కాఫీ అయినా ఇవ్వలేకపోయాం" అన్నాను.

"ఆఁ ఇక్కడ పెద్ద పెద్ద హోటళ్ళున్నాయీ. మనం తెప్పించి యివ్వలేకపోయాం! మనం మహా మంచి కాఫీ తాగేదుస్తున్నామా ఆయనకు ఒక్క పూట. మనం సంవత్సరాల తరబడి చస్తావున్నామే!" అన్నాడు చంగల్రాయలు.

"మనం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నామో అయన అర్థం చేసుకుంటే చాలు" అన్నాడు చంగయ్యశర్మ.

"ఇక్కడ స్కూలు పెట్టిం తరువాత విజిటు కొచ్చిన పెద్ద ఆఫీసరు ఈయనేనేమో!" అన్నాడు శ్రీనివాసులు.

"ఆయన రానన్నా వచ్చాడు గాని నా కళ్ళు తెరిపించాడు. నా కంటే జూనియర్లు హెడ్మాస్టర్లుగా ప్రమోటై ఎక్కువ జీతాలు తీసుకుంటున్నారట" అన్నాను. నేనేమో ఇంకా ఎకౌంట్ టెస్టు కట్టను గూడా లేదు. ఇక్కడ ఉన్నందువల్ల నేనెంత నష్టపోయానో తెలుసా?.

"మీ రొకరే గాదు సార్! అందరం నష్టపోతున్నాము. టౌన్లో ఒక్కో టీచరు బ్యాచీలుగా ట్యూషన్లు చెప్పి మేడలు, మిద్దెలు కట్టుకుంటున్నారు. సైడ్ బిజినెస్ లు చేసుకుంటున్న వాళ్ళెందరో. వాళ్లకు స్కూలు పని పార్ట్ టైమ్ సార్! ఇతర పన్లు లేకపోతే స్కూలుకు పోతారు. మనమేం సంపాదిస్తున్నాం ఇక్కడ? పైగా చేద్దామంటే వేరే పనేముంది. ఇల్లు వదిల్తే స్కూలు, స్కూలు వదిల్తే ఇల్లు. ఊరికేనన్నా వచ్చి చదువుకోండిరా బాబూ అన్నా ఒక్కడూ రాడు. పల్లెల్లో స్కూళ్ళు దండగ సార్! ఎవరో ఒకడు తెలివిగా పరీక్షలు పాసై పై చదువులు చదివినా టౌన్లో ఉద్యోగం కోసం పోరాడితే గాని పల్లెకురాడు. ఇక పల్లె లెట్లా బాగుపడతాయ్. ఇక్కడ స్కూలు పెట్టింది పిల్లల చదువు కోసం కాదు సార్! మనబోటి నోరు చచ్చిన వాళ్ళను శిక్షించడానికి." ఆవేశంగా అన్నాడు మునసామి నాయుడు.

మునసామి మాటల్లో గూడా పాయింటుంది.

ఇక్కడ పది నిముషాలుండేందుకు బాధపడ్డా డాయన. మేము సంవత్సరాల తరబడి ఉంటున్నాము. మా యోగక్షేమాల గురించి అణు మాత్రమైనా శ్రద్ధ కనబరచలే దాయన. ఇక్కడ మే మనుభవిస్తున్న కష్టసుఖాల గురించి అడగ లేదు. తన అధికార ధర్మాన్ని ఆ పది నిముషాలసేపు జీపులో వదిలిపెట్టి మనుషుల్లో మనిషిగా కలిసి పోలేదు. మాకు ఎన్నిసార్లు వెదురుపుల్లలు పొడుచుకున్నాయో! మేము వెనక్కుదిరిగి పొలేదే! గోడలకు సిమెంటు చేయించమని, ఫ్లోరింగు చేయించమని సలహా ఇచ్చాడు. ఆ మాత్రం మాకు

తెలీదా? ప్రెసిడెంటును పిలిపిస్తానంటే ఆయన వచ్చేంత వరకు ఉండే ఓపిక లేదాయనకు. కొత్త రూములకు సిమెంటు ఏ కారణంగా చేయించలేదో, ఫ్లోరింగు ఇంకా ఎందుకు చేయించలేదో అడిగాడా? ఇక్కడ ఇంత పని చేశాము, తనవంతు సాయం ఏంచెయ్యగలడో చెప్పి ఉంటే ఎంత బాగుండేది! ఆయనకు మద్రాసులో పని ఉంది. తమిళనాడులో తెలుగు ప్రభుత్వ జీపు తిరిగితే తప్పు. తప్పును ఒప్పు చేసుకునేందుకు తమిళనాడులో తెలుగు దీవి జంబాడకు విజిట్. రూలు ప్రకారం పని చేస్తున్నాడాయన. మన రూల్సు అవకాశవాదులను అందలా లెక్కించేందుకు ఉపయోగపడుతున్నాయి గాని మరెందుకూ గాదు.

మనసు గందరగోళంగా ఉంది.

ఆ రోజుకు స్కూలు చాల్లెమ్మని గంట కొట్టించి పిల్లల్ని ఇళ్లకు పంపించేశాను.

ముందుగానే ఇంటికి పోతున్నందుకు వాళ్ళ ముఖాల్లో సంతోషం లేదు. సంతోషించే సత్తువ లేదు. వాళ్ళకు. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళారు వాళ్ళు.

రూముకు పోయి అన్నంతిని పడుకున్నాను. సెక్రటరీగారు వచ్చి పోయినందుకు అభినందించాలో, అభిశంసించాలో అర్థం గావటం లేదు.

ఈ ఊళ్ళో ఇక ఉండగూడదు. ఉన్నది చాలు ఎలాగైనా బయటపడాలి. ఎలా? ఎలా? ఎలాగైనా వచ్చే ఏడు ఈ స్కూల్లో పదో తరగతి ప్రారంభమయ్యేట్లు చూడాలి. అప్పుడిది పూర్తిస్థాయి హైస్కూలవుతుంది. ఎకౌంట్ టెస్టు పాసయిన హెడ్మాస్టర్ను వేస్తారు. నాకు ఎలిజిబిలిటీ ఉండదు, హెడ్మాస్టరుగా కొనసాగేందుకు. నాకు మరో చోటుకు బదిలీ ఇస్తారు. ఏ ఊరయినా ఇంత అధ్వాన్నంగా ఉండదు.

(ఇవి తెలియనితనంతో అనుకున్న మాటలే. కాని దీని తాత ల్లాంటి ఊళ్ళున్నాయని తరువాత అనుభవం మీద తెలుసుకున్నాను.)

నా తక్షణ కర్తవ్యం అకౌంటెస్టు కట్టి పాసవడం.

ఆలోచిస్తూ ఆలోచిస్తూ నిద్రబోయాను.

“మీ కోసం ఎవురో వచ్చారు సారూ!" అని కేకలు వేస్తూ లేపింది నరసమ్మ గోడ అవతలనుంచి.

నేను కళ్ళుతెరిచి చూచాను.

ఎదురుగా నాకు కాబోయే బావమరిది కనిపించాడు. అతన్ని పరామర్శించటం పూర్తి చేశాను. స్టూలు మీద కూచోమన్నాను. అతను తోవ మధ్యలో భోంచేసే వచ్చాడట. యోగక్షేమాలు విచారించడం పూర్తయినతరువాత “వచ్చిన పనేమిటి?" అని అడిగాను.

“తొందరగా తాంబూలాలు పుచ్చుకుందామని మీరు రాశారట. అదుగో ఇదుగో అంటూ వాయిదాలు వేసుకుంటూ కూచున్నారు మావాళ్ళు. మా ఇంట్లో ఒక ముసలమ్మ జేరింది లెండి. అన్నిటికీ ఆటంకమాయె” అన్నాడతను.

“ఇంతకూ ఇప్పుడు నువ్వెందుకు వచ్చావో చెప్పవయ్యా” అన్నాను విసుగ్గా.

“మిమ్మల్ని పిలుచుకురమ్మని పంపారు” అన్నాడు.

ఉత్తరం రాస్తే నేను రెక్కలు కట్టుకుని వాలేవాడిని. ఇదో దండగ మనిషిని పంపి తీసుకురమ్మనటం. బహుశా అల్లుడికి చేసే మర్యాదలు చేస్తున్నారేమో!

"ఇక్కడ నాకు చాలా పనులున్నవి గదయ్యా! వెంటనే వచ్చేందుకు వీలు కాదే!" అన్నాను బెట్టుసరిగా.

"మీరలా అంటే ఎలా? మీ కోసం అదేపనిగా వచ్చాను. మీరు రాకపోతే మా వాళ్ళంతా నిరుత్సాహపడతారు. మీరు తప్పక రావాలి.

మా చెల్లెలు మీ కోసం ఎదురు చూస్తున్నది చకోరంలా!" వగైరా మాటలతో నన్ను బ్రతిమాలుతాడనే ఆశతో అన్నా నా మాట.

“అయితే ఎప్పుడోస్తారో చెప్పండి. నేను వెళ్ళి మా వాళ్ళకు చెబుతాను” అని తిరుగు ప్రయాణానికి ఉద్యుక్తుడయ్యాడు.

రామకృష్ణ రాసిం దాంట్లో అబద్ధం ఏమీలేదు!

ఇప్పుడెలా పోతావు? ఈ రాత్రికి ఇక్కడుండు. ఉదయమే పోదువుగాని. నేనూ రావటానికి వీలవుతుందేమో చూస్తాను" అన్నాను. నా దైన్యానికి నాలో నేను నవ్వుకున్నాను. “మీకు తీరికయినప్పుడేరండి” అనలా పుణ్యాత్ముడు. అయినా తప్పంతా నాది. అతగాడికి బుద్ధి నేలమట్ట మౌతుందట.

సెక్రటరీగారి రాకమీది నుంచి ఆలోచనలు మదనపల్లె మీదికి మళ్ళాయి.

శ్రీనివాసులుకు ఒక చీటీ రాసి బుద్ధిగా ఉదయమే అతని వెంట బయలుదేరాను. అతని బస్సు ఛార్జీలు కూడా నేనే పెట్టాను. సాయంత్రానికి ఇల్లు చేరాము.

తాంబూలాల తతంగం ఆ రాత్రే ముగించారు. వాళ్ళు ఏమేం పనులు చెబితే ఆ పనులన్నిటినీ మంత్రముగ్ధుడిలా చేశాను. రాత్రి భోంచేసి పడుకున్నాను. ఎంతకూ నిద్రపట్టలేదు. ముసలివాళ్ళు చాలా రాత్రి వరకు నన్నుకొరుక్కు తిన్నారు. వయసావిడ భోజనాల దగ్గర తళుక్కు తళుక్కుమంటూ మెరిసింది. ఆ తళుకులను మననం చేసు కుంటూనే పడి ఉన్నాను తెల్లవారుఝాము దాకా. నాకు తెలీకుండానే నిద్ర పట్టింది.

"శానా పొద్దెక్కింది. లేవండప్పా?" అంటూ వచ్చింది పెద్దావిడ.

లేచి కూచొని కళ్ళు నులుముకుంటూ దిక్కులు చూశాను. కళ్ళు నా మనిషి కోసం వెదికాయి. నిరాశే మిగిలింది. దొడ్లోకి పోయి, ముఖం కడుక్కొని లోపలి కొచ్చాను. మళ్ళీ నాకు వేసిన మంచం మీద ఒక నిముషం కూచొని తరువాత వెనక్కు వాలి పడు కున్నాను. కాలు మీద కాలు వేసుకొని ఆలోచిస్తూ.

మబ్బుల చాటునుంచి చందమామలా, లడ్డుండ లోనుంచి జీడి పప్పులా, ఆకుచాటున, ముళ్ళమాటున ఒదిగిన రోజాపువ్వులా నాముందు నిలిచింది నా మనోహారిణి మాటా పలుకూ లేకుండా కాఫీ గ్లాసును ముందుకు చాపి.

నేను గబాల్న లేచి కూచున్నాను. ఆమె ముఖంలోకి చూస్తూ కాఫీ గ్లాసందుకొన్నాను. వెంటనే వెనక్కు తిరిగి పోబోయింది. నేను ఒడుపుగా చెయ్యి పట్టుకొని “రావే నా చెలియా!' అంటూ దగ్గరికి లాక్కున్నాను. “వద్దు వద్దు ” అంటూనే నా బిగికౌగిలిలో ఒదిగిపోయింది. జీవితంలో మొట్ట మొదటిసారి అధరసుధారసపానం చేశాను. “మా వాళ్ళు చూస్తా” రంటూ లేచి పోబోయింది.

ఇంతలో "ఏం చేస్తున్నావమ్మా విజయా" అంటూ ముసలాయన చెల్లెలు కేకవేసి పిలిచింది.

“పోతున్నా” అని కళ్ళతోనే చెబుతూ గబగబా వెళ్ళిపోయింది.

నేను కాఫీ గ్లాసందుకొని తాగాను. సగం చల్లారిపోయింది కాఫీ.

తొమ్మిది గంటలకు టిఫిను పెట్టారు. మళ్ళీ ఏ సాకుతోనయినా నాదగ్గరికి వస్తుందేమో అని ఆశపడ్డాను. రాలేదు. ఆ ఆశతోనే ఆరోజు అక్కడున్నాను వాళ్ళు ఉండమనక పోయినా. ఉదయం జంబాడకు ప్రయాణమయినాను అయిష్టంగానే. ముసలాయనకు “త్వరలో ముహూర్తం పెట్టించి పెళ్ళి జరిపించండి" అని చెప్పాను.

"పెళ్ళంటే మాటలా అప్పా? అన్నీ చేసుకోవద్దూ? మరీ మీరు అంత తొందరపడితే ఎట్లా గప్పా?" అంటూ సిగ్గుపడిందామె.

"మీ పెద్దవాళ్లకు రాశారా? వాళ్ళు ఒప్పుకున్నారా?” అంటూ ఆరాలు తీసింది ముసలాయన చెల్లెలు.

" అన్నీ జరిగినయ్. మీదే ఆలస్యం" అని చెప్పాను.

“ఒక రెండు నెల్లు ఓపిక పట్టండి. డబ్బు సంతన గావాలిగా" అన్నదావిడ. ఇక్కడ ఒక వంక వీళ్ళతో మాట్లాడుతూనే మరో వంక నాకన్నుల చందమామ కోసం వెదికాను. తలుపు చాటునుంచి ముఖం బయటికి పెట్టి నుంచున్నది. నే నామె దగ్గరకు పోయి ఆమె చేతిని నా చేతిలోకి

తీసుకున్నాను. మిగిలిన వాళ్ళకు వినిపించకుండా- "నువ్వు వస్తావేమోననే ఆశతో నిన్నంతా ఉన్నాను" అన్నాను.

“మా వాళ్ళు రానివ్వలేదు” అన్నది తలవంచుకొని.

ముసలివాళ్ళ మీద ఎక్కడలేని ఆగ్రహం వచ్చింది. “నువ్వు రావాలనుకొని ఉంటే ఎలాగైనా వచ్చి ఉండొచ్చు" అన్నాను నిగ్రహించుకొని.

సమాధానం చెప్పలేదు. సిగ్గుతో ఆమె పెదవులు వణికాయి.

“ఇంకా రెండు నెలలు ఆగాలంటున్నారు వీళ్ళు. ఎలా ఉండాలో తెలీటం లేదు" నిట్టూర్పు విడిచాను. “నేను ఊరికి పోతున్నాను. రెండు రోజుల కొకసారైనా నువ్వు ఉత్తరం రాస్తుండాలి. తెలిసిందా?" అంటూ ఆమె చెయ్యి వదల్లేక వదిలి ఇవతలి కొచ్చాను. “మీ అమ్మాయిచేత అప్పుడప్పుడు ఉత్తరాలు రాయించండి" అంటూ పెద్దావిడకు చెప్పాను.

“అట్లాగే నప్పా!” నవ్విందావిడ.

అందరికీ చెప్పి గబగబా బయటికొచ్చేశాను. ముసలాయన నాతో బాటు బస్ స్టాండుకు రాబోయాడు. “నాతో మీ రెందుకు? మీ రుండండి" అంటూ నేను బస్ స్టాండుకు చేరి ప్రయాణం కొనసాగించాను!

కళ్ళు మూసుకున్నా తెరిచినా ఆ అమ్మాయి రూపమే ప్రత్యక్ష మవుతున్నది. దట్ ఫస్టు కిస్ ఈజ్ హాంటింగ్ మి-ది ప్లెషర్ ఆఫ్ ఇట్, ది ఎక్స్టసీ ఆఫ్ దట్! ద వామ్ ఎంబ్రేస్ ఎండ్ ద థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్! ఓహ్! అలాంటి ఆనందానుభూతి ఎన్నడూ అనుభవించలేదు.

24

జంబాడలో లైఫ్ డల్ గా బోర్ కొడుతున్నది. స్కూలు, పిల్లలు, నాటకం విసుగేస్తున్నది. ఈ నాటకం మొదలు పెట్టకుండా ఉన్నా బాగుండేది!

మనసు మదనపల్లెవైపు లాగుతున్నది. బాడీ ప్రెజెంట్, మైండ్ ఆబ్సెంటా ఉన్నది నా పరిస్థితి. పద్యం పాడటం, వచనం చెప్పటం ఇంతకుముందులా

ఉండటం లేదు. మొక్కుబడిలా జరుగుతున్నదంతా గంగరాజు అన్నాడు గూడా మొహమాటం లేకుండా.

ఆయన రూము కొచ్చినప్పుడు నా పరిస్థితి నంతా వివరించి చెప్పాను. "ఇప్పుడట్లాగే ఉంటుందిలే. రానురాను గదా దాని విషయం తెలిసేది!" అంటూ నవ్వాడాయన.

వారం రోజులు గడచినా రాస్తానన్న మనిషిరాయలేదు. నేను మాత్రం రెండుత్తరాలు రాశాను. జంబాడలో ఉండటం సాధ్యం కావడం లేదు.

నెల రోజులు గడిచాయి. ఉత్తరం ముక్కలేదు. తాంబూలాలు పుచ్చుకున్నాం గదా! పెళ్ళి స్థిరమైనట్లే. ఒకసారి పోయివద్దా మనిపించింది. నరసరాజుకు, గంగరాజుకు చెప్పి రెండు రోజుల్లో వస్తానని బయల్దేరాను.

మదనపల్లెలో వాళ్ళునన్ను చూచి ఆశ్చర్యపోయారు. "మీరు వస్తారనుకోలే దప్పా! ఇవాళో రేపో ముహూర్తం పెట్టించి ఉత్తరం రాద్దా మనుకుంటున్నాము. మీ రొచ్చారు" అన్నది పెద్దామె.

"మీ అమ్మాయి చేత ఉత్తరం రాయిస్తామన్నారు. ఒక్కటిగూడా రాయించలేదు" అన్నాను.

"నేను రాయమనే చెప్పా నప్పా! కార్డు కూడా తెప్పించి ఇచ్చాను. అది రాయంది నేనేం జేసేది?"అన్న దామె.

మహా ఘనకార్యంచేశావు. కార్డు తెప్పించిందట! ప్రేమికులు ఎక్కడైనా కార్డుల్లో ఉత్తరాలు రాసుకుంటారా!

"సరేలెండి. జరిగిందేదో జరిగిపోయింది. మీరు చెప్పిన గడువు కూడా తీరిపో వస్తున్నది. ఇంతకూ ముహూర్తం ఎప్పుడనుకున్నారు?" అన్నాను.

"పోయి కనుక్కురండీ అని ఎంత చెప్పినా ఈయన కదటం లేదు, ఇదిగో అదుగో అని వాయిదా లేస్తున్నాడు. ఆడవాళ్ళం ఎంతకని పాకులాడుతా మప్పా!" అన్న దామె.

“ఇప్పుడే పోయి కనుక్కొస్తానుండు” అంటూ ధుమధుమలాడుతూ వెళ్లాడు ముసలాయన. ఆయన కోపానికీ, నడకకూ నవ్వొచ్చింది నాకు.

"సినిమాకు పోయొస్తామండీ" అని ప్రపోజులు పెట్టాను పెద్దామెతో.

“పోయిరండప్పా! మా వదినకూడా చూడాలంటున్నది. ఆమెనూ మీతో తీసుకు పోండప్పా! అన్నది.

పానకంలో పుల్ల! పుల్ల ఉందని పానకం తాగకుండా ఉంటే ఎలా! "సరేలెండి. మీ అమ్మాయిని తయారుకమ్మనండి. టైముగూడా ఎక్కువ లేదు” అన్నాను.

మరో అరగంటలో వచ్చింది ముసలాయన చెల్లెలు - “పోదామా నాయనా!” అంటూ. నాకు ఒళ్ళు మండిపోయింది. వీళ్ళీ పనులు కావాలని చేస్తున్నారో, అమాయకంగా చేస్తున్నారో అర్థం కాలేదు. “మీ అమ్మాయేదీ? మీతో అయితే నేను రాను.” కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాను.

“అమ్మాయి లేకుండానా? అదికూడా వస్తున్నది...... ఎంతసేపే సింగారం. రారా. చేసుకున్నది చాల్లే?" అంటూ అరిచిందావిడ.

అట్టహాసంగా ముస్తాబై వచ్చింది కాబోయే శ్రీమతి. మేకప్పు కొంత హెచ్చుమోతాదులో ఉంది. ఏం మాట్లాడకుండా బయలుదేరాము.

టికెట్లు కొని హాల్లోకి పోయాము. ముందు ముసలామెను కూచోబెట్టి ఆమె పక్కన అమ్మాయి, అమ్మాయి పక్కన నేను కూచున్నాము.

సినిమా జరిగినంత సేపూ స్వీట్ నథింగ్స్ చెప్పుకున్నాము. నిజానికి మేము సినిమా అప్పుడో బొమ్మ అప్పుడో బొమ్మ తప్ప చూడలేదు. ఇంటర్వల్లో “డ్రింకేమైనా తాగుదాం పద" అంటూ అమ్మాయిని బయలు దేర దియ్యబోతే “నేనూ వస్తా" నని లేచింది ఆమె. “ఇక్కడి కొచ్చినప్పుడు పిలుద్దాం లే" అని కుర్చీలో కూలబడ్డాను. అవి రానూలేదు. మేం తాగనూ లేదు. పిల్లను తీసుకొని

ఎటో పారిపోతాననుకుంటున్న ట్లున్న దావిడ. వాళ్ల జాగ్రత్త వాళ్లది! నా ఆత్రం నాది!

సినిమా నుంచి ఇంటికొచ్చాము. ముసలాయన పంచాంగం ముందేసుకొని కూచున్నాడు. ఆయన కెదురుగా ఆమె.

మేము ఇంట్లోకి పోగానే ఇద్దరూ వినయంగా లేచి నుంచున్నారు. నేను నాకోసం కేటాయించిన స్థలంలోకి పోయాను.

"భోంచేద్దురుగాని కాళ్ళుకడుక్కోండప్పా!" అంటూ వచ్చింది పెద్దామె.

ఇలాంటి చిన్న చిన్న పిలుపులకు కూడా పెద్దవాళ్లెందుకు! అంతా చాదస్తం : లేచి పోయి కాళ్ళు కడుక్కొని విస్తరి ముందు కూచున్నాను.

ఆనాటికి సరిగ్గా నెల రోజులకు ముహూర్తం కుదిరిందట. తేదీ నక్షత్రం వగైరాలన్నీ చెప్పాడాయన.

"అయితే ఇంకేం? పత్రికలు అచ్చేయించండి త్వరగా" అన్నాను నవ్వుతూ. కనీసం నాతో పాటు భోంచెయ్యటానికయినా ఆ అమ్మాయిని కూచోబెడతా రనుకున్నాను గాని అది జరగలేదు.

రెండు రోజులున్నా ప్రియా సమాగమం జరగలేదు. మూడో రోజు - "ఊరికెప్పుడు పోతావు నాయనా?" అంటూ వచ్చింది ముసలాయన చెల్లెలు - నా పాలిటి శుక్రాచార్యులు.

"ఇదుగో బయలుదేరుతున్నానండి! ఇప్పటికే రెండు రోజులున్నాను అనవసరంగా" అంటూ లేచాను. నిజానికి ఆ రోజు బయలు దేరాలను కోలేదు. ఆవిడ ఆ మాట అన్న తరువాత అసలుండదలచుకోలేదు. "త్వరగా పత్రికలు అచ్చేయించి పంపండి. అనవసరంగా ఇంకా ఆలస్యం చెయ్యవద్దు" అని చెప్పి వచ్చేశాను. కాబోయే శ్రీమతితో ఒక్క మాట మాట్లాడే అవకాశం కూడా దొరకలేదు. సినిమాలో ఏం మాట్లాడు కున్నామో అంతే.

25

సాయంత్రం స్కూలు నుంచి ఇంటికొచ్చి టీ తాగి, సిగరెట్టు కాలుస్తూ కూచున్నాను. రూములో నేను ఒంటరివాడి నయినాను, ఎప్పుడూ రాని కృష్ణుడు నా దగ్గరికొచ్చాడు.

"ఏమయ్యా విశేషం?" అంటూ పలకరించా నతన్ని.

"కోసల నగరం నుంచి ఒకాయ నొచ్చాడు సార్! మన నాటకంలోని పద్యాలు దంచిపాడేస్తా ఉన్నాడు. "ఇంతకుముందు డ్రామాల్లో వేశాడంట. రాగాలు గీగాలు గూడా తెలుసునంట. భజన మందిరంలో ఉన్నాడు. మిమ్మల్ని చూస్తాడంట."

కొత్త మనిషిని చూడాలని నాకూ ఉత్సాహం కలిగింది. "నువ్వు పద. నేను అయిదు నిముషాల్లో వచ్చేస్తాను " అని అతన్ని పంపించేశాను. సిగరెట్టు అంతా కాల్చి అవతల పారేసి ఓబుల్ రాజుతో చెప్పి బయలుదేరాను.

భజన మందిరం దగ్గర అతని చుట్టూ జనం మూగి ఉన్నారు. వాళ్లమధ్యలో కోతి చేష్టలు చేస్తూ ఏదో మాట్లాడుతున్నాడు. మనిషి పొట్టిగా, బక్కపలచగా ఉన్నాడు. నీరుకావి పంచ ధోవతిలా కట్టుకున్నాడు. చొక్కా గూడా అలాగే ఉంది. మోచేతులు కిందికి దిగి చొక్కా పక్క జేబులు మట్టికొట్టుకొని మురికిగా ఉన్నాయి. తెల్లజుట్టు చిందరవందరగా ఉంది. గడ్డం పెరిగింది తెల్లగా. కళ్ళు లోతుకుపోయి ఉన్నాయి. కంఠస్వరం గూడా దృఢంగా లేదు.

నేను మామూలుగా కూచునే చోట్లో కూచున్నాను. అతన్ని చూచి నవ్వాను. "మన హెడ్మాష్టరు సారు ఆయనే!" అన్నారెవరో అతనితో.

అతను నా పక్కకు తిరిగి వినయంగా "నమస్కారం సార్! మీకోసమే చూస్తున్నా" అని రెండు చేతులూ జోడించి నాటక ఫక్కీలో వంగాడు.

"రామాంజనేయ యుద్ధంలో హనుమంతుడి వేషం వేశాను సార్! తులాభారంలో నారదుడి వేషం వేశాను. అడపా దడపా నాటకాలు

వేసినవాడినే సార్! ఇప్పుడు సేద్యం చేసుకుంటున్నాను. మా ప్రాంతంలో నాటకాలు వేసేవాళ్లూ లేరు, వేయిస్తున్న వాళ్ళూలేరు. ఈ వెంకట్రాజు మా దాయాదే సార్! పనిమీద వాళ్లింటికొచ్చాను. మీరు చాలా చాలా బాగా పాడుతారని, నటిస్తారనీ చెప్పారు వాళ్ళు. వాళ్లచేత గయోపాఖ్యానం వేయిస్తున్నారట గదా! నేను గయోపాఖ్యానంలో గయుడి వేషం గూడా వేశాను సార్! మోహన, కళ్యాణి, అఠాన, బిలహరి, బేగడ రాగాలు గూడా తెలుసు సార్: మీరొక పద్యం పాడండి. వినాలని ఆశగా ఉంది. మిమ్మల్ని చూడాలని, మీ పద్యం వినాలని ఉన్నాను సార్!" అంటూ ముందు మాదిరిగానే నమస్కారం పెట్టాడు.

నే నడక్కుండానే తన నాటకానుభవమంతా చెప్పేశాడు. అతని ఉత్సాహం నాకు సంతోషం కలిగించింది. "మీకు వీలయితే మా నాటకంలో వేషం వెయ్యండి." అన్నాను. "గయుడి వేషమే ఇప్పించండి సార్: రోజూ సాయంత్రం మీరు ఎన్ని గంటలకు రమ్మంటే అన్ని గంటలకు వస్తాను అన్నం తిని. మా వాళ్ళింట్లో పడుకుంటాను. ఇక్కడ అన్నానికి గూడా నాకేం తొందర లేదు సార్! మా బంధువులున్నారు. నాకో వేష మిప్పించండి సార్! రంగు పూసుకొని పదేళ్ళకు పైగా అయింది." ప్రాధేయ పడ్డాడతను.

“మీది కోసల నగరమని చెప్పారు. మీ పేరేమిటండీ? అడిగాను.

"సీతారామరాజండీ! ఆ రాజంతటి వాణ్ణి కావాలని మా వాళ్ళు నాకా పేరు పెట్టారు. నేను మాత్రం నాలుగున్నరడుగులకు మించలేదు" అంటూ నవ్వాడతను.

అతనితో బాటు అందరం నవ్వాము. ప్రతి మాటా అభినయిస్తూ చెబుతున్నాడతను. "మీరో పద్యం పాడండి వింటాను." అన్నాను.

"మీరు పాడితే వినాలని ఉంది సార్! మొదట మీరు పాడండి" అన్నాడు.

"మీరు రామాంజనేయ యుద్ధంలో ఆంజనేయులు పాత్ర ధరించారు. హనుమంతుడి ముందు నేను కుప్పిగంతులు వెయ్యడం బాగుండదు. మీరు పాడండి" అన్నాను.

అతను గయోపాఖ్యానంలో గయుడి పద్యమే స్పీచితో సహా మొదలు బెట్టాడు. "పాతాళమున కేగి బ్రతుకవచ్చు నటన్న బలిచక్రవర్తి న న్పట్టి ఇచ్చు" అనే సీస పద్యం పాడాడు. ప్రతి చరణానికి రాగం లాగాడు. పద్యం పూర్తయిం తరువాత కొండవీటి చాంతాడులా ఎడతెగని రాగం లాగాడు. రకరకాలుగా మెలికలు తిప్పుతూ, వాంతులు చేసుకుంటూ! అతని గోడంతా నా మెప్పు సంపాదించా లనే వెళ్ళబోసుకున్నాడు పాపం. లోలోపల నవ్వుకుంటూ అతని అవస్థ చూస్తూ ఆనందిస్తూ కూచున్నాను. ఒక పదినిముషాల సేపు బాధపడి "ఎట్లా ఉంది సార్! పరవాలేదా?" అని దీనంగా అడిగాడు.

"బాగుంది. చక్కగా పాడారు" అన్నాను మెచ్చుకోలుగా.

అతని ముఖం సంతోషంతో వికసించింది.

"పద్యం పాడేప్పుడు. అయిపోయిం తరువాత సంగీతకచ్చేరిలోలా అంత దీర్ఘంగా రాగాలు పీకటమెందుకు? అలా పాడినందువల్ల సాహిత్యం దెబ్బ తినదూ? నాటకం చెడిపోదూ?' అన్నాను.

"ఇప్పుడందరూ పద్యం ఇట్లాగే గద సార్ పాడుతున్నాది?" అన్నాడతను.

"అవును. అందరూ అలాగే పాడుతున్నారు. తెలుగు నాటక రంగాన్ని ఈ కొండవీటి చాంతాడులే ఉరిబోసి ఊపిరి తీసేస్తున్నాయని తెలుసుకోవటం లేదు. నాటకంలో సంగీతంకంటే డ్రామా ఎక్కువగా ఉండాలి. ఎవరో అల్లాయి, పుల్లాయిగాళ్ళు నాటక మంటే ఏమిటో తెలీని వాళ్ళు చేతులు తట్టి సంతోషిస్తున్నారని విపరీతంగా రాగాలు తీస్తూ నాటకాన్ని చంపేస్తున్నారు. దీన్ని కొనసాగిస్తే ఇప్పటికే సగం చచ్చిన నాటక రంగం పూర్తిగా చచ్చి ఊరుకుంటుంది. సాహిత్యాన్ని చంపే సంగీతం సంగీతం కాదు. సంగీతం నాటకాన్ని బ్రతికించలేదు. నాటకంలో సంగీతం ఉండాల్సిందే. తగు

మోతాదులో ఉండాలి. అతి ఎందులోనూ పనికి రాదు గదండీ!" ఈ మాటలు ఇక్కడ ఈ మనుషుల మధ్య మాట్లాడవచ్చునా, లేదా అన్న ఆలోచన లేకుండా మాట్లాడాను. నా మాటలు ఎవరికీ అర్థమైనట్లు లేదు. అందరూ నిశ్శబ్దంగా కూచున్నారు.

సీతారామరాజు నిరుత్సాహ పడగూడదన్న ఉద్దేశంతో "ఏది ఏమైనా మీరు పద్యం బాగా పాడారు. స్పీచి గూడా బాగా చెప్పారు" అన్నాను. "పది సంవత్సరాల పాటు గొంతు విప్పి పాడకపోయినా ఇప్పుడింతగా పాడారంటే మిమ్మల్ని అభినందించాల్సిందే. అభినందిస్తున్నాను."

“మరి నాటకంలో వేషం....” అన్నాడతను చేతులు జోడించి.

“మీరు తప్పకుండా వేద్దురు గాని, గయుడి వేషయే వెయ్యండి." అన్నాను నోరుజారి. ఇంతకుముందే గయుడి వేషానికి నిర్ణయించబడిన మనిషి ముఖం మాడ్చుకున్నాడు. అతన్ని దగ్గరికి పిలిచి సముదాయించాను. “నువ్వు గయుడి మంత్రి వేషం వేద్దువుగానిలే” అన్నాను అతని వీపు తడుతూ. ఆవేషం ఇంకా ఎవ్వరికీ ఇవ్వలేదు.

“గయుడి దయితే రాజు వేషం బాగుంటుంది” నసిగాడు సోగ్గాడు.

“మంత్రి మేకప్పు గూడా అలాగే ఉంటుందయ్యా బాబూ! రాజుకూ, మంత్రికీ తేడా కిరీటం ఒక్కటే గదా: అంతగా అయితే నీకూ చిన్న కిరీటం పెట్టమంటానే. నీ వేషమే అతని వేషం కంటే బాగుండేలా చూస్తాను. సరేనా?" అంటూ నవ్వాను.

అతను బుంగమూతి పెట్టాడు.

“గయుడి వేషం పెద్దది, అదినేర్చుకోవాలంటే చాలా కష్టపడాలి. నీ వేషం చిన్నది. కష్టం లేకుండానే అందరిచేతా పొగడ్తలందు కుంటావు. నా మాట విను" అన్నాను.

“సరే” అని అతను ఒప్పుకున్నాడు.

“మీరు నా కోర్కెతీర్చనేలేదు” అన్నాడు కొత్త గయుడు. "వేషం యిచ్చాను గదా! అందులోను ముఖ్యమైన వేషం ''అన్నాను. "వేషం మాట గాదు నేననేది" అన్నాడతను.

“ఇంకేంటి మరి?”

“ఒక్క పద్యం పాడండి. మీరు బాగా పాడుతారట.”

"ఓ:అదా; దాందేముంది. రేపట్నించి వస్తారుగా. రిహార్సలలో పాడు తుంటాను. విందురుగాని, మూడ్ లేకుండా నేను పాడలేను" అన్నాను.

అతను తృప్తిపడ్డాడు. రేపట్నించి రిహార్సలు కొస్తానని చెప్పిపోయాడు.

ఇదంతా అయి రూముకొచ్చేసరికి దాదాపు ఏడుగంటలైంది టైము. “ఇవాళ రిహార్సలు వద్దులెండి” అని చెప్పి వచ్చాను.

26

పెళ్ళి ఇంకా పదిహేను రోజులుండనగా పెళ్ళి పత్రికలు అచ్చేయించి పంపించారు. నేను వేరుగా ఏమీ ప్రింటు చేయించలేదు. వాళ్ళనే కొన్ని ఎక్కువగా నాకు పంపమని రాశాను. వాళ్ళు అలాగే పంపించారు.

నేను ఊరికి పోయి మా వాళ్ళకు పెళ్ళి పత్రిక ఇచ్చాను. పెళ్ళికి రమ్మని అడిగాను. అంత దూరం ప్రయాణం చెయ్యలేమన్నారు అమ్మ, అక్కయ్య. అన్నయ్య, వదినెలు మాత్రం తప్పక వస్తామన్నారు.

ఊళ్ళో రెండు రోజులుండి వచ్చాను. వాళ్ళకు నే నుండే ఊరికి రావాల్సిన మార్గం గురించి చెప్పాను. “మీరు డైరెక్టుగా మద్రాసు రండి. మద్రాసులో తిరుత్తణి బస్సు ఎక్కి సరిగ్గా ఆర్కాటుకుప్పం అనే ఊరి దగ్గర దిగండి. అక్కణించి మీరు ఊళ్లోకి రావాలంటే రెండు మైళ్ళు నడవాలి, మీకోసం అక్కడ ఎద్దుల బండి ఉంచుతాను. నడవక్కర లేకుండానే మీరు ఆ ఊరు

రావచ్చును" అని చెప్పాను. ఉత్తరం గూడా రాశాను. రెండు రోజులు ముందుగానే రమ్మని కోరాను. వాళ్ళు వస్తామన్నారు.

నా పెళ్ళి గురించి నేను పెద్ద అట్టహాసాలు, ప్రచారాలు చెయ్యదలుచు కోలేదు. పెళ్ళంటే ఇద్దరు స్త్రీ పురుషుల కలయిక. జన్మ జన్మల బంధం. పోయిన జన్మలో ఒకటిగా జీవించి, ఆ జీవితాధ్యాయం ముగిసిం తరువాత విడిపోయిన జీవితాలు నూతన జీవితాధ్యాయంలో పునస్సమాగంచెందటమే పెళ్ళి. అది సహజ జీవితావసరం. ఎక్కువ మందికి ఇన్విటేషన్లు పంపలేదు నేను. నాకు అతి సన్నిహితులయిన వారికి మాత్రం పంపించాను.

పెళ్ళికూతురుకు చీరలు మీరే కొనాలప్పా: మీరు కొంటారా?" అన్నది పెద్దామె. "చీరల సంగతి నాకు తెలీదండీ. మీకే డబ్బు పంపుతాను. మీరే కొనండి" అన్నాను.

"మీ ఇష్టం అప్పా!" అన్న దావిడ.

చెప్పిన ప్రకారం వాళ్ళకు డబ్బు పంపించాను.

పెళ్ళి ముహూర్తం దగ్గరయిన కొద్దీ నాలో ఉత్సుకత ఎక్కువవుతున్నది.

తాము అక్కడ ఏ తేదీన బయలుదేరుతున్నారో ఉత్తరం రాశాడు అన్నయ్య. పెళ్ళి ఇంకా మూడు రోజులుందనగా వస్తామని రాశాడు. పెళ్ళికి రావాలని ఈ ఊరినుంచి చాలామంది ఉత్సాహం చూపుతున్నారు. నే నందర్నీ డిస్కరేజ్ చేస్తున్నాను.

"అక్కడేముందయ్యా చూసేందుకు? పెళ్ళయింతరువాత మీ ఊరికే వస్తాం గదా! మా ఇద్దర్నీ ఇక్కడే తనివిదీర చూడవచ్చును, ఇంతమంది పోయి వాళ్ళ నెత్తిన పడితే వాళ్ళు చెయ్యలేరు పాపం!" అని చెప్పాను.

వాళ్ళకు పెళ్ళి భారం కాకూడదనే నా నిర్ణయం. ఎక్కువమంది పోతే అందరికీ భోజనాలు, వసతులు ఏర్పాటు చేసే సమర్థత ఎవరికుంది ఆ ఇంట్లో? పైగా పెళ్ళి గూడా సత్రంలో గాదు, గుళ్ళో ఏర్పాటు చేశారు.

అందర్లాగే పెళ్ళి చేసుకున్నా ననిపించుకొని నా మనిషిని నేను తీసుకొచ్చు కోవాలని అనుకున్నాను.

అన్నయ్య, వదినెలు వస్తామన్న రోజుకు రోడ్ పాయింటుకు బండి పంపించాను. ఓబుల్ రాజే బండి తోలుకుపోయాడు. అతనికి నా బంధువుల్ని మర్యాదగా తీసుకు రావాలని మహా కోరికగా ఉంది. మా అన్నయ్య, వదినెలు ఎలా ఉంటారో అతనికి అర్థమయ్యేలా వర్ణించి చెప్పాను నాలుగైదు సార్లు. వాళ్ళెలా ఉంటారో చెప్పమంటూ అతనిచేత చెప్పించుకొని, ఆ తరువాతనే అతన్ని పంపించాను.

నేను ఉద్యోగం చేస్తున్న చోటుకు మా వాళ్ళు రావటం ఇదే ప్రథమం. ఇంతకు ముందు ఎవరూ రాలేదు. వాళ్ళు నన్ను చూచి, నా పరిస్థితిని చూచి సంతోషించాలని నాకోరిక. నేను కోరుకున్నది నేను సంపాదించిన వస్తు సామగ్రిని, ధన, కనకాలను వాళ్ళు చూచి ఆనందించాలని కాదు. నేను చేసిన పనులు చూసి సంతోషించాలని, ఈ మనుషులు నా పట్ల చూపుతున్న ఆదరాభిమానాలను చూచి సంతోషించాలని. అంత దూరం నుండి ఈ కొత్త ప్రాంతాలకు వచ్చిన వీడు అందరి అసూయాద్వేషాలకు లోనుగా కుండా, ప్రేమాభిమానాలకు, గౌరవాదరాలకు పాత్రుడైనాడని గర్వంగా అనుకొని సంతోషించాలని!

ఉదయం నుంచి సాయంత్రం దాకా పడిగాపులు గాచి ఓబుల్ రాజు ఖాళీ బండి తోలుకొని వచ్చాడు. వస్తామన్న వాళ్ళు రాలేదు. నాకు చాలా నిరుత్సాహమైంది. వాళ్ళ రాకకోసం చాలా ఆశతో ఎదురు జూశాను.

మరుసటి రోజు గూడా ఓబుల్ రాజును బండి తోలుకుపొమ్మని పంపించాను. గత్యంతరం లేనట్లు వెళ్ళాడతను. మొదటి రోజు ఉన్న ఉత్సాహంలే దతనిలో. సాయంత్రానికి ఖాళీ బండే తిరిగి వచ్చింది. ఆ రాత్రి అన్నం తినలేదు నేను.

ఆ రాత్రి ఏడ్చి ఏడ్చి నిద్రపోయాను. ఉదయం నిద్ర లేచేసరికి వికృతంగా తయారైంది నా ముఖం. రోజే నేను మదనపల్లెకు పోవాలి. ఏం చెయ్యాలో తోచటంలేదు. ఒంటరిగా పోవటం ఎలా? మా అన్నయ్య, వదినె తప్పకుండా వస్తారని వాళ్లతో చెప్పాను. వాళ్ళు లేకుండా పోతే ఏమనుకుంటారో? అసలు వస్తామన్న వాళ్ళు ఎందుకు రాలేదు? ఇవే ప్రశ్నలు. సమాధానం లేని ప్రశ్నలు తలను తొలుస్తున్నాయి. కాలు కాలిన పిల్లిలా రూములో అటూ ఇటూ తిరుగుతున్నాను. ఓబుల్ రాజు ప్రయాణానికి తయారైవచ్చాడు. శ్రీనివాసులు, గంగరాజు, మునసామి తిరుపతి పోయి అటునుంచి వస్తామని ముందుగానే వెళ్ళారు. చంగయ్యశర్మ, చంగల్రాయలు పెళ్ళి టైముకు వస్తామని చెప్పారు.

ఉదయం ఎనిమిది గంటలైంది. తొమ్మిది గంటలైంది. నే నింకా బయలు దేరలేదు. ఏం చెయ్యాలో తోచటంలేదు. ఓబుల్ రాజు దిగులుగా ముఖం పెట్టుకొని తలుపు నానుకొని నుంచున్నాడు.

రే పీపాటికి పెళ్ళిపీటల మీద కూచొని ఉండాలి. వాళ్ళు రాకుండానే పోతే ఎలా? పెళ్ళి చూపులు ఒంటరిగానే జరిగాయి. పెళ్ళి మాటలన్నీ నేనే మాట్లాడుకున్నాను. పెళ్ళికి గూడా తగుదునమ్మా అని నేను ఒంటరిగానే పోతే ఏం బాగుంటుంది? అసలు వస్తామన్న మనుషులు ఎందుకు రాలేదు? నే నిప్పుడు పోకపోతే వాళ్ళెంత అభాసుపాలవుతారు! ఏం చెయ్యాలో తోచక మంచంలో పడిపోయాను.

“ఏఁరా ఓబులూ!ఇంకా ఇక్కడే వుండారేందిరా? ఇంకెప్పుడురా బోయేది? ఆడ వాళ్ళు ఎదురుజూస్తా వుండరంట్రా?" అంటూ కేకలు బెడుతూ వచ్చాడు నరసరాజు. “సా రింకా పడుకొనే ఉన్నాడు" అన్నాడు ఓబుల్ రాజు.

"అదేంది సారూ! లచ్చనంగా పెల్లి జేసుకోబోతా దిగులుగా పడుకున్నావు? లేలే. వాల్లు మీకోసం ఎదురుజూస్తావుండరూ? పదరా ఓబులూ! సారు సంచీ దీసుకో”, అంటూ వచ్చింది నరసమ్మ.

మానుకుంటావా? పద పద." "మంచి మొగాడివేలే. వాళ్ళు రాలేదని తొందరజేశాడు నరసరాజు. "డబ్బేవఁన్నా కావాలా?" అంటూ బొడ్లోంచి డబ్బు ఇవతలికి తీశాడు.

డబ్బవసరం లేదని తీసుకోలేదు. మంచంమీద కూచున్నాను రెండు చేతులతో తల పట్టుకొని.

"పెల్లి జేసుకునేది నువ్వా, వాల్లా! నువ్వు బోకపోతే పెల్లాగుద్దు గాని వాల్లు రాకపోతే ఆగుద్దంటయ్యా పిచ్చోడా! లెగు లెగు. బయల్దేరిపో!"

"పదండి సారూ! పదరా ఓబులూ! ఇంటి బీగం తీసుకోరా!" అంటూ లోపలకొచ్చింది నరసమ్మ.

నా చెయ్యి పట్టుకొని లేవదీశాడు నరసరాజు. నేను పోకపోతే ఈ ఇద్దరూ ఊరుకునేట్లు లేరని గుడ్డ లేసుకొని బయలుదేరాను.

"మొగం కడుక్కోండి సారూ! తల దువ్వుకోండి. పెల్లి కొడుకు నవ్వుతా వుండాలి" అన్నది నరసమ్మ.

ఆమె చెప్పినట్లు ముఖం కడుక్కోలేదు. స్నానం చేశాను. తల దువ్వుకున్నాను. గుడ్డలు మార్చుకున్నాను. మరో పదిహేను నిముషాల్లో పోయి వస్తానని నవ్వుతూ వాళ్ళకు చెప్పిఓబుల్రాజును వెంటదీసుకొని బయలుదేరాను. రూముకు తాళం వేసి చెవి నరసరాజు చేతి కిచ్చాడు ఓబుల్ రాజు.

" నే నెదురుగా వత్తా వుండు సారూ!" అంటూ నరసమ్మ పరుగున ఇంట్లోకి పోయి ముఖాన రూపాయంత బొట్టు పెట్టుకొని ఎదురొచ్చింది నవ్వుతూ. "అమ్మయ్యను యంట బెట్టుకొని రా!" అని చెప్పింది ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

ఈ చదువు రాని పల్లెటూరు మనుషులు ఎంత మంచివాళ్ళు ఎంత సహృదయత ఉన్నది వీళ్ళలో!

కొలంబసు పడమటి ఇండియా దీవుల్ని చేరిం తరువాత అక్కడి మనుషులు, రెడ్డిండియన్లు, ఇతగాడిని దేవతగా భావించుకొని, ఎన్నో మర్యాదలు చేశారట. ఆ దుర్మార్గుడు ఇనబెల్లా రాణికి "రాణిగారూ! ఇంత మంచి మనుషుల్ని నే నెక్కడా చూడలేదు. వీళ్ళను మనం మంచి బానిసలుగా ఉపయోగించు కొనవచ్చును" అంటూ ఉత్తరం రాశాడట. మన వాళ్ళు ఈ మంచి పల్లెటూరు మనుషుల మంచితన్నాన్ని ఓట్ల రూపంలో వాడుకుంటూ తరగని దరిద్రంలో ముంచి తేలేస్తున్నారు - వాళ్ళ మంచి తనాన్ని నేను దురుపయోగ పరుచుకోటం లేదు.

అడుగులు ముందుకు పడ్డకొద్దీ ధైర్యం ఎక్కువ కాసాగింది. సాయంత్రం ఆరు గంటలకు మదనపల్లె చేరాము. బస్టాండులో నా కోసంకాచుకొని ఉన్నాడు కాబోయే బావమరిది. నన్ను చూడగానే చాటంత అయింది అతని ముఖ్యం.

“పొద్దున్నుంచీ మీకోసం ఇక్కడ కాచుకొని ఉన్నాను. మీ అన్న గారు, వదినెగారు ఇవాళ ఉదయమే వచ్చేశారు. మీరు రాలేదని ఆదుర్దాపడు తున్నారు” అన్నాడు.

అంత ఆనందకరమైన వార్త నేనెన్నడూ వినలేదు. “ఇక్కడి కొచ్చేశారా వాళ్ళు? నేనక్కడ ఎదురుచూస్తూ కూచున్నాను. మంచి పని చేశారు!" అంటూ అతని వెంట గబగబా వాళ్ళ ఇంటికి నడిచాను.

నేను వాళ్ళ ఇంటికి చేరే సమయానికి మా అన్నయ్య, వదినెలు ఆ ఇంటికొచ్చిన చుట్టాలతో మాట్లాడుతున్నారు. పెళ్ళికోలాహలం పెద్దగా ఏమీలేదు. బీద పెళ్ళి ఇంట్లో ఎంత సందడి ఉంటుందో అంత మాత్రం సందడిగా ఉంది. పదిమంది దాకా కొత్త ఆడవాళ్ళు, మగవాళ్ళు కనిపించారు. వాళ్ళెవరో నాకు తెలీదు. పెళ్ళి గుళ్ళోగాబట్టి మాకు ప్రత్యేకంగా విడిది ఇల్లంటూ ఏమీ ఇవ్వలేదు. మా వాళ్లకు ఆ ఇంట్లోనే ఒక గది ఇచ్చినట్లున్నారు.

నన్ను చూచి నవ్వాడు మా అన్నయ్య. వదినె కూచున్న చోట్లోంచి లేచి వచ్చి రెండు చేతులతోనూ నా చెంపలు నిమురుతూ "ఇంతాలస్యం చేశావేం?" అని అడిగింది.

నా కళ్ళనిండా ఆనందాశ్రువులు నిండాయి. నన్ను నేను నిగ్రహించుకొని జరిగిందంతా చెప్పాను. “ఆ ముసలాయనా, ఆమే నన్ను తొందర చెయ్యకుండా ఉంటే వచ్చి ఉండేవాడిని కాదు”అన్నాను.

“భలే పని జరిగిందే” అన్నది వదినె.

ఇంతలో ఎవరో కాఫీ తెచ్చి ఇచ్చారు. గ్లాసు మా వదినె కందిస్తే ఆమె తీసుకోలేదు. “మా కాఫీలైపోయా యయ్యా! నువ్వు తాగు” అన్నది.

ఈ దృశ్యాన్ని మౌనంగా చూచి ఆనందిస్తున్నాడు ఓబుల్ రాజు అతనికీ కాఫీ ఇచ్చారు అతన్ని కూచోమన్నాను.

ఆ ఊరు రాకుండా ఇక్కడికే ఎందుకొచ్చారు? నేను మీకోసం రెండు రోజులు రోడ్లోకి అదేపనిగా బండి పంపించాను. అన్నాను మా అన్నయ్యతో.

“అనుకున్న టైముకు బయలుదేరలేక పోయాముురా! ఆలస్యమైంది గదాని మదనపల్లెకే పోదామని అనుకున్నాము. పత్రికలో ఇంటి అడ్రసు ఉందిగా, కష్టపడకుండానే ఇక్కడికి చేరాము” అన్నాడాయన.

“వీళ్లసలే అయోమయం మనుషులు. మిమ్మల్ని సరిగా చూసుకున్నారా? పెళ్ళికూతుర్ని చూశారా? బాగుందా?" అంటూ ప్రశ్నలు గుప్పించాను.

వదినే సమాధానం చెప్పింది. “పిల్లను చూడకపోవటమేందయ్యా! ఇప్పటి దాకా మాతోనే కూచున్నది. నిన్ను చూచి ఇంట్లోకి పోయింది."

"అది సరేలే. పిల్ల బాగుందా అని.”

“నీ సెలెక్షన్ బాగుండకుండా ఉంటుందిటయ్యా! పిల్ల కేం బంగారు బొమ్మలా ఉంది. పని పాట అన్నీ బాగా తెలుసునట. నీ పెళ్ళి చూపుల తతంగమంతా చెప్పింది, వాళ్ళ అమ్మగారు" అన్నది వదినె నవ్వుతూ.

రాత్రి భోజనా లయ్యాయి. మొత్తం ముప్పయి మంది కంటే ఎక్కువ లేరు జనం. సరసాలు, సరదాలు ఏమీలేవు చెప్పుకోదగినంతగా,

ఉదయం పది గంటలకు ముహూర్తం జరిగిపోయింది. నా జీవిత భాగస్వామిని మెడలో మూడు ముళ్ళూ వేశాను. ఈ జన్మలో మరోసారి శాస్త్రసమ్మతంగా ఆలుమగల మైనామువేమిద్దరం.

శ్రీనివాసులు, మునసామినాయుడు, గంగరాజు, చంగయ్య శర్మ వచ్చారు. చిన్నయ్య చిన్న ప్రెజెంటేషన్స్ ఏవో తీసుకొచ్చారు. భోజనాలు చేసుకొని వాళ్ళు వెళ్ళిపోయారు. పోతూ పోతూ గంగరాజు - రేపేగా మీరు అమ్మయ్యతోబాటు ఊరికి వచ్చేది?” అని అడిగాడు.

"అవును. రేపే వస్తాము. ఇంకా ఇక్కడెందుకు?" అన్నాను. ఆయన వెళ్ళి పోయాడు. ఆయన పెళ్ళిలో మా అన్నయ్య, వదినెలతో కూడా మాట్లాడాడు. వాళ్ళ ముందు నన్ను చాలా పొగిడినట్లున్నాడు.

"ఆ ఊరి వాళ్ళు చాలా మంచివాళ్ళులా ఉన్నారా!" అన్నాడాయన. నిన్ను గురించి చాలా గొప్పగా చెప్పాడా గడ్డం మనిషి” అన్నాడు.

పెళ్ళయింది మొదలు మే మిద్దరం ఒకరికొకరం అంటుకొనే ఉన్నాము. ఏకాంతం దొరికినప్పుడల్లా మరింత అతుక్కు పోయాము.

ఆ రాత్రే మమ్మల్ని గదిలోకి పంపించారు. అక్కడ జరిగిన ప్రైవేటు విషయాలు మాకు మాత్రమే పరిమితం. మా దివ్యానుభవాలు మాకు మాత్రమే స్వంతం.

మర్నాడు ఉదయమే మేము జంబాడకు బయలుదేరాము.

“మే మెవరం పిల్లతోబాటు రావటం లేదప్పా! మీ చేతుల్లో పెట్టాము. ఎట్లా చూసుకుంటారో మీ ఇష్టం" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొన్నది పెద్దావిడ.

“మీరేం భయపడనక్కర్లేదు లెండి. అంతా బాగానే ఉంటుంది" అని హామీ ఇచ్చాను.

పెళ్ళికూతురు మాత్రం సంతోషంగానే ఉంది. మామూలు ఏడుపులూ, పెడబొబ్బలూ ఏమీలేవు. ఆవిడకు ముందుగానే చెప్పాను “నాతో వచ్చేప్పుడు సంతోషంగా రావాలి గాని సీన్లు క్రియేట్ చెయ్యవద్దని.”

ఓబుల్ రాజుతో సహా అయిదుగురం బస్టాండుకు చేరి చిత్తూరు బస్సెక్కాము. ముసలాయన, బావమరిది బస్సు దాకా వచ్చి, బస్సు కదిలిందాకా ఉండి, మాకు వీడ్కోలు చెప్పి పోయారు. చిత్తూరు నుంచి తిరుత్తణి, అక్కడి నుంచి ఆర్కాటుకుప్పం చేరేసరికి సాయంత్రం అయిదు గంటలైంది.

గంగరాజు, నాటకంలో వేషం వేసే చాలామంది, మరి కొందరు మాకు ఆర్కాటుకుప్పంలోనే స్వాగతం పలికారు. మమ్మల్ని తీసుకు పోయేందుకు ఎద్దులబండి కట్టుకొచ్చారు. వాళ్ళందర్నీ చూచి నవ్వుతూ గంగరాజుతో అన్నాను "ఇంత మందిని పిల్చుకొచ్చారు. మీతోపాటు మేళగాళ్ళను కూడా తీసుకొస్తే బాగుండేది గదండీ".

"పెళ్ళయిపోయిందిగా! ఇక మేళం ఎందుకని తీసుకురాలేదు" అన్నాడు గంగరాజు నవ్వుతూ.

బండిలో కూచోమని మా నలుగుర్నీ బలవంతం చేశారు. మేము, మాతో ఉన్న సామాగ్రిని బండిలో వేసి వాళ్ళతోబాటు నడిచి వెళ్ళాము ఊళ్ళోకి. మేము వీధిలో పోతూ ఉంటే ఇళ్ళలోంచి చాలామంది బయటి కొచ్చి చూశారు.

మా రూము ముందు అలికి ముగ్గులు పెట్టారు. చిన్న పందిరి కూడా వేశారు వాకిట్లో, ఇంటి లోపలకూడా అలికి ముగ్గులు బెట్టారు. మేము పోయేసరికి ఇల్లు ఇంత చక్కగా ఉంటుందని నేను ఊహించను గూడా లేదు.

నరసమ్మ మా ఇద్దరికీ మంగళహారతిపట్టింది. దిష్టి తీసిపోసింది. ఈ కార్య క్రమంలో ఊరి ఆడవాళ్ళు చాలా మంది పాల్గొన్నారు. వాళ్ళను గదమా యిస్తూ నరసరాజు గూడా పాల్గొన్నాడు. మేం గృహప్రవేశం చేసింతరువాత గాని గంగరాజు పోలేదు.

ఆ రాత్రి వంటకు అన్నీ సిద్ధంగా ఉంచారు. వదిన వంట జేసింది. భోజనా లయిం తరువాత అన్నయ్య వదినె నరసరాజుగారింట్లో పడుకునేందుకు వెళ్ళారు. మాకు రూము వదిలేశారు.

రెండ్రోజు లుండి వదినె, అన్నయ్య ఊరికి వెళ్ళారు. ఇంట్లో మిగిలింది ఇద్దరమే. ఇష్టారాజ్యం!

27

కాలం మత్తుగా, గమ్మత్తుగా గడుస్తున్నది. ఇల్లాలి రాకతో రూము ఇల్లుగా మారింది. ఇప్పుడు మా ఇంటికి వచ్చే పోయే ఆడవాళ్ళ సంఖ్య ఎక్కువైంది. ఇంతకు ముందు నరసమ్మ తప్ప ఎవరూ వచ్చేవాళ్ళు కాదు. ఈవిడ రాకతో వాళ్ళకు పూర్తి స్వతంత్రం వచ్చేసింది. ఈగల్లా ముసురుకొని ఉంటున్నారింట్లో పిల్లలు, పెద్దలూ. ఉన్నది ఒకటే గది. దాన్నిండా మనుషులు. ప్రైవసీకి చోటే లేదు. ఒంటరితనం ఎలా ఉంటుందో తెలీటంలేదు శ్రీమతికి.

టొమేటోలు, వంకాయలు, బెండకాయలు కూరగాయలు సమస్తం ఇబ్బడి ముబ్బడిగా ఇంటికి చేరుతున్నాయి. పాలు, జున్ను, జున్ను పాలు, పెరుగు, నెయ్యి అతి ఆప్యాయంగా తెచ్చి ఇస్తున్నారు వద్దన్నా వినకుండా. ప్రేమ, అభిమానం పల్లెల్లో ఇంకా బ్రతికే ఉన్నాయి.

సంసారిక జీవితంలో నేను అడుగుబెట్టీ పెట్టకముందే స్కూలు ఇన్స్పెక్షను చేస్తామంటూ తాకీదు పంపించారు గెజిటెడ్ ఇన్స్పెక్టరుగారు. ఇన్స్పెక్షను కోసం

ప్రత్యేకంగా తయారుకావాల్సిందేమీ లేదు. లెస్సన్ ప్లాన్లు, కాంపోజిషను పుస్తకాలు, స్పెషల్ ఫీజుల లెక్కలు చూపిస్తే చాలు. అన్నీ ఉన్నట్లే ఆయన తృప్తిపడతారు. క్లాసులో కూచోని కాసేపు టీచరు చెప్పే పాఠాలు వింటారు. ఇన్స్పెక్షను పూర్తి చేసుకొని పోయిన అయిదారు నెలలకు "అది పరవాలేదు. ఇది పరవాలేదు ఫలానా విషయంలో మరింత శ్రద్ధ చూపాలి. టీచర్లు మరికాస్త బాగా పనిచెయ్యాలి" వగైరా స్టాకు రిమార్కులతో ఆయన రిపోర్టు రాసి పంపిస్తారు.

ఈ స్కూలు జీవిత చరిత్రలో ఇది మొదటి ఇన్స్పెక్షను. ఈ ఇన్స్పెక్షను నా పెళ్ళి కాకముందు అయి ఉంటే బాగుండేది. లేదా మరో అయిదారు నెలల తరువాత పెట్టుకున్నా బాగుండేది. ఇప్పుడు నా మనసును స్కూలు మీద, ఇన్స్పెక్షను మీద కేంద్రీకరించ లేకుండా ఉన్నాను.

గెజిటెడ్ ఇన్ స్పెక్టరు గారు వస్తామన్న రోజున ఓబుల్ రాజును రోడ్లోకి పంపించాను ఆయన్ను వెంటబెట్టుకొని రమ్మని. ఆ రోజురాలేదాయన. ఇక రాడేమోలే అను కున్నాను. ఆ మర్నాడు మధ్యాహ్నా మప్పుడు అపసోపాలు పడుతూ వచ్చాడాయన. "కనీసం వాచ్మన్నయినా రోడ్డు దగ్గరికి పంపి ఉండ గూడదుటయ్యా:" అన్నా డాయన ధుమ ధుమ లాడుతూ స్కూల్లో అడుగు పెట్టగానే.

నేను సమాధానం చెప్పకుండా మంచినీళ్ళందించాను. అవి తాగి కాస్త చల్లబడ్డాడాయన. "నిన్న పంపించానండీ. మీరు రాలేదు. ఇక రారులెమ్మని ఇవాళ పంపలేదు సార్:" అన్నాను వినయంగా.

"ఇన్ స్పెక్షను మూడు రోజులని గదయ్యా నీకు ప్రోగ్రాంలో ఇచ్చింది."
"అవును సార్!"

"మరి మూడు రోజుల్లో ఏ రోజైనా రావచ్చునని తెలీదా నీకు?"

"అలా అనుకోలేదు సార్!"

"మూడు రోజులూ ఇక్కడే ఉంటాననుకున్నావా? అసలు ఇన్ స్పెక్షను ప్రోగ్రాం అందగానే నా దగ్గరి కెందుకు రాలేదు?"

'ఆ పద్ధతులన్నీ తెలీవుసార్! నేను అన్క్వాలిఫైడ్ హెడ్మాస్టర్ని. అనుభవం తక్కువ."

"ఇంత చిన్న స్కూలును మూడు రోజులు తనిఖీ చెయ్యాలంటయ్యా. ప్రోగ్రాంలో అలా చూపుతాం. అంతే" అన్నాడాయన.

ఓబుల్ రాజును పంపి ఆయనకు భోజనం తెప్పించాను. పచ్చడి, పులుసు, చారు, నెయ్యి, గడ్డపెరుగు వగైరాలు తీసుకొచ్చాడు ప్రెసిడెంటు గారి ఇంటి నుంచి. గెజిటెడ్ ఇన్ స్పెక్టరుగారు తృప్తిగా తిని ఆ రోజంతా విశ్రాంతి తీసుకున్నారు.

ఆ సాయంత్రం టీచర్లందరం ఆయన్ను నూతన భవనాల దగ్గరికి తీసుకు పోయాము. అవి చూపించాము.

"వాటి ముఖాన సిమెంటు పూస్తే గదయ్యా బాగుండేది!" అన్నాడాయన.

"చేయించాలి సార్! అందుకే ప్రయత్నం చేస్తున్నాం" అన్నాను.

"గదులు కట్టించుకోటమేనా, పిల్లలకు చదువేమైనా చెబుతున్నారా? అన్నాడాయన నవ్వుతూ.

వీళ్ళకున్న రోగమే ఇది అనుకున్నాను లోలోపల. "పిల్లల చదువులు చూడబోతారు గద సార్!" అన్నాను.

దీపం పెట్టుకొని ఏడున్నర ఎనిమిది గంటలదాకా స్కూల్లో ఆయనతోనే కూచున్నాం. ఆయన స్కూల్లోనే ఉంటానన్నాడు. ఓబుల్ రాజు ఆయనకు భోజనం తీసుకొచ్చిం తరువాత అతనితో ఆయనకు తోడుగా అక్కడే పడుకోమని చెప్పి మేము ఎవరిళ్ళకు వాళ్లం వెళ్ళి పోయాము.

నేను ఇంట్లో కాలు బెడుతుండగానే "అబ్బబ్బ! ఈ జనం రాకపోకలతో చచ్చిపోతున్నానండీ! ఒకటే జనం. వచ్చినవాళ్ళే రావటం! అడిగిన ప్రశ్న

అడగటం. ప్రాణం విసిగించేస్తున్నారు" ఆపసోపాలు పడుతూ ఎదురైంది శ్రీమతి.

“ఇది పల్లెటూరు. పట్నాల్లో అయితే ఒకరి విషయాలు ఒకరు పట్టించు కోకుండా గడిపేస్తుంటారు. ఎదుటివాడు ఏమైనా వాళ్ళ కనవసరం. ఇక్కడ అలా కాదు. పల్లెల్లో ప్రేమాభిమానాలు జాస్తి. నువ్వు వాళ్ళలాంటి సర్వ సాధారణ మనిషివే అయినా వాళ్ళ స్కూలు హెడ్మాస్టరు భార్యవైనందువల్ల నీకో ప్రత్యేకత ఇచ్చి వస్తున్నారు. వాళ్ళు వచ్చి నందుకు నువ్వు సంతోష పడాలి గాని ఈ చిర్రుబుర్రు లాడటం ఏం బాగాలేదు. నువ్వు వాళ్లతో గూడా ఇలాగే ప్రవర్తిస్తున్నావేమో! జాగ్రత్త! వాళ్ల ప్రేమ ద్వేషంగా మారి పోయేట్లు చేసుకోవద్దు' అన్నాను.

“మీకూ, ఈ మనుషులకూ సరిపోయింది. ఎన్నయినా చెబుతార్లెండి మీరు. ఇక్కడో సినిమా లేదు. పార్కులేదు. ఎంతసేపూ ఈ నాలుగు గోడల మధ్యలో, ఆ మనుషులతో విసుగేస్తున్నదండీ! నాకిక్కడ ఏం బాగాలేదు. మీరిక్కణ్ణుంచి ట్రాన్స్ఫరు చేయించుకోండీ!" మారాం చేసింది.

“నేను ముందే చెప్పాను. నే నుండేది పల్లెటూళ్ళోనని. అక్కడ సినిమాలూ, పార్కులూ ఉండవని. అందుకొప్పుకొనే నువ్వు నన్ను చేసుకున్నది, ఇక్కడికొచ్చింది. అది జ్ఞాపకం ఉంచుకో" అన్నాను కొంత తీవ్రంగానే.

ఆమె ముఖం వంకర్లు తిరిగింది. గడ్డం వణికింది. అలకపాన్పు నలంకరించింది మొదటిసారి. అఫ్కోర్స్! ఇంట్లో ఉన్నది పాన్పు గాదు. నులక మంచం !

ఆవిడను బ్రతిమాలి, బామాలి అన్నం తినిపించేసరికి చాలా టైము పట్టింది.

మర్నాడు గెజెటెడ్ ఇన్ స్పెక్టరుగారు క్లాసు తనికీ ప్రారంభించారు. ఈయన పద్ధతి గమ్మత్తుగా ఉంది. టీచర్లున్న క్లాసుల్లోకి ఈయన పోవటం గాదు.

ఈయన ఉన్న క్లాసులోకే టీచర్లు వంతుల వారీగా పోవాలి. ఒక్కో టీచరు పని చూడ్డం పదిహేను ఇరవై నిముషాల్లో ముగించేస్తున్నాడు.

ముందు టీచర్ను పాఠం చెప్పమంటాడు. అతను మొదలుబెట్టగానే 'నీ లెస్సన్ ప్లానేది?" అని అడుగుతాడు. అతడు లెస్సన్ ప్లాన్ అందించగానే కాంపోజీషన్ పుస్తకాలు తెమ్మంటాడు. అవి తేగానే 'అసైన్మెంట్లేవి?' అంటాడు. మొత్తంమీద ఆయన ఏ టీచరు పాఠమూ వినలేదు, ఏ టీచరు లెస్సన్ ప్లాన్ చూడలేదు. ఎవరి కాంపోజిషను వర్కూ చూడలేదు. అసైన్మెంట్లు చేతిలోకి తీసుకొని అవతల పారేశాడు. 'ఫలానా ఉన్నదా?' అని ఆయన అడగటం. 'ఉన్నది సార్' అంటూ టీచరు ఆయన చేతిలో పెట్టడం. దాన్నవతల పారేసి మరొకటి ఇమ్మని అడగడం. ఈయన వ్యవహారం చూచి కొందరు టీచర్లు గమత్తులు కూడా చేసారు. పాపమాయన గమనించలేదు.

స్కూలు అక్కౌంట్లను మరో అరగంటలో చూసేశాడు. సాయంత్రం నాలుగు గంటలకల్లా ఇన్ స్పెక్షను పూర్తయింది. ఆయనకు చిన్న టీపార్టీ ఇచ్చి వీడ్కోలు చెప్పాము. అందరం రోడ్లోకి పోయి బస్సెక్కించాం. ఇన్స్పెక్షను అనుకున్నంతసేపు పట్టలేదు. తోవలో గెజెటెడ్ ఇన్ స్పెక్టరుగారితో స్కూలుకు అవి గావాలి, ఇవి గావాలి' అంటూ చెప్పుకున్నాం.

"మీ కోర్కెలన్నిటినీ జిల్లా పరిషత్తువారు తీర్చాలయ్యా! మా చేతుల్లో ఏమీలేదు" అంటూ వెళ్ళిపోయాడాయన.

ఆయన్ను పంపించి ఇంటికొచ్చాను.

"నాకిక్కడ ఏమీ బాగాలేదండీ! మనం వెళ్ళిపోదామండీ!" అంటూ ఏడుపు ప్రారంభించింది.

రోజూ అలకపాన్పు లెక్కుతుంటే బ్రతిమాలి భంగపడుతుంటానని అనుకున్నట్లున్నది అమాయకురాలు !

"ఇక్కడ నాకూ బాగానే లేదు. అయినా ఉంటున్నాను గదా! ఎక్కడి కెళ్ళిపోదాం? మన ఇష్టం వచ్చినట్లు పోతే అన్నం ఎవరు పెడతారు? పిచ్చి పిచ్చి వేషాలెయ్యవద్దు రోజూ! ఇంటికి రాగానే రోజూ ఒకటే పాటా? నాకిలాంటివి నచ్చవు. హాయిగా నవ్వుతూ పేలుతూ ఉండాలి గాని ఈ నిష్కారణ ఏడుపులేంటి? నీకు మీ వాళ్ళు గుర్తుకొస్తుంటే చెప్పు - మీ ఊరు పంపుతాను. నీ ఇష్టం వచ్చినన్ని రోజులు ఉండిరా! అంతేగాని రోజూ ఇలాంటి వేషాలేస్తుంటే మాత్రం నాకు బాగుండదు" అన్నాను కటువుగా.

“నా చేతులు చూడండి ఎలా ముళ్ళు గుచ్చుకున్నాయో! ఈ ముళ్ళకంపలతో వంట చెయ్యాలి. ఒకంతకు మండవు. ఊది ఊది కళ్ళుపోతున్నయ్. మంచి నీళ్ళు ఎక్కణ్ణించో తీసుకురావాలి. నీళ్ళు చేది చేతులు బొబ్బలెత్తుతున్నాయి.” తన కష్టాలు చెప్పుకున్నది. ఆమె చేతులు రెండూ నా చేతిలోకి తీసుకున్నాను. రెంటిమీద రెండు ముద్దులుంచాను. నా చెంప కానించుకున్నాను.

“చూడు డియర్! మనం ఎక్కడున్నా ఈ బాధలన్నీ ఉండేవే. మనం మహారాజులం ఈ

కాదు నౌకర్లచేత పనులు చేయించుకునేందుకు. నీకు కష్టంగా ఉన్న మాట నిజమే. నువ్వు కష్టపడటం నాకూ ఇష్టం లేదు. కాని వాటిని అనుభ వించటం కంటే ఏమీ చెయ్యలేము. ఇక నుంచి నీ పనిలో నేను కూడా భాగం పంచుకుంటాను. పుల్లలు నరికిపెడతాను. బావినుంచి నీళ్ళు తెస్తాను. సరేనా? కష్టం వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలి గాని ఏడుస్తూ కూచోకూడదు. నువ్వు సంతోషంగా ఉంటేనే నాకు సంతోషంగా ఉంటుంది. నువ్వు వేరు, నేను వేరు కాదు. ఇద్దరం ఒకటే" అని హితబోధ చేస్తూ పక్కకు తీసుకుపోయాను.

ఆరోజు అన్నపూర్ణ ఎదురైనా ఈవిడకు అసలు వంట చెయ్యటం చేతగాదు. ఓబుల్రాజే నయం. ఏ కూర ఎలా చెయ్యాలో, ఏ పచ్చడి ఎలా నూరాలో, ఉప్పు ఎంత వెయ్యాలో, కారం ఎంత వెయ్యాలో అన్నీ చెబుతున్నాను.

ప్రాక్టికల్ నాలెడ్జి లేదు నాకు. థియరటికల్గా చెబుతూ నెట్టుకొస్తున్నాను. ఏది ఎలా ఉన్నా ఒకరి చెయ్యి ఒకరికి తగిలితే చాలు! అన్ని రుచులూ అందులోంచే పుట్టుకొస్తాయి. ఇద్దరం ఒకే కంచంలో తింటూ, ఒకే మంచంలో పడుకుంటూ ఉన్నాము.

సాయంత్రం భోజనాలు ముగించుకొని లాంతరుకు అటూ ఇటూ కూచొని మాటలు చెప్పుకుంటున్నాము.

గంగరాజు ఒక బొప్పాయి కాయ తీసుకొచ్చి "దీన్ని కోసి పెట్టమ్మా!" అంటూ శ్రీమతి చేతికి అందించాడు. తమ ఇంటి గడప మీద కూచున్నాడు. "ఇప్పుడు మీరు పెద్ద కష్టం తెచ్చి పెట్టారు మాకు" అన్నాను. -"కాయ తినటానికి కష్టమెందుకు? నువ్వు మరీ విచిత్రం" అన్నాడాయన నవ్వుతూ. "ఆమె తరిగేది కాయను గాదు. చేతిని తరుక్కుంటుంది. ఇక్కడ డాక్టరు గూడా లేదు" అన్నాను దిగులుగా.

"చెయ్యెందుకు తరుక్కుంటానండీ! నేనేమంత తెలివి తక్కువ దాన్నను కున్నారా?" అని కత్తిపీట ముందు కూచున్నది. నేను లాంతరు ఆమె ముందుకు జరిపాను.

ఆ పెద్దకాయను నిలువుగా కోద్దామా, అడ్డంగా కోద్దామా అని కాబోలు తిప్పి తిప్పి చూస్తున్నది.

"నువ్విటియ్యమ్మా నేను తరుగుతాను. ఆకో, పళ్ళెమో తీసుకురా, ముక్కలు తరిగిపోస్తాను" అన్నాడు గంగరాజు.

"నేనుండగా మీరెందుకు? నేను తరుగుతా నివ్వు" అంటూ అందుకో బోయాను. "మీరు కూచోండి. నేను తరిగి ఇస్తానుగా. తిందురు గాని" అంటూ దాని చర్మం తియ్యకుండానే తరిగేందు కుద్యుక్తురాలైంది.

"అట్లా అయితే రొండు చేతుల్తో తినాల్సిందే! ముందా చర్మం తీసెయ్యాలమ్మా. ఇటివ్వు నీకు చేతగాదులే. నేను తరుగుతా నివ్వు. నీ చిన్న

చేతుల్లో అంత పెద్దకాయ ఇముడదులే" అంటూ కాయ, కత్తి పీట తాను తీసుకున్నాడు.

ఆయన నానా అవస్థలూ పడి దాన్ని కోసి గింజలు తీసి, ముక్కలు కోసి పళ్ళెంలో కుప్పగా పోశాడు. ఒక కాగితంలో ఆయనకు కొన్ని ముక్కలిచ్చి, పళ్ళెంలో ఉన్న వాటిని మేమిద్దరం తింటూ కూచున్నాము.

"అంతా బాగానే ఉంది గాని పెళ్ళాం మోజులో పడి స్కూలును, ఊరిని మరిచి పోయేట్లున్నావు" అన్నాడు గంగరాజు.

సిగ్గు పడ్డాన్నేను. ఆయన మాటల్లో యదార్థం ఉంది. స్కూల్లో కుర్చీలో కూచొని టేబులు మీదికి వాలి నిద్రపోతున్నాను మధ్యాహ్నం పూట. స్కూల్లో నిద్రపోవటం నేనెన్నడూ చెయ్యని పని. ఎప్పుడూ ఎంతో చైతన్యంగా ఉండే నేను అలా నిద్రబోతున్నందుకు సిగ్గుపడ్డాను. మిగతా టీచర్లు నన్ను జూసి నవ్వుతున్నారు. ఓబుల్ రాజు ముఖంలోంచి చిరునవ్వు మాయమవటం లేదు.

"నేనేం మరిచిపోలేదు. మీరు అనుకుంటున్నారు ఊరికేనే" అన్నాను నవ్వుతూ.

''పెద్దయ్యో రీ మద్దె స్కూల్లో నిద్దరబోతున్నాడు' అని పిల్లలు అనుకుంటున్నారు. ఓబులుగాడు గూడా చెప్పాడు. మా నాటకాన్ని మధ్యలోనే వదిలేశావు. ఆ రూములకు సిమెంటు చేయించటం గురించి ఆలోచించటమే లేదు" అన్నాడాయన.

"ఈన నాటకాలు గూడా వేస్తాడా? అయితే ఇక మేము సంసారం చేసినట్లే!" అన్నది శ్రీమతి.

"నాటకం వెయ్యటమంటే అట్లా ఇట్లా కాదమ్మా! చాలా బాగావేస్తాడు. పాటలు, పద్యాలు బలే బాగా పాడుతాడు." కళ్ళెగరేస్తూ చెప్పాడు గంగరాజు.

"రేపటి నుంచి తిరిగి రిహార్సలు మొదలుబెడదాం కానివ్వండి. మీచేత ఆ నాటకం త్వరగా వేయించేస్తాను" అన్నాను.

“రేపట్నించి అందర్నీ చేరమని చెబుతాను. వాయిదా లెయ్యవద్దు" అంటూ లేచిపోయాడాయన.

మా ఏకాంతానికి భంగం కలిగించకూడదని కాబోలు నరసరాజు ఎక్కువగా రావటం లేదు నా దగ్గరికి. నరసమ్మ గూడా నేను లేనప్పుడు వచ్చి కూచుంటున్నది గాని ఉన్నప్పుడు రావటం లేదు.

28

డ్రామా రిహార్సలు ముగించుకొని ఇంటి కొచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలకు పైగా అయింది.

శ్రీమతి గుర్రుపెట్టి నిద్రబోతున్నది. లేపి అన్నం పెట్టమన్నాను. పెట్టుకొని తినమని చెప్పి మరో ప్రక్కకు తిరిగింది. “నువ్వు తిన్నావా? కలిపి తీసుకురానా?” అన్నాను.

"ఇంట్లో ఒక మనిషి ఉందని మీకు జ్ఞాపకం ఉందా? నేను తింటే ఏం? తినకపోతే ఏం. మీరు తిని పడుకోండి" అంటూ రుసరుసలాడింది.

“ఇవాళ కొద్దిగా ఆలస్యమైంది. రేపట్నించీ ముందుగా వచ్చేస్తాలే. లే. అన్నం తిందాం రా” అని మంచం మీద కూచున్నాను. ఆమెను లేపి ప్రక్కన కూచోబెట్టు కున్నాను. భుజం చుట్టూ చెయ్యి వేసి నా ప్రక్కకు లాక్కుంటూ “వాళ్లందరూ ఎంతో ఇష్టంగా నేర్చుకుంటున్నారు. నేను కదలకుండా ఇంట్లో కూచుంటే ఎలా?" అన్నాను గోముగా.

“అటు వాళ్లకూ పనిలేదు. ఇటు మీకూ పని లేదు. ఉట్టిగట్టుకొని ఊరేగండి" అంటూ దూరంగా జరిగింది.

“నటన నీకు గూడా చేతనవు నన్నమాట. సినిమాలు చూచిన అనుభవం ఎక్కడికి పోతుంది! నువ్వు సత్యభామగా, నేను కృష్ణుడుగా ఈ ఊళ్లో

డ్రామా వేద్దాం మనం.... టౌనులో రాత్రి పదకొండు దాకా మేలుకొనే ఉంటారు మనుషులు. ఇప్పుడింకా పదయినా కాలేదు. టౌను పిల్లవు. ఎనిమిదికే నిద్రపోయేందుకు సిగ్గులేదూ? నీకు నిజంగా నిద్రరాలేదు. నిద్ర నటిస్తున్నావు అవునా?" అంటూ ముఖం నా ప్రక్కకు తిప్పుకొని గట్టిగా ముద్రవేశాను.

దాంతో కోపం కాస్త దిగి వచ్చింది.

"ఒంటరిగా ఎంత సేపని కూచునేది? ఇవాళ ఆ నరసమ్మ గూడా రాలేదు." రెండు చేతులూ నా భుజం మీద వేసి బుంగమూతి పెట్టింది.

“ఆమెకు నాటకమంటే మహాపిచ్చి. అసలీ నాటకం ప్రారంభించడానికి ఆమే కారణం. ఆమె కూతురు గూడా నాటకంలో వేషం వేస్తున్నది. ఇక్కడ ఒంటరిగా కూచోటం కష్టమైతే నువ్వు గూడా అక్కడికొచ్చెయ్. అక్కడ ఆడవాళ్లు కూడా ఉంటారు" అన్నాను ఆమెను చెయ్యి పట్టుకొని లేవదీసుకు పోయాను. లాంతరు పెద్దది చేసి ఇద్దరం అన్నం తిన్నాము.

“మీరు పల్లెటూరులో ఉండాలంటే ఒప్పుకున్నాను గాని ఇలా నాటకాల రాయుడంటే ఒప్పుకునేదాన్ని కాదు” అన్నది తలుపు వేసి మంచంమీది కొస్తూ.

“ఇందులో నా ఇష్టం నీ ఇష్టం అంటూ ఏమీలేదు. ఇది జన్మజన్మల బంధం! నేను నాటకాలు వెయ్యకుండా ఎలుకలు పట్టేవాడినయినా నువ్వు నా దానివి కావాల్సిందే. నేను నీ వాడిని కావాల్సిందే" అంటూ బిగి కౌగిలిలోకి తీసుకున్నాను.

“నాటకం, గీటకం అంటూ రోజూ నన్ను ఒంటరిగా వదిలి పోతుంటే నే నూరుకోను” అన్నది నా ఛాతీమీద తన తల ఆనించి.

“ఈ ఊళ్ళో నేను ఇంత పని చెయ్యగలగటానికి, ఈ మనుషుల ప్రేమాభిమానాలు సంపాదించుకోటానికి కారణం నాటకమేనే పిచ్చిదానా.

మన దేశాన్ని బాగుచెయ్యగల శక్తి నాటకానికున్నది. నాటకం చాలా శక్తివంతమైన సాధనం! " అన్నాను.

“సినిమాలు గూడా శక్తివంతమైనవే గదా! నాటకం కంటెగూడా ఇంకా శక్తివంత మైంది గదా! దేశం బాగుపడలేదేం మరి?" అన్న దావిడ అమాయకంగా,

"సినిమా వ్యాపారం. లక్షలు లక్షలు, కోట్లు పెట్టుబడి పెట్టి సినిమాలు తీస్తున్నారు. వాళ్లు కోరేది లాభాలు గాని దేశ క్షేమం కాదు. అందుకే సినిమాలు జనాన్ని చెడగొాడు తున్నాయని అందరూ గగ్గోలు పెడుతున్నారు.”

“టీచర్లు పిల్లలకు చదువులు చెబుతారు గాని నాటకాలు వెయ్యడం నేనెక్కడా చూడలేదు” అన్నది నవ్వుతూ.

"నీకు తెలిసిన ప్రపంచం ఎంత గనుక! నాలుగు గోడల మధ్య పిల్లలకు చదువు చెప్పటమే గాదు టీచరు చెయ్యాల్సిన పని. మన దేశం లాంటి దేశంలో టీచరు తన చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యవంతం చెయ్యాలి. ఆనందాన్ని పండించి పంచిపెట్టాలి తను. మన మనుషుల్లో టీచరంటే ఇంకా గౌరవం ఎక్కువగా ఉంది. ఆ గౌరవాన్ని తన సుఖసంతోషాల కోసం గాకుండా సమాజ సౌభాగ్యం కోసం ఉపయోగించాలి టీచరు. సుఖమంటే ఏమిటో, సంతోషమంటే ఏమిటో చదువురాని ఈ మనుషులు తెలుసు కునేలా చెయ్యాలి. టీచరు స్వార్థపరుడు కాకూడదు. మన ప్రాచీన టీచర్లందరూ ఋషులే. వారు ఐహిక సుఖాలకు వీలయినంత దూరంగా ఉండి విజ్ఞానాన్ని పండించి పంచిపెట్టారు. ఇప్పుడు మనం పోయేందుకు అడవులు లేవు! మనుషుల మధ్యనే ఉంటూ వారు చేసిన పనిని నేడు చెయ్యాలి. “నాలాంటి వాడు మొగుడయినందుకు సంతోషపడు, తప్పులు పట్టొద్దు" అన్నాను ఆమెను దగ్గరికి తీసుకుంటూ, నాలో ఒదిగిపోయింది తను.

ఉదయం నిద్రలేచి గదిగుమ్మంలో కూచొని పళ్ళు రుద్దుకుంటున్నాను. శ్రీమతి కాఫీ కాస్తున్నది పొయ్యి దగ్గర కూచొని. నేను ఎదురింటి వాకిట్లో ముగ్గేస్తున్న మనిషిని చూస్తూ కూచున్నాను పళ్లు తోముకోవటం గూడా మరిచిపోయి.

వెంకట్రాయలు పెళ్లాం చాలా అందంగా ఉంటుందని ఇతరులు చెప్పగా విన్నాను. ఆమెను ఇంతవరకు చూడలేదు. ఆమె ఇంటి ముందు ముగ్గు పెడుతున్నది. బంగారు తీగెలా ఉంది మనిషి, ఆమె అవయవాల పొందిక ఎవరో అతినైపుణ్యం గల శిల్పి దేవతా విగ్రహానికి అమర్చినట్లుగా ఉన్నది. వంకీలు తిరిగిన జుట్టు, శంఖం లాంటి మెడ, ముఖానికి చక్కగా సరిపోయే కొలతల్లో అందమైన సోగకళ్లు, చక్కని ముక్కు, తెల్లని పలువరుస, విశాలమైన ఫాలం, ఎర్రటి పెదవులు, ఎత్తుగా, బిగుతుగా ఉన్న వక్షాలు, సన్నటి నడుము, ఎత్తుగా వంపు తిరిగిన పిరుదులు, పొడుగాటి కాళ్లు, చేతులు, అద్భుతంగా, అచ్చం కదులుతున్న దేవతా విగ్రహంలా ఉందా అమ్మాయి.

తన అందచందాలను ఎవరో కళ్లతో జుర్రుకుంటున్నారన్న విషయం ఆ సజీవ శిల్పసుందరికి తెలీదు. తన పనిలో తాను నిమగ్నమై ఉన్నది. కూచుంటూ లేస్తూ ముందుకు వాలుతున్న కురులను వెనక్కు తోసుకుంటూ, వివిధ కోణాలలోంచి తను వేసిన ముగ్గును వాలుకన్నులతో పరిశీలిస్తూ అటూ ఇటూ తిరుగుతూ తన పని చేసుకుంటున్నది ఆమె.

ప్రతి కదలికలోనూ అందం జాలువారుతున్నది.

నా ప్రక్కన వెనకగా నుంచొని ఆమె గూడా నేను చూస్తున్న దృశ్యాన్ని చూచి ఉగ్రురాలయింది. "పళ్లు తోముకోటం కూడా మరిచిపోయి చూస్తున్నారే! ఏం. అంత అందంగా ఉందా ఆ అమ్మాయి?" మంచంమీద కూచొని కోపం వెళ్ళగ్రక్కుతూ అడిగింది శ్రీమతి గట్టిగానే.

ఆ మాటలు నా చెవిని బడటం, నేను సచేతనుణ్ణి కావటం, ఆ అమ్మాయి పని ముగించుకొని ఇంట్లోకి వెళ్లటం ఒక్కసారే జరిగాయి.

గబగబా ముఖం కడుక్కొని లోపలికొచ్చాను.

“ఇట్టాంటి పాడు బుద్ధులు గూడా ఉన్నయన్నమాట. ఇన్ని రోజులూ వంటరి గా ఉన్నారు. ఏ మే మాటలాడారో ఎవరికి తెలుసు" తనలో తాననుకొంటూ ఏడుస్తూ పడుకున్నది.

"ఛఛ! ఏమిటిది! ఏదో అటు చూచినంత మాత్రాన పాపాత్ముడి క్రింద లెక్క గడుతున్నావా నన్ను! నేను అల్లరి చిల్లరి మనిషినైతే ఊరి వాళ్లు ఎప్పుడో తన్ని తగిలేసే వాళ్లు. లేకపోతే చంపి పాతి పెట్టేవాళ్లు. ఎప్పుడూ ఊరివాళ్ల కళ్లన్నీ నామీదే కేంద్ర కరించి ఉంటాయి. నేను ఏ పనిచేసినా చాలా జాగ్రత్తగా ఆలోచించి గాని చెయ్యను. నువ్వే నన్ను అనుమానిస్తే ఎలా?" అంటూ సముదాయించబోయాను. ఎంత చెప్పినా ఏడుపు మానలేదు. ఆవిడ మానానికి ఆవిడను వదిలెయ్యక తప్పలేదు. నేను కాఫీ తాగి, సిగరెట్టు కాల్చుకొని ఏం మాట్లాడకుండా స్కూలుకెళ్లాను.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చాను. వంట చెయ్యలేదు. ఇంకా పడుకునే ఉన్నది. ఏడవటం లేదు గాని కళ్లు ఎర్రగా ఉన్నాయి.

"అమ్మయ్య పొద్దుట్నించీ పడుకొనే ఉంది. ఒళ్లు బాగాలేదా? వంట గూడా జేసినట్లు లేదే?" అంటూ వచ్చింది నరసమ్మ.

“మీరు అడగలేదా?” అన్నాను.

"అడిగితే చెబితేగా! యేందో బూదేవిలా పడుకోనుండాది. ఏమైనా పోట్లాడు కోనుండారా?" ఆరా తీసింది.

“పోట్లాడుకుంటే మీకు వినపడదా! గోడేగా అడ్డం?" అన్నాను నవ్వుతూ.

ఆవిడ “మరెందుకు?” అని అడిగి ఉంటే నా పని "గోవిందా?” అయ్యేది. ఆవిడకు ఏమని సమాధానం చెప్పగలను? "నే నా అమ్మాయిని చూస్తూ కూచుంటే ఈవిడకు కోప" మని చెపితే ఇన్ని రోజులూ అసిధారావ్రతంగా

ఉన్న నా చరిత్ర వాళ్లముందు చిన్నబోతుంది! ఆవిడ పుణ్యానికి అంతటితో వదిలేసింది ఆరా తియ్యటం"

“లే అమ్మయ్యా లే. సా రొస్తే గూడా పడుకొనే ఉండావే! ఆయనిప్పుడేం తినిబోతాడు? లేలే" అంటూ ఆవిడతో మాట్లాడింది.

శ్రీమతి ఉలకలేదు, పలకలేదు. గోడకు తిరిగి పడుకున్న మనిషి పడుకున్నట్లు గానే ఉంది.

"నేనన్నా కాస్త అన్నం, కూరా తెస్తానుండు” అంటూ వెళ్ళబోయిందామె

. "ఏం వద్దు. మీ రూరుకోండి" అని ఆమెను పంపించేశాను.

కొంతసేపు మౌనంగా స్టూలు మీద కూచొని తరువాత మంచి నీళ్లు తాగి స్కూలుకు పోయాను.

సాయంత్రం స్కూలు వదలగానే ఇంటికొచ్చాను. అప్పటికి వంట పూర్తిచేసి సింగారించుకొని కూచున్నది. ఆవిడను చూడగానే చాలా కోపమొచ్చింది. రోజూ మాదిరిగా నవ్వుతూ పలకరించలేదు. మురిపాలతో సత్కరించలేదు. కాళ్లు కడుక్కొని మంచం మీద కూచున్నాను ఏం మాట్లాడకుండా.

కూచున్న చోట్లోంచి లేచిపోయి టీ తెచ్చి ఇచ్చింది. గ్లాసు చేతిలోకి తీసుకొని ఎదురుగా కూచోమన్నాను.

“నువ్వు ఇక్కడికొచ్చి ఒకటిన్నర నెలకూడా కాలేదు. ఇప్పటికి ముప్పయి సార్లయినా అలిగి ఉంటావు. ఇలా చేస్తేగాని మొగుడు నీ కొంగు పట్టుకొని తిరగడని మీ వాళ్లు నేర్పి పంపించారా? నీకే ఉన్నదా ఆ తెలివి?" వేలితో గడ్డం పట్టుకొని ముఖం పైకెత్తుతూ అడిగాను.

“వాళ్లనెందుకు తీసుకొస్తారు మధ్యలో? మీరు బాగుంటేనే నిలా ఎందుకుంటాను?" అన్నది నా చేతిని అవతలికి తోసి.

“నేను బాగుండక ఏం చేశాను? నిన్ను ప్రేమగా చూచుకోవటం లేదా?" “మహా బాగా చూచుకుంటున్నారు! పొద్దస్తమానం ఊరి మనుషులతో మాటలు డ్రామాలు, ఊరి జనం మీద చూపులు. నా గురించి యేం పట్టించు కుంటున్నారు? ఇంతకంటే ఏం కావాలి ?" మళ్ళీ ఏడుపు మొదలు పెట్టింది.

"ముందా ఏడుపు నిలుపు. లేకపోతే నిజంగానే ఏడుస్తావు. నా మంచితనం మాత్రమే చూశారు నువ్వు, మీవాళ్ళు. కోపం వస్తే ఎలా ఉంటానో చూడాలని కోరుకోవద్దు." గుడ్లురిమి గట్టిగా అన్నాను.

ఏడుపు మింగుకొని మామూలు మనిషైంది. అంతవరకు బుద్ధిమంతురాలే. ఆ “చూడు, ఇలాంటి వేషాలు నాకు నచ్చవు. నేను ఎంతో పవిత్రంగా, హాయిగా ఉన్నాను పెళ్ళిగాక ముందు. పెళ్లి చేసుకున్నది ఆ హాయిని, సుఖాన్ని మరింత ఎక్కువ చేసుకోవాలని గాని మాట్లాడితే అనవసరంగా చిర్రుబుర్రులాడే మనిషితో వేగాలని కాదు. జీవితాన్ని నరకప్రాయం చేసుకోవాలని కాదు. నువ్వు అలిగి పడుకుంటే నేను నీ కాళ్లు వత్తుతూ కూచుంటానని కలలో గూడా అనుకోవద్దు. మీ ఇంట్లో అంతా ఆడపెత్తనమని, ఆ మగవాళ్లకు వెన్న ముకల్లేవని నాకు తెలుసు. నేను కళ్ళారా చూశాను. నన్ను గూడా వాళ్ల లాగే మార్చుకోవాలని చూస్తే మాత్రం నీకు ఆశాభంగం తప్పదు. మనం కలిసి జీవించలేము. మనకు అన్నం పెడుతున్నది స్కూలు. ఆ స్కూలు అభివృద్ధి కోసం పాటుబడాల్సిన బాధ్యత నామీదుంది. నాటకం నన్నీ మనుషులకు ఎంతో సన్నిహితం చేసింది. ఆ సాన్నిహిత్యం వల్ల నాకు గౌరవం, మర్యాద, సంతోషం లభిస్తున్నది, స్కూలుకు అభివృద్ధి కలుగుతున్నది. నీ పిచ్చివేషాలతో నాకు బంధాలు వేస్తే ఎందుకూ కొరగాని వాడిగా, నీ కొంగు విడిచి మనలేనివాడుగా అవుతానని భ్రమపడవద్దు. ఇంటికీ, నీకూ ఏం కావాలో చెప్పు. చేతనయినంతవరకు తెప్పించి పెడతాను.

ఈ పరిసరాలు, వాతావరణం నీకు కొత్త, నువ్వు దీనికనుగుణంగా మారాలి గాని, వీటిని నీకు సరిపడేట్లు మార్చుకోవాలంటే అసాధ్యం... నేనెన్నటికీ నీవాడినే. నన్ననుమానించవద్దు. ఇతరులెవరికీ నన్ను తాకే హక్కు లేదు. నన్ను

చూచేందుకే భయపడతారు మనుషులు. నా మాటలు నమ్ము... అంతేగాని నేను పొందాలనుకున్న ఆనందానికి, అభివృద్ధికి ఏది అడ్డం నిలిచినా నేను సహించను. అది నువ్వయినా సరే, మరెవరయినా సరే. బాగా జ్ఞాపకం ఉంచుకో. మళ్లీ ఇలాంటి వేషాలు వేశావంటే నిన్ను మీ ఊర్లో వదిలేస్తాను. ఆ తరువాత నీ ఇష్టం... ఇష్టం ... నన్నర్థం చేసుకొని నన్ననుసరించి నా హృదయరాజ్యాన్ని ఏలుకోవాలని నా ఆశ" అని చెప్పి బయటికెళ్లాను.

భజన మందిరం దగ్గరికి పోయి కూచున్నాను. అంత ముందుగా నేను ఏ రోజూ అక్కడ కూచోలేదు. ఆశ్చర్యంగా చూశారందరూ నా వంక. ఆరోజు రిహార్సలుకు కొంత ముందుగానే వచ్చారంతా.

పాత్రధారులు వాళ్ల లెవల్లో కొంత ముందుకే వచ్చారు. వారి నుంచి అద్భుతాలు ఆశించటం అత్యాశే అవుతుంది. ఫరవాలేదు. వాళ్ల స్థాయిలో పోర్షన్లు బాగానే చెబుతున్నారు. ఒక గంటసేపు వారితో కూచొని ఇంటి కొచ్చాను. ఉదయం నుంచి తిండి లేనందువల్ల కొంత నీరసంగానే ఉంది గాని మరీ అంత పడిపోయేలా లేను.

శ్రీమతి మంచి చీర కట్టుకున్నది. తలలో సన్నజాజిపూలు పెట్టుకొన్నది. ముఖానికి స్నో, పౌడరు అద్దుకొని ఆకర్షణీయంగా తయారయింది. ఇంటి నిండా సువాసన అలుము కొని ఉన్నది.

చూచీ చూడనట్లుగా పోయి మంచం మీద పడుకొని కళ్లు మూసుకున్నాను యేమీ మాట్లాడకుండా.

నా పక్కన కూచొని నా మీదికి వాలి పెదవులతో నా బుగ్గల్ని రాస్తూ "అన్నం తిందాం రండి" అన్నది గారాలుపోతూ. "నా కాకలిగా లేదు. నువ్వు తిను పోయి" అంటూ పక్కకు తిరిగాను.

"పొద్దుట్నించి ఏమీ తినలేదని నాకు తెలుసు. పళ్ల బిగువెందుకు? అన్నం తినకుండా పడుకోటం ఎందుకు? తిందాం రండి." చెయ్యి పట్టుకొని లాగింది.

చెయ్యి విడిపించుకున్నాను. "నిన్ను తినమని చెప్పటంలేదూ? అనవసరంగా గొడవ చెయ్యొద్దు నువ్వు తినుపో. నాకు నిద్రొస్తున్నది."

"మీరు తినకుండా నేనెట్లా తింటాను! నేనూ పడుకుంటాను" అని నా పక్కనే ఒదుక్కోబోయింది.

"ఇక్కడ గాదు. అవతల చాప ఉంది. వేసుకొని పడుకో, లేకపోతే నువ్విక్కడ పడుకో, నేనక్కడ పడుకుంటాను."

"మళ్ళీ ఇంకెప్పుడూ అలా చెయ్యనుగా! నా మాట నమ్మండి. మీ మీద ఒట్టు" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

మళ్లీ ఆ సీను జరగటం ఇష్టం లేదు. తటాలున లేచి ఆమెను బిగి కౌగిలిలో జేర్చుకొని ముద్దుల్లో ముంచేశాను. "అలకపాన్పు ఎక్కటం ఆడవాళ్ళకే కాదు మగవాళ్ళకు కూడా చేతనవుతుంది! తెలుసా!" అన్నాను నవ్వుతూ.

"ఇప్పుడు ఎక్కి చూపించారుగా!" అన్నది నాకు అతుక్కుపోతూ.

"ఈసారి నన్ననుమానించావో! ఏ శుకబ్రహ్మాశ్రమంలోనో చేరిపోయి సన్యాసం పుచ్చు కుంటాను. బంగారం వంటి భర్తకు దూరమవుతావు!" అంటూ మంచంమీదినుంచి లేచాను.

"ఆఁ! మహా గొప్ప సన్యాసులవుతారు మీరు! మీతోపాటే నేనూ ఆశ్రమంలో చేరిపోతాను" అన్నది నాతోపాటే లేచి.

"అలా అనుకుంటున్నావేమో! అక్కడ ఆడవాళ్ళను రానివ్వరు. వాళ్ళ గాలి కూడా తగలనివ్వరు తెలుసా?" అన్నాను స్నానం చేసేందుకు టవలు చుట్టు కుంటూ.

"స్నానానికి తయారవుతున్నారు. అక్కడ నీళ్ళు లేవు."

"చన్నీళ్లు చాల్లే. ఒళ్లంతా చిరాగ్గా ఉంది" అంటూ చన్నీళ్లతో స్నానం ముగించాను. ఇద్దరం భోంచేసి మాట్లాడుకుంటూ కూచున్నాము తలుపు దగ్గర.

మా మాటలు విని నరసరాజు, నరసమ్మ గూడా వచ్చి కూచున్నారు. మేమిద్దం సంతోషంగా మాట్లాడుకుంటూ ఉండటం చూసి నరసమ్మ గూడా సంతోషించింది.

పది గంటల దాకా యేవేవో విషయాలు మాట్లాడుకుంటూ కూచున్నాము.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

మేము, మంచము మిగిలాము.

29

మర్నాడు ఉదయమే ఎప్పుడూ రాని దొరసామి మా ఇంటికొచ్చాడు. స్టూలు మీద కూచోమని కాఫీ ఇచ్చాను.

“ఏం దొరసామీ! ఏంటి విశేషం! తోవతప్పి వచ్చినట్లున్నారు” అన్నాను. “ఒణుమిల్లే సార్! నంబ స్కూలిత్తిలే ఒరు బుద్ధవిగ్రగం సేయ మనసిత్తిలే రొంబ ఇష్టంగా ఉంది సార్," అన్నాడు.

నేను ఎన్నడూ ఊహించని ప్రపోజల్ తీసుకొచ్చాడు దొరసామి. "భలే మంచి ఆలోచన దొరసామీ! మనం రోజూ ప్రార్థన చేస్తామే అక్కడ డయస్ కట్టి దానిమీద విగ్రహం పెడితే భలే బాగుంటుంది” అన్నాను. స్కూలు పాకలో జరుగుతున్నా ప్రార్థనా, ఇతర కార్యక్రమాలు మాత్రం కొత్త బిల్డింగు పక్కనే చేస్తున్నాము.

“ఆమాఁసార్! రొంబ అళ ఘూ ఇరుక్కుదు" అన్నాడతను.

"ఎంత ఖర్చువుతుందేంటి?" అడిగాను కుతూహలంగా.

“ఒరు యాభై రూపా పోదుం సార్:”

“యాభై రూపాయలా: అంతేనా? అంత చౌకగానా?” అన్నాను ఆశ్చర్య పడుతూ.

“విగ్రగం సేయటాన్కి సిన్న సిన్న ఇటుక తంపులు పోదుంసార్: కొంజెం మణ్ణువేణు అవళదా: అది ఒరు టెక్నిక్కు సార్:”

“ఇటుక ముక్కలు, మట్టి, చాలా: వాటితో చేస్తారా? చిత్రంగా ఉందే:” అన్నాను. "సిత్రం కిత్రం ఒణ్ణు మిల్లె సార్: నీంగళ్ పర్మిషన్ కుడుంగో: నాన్ వేల నేసి సూపుతాను.”

“సిమెంటు గిమెంటు అక్కర్లేదా?”

“ఒరు బ్యాగ్ సిమెంటున్నా పోదుం సార్:"

“నువ్వు చెయ్యాలే గాని పర్మిషన్ దేముంది దొరసామీ: రేపే మొదలుబెట్టు. నాకూ మేయైనా పనుంటే చెప్పు చెస్తా" అన్నాను. ఉత్సాహంగా నవ్వుతూ.

"నీంగళ్ వేల సేయమాట్టాం:

నీంగా సుమ్మా పారుంగో."

“ఇంత మంచి కార్యక్రమం తలపెట్టినందుకు నిన్నభినందిస్తున్నాను దొరసామీ: మరో కప్పు కాఫీ తాగు" అంటూ బలవంతం చేశానుగాని అతను “నాన్ ఎరేసార్:" అంటూ వెళ్ళిపోయాడు.

“ఇవాళ బలే ఉదయం విజయా: ఆయన మా డ్రాయింగు మాస్టరు. స్కూల్లో బుద్ధుడి విగ్రహం చేస్తాడట. యాభై రూపాయలకు మించి ఖర్చు గాదట. ఆ బొమ్మనే యే మద్రాసులోనో కొంటే వెయ్యి రూపాయలకు పైగా అవుతుంది. ఇప్పుడు దాన్ని మద్రాసు నుంచి తెచ్చేందుకయ్యే ఖర్చు గూడా కాదు. అయాం లక్కీటుడే:" అంటూ శ్రీమతిని రెండు చేతుల్తోనూ పైకెత్తి చిరుకానుక సమర్పించి క్రిందికి దించాను.

"వేళాపాళా లేదు మనిషికి" అంటూ మూతి తుడుచుకుంది.

నేను ఒప్పుకున్నదే తడవుగా పని ప్రారంభించాడు దొరసామి. బిల్డింగుకు సరిపోగా ఇంకా చాలా ఇటుకలు మిగిలాయి బట్టీల్లో, పిల్లల చేత వాటిని తెప్పించి మూడడుగుల ఎత్తు గోడ చుట్టూ కట్టి దాన్ని మట్టితో నింపించాడు.

ఎత్తైన వేదిక అలా తయారయింది. దానిమీద నుంచొని ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తున్నా నిప్పుడు. వేదికకు ఖచ్చితంగా మధ్యలో మూడడుగుల ఎత్తుకు ఒక పెడస్టల్ నాలుగడుగులు చదరంగా నిర్మించి దాన్ని గూడా మట్టితో నింపించాడు. నీళ్ళు పోయించి అంతా గట్టిపడేట్లు చేశాడు. దానిమీద అయిదడుగుల ఎత్తుకు ఒక దిమ్మ లాంటిదాన్ని తయారుచేశాడు ఇటుక ముక్కలు, తడిమట్టి ఉపయోగించి.

తరువాత వారం రోజులు దాని జోలికి పోలేదు. నా కనుమానం వచ్చింది. దొరసామిని పిలిచి ఆదిమ్మను చూపుతూ “నువ్వు చేస్తానని చెప్పిన బుద్ధుడి బొమ్మ ఇదేనా దొరసామి?'' అన్నాను నవ్వుతూ.

పగలబడి నవ్వాడు దొరసామి. "అది ఇల్లెసార్: ఆ దిమ్మ నల్ల ఎండాల సార్: అంద మేలె వేల: అది ఎండక మిన్నె ఒణ్ణూ సేయ ముడియాదు సార్:" అన్నాడు.

అత నాపని చేస్తాడు. అతన్ని ప్రశ్న లెయ్యడంకంటె చేసేది చూడటం మంచి దనుకున్నాను.

డ్రామా రిహార్సలు రెగ్యులర్ గా జరుగుతున్నది. అయాం ఇన్‌మై ఎలిమెంట్స్ నౌ: శ్రీమతి సంతోషంగా కోఆపరేట్ చేస్తున్నది. నరసమ్మ కూతురు సంపూర్ణను తోడుగా ఉండమని చెప్పాను. పుస్తకాలు తీసుకువచ్చి ఇక్కడే చదువుకోమన్నాను. ఆ అమ్మాయి గూడా డ్రామాలో వేషం వేస్తున్నది. “నీ వేషం ఉన్నప్పుడు నువ్వు వద్దువుగానే, నీ దెంత అయిదు నిముషాలు. తేలిగ్గా నేర్చుకోవచ్చు" అని చెప్పాను.

మోక్షముని అనే కొత్త సెకండరీ గ్రేడ్ టీచరు వచ్చి చేరాడు స్కూల్లో, ఫ్రెష్ అపాయింట్మెంట్. యువకుడు. మంచి ఉత్సాహంతో ఉన్నాడు. ట్రైనింగ్ స్కూలు వదిలి కొత్తగా ఉరకలు వేసే ఉత్సాహంతో ఉద్యోగంలో చేరాడు. ఎలిమెంటరీ సెక్షన్లో మునిగి

పైకి తేలిన సరుకుగాదు. దొరసామి పిలవకుండానే విగ్రహం చెయ్యటంలో అతనికి సహాయపడుతున్నాడు మోక్షముని.

డ్రామా రిహార్సల్స్ నేనుచాలా యాక్టివ్గా పాల్గొంటున్నాను. చాలా బాగా పాడి చెబు తున్నాను. నటించి చూపుతున్నాను. నాకు నాకే మహా తృప్తిగా ఉంటున్నది. చూచే వాళ్ళు గూడా ఆనందిస్తున్నారు, చూసేందు కొచ్చే జనం గూడా ఎక్కువవుతున్నారు.

కోసలనగరం నుంచి వచ్చే గయుడు చాలా శ్రద్ధగా అందరికంటే ముందుగానే వస్తున్నాడు. అతని కోతి గంతులు తగ్గిపోయాయి. దీర్ఘ రాగాలను కట్టుదిట్టం చేశాను.

సాయంత్రం భోజనాలయింతరువాత రిహార్సలు గాబట్టి అందరికీ అనుకూలంగా ఉంటున్నది.

నేను వద్దంటున్నా ఇంటికి పాలు, పళ్ళు, పెరుగు పుష్కలంగా వచ్చి చేరుతున్నాయి. అవి చెడిపోకుండా కొన్నింటిని మిగతా టీచర్లకు, ఓబుల్రాజుకు పంపుతున్నాను.

స్కూల్లోను, ఊళ్లోనూ, ఇంట్లోనూ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొని ఉంది.

దిమ్మ బాగా ఎండిన తరువాత ఉలి తీసుకొని దాన్ని బొమ్మ ఆకారంలో చెక్కడం ఆరంభించాడు దొరసామి. పద్మాసన స్థితుడైన బుద్ధుడి విగ్రహం అతను తయారు చేయబోతున్నది. ముందు కాళ్ళ దగ్గర ప్రారంభించి, నిదానంగా నడుము, చేతులు, భుజాలు, తల, జుట్టు, చెవులు, ముక్కు ఆకారం ఏర్పడేటట్లు చెక్కాడు. బొమ్మకు ఓ ఆకారం ఏర్పడ్డది.

తరువాత ఇసుకను వస్త్ర కాయితం పట్టి కుప్పగా పోసుకున్నాడు.

అతనా పనిలో ఉండగా మోక్షముని నా దగ్గరి కొచ్చి "బొమ్మ పూర్తయేందుకు నాలుగు బస్తాల సిమెంటన్నా కావాలి సార్:" అన్నాడు.

'''ఒరు బస్తా పోదుం' అన్నాడు గదయ్యా దొరసామి:" అన్నాను మోక్షమునితో నవ్వుతూ. 'విగ్రగత్తికి ఒరు బస్తా పోదుం సార్: కింద కట్టిన ప్లాట్ ఫాంకు, విగ్రహం నిలిచేందుకు కట్టిన పెడస్టలు మూడు బస్తాలన్నా కావాలి సార్" అన్నాడు అతనూ నవ్వుతూ.

ఓబుల్ రాజుకు చెప్పాను ఎవరి బండయినా తిరుత్తణి పోతుంటే నాలుగు బస్తాలు సిమెంటు తీసుకురమ్మని.

"వెంకట్రాయ లింటో యాభై బస్తాల దాకా సిమెంటు ఉంది సార్: అతన్నడగండి నాలుగు బస్తాలిమ్మని. మళ్ళీ ఇచ్చేద్దాం" అన్నాడు శ్రీనివాసులు.

"వాళింట్లో అంత సిమెంటు ఎందుకున్నదండీ? అతనేమన్నా సిమెంటు బ్లాకులో అమ్ముతాడా?" అన్నాను.

"ఇంట్లో రూమేదో కట్టించాలని తెచ్చా సార్. ఓబుల్ రాజును పంపి అడగమనండి" అన్నాడతను.

వెంకట్రాయలు డ్రామాలో అర్జునుడి వేషం వేస్తున్నాడు. ఊళ్ళో అందరికంటే బాగా ఉండే వాళ్ళట గూడా. ఓబుల్రాజును పోయి అడిగి రమ్మన్నాను. ఒక గంటలో నాలుగు మూటల సిమెంటు స్కూలుకు చేరింది:

మోక్షమునిని, దొరసామిని పిలిచి చెప్పాను.

"మీరడిగిన సిమెంటు వచ్చిందండీ: కేరీ ఆన్" అన్నాను సంతోషంగా

"మీరు పట్టిందంతా బంగార మౌతున్నది సార్:" అన్నాడు చంగల్రాయలు.

"అంతా పట్టే విధానంలో ఉందయ్యా: పట్టులో యేమీలేదు" అని నవ్వాను.

"రొంబ థాంక్స్ సార్" అంటూ వెళ్ళాడు దొరసామి.

సెక్రటరీగారి సలహా మరిచిపోకుండా ఎకౌంటు టెస్ట్ పరీక్షకు కట్టాను. తీరిక సమయాలు దానికి తయారయేందు కుపయోగిస్తున్నాను. మోక్షముని

తో, నేను మద్రాసు పోయి ఎకౌంటు టెస్టు ఇన్స్టిట్యూట్ కావాల్సిన గైడ్లు కొనుక్కొచ్చుకున్నాను.

రోజులు పరుగెత్తి పోతున్నాయి.

జనవరి నెల వచ్చేసింది. సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలే వ్యవధి.

తొమ్మిదో తరగతిలో ఇరవై నాలుగు మంది పిల్లలున్నారు. ఆ ఇరవై నాలుగు మంది పదిలోకి వచ్చెయ్యాలి. అందరూ బుద్ధిగా చదువుతున్నారు.

గంగరాజును, ప్రెసిడెంటును స్కూలుకు పిలిపించాను.

“చూడండి. తొమ్మిదో తరగతిలో ఇరవై నాలుగు మంది ఉన్నారు. అందరూ బాగా చదివేవాళ్ళే. వాళ్ళందరూ వచ్చే సంవత్సరానికి పదిలోకి వస్తారు. స్కూలో పదో తరగతి తెచ్చేందుకు ఇప్పటి నుంచే మీరు ప్రయత్నాలు ప్రారంభించాలి. ఆలస్యం చేస్తే ప్రయోజనం ఉండదు. పదో తరగతి వచ్చేస్తే యస్సెల్సీ దానంతటదే వస్తుంది. ఏం చేసినా మీరు ఇప్పుడే చెయ్యాలి. స్కూలును పూర్తి హైస్కూలుగా మార్చేందుకే మనం బిల్డింగులు కట్టింది. అవస్థలు పడింది. మీకుముందు గానే చెబుతున్నాను. తరువాత మీ ఇష్టం” అన్నాను సీరియస్గా.

"మేం చెయ్యగలిగింది జేస్తాం సార్:" అన్నాడు ప్రెసిడెంటు.

“ఎవరయినా చెయ్యగలిగిందే చేస్తారు. మీరు చెయ్యగలరనే మీకు చెబుతున్నాను. మీరు దాన్ని సాధించాలి. లేకపోతే స్కూలు మూలబడటం ఖాయం. ఏ పనయినా నిరాఘాటంగా సాగిపోవాలి. మధ్యలో గంట్లు పడితే అంతే. ఈయేడు తొమ్మిదొచ్చింది. వచ్చే యేడు పది రావాలి. ఆపై యేడు పదకొండు. ఆ తరువాత మీరు ఘనకార్యం సాధించామని మీసాలు మెలేసి చెప్పవచ్చు. విశ్రాంతిగా నిద్రపో వచ్చును" అన్నాను నవ్వుతూ.

“ఏం చెయ్యమంటావో చెప్పు. అట్లాగే చేస్తాం" అన్నాడు గంగరాజు.

"మీరు ఛెయిర్మనుగార్ని కలిసి పరిస్థితిని వివరించండి. ఆయన ఏం కావాలన్నా చేస్తామని చెప్పండి. ఆయన దగ్గర మాట తీసుకొని రండి" అంటూ చెప్పాను.

"ఆయన డబ్బూ గిబ్బూ కట్టాలంటాడేమో." అన్నాడు గంగరాజు. "కడతామని చెప్పండి."

"మనం కట్టగలగొద్దూ: రేకుల కోసం మొన్ననేగా వసూలు చేసింది. మళ్ళీ ఇమ్మంటే ఇస్తారా?" అన్నాడు ప్రెసిడెంటు.

"కడతామని ఒప్పుకోండి మహానుభావా: ఏం ఫరవాలేదు. ముందు కొంత కట్టిం తరువాత కొంత కట్టటమో లేకపోతే ఇక కట్టలేమని చేతులెత్తి ఆయన కాళ్ళమీద పడటమో చేద్దురుగాని, ముందాయన దగ్గర మాట తీసుకోండి. ఇలా చాలామంది చేస్తున్నారిప్పుడు. మీరూ చెయ్యండి. తప్పులేదు" అన్నాను.

"అట్లాగే చేస్తాం" అంటూ లేచారు. ఇంటి దగ్గర్నించి కాఫీ తెప్పించి ఇచ్చాను ఇద్దరికీ. దొరసామి, మోక్షముని ఇద్దరూ విగ్రహం పని ఉత్సాహం తో చేస్తున్నారు. మెడదాకా వచ్చింది బొమ్మ. మరో పదిహేను రోజుల్లో పనంతా పూర్తవుతుంది.

నాటకం గూడా నేర్చుకోవటం పూర్తయినట్లే. ఇటు బుద్ధుడి విగ్రం, అటు నాటకం రెండూ ఒకేసారి ముగింపుకు రావడం జరిగింది.

స్కూల్లో టీచర్లందరూ రిపబ్లిక్ డే నాడు విగ్రహావిష్కరణ, నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. అదీ బాగానే ఉంది.

"విగ్రహావిష్కరణ ఛెయిర్మనుగారి దగ్గర చేయిద్దాం" అన్నాను.

"అంతకంటేనా? ఆయన ఈ మారుమూల ప్రదేశానికి వస్తాడా అనేదే సమస్య" అన్నాడు శ్రీనివాసులు.

“మనం చేసిందంతా వివరిస్తూ ఆయనకు ఉత్తరం రాద్దాం. ఏమంటాడో చూద్దాం” అన్నాను. ఛెయిర్మను గారి అడ్రసు మాత్రం తెలుసు నాకు. ఆయన్నెప్పుడూ చూడలేదు. ఆయన్ను గురించి ఏమీ తెలీదు నాకు.

అలాగే చేద్దామని అందరూ అన్నారు.

30

ఛెయిర్మనుగారికి ఉత్తరం రాశాను. త్వరత్వరగా విగ్రహంపూర్తి చెయ్యమని దొరసామికి చెప్పాను. నాటకం వాళ్ళకు డ్రస్సులు లైట్లు మాట్లాడుకోమని చెప్పాను.

గంగరాజు, ప్రెసిడెంటుగార్లను కలిసి “ఛెయిర్మనుగారిని ఇక్కడికే రమ్మని రాశానండీ. మన విగ్రహావిష్కరణ ఆయన చేతనే చేయిద్దామనుకున్నాము. మీరు వెంటనే ఆయన దగ్గరకు పోయే బాధ తప్పుతుందేమో చూద్దాము. జనవరి ఇరవై ఆరు జరుపదలుచు కున్న కార్యక్రమమంతా వివరించి వారి సహాయం కావా"లంటూ అడిగాను.

“కొత్త మనుషులతో మాట్లాడినట్లుగా మాట్లాడుతున్నావే: ఫలానా ఫలానా పన్లు చెయ్యాలని చెప్పు. మేం చేస్తాము" అన్నాడు గంగరాజు.

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తమరు గూడా పాల్గొనాలని సెక్రటరీగారికి, డి.ఇ.ఓ.గారికి కూడా ఉత్తరాలు రాశాను. వాళ్ళను పోయి పిలిస్తే బాగుంటుందని ఉంది మనసులో. ఒక రిద్దరు టీచర్లు గూడా అన్నారు. పోయి పిలవట మంటే డబ్బుతో పని. తీరా మనం పోయేసరికి వాళ్ళుంటారో, ఉండరో నని అనుమానం.

విగ్రహం పని దాదాపు పూర్తి కావస్తున్నది. కళ్ళూ, ముక్కు, పెట్టేటప్పుడు చుట్టూరా అడ్డం కట్టించాలని అడిగాడు దొరసామి. కొన్ని కొయ్యలు, పట్టలు సంపాయించి విగ్రహం చుట్టూ దడి కట్టించాము.

విగ్రహం చాలా అందంగా తయారయింది. ప్రారంభంలో ఎంత వికృతంగా ఉందో ఇప్పుడంత అందంగా ఉంది. పెడస్టలుమీద అశోక చక్రం. ఆవు వగైరా

బొమ్మలు గూడా చెక్కాడు దొరసామి. కింద "సత్యమేవ జయతే” అన్న మాటలు రాశాడు. విగ్రహానికి సిల్వర్ పెయింటు పూసాడు. వేదికకు గూడా సిమెంటు చేశాడు. సున్నం కొట్టాడు. వేదిక చుట్టూరా రెండడుగులు చోటు వదిలి ఇటుకలు నాటి వాటి లోపల మట్టి పోయించాడు. మట్టిలో 'కాన్నా' మొక్కలు నాటించాడు. ఆ ప్రదేశమంతా కళాత్మకంగా, హృదయాహ్లాద కరంగా తయారుచేశారు దొరసామీ.. మోక్షముని. వాళ్ళను అభినందించని రోజులేదు నేను. ఛెయిర్మనుగారే విగ్రహావిష్కరణ చేస్తార నటంలో వాళ్ళ ఉత్సాహం రెట్టింపయింది. ఊరి జనమేగాక ప్రక్క ఊళ్ళనుంచి కూడా మనుషులు వచ్చి చూచిపోతున్నారు. చుట్టూరా కట్టిన దడి విప్పలేదు. టెంకాయలు కొడుతున్నారు. కర్పూరం వెలిగిస్తున్నారు. చాలా అట్టహాసంగా ఉంది అంతా.

దొరసామిని, మోక్షమునిని విగ్రహావిష్కరణ సందర్భంలో సన్మానిస్తే బాగుంటుందని పించింది. గంగరాజు, ప్రెసిడెంటు, బాలరాజు, నరసరాజు. నరసమ్మ, ఇంకా కొందరికి ఈ మాట చెప్పాను. తప్పకుండా చేద్దా మన్నారు. వాళ్ళకు కొత్త గుడ్డలు కొనే ఏర్పాటు చేశాను.

"ఛెయిర్మనుగారు స్కూల్లో బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు అంగీకరించారు. మీరు పూర్తి వివరాలు తెలియజెయ్యండి" అంటూ చెయిర్మనగారి క్యాంపు క్లర్కు జాబు రాశాడు. నా ఉత్తరం అందిన పది రోజులకు, "ఛెయిర్మనుగారితో బాటు నేను గూడా వస్తాను" అని సెక్రటరీగారు రాశారు. స్కూల్లో, ఊళ్ళో అందరమూ ఉబ్బితబ్బిబ్బయ్యాము:

'నథింగ్ సక్సీడ్స్ లైక్ సక్సెస్' అని అందుకే అన్నారేమో అనుకున్న పనులన్నీ జయప్రద మవుతున్నాయి. నాకు చాలా సంతోషంగా ఉంది.

విగ్రహావిష్కరణ కార్యక్రమం మరో వారం రోజులుందనగా ఆహ్వానాలు, కార్యక్రమంతో సహా అచ్చేయించాము. ఛెయిర్మనుగారికి, సెక్రటరీగారికి, డి.ఇ.ఓ. గారికి పంపించాము. ఊళ్ళలో పంచిపెట్టే కార్యక్రమం పిల్లలకు

అప్పగించాము. అందులో నాటకంలో వేషాలు వేసే వారి పేర్లు గూడా చేయించాము. ప్రెసిడెంటు, గంగరాజు గార్ల పేర్లు ప్రముఖంగా కనిపించేట్లు వేశాము. ప్రోగ్రాం పేసరు ప్రకారం కార్యక్రమం నిర్వాహకులు వాళ్ళే.

బుద్ధ విగ్రహానికి కొంచెం దూరంలో డ్రామాకు స్టేజీ వేయించాము.

ఛెయిర్మనుగారికి, సెక్రటరీగారికి స్వాగత తోరణాలు కట్టించాము. స్కూలు ఆవరణమంతా రంగు కాయితాలతో అలంకరించాము.

ఊరి పొలిమేర్లలోనే ఛెయిర్మనుగారికి, సెక్రటరీగారికి స్వాగతం పలికి మేళతాళాలతో స్కూలు దగ్గరికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశాము.

జనవరి ఇరవై ఆరవ తేదీ సాయంత్రం నాలుగు గంటలకల్లా మేమందరం ఊరి ముందు చేరాము. పూలహారాలతో, పలకల వాద్యగాళ్ళతో దాదాపు నూరు, నూట ఏభై మందిమి పోగయినాము. మేమక్కడ చేరిన అరగంటకల్లా ఛెయిర్మనుగారు కార్లోనూ, సెక్రటరీ గారు జీపులోనూ వచ్చేశారు. ఛెయిర్మనుగారితో బాటు వైస్ ఛెయిర్మన్ గారు, ఇద్దరు సమితి అధ్యక్షులు గూడా వచ్చారు. మేము తీసుకుపోయిన పూలహారాలు రెండే. ఒకటి ఛెయిర్మన్ గారికి, ఒకటి సెక్రటరీగారికి అని. ఇంతమంది మనుషులు వస్తారని మే మనుకోలేదు. ప్రెసిడెంటు, గంగరాజు నా వంక చూచారు. అనుకున్న ప్రకారం ఆ యిద్దరికీ వెయ్యండి." అని చెప్పాను. ప్రెసిడెంటు ఛెయిర్మనుగారి మెళ్ళో దండ వేశాడు. గంగరాజు సెక్రటరీగారి దగ్గరకి పోయాడు. ఆయన వైస్ చెయిర్మను గారికి వెయ్యమంటూ సలహా యిచ్చాడు. ఆ ప్రకారమే చేశాడు గంగరాజు. వైస్ ఛెయిర్మన్ గారు అభ్యంతరం చెప్పలేదు.

పలకలు మోగుతున్నయ్. రకరకాల దరువు లేస్తున్నారు వాళ్ళు. అందరూ వాహనాలు దిగి మాతో బాటు నడిచారు. అయిదు గంటలకల్లా స్కూలుకు చేరాము. అందుకని నియోగించిన మనుషులు అతిధులకు కుర్చీలు వేసి తయారుగా ఉన్నారు. స్కూలు గార్డెను మధ్యలో వేసిన కుర్చీల్లో అందరూ ఆసీనులయ్యారు. ప్రెసిడెంటుగారి ఇంటినుంచి కాఫీ వచ్చింది. వాళ్ళ

ఇంట్లోనే భోజనాల ఏర్పాటు గూడా జరిగింది. కాఫీతాగా రందరూ ముఖం చిట్లించుకొని.

ఛెయిర్మనుగారు నన్ను దగ్గరికి పిలిచారు. "విగ్రహం చేయించేందుకు ఎంత ఖర్చయింది?” అన్నారు.

“విగ్రహానికి ఒక మూట, మిగతా అంతకూ మూడు మూటలు, సిమెంటు ఖర్చయింది.

విగ్రహానికి వేసిన పెయింటు అంతా రెండు వందల లోపు అయింది” అన్నాను.

“ఇంతేనా?” అని ఆశ్చర్య పోయాడాయన. విగ్రహం ఎత్తు వగైరా వివరాలడిగారు. చెప్పాను.

అయిదున్నరకు కార్యక్రమం ప్రారంభమైంది. ఛెయిర్మనుగారు, సెక్రటరీ గారు, వారితో వచ్చిన పెద్దలు వేదికమీద ఆసీనులయ్యారు. విగ్రహాన్ని ఇరవై మీటర్ల ఖద్దరు గుడ్డతో కప్పాము. ఛెయిర్మనుగారు ఒక చోట కత్తిరిస్తే గుడ్డంతా కిందికి జారుతుంది. పనైపోయిం తరువాత టీచర్లందరూ ఆ గుడ్డ లోంచి ఒక చొక్కా కయ్యేంత కొనుక్కోవాలి. అలా ఫ్రీగానే గుడ్డ వచ్చిందన్న మాట.

అతిధులను ఆహ్వానించడం, పూలమాలలు వేసి గౌరవించడం మొదలైన కార్య క్రమం ముగిసింది. ఆవిష్కరణ కార్యక్రమానికి నాలుగైదు వేలమంది జనం వచ్చారు. నేను స్కూలును గురించి, భవన నిర్మాణాన్ని గురించి కొంత వివరం గా చెప్పాను. అక్కడ పదో తరగతి ప్రారంభించాల్సిన అవసరాన్ని గురించి చెప్పాను. ఆ తరువాత ఛెయిర్మనుగార్ని విగ్రహావిష్కరణ చెయ్యాల్సిందిగా కోరాను.

స్టేజీమీద నుంచి పీఠంతో సహా ఏడడుగుల ఎత్తుంది విగ్రహం. ఒక స్టూలు వేసి ఛెయిర్మనుగార్ని దానిమీద కెక్కించి చేతికి కత్తెర ఇచ్చాము. ఆయన జాగ్రత్తగా కత్తిరించారు. గుడ్డకిందకి జారిపోయింది. విగ్రహం మెడలో వేసేందుకు

ఆయన చేతికి పూలదండ ఇచ్చాను. ఆయన దాన్ని విగ్రహం మెడలో అలంకరించారు. స్టూలుమీది నుంచి కిందికి దిగి ఒక నిముషం ఎదురుగా నుంచొని చూశారు. చేతులు మడిచి దణ్ణం పెట్టారు. మిగతా అతిథులు గూడా ఆయన్ననుసరించారు. చుట్టూ తిరిగి చూచారు. అశోకచక్రం వగైరాలన్నింటినీ చూశారు. ఒక పక్క ఛెయిర్మనుగారి పేరు, సెక్రటరీగారి పేరు, దొరసామి, మోక్షమునిగార్ల పేరు గూడా సిమెంటుతో చెక్కించాను. ఆయన పరిశీలనగా అన్నీ చూచి తన స్థానంలోకి వచ్చి కూచున్నారు. అతిథులందరూ ఆసనాలలకరించిన తరువాత పాఠశాల కమిటీ ప్రెసిడెంటు స్కూలును పూర్తిస్థాయి హైస్కూలుగా మార్చాల్సిన అవసరం గురించి తెలుపుతూ ఛెయిర్మనుగారికో మహజరు సమర్పించారు. అంతకుముందు దాన్ని అందరం కూచుని తయారు చేశాము.

ఛెయిర్మనుగారు తమ ప్రసంగంలో విగ్రహాన్ని చాలా మెచ్చుకున్నారు. ఇంత పెద్ద విగ్రహాన్ని అంత చౌకగా తయారుచేసిన దొరసామిని మెచ్చుకున్నారు. విగ్రహం అందచందాలను ప్రశంసించారు. పాఠశాలకు వచ్చే సంవత్సరం పదో తరగతి తప్పకుండా శాంక్షను చేస్తామని వాగ్దానం చేశారు. భవనం గోడలకు సిమెంటు చేయించి, ఫ్లోరింగు చేయించమని చెప్పారు. ఆయన ప్రసంగమంతా అయిదు నిముషాల్లో ముగిసింది.

వైస్ ఛెయిర్మనుగారు జ్ఞానార్జన చేసి - గౌతముడు ఎలా బుద్ధుడయ్యాడో వివరంగా చెప్పారు. ఆయన మతం ఖండఖండాలలో ఎలా వ్యాపించిందో వివరించారు. ఈ బడిలో చదివే పిల్లలు గూడా అలాగే తాము విజ్ఞానవంతులై దేశానికీ, సమాజానికీ సేవ చెయ్యాలని ఉద్బోధించారు.

సెక్రటరీగారు ఏమీ మాట్లాడలేదు.

తరువాత దొరసామిని, మోక్షమునిని పూలమాలలతోనూ, నూతన వస్త్రాలతోను సత్కరించాల్సిందిగా ఛెయిర్మనుగారిని కోరాను.

ఛెయిర్మనుగారు దొరసామిని, మోక్షమునిని సత్కరించి, వారిని మెచ్చు కుంటూ కరచాలనం చేశారు. ఆ ఇద్దరూ పరమానందభరితులై ఆయనకు నమస్కరించారు.

శ్రీనివాసులు వందన సమర్పణ చేశాడు.

ఆరున్నర ఏడు గంటలకల్లా ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయింది. తరువాత ఛెయిర్మనుగారు వెళ్ళిపోతామంటూ బయలుదేరారు. భోంచేసి, గ్రామస్థులు ప్రదర్శిస్తున్న నాటకం చూసి పోవలసినదిగా కోరాము. భోజనానికి అంగీకరించారు. అందరం ప్రెసిడెంటుగారి ఇంటికి చేరాము.

నాటకం వేసేవాళ్ళను మేకప్పు చేసుకోమని చెప్పి పంపించాను. అదృష్టవ శాత్తు అది పున్నమిరాత్రి.

ప్రెసిడెంటు గారింట్లో అరగంటసేపు కూచొని ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ కూచున్నారు. గంగరాజు మధ్యలో నా గురించి ఆయనకు గొప్పగా చెప్పాడు. "నువ్వు టెస్టు పాస్ త్వరగా: హెడ్మాస్టరుగా ప్రమోషనిస్తాను" అన్నారు మెచ్చుకోలుగా.

భోజనాలయ్యాయి. తరువాత అందరూ బయలుదేరారు. నాటకం చూడమని బ్రతిమాలాము. వారు వినలేదు. "నాటకంలో వేస్తున్న స్త్రీ పాత్రధారు లెవరు?" అంటూ తీశారు వైస్ చెయిర్మను గారు, మా స్కూలు పిల్లలేనని చెప్పాను. చప్పరించాడాయన. "నాటకం చాలా కష్టపడి నేర్చుకున్నారు. కొంచెం సేపయినా చూస్తే వాళ్ళు చాలా సంతోషిస్తారు" అని ఛెయిర్మను గార్ని అడిగాను."వేరే పనులున్నాయి. ఉండే వీలులేదు" అంటూ ఆయన కార్లో కూచున్నాడు. మిగతా వారు గూడా ఆయన్న నుసరించారు.

సెక్రటరీగారు నన్ను దగ్గరికి పిలిచి - "యూ డిడ్ వెల్. పాస్ ది టెస్టు: డోంట్ వేస్టు ఎనీమోర్ టైం:" అంటూ నాకు షేక్ హ్యాడిచ్చారు. పులకిత గాత్రంతో "థాంక్ యూ వెరీమచ్ సార్: టెస్టుకు కట్టాను. తప్పకుండా

పాసవుతాను. బాగా ప్రిపేరవుతున్నాను సార్: మీరు ఇంతకు ముందు వచ్చినప్పుడే చెప్పారు నేను వెనకబడిపోయానని” అంటూ ఆయనకు నమస్కారం పెట్టాను. నా వీపు తట్టి కూచున్నారాయన. ముకుళిత హస్తాలతో వారికి వీడ్కోలు చెప్పాము. వారు వెళ్ళి పోయారు.

నేను స్కూలుకు పోయాను. మొటమొదట బుద్ధ విగ్రహాన్ని చూచాను.

నిర్మలమైన ఆకాశంలో నక్షత్రాలు మిల మిల మెరుస్తున్నాయి. నిండు చంద్రుడు ప్రకాశవంతంగా ఉన్నాడు. చల్లని గాలి మెల్లగా వీస్తున్నది. వెన్నెల్లో ధ్యాన ముద్రాస్థితుడైన బుద్ధ భగవానుడు ప్రశాంత గంభీరంగా, ప్రసన్న వదనంతో మెరిసి పోతున్నాడు. అప్రయత్నంగా ఆ మహాపురుషుడికి చేతులెత్తి నమస్కరించాను.

నాటకం చూసేందుకు ప్రేక్షకులు గుంపులు గుంపులుగా వచ్చి తమ కనువైన స్థలాల్లో కూచుంటున్నారు. లాంతర్లు పట్టుకొచ్చుకున్నారు కొందరు. దుప్పట్లు కప్పుకొని కొందరు, వక్కాకు నములుతూ కొందరు, పిన్నలు, పెద్దలు, వృద్ధులు, స్త్రీలు, పురుషులు అంతా చాలా సందడిగా ఉంది.

నేను స్టేజీ లోపలికి పోయాను. అందరికీ రంగులు పూస్తున్నాడు. మేకప్ చేసే మనిషి, వాళ్ళ చుట్టూ జనంచేరి అతన్ని చెయ్యాడనివ్వటం లేదు. అందర్నీ బయటికి పొమ్మని చెప్పాను. పోయినట్లు పోతారు. మళ్ళీ పోగవుతారు. ఓబుల్రాజును, చంగల్రాయలు, శ్రీనివాసులు, కనిపించిన ఇతర టీచర్లను పిలిచి ఈ జనాన్నంతా బయటికి పంపించెయ్య మని చెప్పాను. వాళ్ళు ఎంత శ్రమ పడ్డా ప్రయోజనం లేకపోయింది. ఇలాగైతే అసలు నాటకం నిలిపేయిస్తానని బెదిరించేసరికి కొంత పలచబడ్డారు జనం.

మేకప్పు పూర్తయేసరికి దాదాపు పది గంటలైంది. భోజనాలు ముగించుకొని గంగరాజు, ప్రెసిడెంటు వచ్చారు. ఇంటికిపోయి శ్రీసతిని తీసుకురమ్మని ఓబుల్ రాజుకు చెప్పాను. "నరసమ్మతో బాటు అప్పుడే వొచ్చింది సా అమ్మయ్య:" అన్నాడు ఓబుల్రాజు నవ్వుతూ. "సరేలే. అయితే నువ్వు ఇక్కడే ఉండు జనాన్ని రానివ్వకుండా" అని అతనికి చెప్పి నేను స్టేజీలో కొచ్చాను.

బయట వెన్నెల చల్లగా ఉంది. కూర్చున్న జనం కూచున్నారు. అటూ ఇటూ తిరుగుతున్న వారు తిరుగుతున్నారు.

నాలుగు పెట్రోమేక్సులైట్లు మండుతున్నాయి. అంతా సవ్యంగానే ఉన్నదని నిర్ధారణ చేసుకున్న తరువాత వేషధారు లందర్నీ స్టేజీలోకి రప్పించి ప్రార్ధన చెప్పించి, టెంకాయ కొట్టించి, మంగళహారతి పట్టించాను. అందరూ లోపలికి వెళ్ళిపోయారు. మొదటి సీను ప్రారంభమైంది. తెర తీశారు.

పాత్రధారులు నాలుగు మాటలు చెప్పీ చెప్పక ముందే పూలదండలతో ఆయా పాత్రధారుల చుట్టాలు, స్నేహితులు వచ్చి వారి గళసీమల్లో వాటి నలంకరించి, కరచాలనాలు చేసి వెళ్ళారు. ఆ కార్యక్రమం పది నిముషాలు తీసుకున్నది. అలా కొత్త నటుడు స్టేజీ మీద కనిపిస్తే చాలు అతని తాలూకు మనుషులు దండలతో తయార వుతున్నారు.

ఇది వాళ్ళ మర్యాదట. దాన్నతిక్రమించేందుకు వీల్లేదని గంగరాజు సలహా, "ఇంతకు ముందు అట్లా చెయ్యలేదు గదండీ:" అని అడిగాను.

"ఆయన చుట్టాలు ఎవరూ ఇక్కడ లేరుగా అందుకని వెయ్యలేదు. ఉండుంటే దండ లెయ్యకుండా ఊరుకునేవాళ్ళు గాదు" అన్నాడు గంగరాజు సీరియస్గా, నాకు నవ్వొచ్చింది.

ఈ దండల వ్యవహారంతో నాటకం అస్తవ్యస్తంగానే సాగింది. మరీ గయుడు స్టేజీలోకి వచ్చేసరికి కోసలనగరం, కోసల నగరమే వచ్చారు స్టేజీలోకి, ఆ పొట్టి మనిషి ఉక్కిరి బిక్కిరయ్యాడు పాపం,

నా ప్రాణం ఉసూరుమన్నది. ఈ దండలకోసమా నేను నాటకం నేర్పించింది అంత కష్టపడి పెళ్ళాంతో పోట్లాడి గూడా:

నాటకం అయిపోయిందనిపించేసరికి తెల్లవారుజాము నాలుగు గంటలైంది. మధ్యలో నాకూ ఒకటి రెండు పూలమాలలు వేశారు. వాటిని పట్టుకొని శ్రీమతి కోసం వెదుక్కుంటూ పోయాను. వాళ్ళు అప్పటికే వెళ్ళిపోయారట.

జనం అందరూ వెళ్ళిపోయారు. పది పన్నెండు మంది అక్కడే పడి నిద్ర పోతున్నారు దుప్పట్లు కప్పుకొని, వేషధారులు అన్నీ విప్పేస్తున్నారు. "చాలా బాగా వేశారు" అని ప్రతి ఒక్కర్నీ మెచ్చుకొని, కరచాలనం చేసి, వాళ్ళ అనుమతితో ఇంటికొచ్చాను. లోపల గడియ పెట్టుకొని నిద్రబోతున్నది శ్రీమతి. కొంతసేపు తలుపు తట్టగా లేచి తలుపు తీసింది.

బయట చలిలో ఉండి వచ్చిన నాకు ఇంటి వెచ్చదనం హాయనిపించింది. శ్రీమతి కౌగిలిలో ఒదిగి పడుకున్నాను.

31

మర్నాడుదయం ఏడుగంటలకే గంగరాజు మా ఇంటికొచ్చాడు. నే నింకా నిద్ర లేవలేదు. తలుపు దగ్గర కూచొని శ్రీమతితో మాట్లాడుతున్నాడు రాత్రి జరిగిన నాటకం గురించి, విగ్రహావిష్కరణ గురించి.

మా ఊరికి ఈయనవల్లే నమ్మా ప్రాణం వచ్చింది. లేకపోతే ఎప్పుడూ తాగి పడుండేవాళ్ళం" అన్నాడు గంగరాజు.

“మీరూ తాగేవాళ్ళేనా?” అన్నది శ్రీమతి ఆశ్చర్యంతో.

"తాగటంలో అట్లా ఇట్లా గాదు. ఒక్కసారాయే గాదు, నల్లమందు భంగాకు గూడా ఉపయోగించేవాడిని. తాగి తాగి ఇట్లా అయ్యాను గడ్డాలు, మీసాలు పెంచుకొని" అన్నాడు నవ్వుతూ.

"మీతో ఎట్లా కుదిరింది ఈయనకు స్నేహం?"

“ఆయనకు దాసానుదాసుణ్ణయిపోయాను. తాగేందుకు ఎడ మివ్వటంలే దాయన. ఆయనంటే శానా యిష్ట మేర్పడింది నాకు. తాగి దగ్గరి కొస్తే గడ్డం మెలేసి తంతాడేమోనని భయం. దాంతో ఇప్పుడు అన్నీ వదిలేశాను. తినటం, తిరగటం-ఇదే పని నాకిప్పుడు”

నవ్వింది శ్రీమతి. నవరత్నాలు రాలాయి ఆ నవ్వులో. “అయితే ఇప్పుడు మీరు నిజంగా ఋషులే. కాఫీ తాగండి" అంటూ గ్లాసులో కాఫీ ఇచ్చింది.

"ఆయన్ను లేవనీయమ్మా: అందాకా ఉంటాలే" అన్నా డాయన.

"మీరు తాగండి. నేనింకా నిద్ర లేవలేదుగా" అన్నాన్నేను పడుకొనే.

"నువ్వు మా మాటలన్నీ వింటూనే ఉన్నావన్నమాట" అని నవ్వుతూ నా వంకకు చూస్తూ

నేను మంచం మీద కూచున్నాను. ఆయన కాఫీ తాగి లొట్టలేస్తూ - మీ ఇంట్లో కాఫీ భలే రుచిగా ఉంటుందమ్మా!" అని గ్లాసు కింద పెట్టాడు.

"మీరు మెచ్చుకోవాల్సిందే మా కాఫీ! మరో నరమానవుడెవడూ మెచ్చుకోడు" అన్నాను. "ఎంత బాగున్నా ఆయనకు నచ్చదులెండి! ఎప్పుడూ ఇంతే. మీకు ఇంకాసిని ఇచ్చేదా కాఫీ?" అన్నది.

"చాలు చాలు. వద్దమ్మా. మీరు తాగండి" అన్నాడాయన చేతులు ఊపుతూ.

"కాఫీ నిజంగానే బాగుంటే ఆయన ఇంకాసిని తాగి ఉండడూ? అన్నాన్నేను.

"నీ పరాచికాలకేంలే! నాదీ కడుపే. చెరువు గాదు" అన్నాడాయన నవ్వుతూ.

నేను లేచి ముఖం కడుక్కొని గోడ కానుకొని ఆయన కెదురుగా కూచున్నాను. శ్రీమతి నాకు కాఫీ ఇచ్చింది. "ఆయన గూడా ఇంకాసినివ్వు" అన్నాను. అలాగే చేసిందావిడ. వద్దు వద్దంటూనే తాగాడాయన.

కాఫీ తాగటం ముగిసింది. నా ముందుకు జరిగి ఏదో రహస్యం మాట్లాడు తున్నట్లుగా అన్నాడు - "అది సరే గాని, ఇక్కడికి పదో తరగతి వస్తే నువ్వుండవుటగా! మరో కొత్త హెడ్మాస్టరు వస్తాడన్నారు."

అప్రతిభుడి నయ్యాను ఒక్క నిముషం. "ఎవరు చెప్పారు మీకు?" అడిగాను.

"ఒకరు చెప్పటమేంటి? ఊరంతా కోడై కూస్తున్నది."

"అబద్ధం. ఈ విషయం మా టీచర్లకు, నిన్న వచ్చిన పెద్ద మనుషులకు తప్ప ఎవరికీ తెలీదు."

"అయితే నిజమే నన్నమాట !"

“నిజమే. ఇంకో పెద్ద హెడ్మాస్టర్ని వేస్తారు. ఆయన నా కంటే ఎక్కువ తెలిసిన వాడుగా ఉంటాడు. మీ స్కూలు మరింత బాగుంటుంది... ఎప్పుడూ ఒకరే ఉంటే ఏం బాగుంటుంది? మీరూ కొత్త వాళ్ళని చూస్తూ ఉంటే గదా!” అన్నాను నవ్వుతూ.

"ఆ! కొత్త వాళ్ళు రాకేం వస్తారు. రోజు లెంచుకొని జీతాలు తీసుకునే వాళ్లు వస్తే నీం, రాకపోతే ఏం? మాకా పదో తరగతి వద్దు. పెద్ద హెడ్మాస్టర్లూ వద్దు. నువ్విక్కణ్నుంచి పోయేందుకు వీల్లేదు" అన్నాడాయన.

"రెండేళ్ళకు ముందు నేనెవరో మీకు తెలుసునా? మీ రెవరో నాకు తెలుసునా? మీ ఊరి నీళ్ళ ఋణం ఉంది. వచ్చాను అయిష్టంగానే అయినా, ఇష్టపూర్వకంగా పని చేశాను. మీరు నన్నే పట్టుకొని వేలాడుతుంటే ఇంకా ఎందర్నో చూచే అవకాశం పోగొట్టుకుంటారు. పుట్టలో ఏ పాముందో మనకేం తెలుసు?" అన్నాను.

"పుట్టల్లో పాముల్ని చూడాల్సిందే. నీలాంటి మనుషుల్ని చూడలేం. నాకు నీ కంటే అనుభవం చాలా ఎక్కువ. దేశాలు తిరిగి నోణ్ని! నా కళ్ళకు గంతలు కట్టాలని చూడొద్దు అయ్యో రా!” అన్నాడు గంగరాజు,

"ఇందులో గంతలు కట్టేదేముంది? స్కూలుకు మంచి జరగాలనుకోవటం గూడా తప్పేనా?" అన్నాను.

నువ్వు పోతే ఈ స్కూలుకు మంచి జరగదు. నాకు తెలుసు. ఆ పదో తరగతి రానూ వద్దు. నువ్వు పోనూ వద్దు" అంటూ మొండికేశాడు.

“పదో తరగతి వద్దకపోతే ఆ ఇరవై నాలుగు మందిని ఏం జేస్తారు? వాళ్ళ చదువుల్ని గుంటలో బెట్టి గంట వాయిస్తారా?”

“అంతగా చదువుకోవాలంటే ఆర్కాడుకుప్పం పోతార్లే!”

“అక్కడంతా అరవ చదువులు. అది వద్దనుకునే గదా మీరీ స్కూలు పెట్టుకున్నది. నేను ఇక్కడుండేందుకు వాళ్లందరికీ అన్యాయం జరగటం మంచిదా?”

“ఆ పరీక్షేదో పాసయి నువ్వే ఇక్కడుండు. వాళ్ల కన్యాయం జరక్కుండా చూడు.” "పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టమన్నాట్ట ఎవడో! పరీక్ష పాసవటం నా చేతుల్లో ఉందా? అది ఎప్పటికవుతుందో! అందుకోసం దీని అభివృద్ధి నాపటం ఎందుకు?”

"అదంతా నాకు తెలీదు. నువ్వు పోగూడదు."

"పిచ్చి వ్యామోహాలు పెట్టుకొని స్కూలు భవిష్యత్తును చెడగొట్టుకోవద్దు. ఛెయిర్మను గారు మాటిచ్చారు. పదో తరగతికి ప్రయత్నం చెయ్యండి" అన్నాను.

ఎంత చెప్పినా అతను వినలేదు. గంగరాజు కళ్ళలో నీళ్లు తిరిగాయి. మరి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

నా ఆలోచనలు ఇలా బెడిసికొడతాయనుకోలేదు. ఈ విషయంగా గంగరాజు ఊళ్ళో బాగా ప్రచారం చేశాడు. కనిపించిన ప్రతివాడూ "ఇంక నువ్వెళ్లిపోతావంటగా సా!" అని అడుగుతున్నాడు. నేనిప్పుడే పోవటం లేదని వాళ్లకు చెప్పి ఒప్పించేసరికి తల ప్రాణం తోకలో కొస్తున్నది.

అయినా నా ప్రయత్నం నేను మానుకోలేదు. ప్రెసిడెంటు, గంగరాజు కనిపించి నప్పుడల్లా చెబుతున్నాను. జిల్లా పరిషత్తు వారికి నిర్విరామంగా రాస్తున్నాను పదోతరగతికి సంబంధించి.

సంవత్సర పరీక్షలయిపోయాయి. వేసవి సెలవులకు స్కూలు మూశాము. టీచర్లందరూ వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. "స్కూలును జాగ్రత్తగా చూస్తూ ఉండు" అని ఓబుల్ రాజుకు చెప్పాను. గంగరాజును,

ప్రెసిడెంటును పిలిపించి "మీరు ఈ సెలవుల్లోనే చిత్తూరుకు పోయి పదో తరగతికి పర్మిషను తీసుకురండి" అని మరీ మరీ చెప్పాను.

శ్రీమతిని వెంట బెట్టుకొని ఊరికి ప్రయాణమయ్యాను. మా అమ్మకు, అక్కయ్యలకు, వదినెలకు ఈమెను చూపి సంతోషపడాలనే ఆరాటం చాల రోజులనుంచీ ఉంది. కొత్త కోడలు అమ్మకు సేవలు చేస్తుంటే చూడాలని కోరిక. ఇంట్లో అందరితో పాటు ఈవిడ గూడా పనులు చేస్తుంటే చూడాలని ఉబలాటం. ఇంట్లో అందరితో అరమరికలు లేకుండా ఈవిడ కలిసి పోవాలనే కుతూహలం !

32

దీర్ఘ ప్రయాణం తరువాత మేము దాదాపు అర్ధరాత్రి సమయానికి ఇల్లు చేరాము. అందరూ వాకిట్లో మంచాలు వేసుకొని నిద్దర్లు పోతున్నారు.

నేను పెట్టె కింద పెట్టి అమ్మ దగ్గర కూచున్నాను.

"ఈమె మా అమ్మ! చాలా వయసైంది. అంత దూరం ప్రయాణం చెయ్యలేనని మన పెళ్లికి రాలేదు. చాలా ఉత్తమురాలు. మమ్మల్నందర్నీ చాలా కష్టపడి పెంచి పెద్ద చేసింది అంటూ చెప్పాను శ్రీమతికి.

శ్రీమతి అమ్మ కాళ్ల దగ్గర కూచున్నది నాకెదురుగా.

మా మాటల అలికిడి విని లేచినట్లున్నది వదినె. "ఎవరా మాట్లాడేది? అబ్బాయ్, నువ్వేనా? తోడికోడలేదీ!" అంటూ లేచి కూచున్నదామె.

"ఇదుగో ఇక్కడ నా కెదురుగా!" అన్నాను.

అత్తయ్యా! అబ్బా యొచ్చాడు" అంటూ అమ్మను లేపింది.

"ఆఁ అబ్బా యొచ్చాడా?" అంటూ ఆమె లేచి కూచున్నది.

"ఇదిగో నమ్మా నీ కొత్త కోడలు" అంటూ శ్రీమతిని ఆమె ముందు కూచోబెట్టాను. వదినె తలుపు తీసింది. నేను సూట్కేసు తీసుకుపోయి

ఇంట్లో పెట్టాను. చొక్కా విప్పి, పంచె కట్టుకొని బయటికొచ్చాను. బావి దగ్గరికి పోయి కాళ్లు, చేతులు, ముఖము కడుక్కొని వచ్చి కూచున్నాను.

నిద్రబోతున్న అన్నయ్య, అక్కయ్య, అందరూ లేచి కూచున్నారు. యోగ క్షేమాలు విచారించారు.

అమ్మ కొత్త కోడలు పుట్టింటి వారి ఆస్తిపాస్తుల గురించి, బంధువర్గాన్ని గురించి ఆరాలు తీస్తూ కూచున్నది. ఆమె అడిగిన ప్రశ్నలన్నిటికీ వినయం గా జవాబులు చెబుతున్నది శ్రీమతి.

"ఇంకా ఇక్కడ చాలా రోజులుంటుంది లేమ్మా. రోజూ కొద్ది కొద్దిగా చెబుతుందిలే" అంటూ నవ్వాను.

ఓ అరగంటసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్న తరువాత శ్రీమతి ఇంట్లోకి పోయి గుడ్డలు మార్చుకొని, కాళ్ళూ, చేతులూ కడుక్కొని వచ్చింది. మమ్మల్ని భోజనం చెయ్యమని బలవంతం చేశారందరూ.

"అర్ధరాత్రి దాటింది. ఇప్పుడేం భోజనంలే. తోవలో ఏవేవో తిన్నాము. ఆకలిగా గూడా లేదు. పొద్దున తింటాంలే" అని పడుకునేందుకు చోటు వెదుక్కున్నాము.

ఉదయం నిద్ర లేచిం తరువాత కొత్త మనుషుల మధ్య మసలడం ప్రారంభించింది శ్రీమతి. అందరితోనూ చాలా తేలికగా కలిసిపోయింది. కొత్తదనాన్ని ఫీలవడం లేదు.

తన గూడా ఆ పనీ, ఈ పని చేస్తున్నది మిగిలిన వాళ్ళతో బాటు.

అమ్మ మెచ్చుకోలుగా - "మంచి కలుపుగోలుగల తనం పిల్లే" అని సర్టిఫికెట్టు ఇచ్చింది. కోడలి అందచందాలకు మురిసిపోయింది.

రోజుకో పిండివంట చేయించి పెట్టింది అమ్మ. "మాకీ గౌరవాలన్నీ ఎందుకమ్మా! మేమేమన్నా చుట్టాలమా! ఇంటి మనుషులమేగా" అన్నాను.

"పెళ్ళికి మేము ఎటుదిరిగీ రాలేదు. ఇప్పుడయినా మా సరదాలు తీర్చు కోనివ్వరా!" అన్నది అక్కయ్య.

అక్కడ ఉన్న రోజుల్లో నాలుగైదు సినిమాలు చూశాము. పట్టణ జీవితంలోని వడి, వేడి అనుభవించాము. ఏదో కొత్త ప్రపంచంలోకి అడుగుబెట్టిన అనుభూతి !

బస్సులు, కార్లు, రిక్షాలు ఎడతెగని పనులమీద పరుగులు దీసె ఆడ, మగ జనం. కొత్త కొత్త దుస్తులు, ఫ్యాషన్లు, కేశాలంకరణలు ఎన్నో! రంగు రంగుల లైట్లు, సినిమా హాళ్లు, హోటళ్లు, అంగళ్లు కన్నుల పండుగ జేస్తూ ఎన్నో !

ఈ ఉత్సాహం, ఈ ఆనందం, అందం, జనం, జీవం ఆ పల్లెలో ఎక్కడున్నాయి? శిథిలమవుతున్న గోడలు, నిర్మానుష్యమైన వీథులు. కనిపించిన మనుషులే తిరిగి తిరిగి కనిపిస్తుంటారు. బక్కచిక్కిన బడుగు జీవులు. అక్కడ ఎప్పుడూ విశ్రాంతే. ఎప్పుడూ నిశ్శబ్దమే. ది సైలెన్స్ ఆఫ్ ది గ్రేవ్ యార్డ్!

పట్నం అందాలను చూశాము. అనుభవించాలంటే డబ్బు కావాలి. అది ఉంటే నేనా మారు మూల పల్లెకు అంతదూరం ఎందుకు పోతాను? చూసి సంతోషించాము - సినిమా చూసి సంతోషించినట్లు. మావాళ్లు ఎంతో ఆప్యాయంగా చూశారు మమ్మల్ని.

నెలరోజులున్నాము. ఇక తిరుగు ప్రయాణం చెయ్యాలి. మళ్లీ ఆ చోటికి పోవాలంటే బాధగానే ఉంది. అయినా పోక తప్పదు. అక్కడ మరో రెండు మూడు నెలలు గడిపితే చాలు, కొత్త ప్రదేశానికి మారుతాము. ఊరివాళ్ళు ఎంత పట్టుబట్టినా ఉండగూడదు. నేను వాళ్లకు మంచి చేసే పోవాలను కుంటున్నాను. ఆ స్కూలుకు ఎలాగైనా పదో తరగతి వచ్చేలా చెయ్యాలి. పానల్ హెడ్మాస్టర్ రావాలి. తరువాత నేను ఉండా లనుకున్నా ఉండే వీలుండదు !

మరో వారం రోజులకు స్కూళ్ళు తెరుస్తారనగా మేము తిరుగు ప్రయాణం కట్టాము. “స్కూళ్లు తెరిచేందుకు ఇంకా వ్యవధి ఉన్నది గదరా!” అన్నాడు అన్నయ్య.

అక్కడ పనులున్నాయి నాకు. ఈ సంవత్సరమైనా అక్కణ్ణించి ట్రాన్స్ఫరు చేయించు కోవాలి" అన్నాను.

"ఏం? అక్కడ బాగానే ఉందిగా! అంత మంచి చోటు మళ్ళా దొరుకు తుందో, దొరకదో" అన్నాడాయన.

“అక్కడ నేను అందరికీ పాతబడిపోయాను. పైగా అక్కడికి కొత్త హెడ్మాస్టర్ను వేస్తారు” అన్నాను.

“ఇంకో నాలుగు రోజులన్నా ఉండండబ్బాయ్!" అన్నది వదిన.

"పిల్లనన్నా ఇక్కడ ఉంచిపోరా. ఇంకో నెల పోయింతరువాత వస్తుంది" అన్నది అమ్మ. “ఇప్పుడు కాదు లేమ్మా, నే నేదైనా పెద్ద ఊరికి మారిం తరువాత అట్లాగే ఉంచుతానే. ఇప్పుడు నాకు భోజనానికి ఇబ్బందిగా ఉంటుంది" అని ఆమెకు చెప్పాను.

ఇంట్లో అందరి దగ్గరా సెలవు తీసుకుని తిరుగు ప్రయాణం చేశాము. తోవపొడుగునా మా వాళ్ళ మంచితనాన్ని పొగిడింది శ్రీమతి. మా అక్కయ్యలు, బావగార్లు, వాళ్ళ పిల్లల్తో సహా వచ్చి మమ్మల్ని చూసి పోయారు. ఇంత మంచి కుటుంబంలోకి తను రాగలిగినందుకు చాలా సంతోషించింది శ్రీమతి.

ఒక్కరోజు ప్రయాణంతో ఒక లోకంలో నుంచి మరో లోకంలోకి వచ్చాము. ఆ మహా చైతన్యంలో నుంచి ఈ నిశ్చైతన్యంలోకి వచ్చాము.

ఇక్కడి మనుషులకు గూడా మేమంటే ప్రేమాభిమానాలున్నాయి. ఎంతో గౌరవముంది. కాని అది వేరు. ఇదివేరు. అందుకేనేమో, బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్ అన్నారు !

33

స్కూలు తెరిచాము. పరిస్థితులు యథాప్రకారంగా ఉన్నాయి. ఊరివాళ్లు చిత్తూరు పోలేదు. ఆర్డరు తేలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది.

గంగరాజును పిలిపించి అడిగాను.

“ఆ విషయం నాతో మాట్లాడొద్దు" అని దులబరించుకొని వెళ్ళిపోయాడు.

ప్రెసిడెంటుగారింటికి పోయాను. “మీరిలాగే ఉంటే ఎలా!” అన్నాను.

"వూళ్ళో ఎవరూ నాతో కలిసి రాకపోతే నేనేం జేసేది?" అని పెడముఖం పెట్టాడాయన. దిక్కుతోచలేదు నాకు. ఛెయిర్మనుగారికి సెక్రెటరీగారికి ఉత్తరాలు రాశాను.

పదోతరగతి మంజూరు చేస్తామని మీరు మాటిచ్చి పోయారు. ఇంతవరకు ఆర్డరు రాలేదు. మీరు ఇచ్చిన మాట నిలుపుకుంటారని ఆశ పడుతున్నాను" అంటూ ఇక్కడి పరిస్థితులు వివరించి రాశాను.

భగవంతుడి మీద భారం వేసి ప్రతిరోజూ వెయ్యి కళ్ళతో పోస్టుకోసం ఎదురుచూస్తూ కూచున్నాను.

పిల్లల తల్లిదండ్రులు నా దగ్గరికి ఒకరొకరుగా వచ్చి "పదో తరగతి రాదంటగా సా! మా ఓడి టీసీ ఇయ్యండి" అని అడగటం ప్రారంభించారు.

“టీ.సీ.లు గీ.సీ.లు ఇవ్వను. ఈ సంవత్సరం ఇక్కడ పదో తరగతి ప్రారంభమవుతుంది తప్పకుండా. ఛెయిర్మనుగారు చెప్పింది విన్లేదా?" అని అందరికీ ఒకే మాట చెప్పి పంపుతున్నాను.

ఇదంతా గంగరాజు చేస్తున్న పనని ఎవర్నీ అడక్కుండానే నాకు తెలుసు. విపరీతమైన అభిమానం గూడా విపత్తులకు దారిదీస్తుంది.

నేను ప్రెసిడెంటును వదల్లేదు. ఆయన్ను చాలా ఎక్కువసార్లు కలుస్తున్నాను. తొందర పెడుతున్నాను. ఆయన అదిగో ఇదిగో అని వాయిదాలేస్తున్నాడు. టీ.సీ. అంటూ వస్తున్న వాళ్ళకు చెబుతున్నాను.

“మీరు నా దగ్గరికి రావద్దు. పదో తరగతి పర్మిషను తెమ్మని ప్రెసిడెంటును పట్టుకోండి" అని.

ఒకరోజు తొమ్మిదినుంచి పదిలోకి వచ్చిన పిల్లల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశాను. అందరూ రాలేదు. బహుశా డబ్బడుగుతారని భయ పడ్డారేమో! వచ్చిన వాళ్ళను కూచోబెట్టుకుని చెప్పాను.

"మీరు ముందుబడకపోతే లాభం లేదు. మరో రెండేళ్లు చదివితే మీ పిల్లలు ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకునే అర్హత సంపాదించుకుంటారు. ఏదో ఉద్యోగం సంపాయించుకొని హాయిగా బతుకుతారు. వాళ్ళను అధోగతి పాలు చెయ్యవద్దు. వడ్డించిన విస్తరిని వాళ్లముందు నుంచి తీసెయ్యొద్దు... ఈ స్కూలు పురోభివృద్ధిని ఆటంకపరచవద్దు. అయిదో పదో ఇప్పుడు ఖర్చవుతుందని భయపడి వాళ్ళ జీవితాలను చెడగొట్టవద్దు. ఇదంతా నాకోసం చెబుతున్నా ననుకుంటున్నారేమో! అలా ఏం కాదు. మీ ఊరి అభివృద్ధి కోసం, మీ పిల్లల అభివృద్ధి కోసం, మీ అందరి మంచికోసం చెబుతున్నాను. నామాట వినండి. మనుషులు వస్తుంటారు. పోతుంటారు. సంస్థలు శాశ్వతంగా ఉంటాయి...” వగైరా ఎన్నెన్నో మాటలు నా శక్తి యుక్తులన్నిటినీ ఉపయోగించి చెప్పాను.

నా మాటలు విని ఉద్రేకంతో ఊగిపోయారు వాళ్ళు.

"ప్రెసిడెంటు దగ్గరికి పోదాం పదండిరా. అంతగా అయితే తలా పది ఇద్దాం” అని తెంపుగా బయలుదేరారు. పదడుగులు ముందుకు వేశారో, లేదో వాళ్ల ఉత్సాహం నీళ్లు గారిపోయింది. ఎటువాళ్లటు వెళ్లిపోయారు.

మర్నాడు మళ్లీ తయారు. “మీరు టీ.సీ. ఇయ్యండి సా! ఆడిమొగాన ఎట్టా రాచిపెట్టుంటే అట్టా గవుతాది."

“మీరు అరిచి గీపెట్టినా టీ.సీ. మాత్రం ఇవ్వను. ఇక్కడి పిల్లల్ని వేరే చోటుకు పోనివ్వను” అని దృఢంగా చెప్పాను.

రకరకాల ట్రిక్కులు ప్లే చేస్తున్నారు. "ఈడకి పదొచ్చినా సదివించం, మావాడి టీ.సీ. ఇయ్యండి" అని కొందరు. మావాణ్ణి మా పెదనాయన కొడుకు దగ్గరికి పంపించా లనుకొన్నాం" అని కొందరు, “ఈ ఊరే వదిలేస్తున్నాం" అని కొందరు నా ప్రాణాలు కొరుక్కు తింటున్నారు.

ఈ సమస్యలోంచి బయటపడే దెలాగ? ఇదే ఆలోచన మనోవ్యాధిలా పట్టుకున్నది. కడుపునిండా తిండి తినటం లేదు. కంటి నిండా నిద్రపోవటం లేదు. ఇదే సమస్య రాత్రింబవళ్లు పెనుభూతంలా నన్ను వెంటాడుతున్నది.

జిల్లా పరిషత్తుకు మొదటి ఉత్తరం రాసిన రెండు రోజులకు మరోటి రాశాను. తరువాత రెండు రోజులకు ఇంకొకటి రాశాను.

గంగరాజు ముఖం చాటుచేసుకొని తిరుగుతున్నాడు. చెప్పి పంపినా రావటం లేదు. నేను పోయినా ప్రెసిడెంటు కష్టంమీద మాట్లాడుతున్నాడు. ఇన్ని రోజులూ నా చుట్టూ గంగిరెద్దులా తిరిగే వాళ్లు సమయం వచ్చేసరికి చాటవుతున్నారు, వాళ్లమీద విపరీతమైన కోపం వస్తున్నది. ఏం లాభం? వాళ్ల అభిమానం చాలా క్రూరంగా ఉన్నది.

జూన్ నెల దాటిపోయింది. జూలై నెల ప్రారంభమైంది. టీ.సీ.ల కోసం నామీద ఒత్తిడి ఎక్కువైంది. మాట ఇచ్చిన ఛెయిర్మనుగారు నిలుపు కుంటాడని ఎంతో ఆశపడ్డాను. ఇంతవరకూ అతీగతీ లేదు. రోజురోజుకూ నిరుత్సాహం గూడుకట్టుకుంటున్నది నాలో. చిత్తూరు పోయి సెక్రెటరీ గారితోనన్నా మాట్లాడి వద్దామని బయలుదేరాను. అన్ని ఏర్పాట్లు చేసుకొని నేను బయలుదేరే సమయానికి జిల్లా పరిషత్తు నుంచి వచ్చిన కవరు తెచ్చాడు ఓబుల్ రాజు పోస్టాఫీసునుంచి. చించి చదివాను. అది నా ఉత్తరాలకు సమాధానమే. "స్కూలు కమిటీవారు ఇంకా బకాయి ఉన్న అయిదువేల రూపాయలు చెల్లిస్తేగాని పదో తరగతి ప్రారంభించేందుకు ఉత్తర్వులు ఇవ్వబడవు. కాబట్టి కమిటీ వారు ఆ మొత్తాన్ని పదిరోజుల్లోగా చెల్లించాలని కోరుతున్నాము" అని రాశారు. ఆ కింద కాపీ టు ది హెడ్ మాస్టర్ ఫర్ నెసెసరి యాక్షన్ అంటూ రాశారు. స్కూలు కమిటీ ప్రెసిడెంటుకు రాశారు దాన్ని.

వెంటనే ఓబుల్ రాజును పిలిచి ఆ కాయితం ప్రెసిడెంటుగారికి ఇచ్చి రమ్మని పంపాను. చిత్తూరు ప్రయాణం మానుకున్నాను. పదిరోజుల్లోగా అయిదువేల రూపాయలు కట్టాలి. వీళ్లు అయిదు రూపాయలు గూడా కట్టరు. ఈ స్కూలుకు పదో తరగతి రాదు. నెత్తిన చేతులు పెట్టుకొని ఆలోచిస్తూ కూచున్నాను.

ఇంతలో ఎవడో "టీ.చీ. యియ్యండి సా!" అని వచ్చాడు.

వాడి మీద పడి కరవందే తక్కువ. నానా మాటలు అని వాణ్ణి తరుము కున్నాను.

“వాళ్ళకే అంత అక్కరలేనప్పుడు మన మెందుకు బాధపడాలి సార్? ఇచ్చెయ్యండి టీ.సీ.లు” అంటూ సలహా ఇచ్చారు టీచర్లు.

ప్రపంచంలో అన్నిటికన్నా సులువైన పని ఏమిటని చింతామణి ప్రశ్నిస్తే, ఇతరులకు సలహా ఇవ్వటం అని బిల్వమంగళుడు సమాధానం చెబుతాడు.

ఏం చెయ్యాలో పాలుబోవటం లేదు. సాయంత్రం ఇంటికి గూడా పోకుండా స్కూల్నించి సరాసరి భజన మందిరం దగ్గరికి పోయి కూచున్నాను. ఓబుల్ రాజుతో ఊళ్లో అందర్నీ పిలుచుకురమ్మని చెప్పాను. ఏ ముఖానున్నారో గంగరాజు, ప్రెసిడెంటు గూడా వచ్చారు ఏభైమంది దాకా చేరారు.

వాళ్ళకు జిల్లా పరిషత్తు నుంచి వచ్చిన కాగితం గురించి చెప్పాను. అయిదు వేలు కట్టటం పెద్ద కష్టమేమీ కాదని చెప్పాను. వాళ్ల పిల్లల్ని టీ.సీ.లు తీసుకొని వేరు స్కూళ్లలో చేరిస్తే ఎంత ఖర్చవుతుందో సుమారుగా లెక్కలు వేసి చెప్పాను. ఇప్పుడు తలా కొద్దిగా వేసుకుంటే పని జరుగుతుందని చెప్పాను. అయిదువేల రూపాయల ఖర్చుతో స్కూలుకు, ఊరికి శాశ్వత ప్రయోజనం కలుగుతుందని చెప్పాను. నోటిదాకా వచ్చిన కూడును పోగొట్టుకోటం తెలివితక్కువని చెప్పాను. ఒకవేళ ఇప్పుడు అయిదు వేలు కట్టటం భారమనుకుంటే కనీసం రెండు వేలన్నా కట్టి, మిగిలింది తరువాత కడతామని చెప్పి ఆర్డరు తెచ్చుకోమన్నాను. ఒకవేళ ఆ రెండు వేలు గూడా

కట్టలేక పోతే చిత్తూరు పోయి ఛెయిర్మనుగారి ముందు పడిపోతే దయదలిచి పర్మిషన్ ఇస్తారని చెప్పాను.

ఒక్కమాట గూడా ఎదురుచెప్పకుండా నోళ్లు తెరుచుకొని విన్నారందరూ! ఎంతసేపని మాట్లాడేది? ఎంతసేపని చెప్పిందే చెప్పేది ?

“మీరేమైనా చెప్పండి ప్రెసిడెంటుగారూ!” అని ఆయన వంక చూశాను దీనంగా, నా స్థితికి నాకే జాలేసింది.

ఆయన - “చెప్పేందుకేముంది! మీరు చెప్పిన వాటిలో ఏదైనా చెయ్యాలి. ఏదోటి చేద్దాం” అన్నాడు.

నేనూ వాళ్లతోబాటు కూచున్నాను. ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోయారు.

“మేం యేదోటి చేస్తాం. మీరేం దిగులు పడొద్దు" అంటూ వెళ్లిపోయాడు. ప్రెసిడెంటునూ తనకేదో వస్తుందని చెప్పి. తోకంబడి నారాయణ అంటూ వెళ్లిపోయాడు గంగరాజు.

ఆ మర్నాడు, మూడో రోజు ఏమైనా చేస్తారేమోనని చావని ఆశతో ఎదురుచూశాను. వాళ్లు ఏమీ చెయ్యలేదు. చేస్తారనే నమ్మకం గూడా చచ్చిపోయింది.

ఎలాగైనా సరే, ఈ స్కూలుకు ఈ సంవత్సరమే పదో తరగతి వచ్చేలా చెయ్యాలి అని దృఢంగా నిశ్చయించుకున్నాను. బయటి నుంచి వచ్చే పిల్లల్ని చేర్చుకోవటమే గాని, స్కూల్లోంచి ఎవరూ బయటికి పోగూడదని అందరికీ చెప్పేశాను. ఈ స్కూలుకు ఊరికి శాశ్వతంగా మేలు జరగాలి. తాత్కాలికంగానైనా నాకు మేలు జరుగుతుంది లేదా కీడే జరగవచ్చు. ఇంతకు మించి అధ్వాన్నమైన ఊళ్లు చాలా ఉన్నాయి. ఈ ఊళ్లో నేను చాలా గౌరవాన్ని పొందాను. మరో చోట పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చును. ఏది ఏమైనా ఇది జరగాల్సిందే.

ఇక్కడి కొచ్చింతరువాత సెక్రెటరీగారితోనూ, ఛెయిర్మనుగారితోనూ పరిచయ మైంది. సెక్రెటరీగారికి నేనెంత నష్టపోయానో తెలుసు. పోయి వాళ్లతో నా గోడు చెప్పుకుంటే నాకు బదిలీ రావచ్చు. అంతగా అయితే నూరో యాభయ్యో ఇచ్చి కన్సర్న్ గాణ్ణి పట్టుకుంటే అతగాడు పనిజేసి పెడతాడు. రెండేళ్ల ముందటికంటే ఇప్పుడు కొద్దిగా అనుభవం ఎక్కువైంది !

అది మార్గం కాదు. నా విముక్తిని నేను చూసుకొని వెళ్లగూడదు. ఈ స్కూలుకు మేలు చేసి పోవాలి. దీని అభివృద్ధి వాయిదా పడగూడదు. ఇప్పుడే జరగాలి. ఈ సంవత్సరమే జరగాలి. ఆ తరువాతనే నేను కదలాలి ఇక్కడినుంచి.

నేను పోవటం ఇష్టం లేదు ఈ ఊరి జనానికి. నా కోసం స్కూలు అభివృద్ధిని గూడా కాలదన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. వాళ్ళ వెర్రి అభిమానం. అంతకంటే ఏమీ కాదు. ఈ లోకంలో వ్యక్తులు శాశ్వతం కాదు. సంస్థలు శాశ్వతం. సిద్ధాంతాలు శాశ్వతం... కాలక్రమంలో అవీ మారుతుంటాయి. "ఓల్డ్ ఆర్డర్ ఛేంజెత్ ఈల్డింగ్ ప్లేస్ టు ది న్యూ లెస్ట్ వన్ గుడ్ కస్టం ఘడ్ కరక్ట్ ద వర్డ్."

వాళ్లేదో అమాయకంగా ఉన్నారని వాళ్లపాటికి వాళ్లను వదిలేసి నా తోవ నేను చూసుకోగూడదు.

“తనిసిరే వేల్పులుదధి రత్నముల చేత వెరచి ఘోర కాకోల విషము చేత

విడచిరే యత్న మమృతంబు వొడము దనుక

నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు.”

ఈ పద్యాన్ని చాలా తరుచుగా ప్రార్థన సమావేశాల్లో చదివి వినిపించి విద్యార్థులకు హితోపదేశం చేస్తుండేవాడిని. బాగా చదివి పట్టుదలతో కార్య సాధన చెయ్యాలని చెప్పేవాడిని. ప్రారంభించిన కార్యాన్ని మధ్యలో వదల కుండా దాన్ని పూర్తి చేసేవరకు శ్రమించాలని చెప్పేవాడిని వాళ్లకు చెప్పిన

మాటల్ను నేను చేసి చూపించాలి! ఈ జనం సహకరించటం లేదు. ఏం చెయ్యాలి. ఇదే ఆలోచన.

"మీకు పిచ్చి పట్టేట్టున్నది" అన్నది శ్రీమతి.

ఇదో పెద్ద చాదస్తం" అన్నారు టీచర్లు.

ఎవరితోటీ ఎక్కువ మాట్లాడటం లేదు.

పదో తరగతిలో కొచ్చిన ఇరవై నాలుగుమంది పిల్లలూ రోజూ బడికి వస్తున్నారు. వాళ్లను కూచోబెట్టుకొని నూరిపోస్తున్నాను. "మీ అమ్మా నాయన్లను వేధించండయ్యా. డబ్బిస్తే గాని అన్నం తినమని కూచోండి. పదో తరగతి తీసుకురమ్మని పోరండి, సత్యాగ్రహం చెయ్యండి" అంటూ యేమేమో చెబుతున్నాను.

"అన్నం తినకపోతే ఆ పూటకు మిగిలిందిలే అంటారు సార్ మావాళ్లు" అన్నాడొకడు.

"బడి లేకపోతే మాన్లే. గొడ్లకాడికి పో'' అంటారు సార్'' అని ఒకడన్నాడు.

ఆ తానులోంచి వచ్చిన పేలికలే ఇవన్నీ! మంచి చెబితే వినిపించుకోరు. ఊరిబయటి కల్లుపాకలో వాడేం పోసినా తాగుతారు. ఊరి లోపలి పాలు తాగటానికి రుచుల డుగుతారు! డెవిల్ వర్షిపర్స్.

"మా ఊరి మనుషులింతే సారూ. యే పనికీ ముందుకు రారు. వూరొదిలి బయటి కెళ్లాలంటే భయం. వుట్టి పిరికిగొడ్లు. ఆ పెసిరెంటు ఉన్నాడు. ఎందుకూ ముక్కలు గోసుకొని తింటానిగ్గూడా పనికిరాడు . ఉట్టి ఎనుబోతు. గంగ మాఁవఁ కేం రోగ మొచ్చిందంట! ఎప్పుడూ యీడనే పడి సత్తా ఉండెనే. అవసరాని కొక్కడూ అక్కరకు రాడు. నువ్వొక్కడివి యేం జేత్తా?... నువ్వు సరిగ్గా అన్నం గూడా దినటం లేదని అమ్మయ్య జెప్పింది" అంటూ కూచున్నది నరసమ్మ ఆ మధ్యాహ్నం.

“అందరూ నిరుత్సాహపరిస్తే ఎలా? దీనికి ఏదో దోవ కనిపెట్టాలి. మానెయ్యగూడదు. మీ కూతురు సంపూర్ణ ఈ సంవత్సరం పదిలో కొచ్చింది. ఇక్కడికి పదో తరగతి రాక పోతే ప ఆర్కాడుకుప్పంలో జేర్పిస్తారా?” అన్నాను.

“ఇంటికాడే ఉంటది. దాన్ని అట్టా బయటి కొదిలేత్తానా?”

“ఇన్ని రోజులూ చదివి కనీసం ఎస్సెల్సీ అయినా పూర్తి చెయ్యకుండా ఇంట్లో కూచుంటే ఏం బాగుంటుంది. చిన్నపిల్ల. ఇంకా అయిదారేళ్ళకు గాని పెళ్ళికెదగదు."

"నిజవేఁ! యేం జేసేది? ఆర్కాడుకుప్పం పంపింతునా?" అన్నది బుగ్గ మీద వేలేసుకొని.

“ఆఁ. పంపండి. పిల్లగూడా ఎర్రగా బుర్రగా బాగుంది. ఎవడో చంక నేసుకుపోతాడు. రోగం కుదుర్తుంది” అని నవ్వాను.

శ్రీమతి గూడా నవ్వింది.

“పో సారూ! అన్నీ నువ్వే చెబుతావు. ఇంట్లో కూచోబెట్టుకోవద్దంటావు. ఆర్కాటు కుప్పం పంపొద్దంటావు. ఇక ఎట్టామరి?" అన్నది తనూ నవ్వుతూ.

“ఎట్టా ఏముంది? ఇక్కడికి పదో తరగతి తెచ్చుకోటమే దారి. మీరంతా తలా కొంత ఇస్తే అయిదు వేలు లెక్కా జమా! ముందు మీరు మొదలు పెట్టండి. ఎంతో కొంత ఇవ్వండి” అన్నాను నవ్వుతూ.

“మిగతా వోల్లు ఇస్తారా? మొన్న ఇచ్చేందుకే సచ్చారు” అన్నదామె.

“మిగతా వాళ్లతో మీకేం పని? ముందు మీరు మొదలు పెట్టండి" అన్నాను ఆశగా ఆమె వంక జూస్తూ.

"నేను మాత్తరం రాసులు బోసుకొని కూసున్నానా యేం సారూ! వేలు వేలు యియ్యాలంటే నావల్లవుద్దా? అయిదో పదో కావాలంటే యిత్తాను" అన్నది తల వంచుకొని.

"ఎంతొకంత ఇవ్వండి. మీరు బోణీ చెయ్యండి. అవతల ఊరి మీద పడతాను" అన్నాను నవ్వుతూ.

"అట్టాగే ఇత్తాలే. పొద్దున మా ఇంటికాడికి రా!" అన్నదామె.

ఆవిడ కదో సంతోషం. నన్ను వాళ్ళింటికి రమ్మని చాలాసార్లు పిలిచింది. అదుగో ఇదుగో అంటూ పోలేదు. ప్రెసిడెంటుగారింటికి తప్ప ఎవరింటికీ పోలేదు ఆ ఊళ్లో ఇంతవరకు.

తరువాత కాసేపు కూచొని వెళ్ళిపోయిందామె. "రేప్పొద్దున ఖచ్చితంగా మీ ఇంటికొస్తాను. ఒట్టి చేతులతో పంపగూడదు" అన్నానామెతో.

మాట్లాడకుండా వెళ్ళింది.

ఆమె వెళ్ళిం తరువాత ఆ విషయంగానే కాసేపు ఆలోచిస్తూ కూచున్నాను. సమస్యకు సమాధానం దొరికింది. ఇక ఈ మనుషులమీద ఆధారపడను. ఆ ఇరవైనాలుగు మంది పిల్లల్ని వెంటబెట్టుకొని ఇంటింటికిపోయి ఎంత ఉంటే అంత ఇమ్మని భిక్షమెత్తుతాను. అయినంత వరకు ప్రెసిడెంటు చేతుల్లో బెట్టి చిత్తూరు పొమ్మంటాను ఆర్డరు తెచ్చేందుకు. ఆయన బయలుదేరకపోతే నేనే పోయి డబ్బుకట్టి ఆర్డరు తీసుకొస్తాను. ఇంతకంటే వేరు మార్గం లేదు. నాలుగురోజులు కష్టపడితే పని జరుగుతుంది నలభై రోజులు దిగులు పడుతూ కూచునేకంటే!

మనస్సు ప్రశాంతమైంది. తల తేలికపడ్డది. ఆ రాత్రి హాయిగా భోంచేశాను. ప్రియురాలి గాఢ పరిష్వంగంలో ఒళ్ళు మరిచి నిద్రబోయాను.

34

మర్నాడుదయం ఉత్సాహంగా నిద్రలేచాను. స్నానపానాలు ముగించుకొని తొమ్మిది గంటలకే స్కూలుకెళ్ళాను. పదో తరగతి పిల్లల్ని వచ్చిన వాళ్ళను వచ్చినట్లుగా నాచుట్టూ కూచోబెట్టుకున్నాను. అంతా చేరిం తరువాత, అందరి పుస్తకాలు, టిఫినుబాక్సులు స్కూల్లోనే పెట్టించి, నా వెంట తీసుకొని బయలుదేరాను.

మొట్టమొదట నరసమ్మగారింటికే వెళ్ళాను. "వానర సైన్యాన్ని ఎంటబెట్టు కొచ్చావే సారూ!" అంటూ లోపలికి రమ్మని పిలిచింది. పిల్లల్ని బయటనే ఉండమని చెప్పి లోపలికి పోయాను. కుర్చీ వేసి కూచోమన్నది. పాలు కాగుతున్నయ్ తెస్తానని వద్దంటున్నా తాగమని తెచ్చి ఇచ్చింది.

“అంతా బాగానే ఉంది. మీరు ఇస్తామన్నది ఇవ్వండి" అన్నాను. నేను పాలు తాగుతుంటే అనిమిషంగా చూస్తూ నుంచున్నది. నామాట విని ఖాళీగ్లాసు అందు కొని లోపలికి పోయింది. ఒక అయిదు నిమిషాల్లో ఏభై రూపాయలు తీసుకొచ్చి నా చేతిలో పెట్టింది. సంతోషంతో ఉప్పొంగి పోయింది నా మనసు. ఆమెకు కృతజ్ఞతలు తెలిపి బయటికొచ్చాను. పక్క ఇల్లే నరసరాజుది. మమ్మల్ని చూసి లోపల దాక్కున్నాడు మనిషి,

“కాస్త బయటికొచ్చి మమ్మల్ని చూడండి" అంటూ పిలిచాను.

ఆయన లోపల్నించే “అన్నం తింటావుండా. మల్లా రండి” అంటూ కేకవేసి చెప్పాడు. ఆయన కొడుకు బయటికొచ్చాడు. “మా నాయన యేవీఁ ఇయ్యడు. ఆయన తత్వమే అంత" అన్నాడతను.

“ఆయన ఇవ్వకపోతే పోతాడులే. నువ్వయినా ఇవ్వు ఏమైనా!” అన్నాను.

“నా దగ్గర దుడ్లు లేవే!” అంటూ లోపలికెళ్ళాడు. మరో రెండు నిముషాల్లో బయటికి వచ్చి ఓ అయిదు రూపాయల నోటు నా చేతిలో పెట్టాడు తండ్రి చూస్తాడేమోననే భయంతో.

అక్కడినుంచి వెంకట్రాయలు ఇంటికి వెళ్ళాము. అతను ఇంట్లోనే ఉన్నాడు. నన్ను చూసి నవ్వుతూ ఇంట్లోకి ఆహ్వానించాడు. పోయి కూచున్నాను.

"పాలు తాగుతారా, కాఫీ తాగుతారా?" అంటూ అడిగాడు.

“ప్రస్తుతం ఏమీ తాగను. నాకు డబ్బు కావాలి. ఎంత ఇచ్చినా సరే. అందు కోసమే ఇట్లా బయలుదేరాను భిక్షమెత్తటానికి" అన్నాను నవ్వుతూ.

"మీరు రావాల్నే కాని డబ్బుకేం సార్! ఎంతివ్వమంటారు?" అన్నాడు.

ఇష్టం. ఎంతయినా సరే. ఇంత ఇమ్మని అడగను" అన్నాను. అతను రెండు వందల పదహారు రూపాయలు ఇచ్చాడు. ఊళ్ళో అందరికన్నా బాగున్న కుటుంబం వాళ్ళది. పరువు నిలుపుకున్నాడు. అతనికి థ్యాంక్సు చెప్పి ఇవతలి కొచ్చాము.

అన్నట్లు వెంకట్రాయులు ఇప్పుడు తాగుడు పూర్తిగా మానేశాడు. అతను డ్రామాలో వేషం వెయ్యడమే అందుక్కారణం. నాటకాల్లో వేషాలు వేసి తాగుడుకు బానిసలయిన వారనేకమంది ఉన్నారని వినికిడి. నాటకం తాగుడు మానిపించిన సంఘటన నాకు తెలిసి ఇదొకటి! అదో శక్తివంతమైన సాధనం. మంచీ చెయ్యగలదు. చెడూ చెయ్యగలదు. !

తరువాత బాలరాజుగారింటి కెళ్ళాము. ఆయన ఇంట్లో లేదు. ఆయన భార్య పెద్ద ముత్తయిదువ. నేను వాళ్లింటి కెళ్ళినందుకు చాలా సంతోషపడింది. నేను వెళ్ళిన పని చెప్పాను.

“ఆయన లేడు గద నాయనా! ఉంటే బాగుండేది!” అంటూ బొడ్లో ఉన్న వక్కాకు సంచి లోంచి ఇరవై రూపాయలు తీసి ఇచ్చింది. "కాసేపు కూసోండి! కాఫీ అయినా పెట్టిత్తా" అన్నది నవ్వుతూ.

"ఇప్పుడు తీరికలేదు లెండి. మళ్ళీ ఒకసారొస్తాను” అని చెప్పి బయటికొచ్చాను.

ఇలా ఆ రోజంతా ఆ ఊళ్లో తిరిగాము. దాదాపు పదిహేను వందల రూపాయలు వసూలయ్యాయి. మంచి ప్రారంభమేననుకున్నాను. కావాలనే ప్రెసిడెంటుగారింటికి వెళ్ళలేదు. గంగరాజు కొడుకు మాత్రం ఇరవై రూపాయలు ఇచ్చాడు. ఇద్దరు ముగ్గురు ఏభైలు, వందలు కూడా ఇచ్చారు.

ఆ రోజుకు తిరగటం చాలించి పిల్లల్ని ఇంటికి పంపించేశాను, వాళ్ళూ నాతోబాటుగా బాగా అలసిపోయారు.

రాత్రి అన్నం తిని నేను, శ్రీమతి మాట్లాడుతూ కూచున్నాము.

“ఎంతొసూలయింది సారూ ?” అంటూ వచ్చింది నరసమ్మ.

చెప్పాను.

"ఇయాల వూరంతా తిరిగినట్టుండావే! నేనన్నం తిని వచ్చేంత లోపే ఎల్లిపోయావు. తిరిగి తిరిగి శానా అలిసిపోయి నట్టుండావు" అంటూ వచ్చాడు నరసరాజు.

ఆయన్ను చూసి నవ్వుకున్నాన్నేను. మేము నరసమ్మగారి ఇంట్లో ఉన్నప్పుడాయన మమ్మల్ని చూశాడు. బయటనే ఉన్నాడు.

"మిమ్మల్ని తొందర పెట్టడం ఎందుకు లెమ్మని పోయాము. దాందేముంది? మీరు ఇప్పుడు ఇచ్చినా తీసుకుంటాను" అన్నాను నవ్వుతూ.

“దేనికైనా యాళాపాళా ఉండొద్దంటయ్యా! మాఁవో డిచ్చాడంటగా! అన్నాడు నవ్వుతూ. "ఇచ్చాడు. అయిదు రూపాయలు. మీరు కనీసం వందరూపాయలైనా ఇస్తారనుకున్నాను.”

“నువ్వనుకోటానికేంలే! ఎంతయినా అనుకుంటావు. మా నరిసికి కూతురుంది గాబట్టి యాబయ్యిచ్చింది. మా పిల్లోల్లు ఎవురున్నారయ్యా నూరిచ్చేందుకు? మాఁవోడికి తెలీక అయిదిచ్చాడు. నేనయితే ఒకటో రెండో చేతులో బెట్టేవాడిని." అన్నాడు సీరియస్గా.

"పోన్లెండి, మీవాడు అయిదిచ్చాడు. మీరు ఇచ్చే ఒకటో రెండో అయినా ఇవ్వండి. ఎందుకైనా అక్కరకొస్తుంది!" అన్నాను.

"ఒక ఇంట్లోనే రొండుసార్లా? ఇచ్చిందిసాల్లే!" అన్నాడాయన.

"మా సిన్నాయన డబ్బుకాడ శానా గట్టోడు సారూ!" అన్నది నరసమ్మ.

"తెలుస్తూనే ఉందిగా" అన్నాను నవ్వుతూ.

"రే పే వూరికి పోతావేంది ?" అడిగాడు నరసరాజు.

"ఏ ఊరో ఇంకా అనుకోలేదు. రేపు పిల్లలొచ్చింతరువాత ఎటనుకుంటే అటు పోతాము."

"ఆ గంగిగాణీ గూడా యెంబడేసుకు పోరాదూ?" అన్నాడు.

ఆయన కేవో పన్లు. ఈ మధ్య కనిపించటం లేదు నాకు" అన్నాను. పదో తరగతి వస్తే నేను వెళ్ళిపోతానన్న విషయం ఇంకా వీళ్ళవరకు పాకినట్లు లేదు. లేకపోతే అడిగేవాళ్ళే. అందుకే గంగరాజు మీదినుంచి విషయాన్ని బుద్ధ విగ్రహావిష్కరణ కార్యక్రమం మీదికి, నాటకం మీదికి మళ్ళించాను. అలా కొంతసేపు మాట్లాడి వెళ్ళిపోయారు వాళ్ళు.

మర్నాడు ఉదయం ప్రార్థన అయిన తరువాత పాతార్కాడు పోదామని నిర్ణయించుకొని వెళ్లాము. అది జంబాడ కంటే పెద్ద ఊరు. ఆ ఊరి పిల్లలు కూడా స్కూలుకొస్తారు. కాబట్టి నా మాట బాగా చెల్లింది, "మీరు బిల్డింగు కట్టేప్పుడు ఏమీ ఇవ్వలేదు. దీనికయినా ధారాళంగా ఇవ్వండి" అని అడిగాను, అక్కడ రెండు వేలకు పైగానే వసూలయింది.

వారం రోజుల్లో కోసల నగరం, విజయపురం, చిన్న జంబాడ గ్రామాలన్నీ తిరిగాము. పదివేలదాకా వసూలయింది. నాకు పరమానందమైంది. మా పర్యటనలో అనేక అనుభవాలు.

నేను ప్రతిరోజూ స్కూలుకు పోయే తోవలో ఒక శిథిలమయిన చుట్టు గుడిశ ఉంది. అందులో ఒక వృద్ధుడు కాపురముంటున్నాడు. నడుము వంగి

పోయింది. చర్మం గంగడోలులా ఊగిసలాడుతున్నది. చూపుగూడా మందగించి నట్లున్నది. ప్రతిరోజూ స్కూలుకు పోయేప్పుడు ఇంటికి వచ్చేప్పుడు అతన్ని చూస్తూనే ఉన్నాను. ఇతను ఎలా జీవిస్తున్నాడని నాలో నేను చాలాసార్లు అనుకున్నాను. అతనితో నేను ఒక్కరోజయినా మాట్లాడ లేదు. పుల్ల లేరుకుంటూ, నీళ్ళు తెచ్చుకుంటూ చాలా సార్లు ఎదురయ్యా డాయన.

ఆరోజు కోసలనగరం పోవాలని అందరం బయలు దేరిపోతున్నాం. తోవ అతని నివాసం మీదుగానే, ఆ ముసలాయన తన గుడిశ ముందు నుంచొని ఉన్నాడు. నడుము నుంచి మోకాళ్ళ వరకు ఒక జీర్ణ వస్త్రాన్ని చుట్టుకొని ఉన్నాడు. నన్ను చూసి రమ్మంటూ పిలిచాడు చేత్తో. నేను అనుమానించాను ఇతనిప్పుడు తన కథనంతా చెప్పుకొని ఏమైనా సహాయం చెయ్యమని అడుగుతాడేమో ననుకున్నాను. వృద్ధాప్యపు పెన్షను వగైరాల గురించి వివరాలు అడుగుతాడేమో ననుకున్నాను. ఆయన పిలిచిం తరువాత పోకపోతే బాగుండదు. అతను అడగనూ వచ్చు. నేను సమాధానం చెప్పనూ వచ్చు. అయితే కొంతసేపు ఆలస్యమవుతుంది. అనుకుంటూ పిల్లల్ని బయటనే ఉండమని చెప్పి లోపలికి వెళ్లాను.

ఇంటినిండా ఎండపొడలు! కప్పు తెరపలు తెరపలుగా లేచిపోయింది. ఎండకు ఎలాగో ఓర్చుకుంటాడు. వాన కురిస్తే ఎలా పాపం? ఇందులో అతనెలా ఉంటున్నాడు? అనుకున్నాను. ఇంట్లో ఒక కుండ, రెండు మూడు సత్తుగిన్నెలు, కొన్ని చింకిపాతలున్నాయి. ఇంటివాసాలు నల్లగా మసిగొట్టుకొని ఉన్నాయి. బూజు గబ్బిలాల్లా వేలాడుతున్నది. గోడలు పెళుసులూడిపోయి ఉన్నాయి. ఒక పక్కన చిన్న పొయ్యి. పొయ్యి ప్రక్కనే కొన్ని పుల్లలు విరిచి పెట్టుకున్నాడు. కుప్పగా! దరిద్రం ఎలా ఉంటుందని ఎవరైనా అడిగితే 'ఇలాగ' అని తేలిగ్గా చూపించవచ్చును. ఇల్లు అలా ఉన్నా నేల శుభ్రంగానే ఉంది. నేను నుంచునే ఉన్నాను.

ఆ ముసలాయన నా ముందుకొచ్చి నుంచున్నాడు. బొడ్లో దోపుకుని ఉన్న అర్ధ రూపాయి బిళ్ల బయటికి తీసి - నేను శానా బీదవాడిని. స్కూలు కోసం మీరు డబ్బు ఇంటింటికి పోయి వసూలు చేస్తున్నారని తెలిసింది. మీ పట్టుదలకు సంతోషిస్తున్నాను. ఎక్కువ ఇవ్వలేను. ఈ అర్ధరూపాయి తీసుకోండి. కాదనవద్దు. నా శక్తికొద్దీ ఇవ్వాలని నాకూ అనిపించింది." అంటూ నా చేతిలో పెట్టాడు.

ఆయన చాలా స్వచ్ఛమైన తెలుగు మాట్లాడాడు. కంఠస్వరం హీనంగా, స్పష్టంగా ఉన్నది.

అప్రతిభుడినయ్యాన్నేను. సహాయం అడుగుతాడనుకున్న మనిషి సహాయం అందిస్తున్నాడు స్వచ్ఛందంగా !

"మీది చాలా గొప్ప మనసు. ఇప్పుడా అర్ధరూపాయి ఇవ్వకపోతే ఏం? మాకు మీ ఆశీర్వచనాలుంటే చాలు. అదే మాకు కొండంత బలాన్నిస్తుంది. మీ మంచి మనసుకు, త్యాగబుద్ధికీ నమస్కారాలు. ఈ ప్రపంచం ఇంకా మీలాంటి వారివల్లనే నిలిచి ఉన్నది" అని నమస్కారం పెట్టాను. నా రెండు చేతులూ పట్టుకున్నాడాయన. చల్లగా ఉన్నాయి ఆయన చేతులు.

"యాయవారం ఎత్తుకొని ఊరి వాళ్ళ మీద ఆధారపడి బ్రతుకుతున్నాను. నా వాళ్లంటూ ఎవరూ లేరు. ఒంటరివాణ్ణి" అన్నాడాయన. ఆయన కళ్ళలో మెరుపు. "వద్దనకుండా తీసుకోండి. అది నా కోరిక."

అతనిచ్చిన అర్ధరూపాయి తీసుకొని జేబులో వేసుకున్నాను. ఆయన పాదాలకు నమస్కారం చెయ్యబోయాను. "వద్దు. వద్దు. మీరు పెద్దవాళ్ళు. పెద్ద చదువులు చదువుకున్న వాళ్లు" అంటూ వారించాడు.

ఆయన పెద్దతనం ముందు నేనెంత! నా చదువెంత !

35

పదివేలకు పైగా వసూలయినందుకు మావాళ్ళు (టీచర్లు) చాలా ఆశ్చర్యపడ్డారు. సంతోషించారు.

“ఇసుకలోనుంచి నూనె పిండారు సార్!" అన్నాడు శ్రీనివాసులు.

“ఇసుకలో నుంచి గాదండీ! మనుషుల దగ్గర్నుంచి డబ్బు వసూలు చేశాను” అన్నాను. “ఏమైనా మీరు మహాఘటికులు సార్!” అన్నాడు చంగల్రాయలు.

“ఘటికుణ్ణి కాబట్టే ఇలా అనాథలా, బిచ్చగాడిలా ఊళ్ళవెంట తిరిగాను! ఘటికులు ఇలాంటి తెలివితక్కువ పనులు చేస్తారటండీ! హాయిగా ఎకౌంట్ టెస్ట్ పాసయి హెచ్చు హోదాననుభవిస్తూ, హెచ్చు జీతాలు తీసుకుంటూ ఉంటారు!” అన్నాను నవ్వుతూ.

డబ్బు మొత్తం పదివేల రెండు వందల నలభై మూడు రూపాయల అరవై పైసలున్నది. డబ్బంతా కర్చీపులో ఉంచి మూటగట్టి శ్రీనివాసులు చేతికిచ్చాను. సాయంత్రం అందరూ భజన మందిరం దగ్గర సమావేశం కావాలని ఓబుల్ రాజు చేత చెప్పి పంపించాను.

సాయంత్రం ఆరు గంటలకు టీచర్లందరం భజన మందిరం దగ్గర చేరాము డబ్బు మూటలతో, ఒక్కొక్కరుగా ఊరిలోని పెద్దలు, పిన్నలు చేరారు. అందరి కంటే ఆలస్యంగా ప్రెసిడెంటు, గంగరాజు వచ్చారు. అందరూ సమావేశమైం తరువాత నేను వారం రోజుల పాటు తిరిగి ఏ ఊళ్ళో ఎంతెంత వసూల యిందో చెప్పాను. మొత్తం ఎంతయిందో గూడా చెప్పాను. డబ్బు మూట వాళ్లకు చూపుతూ- "ఇందులో పదివేల రెండు వందల నలభై మూడు రూపాయల అరవై పైసలున్నాయి. అయిదు వేలు జిల్లా పరిషత్తుకు కట్టండి. అయిదొందలు మీకు పోను రాను అయ్యే ఖర్చులకు తీసుకోండి. మిగతా డబ్బు నా కివ్వండి. దాంతో సిమెంటు తెప్పించి, కొత్త గదులకు ఫ్లోరింగు చేయిస్తాను.

అన్ని తరగతుల్నీ ఆ పాకలోంచి బిల్డింగులోకి మారుస్తాను. మీరు వెంటనే, రేపు ఉదయమే బయలుదేరి పోయి డబ్బు కట్టేసి ఆర్డరు తీసుకురండి. నేను ఇంత శ్రమ పడింది అందుకోసమే" అన్నాను.

"నువ్వెందుకు శ్రమపడ్డావో మాకు తెలుసులే" అన్నాడు నా వంక కొరకొరా చూస్తూ గంగరాజు.

ఆయన మాటలు నేను పట్టించుకోలేదు. "రేపు పొద్దున మీరు తప్పకుండా చిత్తూరు పోతారు గదండీ ప్రెసిడెంటుగారూ?" అన్నాను.

"మీరింత చేసింతరువాత పోకపోతే బాగుంటదా?" అన్నాడు ప్రెసిడెంటు గంగరాజు వంక చూస్తూ.

"మీతోబాటు మరో నలుగుర్ని గూడా పిల్చుకుపోండి" అన్నాను.

"అట్టాగే" అన్నాడు ప్రెసిడెంటు.

"ఇంత జేసినవాడివి ఆ డబ్బేదో కట్టి నువ్వే తీసుకోగూడదూ ఆ పర్మిషనేందో' అన్నాడు గంగరాజు.

"చిత్తూరుకు నాకు దోవ తెలీదనుకోవద్దండీ! ఆ పని చెయ్యటం కష్టమేమీకాదు. కాని వచ్చే మంచి పేరంతా మీకే రావాలని. ఈ మంచి పనిలో మీకూ భాగం ఉందని మీ రనుకోవాలి. ఛెయిర్మనుగారి దగ్గర స్కూలు కమిటీ మెంబర్లుగా మీ పరపతి పెరగాలని. ఇక ముందు గూడా అవసరమైతే సునాయాసంగా జిల్లా పరిషత్తులో పనులు చేసుకురాగలగాలని, స్కూలు తెచ్చుకున్నది మీరే కాబట్టి దాని పురోభివృద్ధికి కృషి చేసిన ఘనత మీకే దక్కాలని. చాలా ఇంకేమన్నా చెప్పమంటారా?" అన్నాను గంగరాజు వంక చూసి నవ్వుతూ.

"చాలు చాలు. మాటలు నేర్చావు. మా తెలివితేటలు నీముందు ఎందుకు కొరగావటం లేదులే" అన్నాడాయన.

"అది మీ తెలివితేటలు కాదు. మీ తెలివితక్కువతనం" అని గట్టిగా నవ్వాను. ఈ మాటల భావాన్ని ఎవరూ అర్థం చేసుకుంటున్నట్లు లేదు.

డబ్బుల మూట ప్రెసిడెంటు చేతిలో పెట్టి మీకు కావల్సింది తీసుకొని మిగతాది ఇమ్మని అడిగాను.

నేను చెప్పినట్లుగానే ఆయన అయిదువేల అయిదు వందలు తీసుకున్నాడు. మిగతా డబ్బులు నాకిచ్చాడు.

"ఎవరెవరు పోతారో రేపు పోయి సాయంత్రానికల్లా తిరిగి రండి. నేను మేస్త్రీని పిలిపించి పురమాయిస్తాను" అన్నాను సంతోషంతో.

అందరూ ఎవరి తోవన వారు వెళ్ళిపోయారు. నేను ఇంటికి పోయి స్నానం చేసి, భోజనం చేసి హాయిగా నిద్రపోయాను.

ఉదయం స్కూలుకెళ్ళాను. వాళ్లు వెళ్లారో, లేదోనని అనుమానం వచ్చింది. ఓబుల్ రాజును పంపి చూసి రమ్మన్నాను. పదిహేన్నిముషాల్లో అతను తిరిగి వచ్చాడు. "వాళ్లు పోలేదు సా!" అన్నాడు.

"ఎవరెవర్ని చూశావు?" అన్నాను.

"ప్రెసిడెంటు ఇంట్లో కూసోని ఎవరితోనో మాట్లాడతా ఉండాడు. గంగరాజు తలనెప్పిగా ఉందని పడుకున్నాడు."

ఓబుల్ రాజును వెంటబెట్టుకుని ప్రెసిడెంటుగారింటి కెళ్లాను.

నన్ను చూసి జీవం లేని నవ్వు నవ్వాడాయన. లోపలికి రమ్మంటూ ఆహ్వానించాడు. "మీరీపాటికి చిత్తూరులో ఉండి ఉండాలి. ఇంకా ఇక్కడే ఉన్నారు. కనీసం మీరు ప్రయాణ సన్నాహంలోనయినా లేరు. మీరు మరీ నన్నింత తేలిక చెయ్యటం అన్యాయం" అన్నాను వస్తున్న కోపాన్ని అణుచుకొంటూ.

"బయలు దేరుతున్నాం సార్. గంగరాజుకు చెప్పి పంపించాను. మా వైస్ ప్రెసిడెంట్ను గూడా రమ్మన్నాను. వాళ్లు రావటంతోనే బయలుదేరటమే. ఇప్పుడు పోయి సాయంకాలం రావటం ఎంత పని?" అన్నాడాయన.

"నేనిక్కడే కూచుంటాను. మీరు వాళ్లను పిలిపించి బయలుదేరిందాకా" అని వాళ్ల ఇంట్లో అరుగుమీద కూచున్నాను.

"మేం పోతాంగా. అన్నాలు తినిపోతాం. మీ రెల్లండి" అన్నాడాయన.

"మీ మాటలమీద నమ్మకం పోయింది నాకు. మీరు అన్నాలు తిరుత్తణిలో తినండి, అయిదొందలు మీ ఖర్చుల కోసమేగా ఇచ్చింది?" అన్నాడు.

ఇక తప్పదనుకున్నట్లున్నాడు. మనుషుల్ని పంపి వాళ్ళిద్దర్నీ పిలిపించాడు. వాళ్లు తయారై వచ్చారు. వాళ్లను ఊరి పొలిమేరలదాకా సాగనంపి వచ్చాను.

పోతూ పోతూ గంగరాజన్నాడు - "మా సంగతి తెలుసుగా. చేతినిండా డబ్బిచ్చావు. కనీసం వారం రోజులకు సరిపోతుంది. మేము పరారయిపోతే పదో తరగతేం తెరుస్తావో, ఊరి వాళ్లకేమని చెబుతావో ఆలోచించుకో!"

"నా సంగతి మీకూ తెలుసుగా! అందుకే ఊరందర్నీ పిలిపించి వాళ్ల ముందు డబ్బు మీ చేతిలో పెట్టింది, రెండు రోజుల్లో పట్టుకొస్తారు పోలీసులు అందులో గడ్డం, మీసాలు, జుల్ఫాల జుట్టు, గుర్తులు గూడా బాగున్నాయి" అంటూ నవ్వాను. వాళ్లు వెళ్లిపోయారు నవ్వుకుంటూ.

నేను స్కూలుకొచ్చాను. రూములకు ఫ్లోరింగు చేయించేందుకు ఏమేం కావాలని తాపీ మేస్త్రీ గోపాల్ను పిలిపించి అడిగాను.

ఇటుకలున్నాయి కింద పరిచేందుకు. ఇసుక కూలీల్ని పెట్టి పోయిస్తానన్నాడు. సిమెంటు తెప్పించుకోమన్నాడు. ఓబుల్ రాజును బాడుగ బండి కట్టుకపోయి తిరుత్తణి నుంచి సిమెంటు తెమ్మని పంపించాను. కావాల్సిన డబ్బిచ్చాను. గోపాల్ను రేపటినుంచీ పనిలోకి రమ్మని చెప్పి పంపాను.

గంగరాజు మాటలు మనసులో మెదలుతున్నా అంత పని చెయ్యడానికి సాహసించరనే నమ్మకంతో ఉన్నాను.

సాయంత్రానికల్లా ఓబుల్రాజు సిమెంటు తోలుకొని వచ్చాడు. మూటలు పాత ఆఫీసు రూములో దింపించాము. చెప్పిన ప్రకారం గోపాల్ వచ్చాడు. రూములన్నిటిని చదరం చేయించి బాగా నీళ్లు పోయించాడు. మట్టిని అటూ ఇటూ సమతలంగా వచ్చేట్లు సర్ది దిమ్మిస కొట్టించాడు. ఆ తరువాత ఇటుకలు పరిపించాడు రూములో.

ప్రెసిడెంటు అనుకున్న ప్రకారం ఆ రాత్రి రాలేదు. ఆ మర్నాడు గూడా రాలేదు. మన ఆఫీసుల్లో అనుకున్న పనులు అనుకున్నట్లు జరగవు. ఒకరంటే ఒకరుండరు. లేక గంగరాజు అన్నంత పనీ చేశారా ముగ్గురూ కలిసి? భయపడే వాళ్ళను మరింత భయపెడతారు మనుషులు !

రూముల ఫ్లోరింగు పని కొనసాగుతున్నది.

రాత్రి ఎనిమిది గంటలైంది. అంతవరకూ వాళ్ల రాకకోసం ఎదురు చూశాను. భోజనం ముగించుకొని పడుకున్నాను. మాట్లాడేందుకు మామూలు గా వచ్చే నరసరాజు, నరసమ్మ రాలేదు ఎందుకో.

రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. నేను లేచి తలుపు తీశాను. నా ఎదురుగా గంగరాజు! ఆయన నా చేతిలో ఒక కవరు పెట్టి పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

నేను లోపలికొచ్చి దీపం పెద్దది చేసి కవరు చించి చదివాను.

జిల్లా పరిషత్తు వారు స్కూల్లో పదో తరగతి ప్రారంభించేందుకు అనుమతి నిచ్చారు.

నా సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. నేనెంత ఆనందించానో మాటల్లో చెప్పలేను. నిద్రలేచి మంచంమీద కూచున్న శ్రీమతిని బిగి కౌగిలిలో బంధించి ముద్దుల్లో ముంచాను. "పర్మిషను తెచ్చేశారు. ఇదిగో కాయితం. నా కష్టం ఫలించింది. నా పంతం నెగ్గింది" అంటూ చెప్పి నా ఆనందాన్నావిడతో పంచుకున్నాను.

“ఇంకా నయం. మీ పిలుపు విని ఆ గంగరాజు ఉండిపోలేదు!" అన్నదావిడ నవ్వుతూ. “ఏం ఉంటే?” అన్నాను ఆశ్చర్యపోతూ.

“అహఁ. ఏం లేదు. ఇప్పుడీ పన్లన్నీ ఆయనతో చేసేవారేమోనని నా భయం." మరింతగా నవ్వింది.

"నే నేమంత తెలివితక్కువవాడి ననుకున్నావా ?

"తెలివితక్కువని గాదు గాని, కోపం ఎక్కువైనా, సంతోషం ఎక్కువైనా మనమేం చేస్తున్నామో మనకు తెలియదని ఎవరో అన్నార్లెండి!" అన్నది.

36

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు నాకు. రేపు చెయ్యాల్సిన కార్యక్రమం గురించి ఆలోచిస్తూ పడుకున్నాను. ఎంతసేపు ఆలోచించినా త్వరగా తెల్లవారలేదు.

ఉదయం ఏడు గంటలకే టీచర్లందరూ మా ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చారు. "ఆర్డరు వచ్చేసిందిట గద సార్!" అంటూ.

వాళ్ళకు ఆర్డర్ కాయితం చూపించాను.

"అనుకున్నది సాధించడంలో మీకు మీరే సాటి సార్!" అన్నాడు చంగల్రాయలు బోల్డంత సంతోషపడుతూ.

"ఈ సాధన కంతటికీ పునాదిలో మీరున్నారు” అన్నాను.

"పునాది భూమి లోపలే ఉంటుంది. ఎవరికీ కనిపించదు. పైకి కనిపించేది భవనమే గద సార్!" అన్నాడతనే.

"భవనం లేకుండా పునాదితో అవసరం ఉండదు. పునాది లేనిదే భవనం ఏర్పడదు' అంటూ నవ్వాను."

అందరికీ కాఫీలు ఇచ్చింది శ్రీమతి. అందరూ నన్నభినందించి వెళ్ళారు. నరసరాజు, నరసమ్మ గూడా వచ్చారు. సంతోషంగా నాలుగు మాటలు మాట్లాడి వెళ్ళారు.

నేను ఎనిమిది గంటలకే స్కూలుకు వెళ్ళాను. ఓబుల్రాజును ఆర్కాడుకుప్పం పోయి రంగు కాగితాలు, పురికొస, మైదాపిండి తెమ్మని డబ్బిచ్చి పంపించాను. స్కూలుకు ముందుగా వచ్చిన పిల్లల్ని పోయి మామిడాకులు కోసుకురమ్మన్నాను.

పదకొండు గంటలకల్లా మామిడాకు తోరణాలు, రంగుకాయితాల రెపరెపలు కొత్త భవనాలను అలంకరించాయి. సరస్వతి పటం దొరకలేదు ఊళ్లో. బుద్ధ విగ్రహం దగ్గరే పూజా కార్యక్రమం ఏర్పాటు చేశాము. ఊరి ప్రముఖుల్ని కార్యక్రమానికి ఆహ్వానించాము.

ప్రెసిడెంటు చేత టెంకాయ కొట్టించాము. నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేయించాము.

స్కూలు పాత చోట్లోనుంచి కొత్త భవనాల్లోకి మారింది. సిమెంటు నేల మీద కూచొని పిల్లలు ఆనందించారు.

పదో తరగతికి కొత్త అటెండెన్స్ రిజిస్టరు తెరిచి అందులో వాళ్ల పేర్లు రాశాను.

టీచర్లందరూ ఈ కార్యక్రమాలన్నిటిలోనూ అద్భుతంగా సహకరించారు.

స్కూలు మార్పిడి, కొత్త తరగతి ప్రారంభ తతంగం పూర్తయే సరికి ఒంటిగంట పైగానే అయింది. మధ్యాహ్నం మామూలూ రెండు గంటలకు స్కూలు ప్రారంభించాము గాని పాఠాలు చెప్పలేదు. పిల్లల చేత పాటలు పాడించాము. ఆటలాడించాము. వాళ్ళతో కలిసి ఆడుకున్నాము, పాడు కున్నాము. నన్ను పాటలు, పద్యాలు పాడమని బలవంతం చేశారు. చాలా పాటలు పాడాను, పద్యాలు పాడాను.

ఓబుల్రాజు చేత బిస్కెట్ పొట్లాలు తెప్పించాను. ఇంటింటికి పోయి, ప్రెసిడెంటును. వైస్ ప్రెసిడెంటును, గంగరాజును. వెంకట్రాయలును, మరో

నలుగురైదుగుర్ని, మా టీచర్లను మా ఇంటికి సాయంత్రం టీకి ఆహ్వానించాను. అందరూ వచ్చారు.

ఇంట్లో కుర్చీలు, బెంచీలు లేవు. అందరం కిందనే కూచున్నాము. ఆ సంతోష సమయాన్ని సెలిబ్రేట్ చేసుకున్నాం.

టీ తాగటం పూర్తయిం తరువాత - "ఇదంతా ఇక ఇక్కణ్ణుంచి వెళ్ళిపోతాం గదా అనే సంతోషమే గదూ?" అన్నాడు గంగరాజు.

“అదేంకాదు. నా దంత సంకుచిత మనస్తత్వం కాదు. మీరు పొరబాటు పడుతున్నారు. మన స్కూలు పూర్తి స్థాయి హైస్కూలయిందనే నా సంతోషం. ఇందుకు మీరు ప్రెసిడెంటుగారు, మిగిలిన అందరూ అన్ని గ్రామాల వాళ్ళు టీచర్లు నాతో అద్భుతంగా సహకరించారు. మిమ్మల్ని అభినందించడానికి, ధన్యవాదాలు తెలుపడానికి మాత్రమే ఈ ఏర్పాటు” అన్నాను.

“మీరు మా ఊళ్లోనే ఉంటే బాగుంటుంది. మీరిక్కడే ఉండాలని మా కోరిక” అన్నాడు ప్రెసిడెంటు చేతులు జోడించి.

"ఇక్కడ ఉండక యాడికి బోతాడయ్యా?" అన్నాడు నరసరాజు.

"ఇక్కడ ఉండేందుకు నేను టెస్టు పాసు కాలేదింకా. టెస్టు పాసయినాయన వస్తాడు. పదో తరగతి వస్తే నేనిక్కణ్ణించి వెళ్ళిపోతానని గంగరాజు గారికి ఎవరో చెప్పారు. నేను వెళ్లిపోవటం ఇష్టం లేని గంగరాజుగారు ఆ రోజు నుంచి నాతో సహకరించటం మానేశారు. మీ అందరికీ చెప్పినట్లున్నాడా విషయం. మీరు గూడా నాతో సహకరించ లేదు. ఒక మనిషి కోసం ఒక సంస్థ అభివృద్ధినే నిలిపి వేసుకోవాలనుకోవడం చాలా తప్పు. నా తలదన్నే వాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్లను మీరు చూడలేదు. అందుకే నన్నేదో గొప్పగా అనుకుంటున్నారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు" అని పొంగి వస్తున్న ఆనందాశ్రువులను నిలుపుకుంటూ చేతులు జోడించాను. బరువెక్కిన హృదయాలతో ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు'.

అందరూ వెళ్లిపోయిం తరువాత - "ఇక మనం ఈ ఊరి నుంచి వెళ్లిపోతామన్న మాట!" అన్నది శ్రీమతి సంతోషంతో,

"అనే అనుకుంటున్నాను. కాని యీ మనుషుల్ని వదిలిపోవటం బాధాకరంగానే ఉంటుంది" అన్నాను.

"కాస్త మంచి చోటుకు వేయించుకోండి వాళ్లనడిగి. ఏదైనా పెద్ద ఊరికయితే బాగుంటుంది. ఈ ఊరికి బస్సు సౌకర్యం గూడా లేదు" అన్నది శ్రీమతి.

"డబ్బులిస్తే మనం కోరిన చోటికే వేయించుకోవచ్చు. మన దగ్గర లేదే! ఇంతకన్నా అధ్వాన్నమైన చోటికే వేయవచ్చును. అంతా నీ అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది" అన్నాను నవ్వుతూ.

"నా అదృష్టం బాగుండబట్టే మీరు దొరికారు" అన్నది వాలు చూపులు చూస్తూ.

"ఆ మాత్రం ఆలోచన నీ మనసులో ఉంటే మనం అడివిలో ఉన్నా సుఖంగానే ఉంటాం. నీకు తెలీదు. మొదట్లో ఇక్కడ పనిచెయ్యటానికి నా మనసు సుతారమూ ఒప్పుకోలేదు. అంత భయంకరంగా అనిపించింది నాకు. ఇప్పుడిదే నాకు స్వర్గంలా తోస్తున్నది!" అన్నాను ఆనందంగా.

మా భోజనాలయింతరువాత నరసమ్మ, నరసరాజు యథాప్రకారం వచ్చి కూచొని చాలాసేపు నన్ను పొగిడారు. నన్ను ఈ ఊరి నుంచి వెళ్ళిపోవద్దని ఎన్ని విధాలుగానో చెప్పారు. ఇంత మంచి ఊరు మరెక్కడా లేదన్నారు. పెద్ద టౌన్లలో అయితే ఖర్చులకు తట్టుకోవటం కష్టమని చెప్పారు. ఇక్కడైతే నాలుగు రూపాయలు దాచుకోవచ్చని చెప్పారు. నేనంటే ఊరి మనుషు లందరికీ ఇష్టమేనట. నాలుగు డబ్బులు మిగుల్చుకొని పొలం కొనుక్కొని, ఇల్లు కట్టుకొని, ఇక్కడే ఎప్పటికీ ఉండిపొమ్మని సలహా ఇచ్చారు.

నా కలాంటి తెలివితేటలు లేవని వాళ్లకు తెలిసినట్లు లేదు పాపం. ఆ తెలివి తేటలే ఉంటే నా కథ మరో రకంగా ఉండేది !

అభివృద్ధి చెందుతున్న సమాజంలో పరిష్కారమైన ఒక సమస్య నుంచి పరిష్కారం కావాల్సిన అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. పరీక్ష తప్పిన పిల్లవాడికి ఒకటే సమస్య. దానికి మళ్ళీ కట్టి పాసవటం. పాసయినవాడికి ఎదురయ్యేవి అనేక సమస్యలు!

ఇన్ని రోజులూ స్కూలుకు పదో తరగతి రావటమే సమస్య వచ్చింది. ఇక కొత్త హెడ్మాస్టర్లు రావాలి, కొత్త టీచర్లు రావాలి, నాకు బదిలీ రావాలి. ఇలా ఎన్నో !

ప్రతిరోజూ కొత్త హెడ్మాస్టరు నియామకపు ఉత్తర్వుల కోసం, దాంతో పాటు నా ట్రాన్స్ఫర్ ఆర్డరు కోసం ఎదురుచూస్తూ కూచుంటున్నాను. కొత్త తరగతికి చాలా సబ్జెక్టులు నేనే చెబుతున్నాను. వాళ్ళను ఊరికే కూచోబెడితే "ఇదేం పైతరగతి?" అని తిట్టుకుంటారు. అందుకే వాళ్ళు ఊరికే ఉండ కుండా పాఠాలు చెబుతున్నాను.

జూలై నెల గడిచిపోయింది. ఆగస్టు నెల గూడా దాటిపోయింది.

కొత్త తరగతి ప్రారంభించామని జిల్లా పరిషత్తు వారికి ఆ మరుసటి రోజే రాశాను. నేను కోరాల్సిన అవసరం లేకపోయినా నన్ను మరో చోటుకు బదిలీ చెయ్యండని గూడా అప్లికేషను పెట్టాను.

37

సెప్టెంబరు మాసాంతానికి కొత్త హెడ్మాస్టర్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు జిల్లా పరిషత్తువారు. దాంతోపాటు నా నెత్తిన ఒక పిడుగు కూడా వేశారు. నన్ను ఇదే స్కూలులో అసిస్టెంటుగా రిటైన్ చేస్తున్నామంటూ రాశారు. ఏది వస్తుందని నేను వేయికళ్ళతో ఎదురు చూశానో అది వచ్చింది. కాని నేననుకున్న విధంగా కాదు.

ఆ కాగితం చూసి నా నవనాడులూ క్రుంగిపోయాయి. ఏడుపు ఒక్కటే తక్కువ. నా ముఖంలో కత్తివేటుకు కూడా నెత్తురు చుక్కలేదు. ఒక స్కూలుకు కొత్త హెడ్మాస్టర్ను వేస్తున్నప్పుడు అంతకు ముందున్నతన్ని మరో చోటుకు మార్చడం మర్యాద. ఆ మర్యాదను అందరి విషయాల్లోనూ

పాటించారు. నా దగ్గరి కొచ్చేటప్పటికి కథ అడ్డం తిరిగింది. ఆ కాగితం నా చేతిలో ఉంచుకోబుద్ధి పుట్టలేదు.

శ్రీనివాసుల్ని పిలిచి - "మన స్కూలుకు కొత్త హెడ్మాస్టర్ని వేశారండీ!" అంటూ ఆ కాగితం అతని కందించాను.

ఆయన దాన్ని ఆసాంతం చదివాడు - "మిమ్మల్ని ఇక్కడే అసిస్టెంటుగా వేశారు గద సార్!" అన్నాడు.

"అవును. మన వాళ్ళ పరిపాలన అలా ఉంది" అన్నాను బొంగురుబోయిన గొంతుతో. అతనేమీ మాట్లాడలేదు. ఇతర టీచర్లు కూడా ఏమీ అనలేదు. చంగల్రాయలు మాత్రం -

"మనందరం ఒక్కసారే పోదాంలెండి సార్! మంచిపనే చేశారు వీళ్ళు" అన్నాడు నవ్వుతూ. ఎల్లకాలం మనమే ఈ మారుమూల ఊళ్ళో ఉండాలని రాసిపెట్టి ఉందా? అందరం జిల్లా పరిషత్తు ఆఫీసు ముందు కూచుందాం పదండి సార్ ట్రాన్స్ఫరు ఇచ్చిందాకా కదలమని" అన్నాడు మునసామి నాయుడు. అతను చాలాకాలంగా ప్రయత్నిస్తున్నాడు బదిలీ కోసం. అది రావడం లేదు.

"అదే మార్గంలా కనిపిస్తున్నది" అన్నాను.

నీరు చల్లిన పాల పొంగులా నా ఉత్సాహమంతా చల్లారిపోయింది. ఈ నిర్వాకం చిత్తూరు వెళ్ళిన పెద్దమనుషులే చేసుకొచ్చారేమోనని నాకు అనుమానం వచ్చింది.

ప్రెసిడెంటుగారి ఇంటికి పోయి ఈ విషయం అడగాలనుకున్నాను. కాని గంగరాజే మా ఇంటికొచ్చాడు ఎందుకో.

"స్కూలుకు కొత్త హెడ్మాస్టరు వస్తున్నాట్టగా! టీచరుగారినిక్కడే ఉండ మన్నారుట" అన్నాడతను వస్తూనే.

ఆయన మాటలకు ఒళ్లు మండింది. “ఇదంతా మీరే చేసుకొచ్చారను కుంటున్నాను. మేలు చేసిన వాళ్ళకు కీడు చెయ్యడం ఎంత హీనమైన పనో మీకు తెలుసు ననుకుంటాను.

నేను మీ స్కూలు ఔన్నత్యం కోసం పాటుబడ్డాను. మీరు నా పతనం కోసం పథకం వేశారు" అన్నాను కోపంగా.

“రామ రామ! నువ్వు ఇంకో హెడ్మాస్టరు కింద పనిచెయ్యడం నా కిష్టమను కుంటున్నావా! మేమేమీ చెప్పలేదక్కడ. నువ్వు చెప్పిన పని చేసుకొచ్చాము. అంతే. అక్కడ ఆఫీసులో ఒకడుంటే ఇంకోడు లేనందువల్ల ఆలస్యమైంది. అంతే!" అన్నాడాయన.

"మీ మాటలు నేను నమ్మను. మీరే చెప్పి ఉంటారు సెక్రటరీకి, ఛెయిర్మనుకు. ఆయనకు అక్కడుండటమే చాలా ఇష్టం. లేకపోతే ఇంత పనిచేస్తాడా అదీ ఇదీ అని! వాళ్ళదేం పోయింది. ఇలా ఆర్డరు పుట్టించారు" అన్నాను.

“దేవుడు సాక్షిగా చెబుతున్నాను. మేమట్లా చెప్పనూలేదు, చేయించనూ లేదు. అంత తెలువులు మా కెక్కడున్నాయి!” నవ్వాడాయన.

“ఇలాంటి తెలివి బాగా ఉంది. మంచి చెయ్యడానికి తెలివి లేదు గాని, పాడు పన్లు చేసేందుకు, కుతంత్రాలు పన్నేందుకు, ఎదుటివాళ్ళ కొంపలు కూల్చేందుకు కావాల్సిన తెలివి తేటలు అమోఘంగా ఉన్నాయి. విదేశాలకు గూడా ఎగుమతి చేసేంత ఎక్కువగా ఉన్నాయి” అన్నాను కోపంగా.

“నా మాట నమ్మకపోతే ఏం జేస్తాను. కావాలంటే ప్రెసిడెంటు నడుగుదాం పద” అంటూ లేచాడు.

“ఇద్దరూ తోడు దొంగలు. ఒకరికొకరు సాక్ష్యమా !”

గంగరాజు ఉద్రేకపూరితుడయ్యాడు. ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

“వాడెవడో హెడ్మాస్టరుగా రావాలని, వాడి కింద నువ్వు పని జెయ్యాలని నాకుంటుందా? శానా అన్యాయంగా మాట్లాడుతున్నావు. నువ్వంటే మా కందరికీ ఎంతో గౌరవం. నువ్విక్కడుండాలనుకున్నది మమ్మల్ని బాగు చేస్తావని. నువ్వు చెడిపోవాలని కాదు. నీవల్ల నాలో, వెంకట్రాయలులో, ఓబుల్రాజులో ఎంతో మార్పొచ్చింది. తాగుడు పూర్తిగా మానేశాము. నువ్వు పోతే మళ్ళీ దానికి దాసులమవుతామని భయం. నీలాంటివాడు మళ్లీ ఇక్కడికి రాడని భయం. నువ్వు మాతో ఉండాలని కోరుకున్నాము. కోరుకుంటున్నాము. కాని ఈ ఆర్డరుకూ మా కోరికకు ఏమీ సంబంధం లేదు. నా మాట నమ్మ. దీప మార్పిప్రమాణం చెయ్యమంటే చేస్తా" అన్నాడు గంగరాజు రుద్ధమైన కంఠంతో,

"ఆయన్నెందుకు మాటలతో అంత బాధపెట్టడం?" అన్నది శ్రీమతి. కాఫీ తాగమని ఇచ్చింది.

"నాకేమీ వద్దులేమ్మా. మీ ఇంట్లో చాలాసార్లు కాఫీ తాగాను. మీకు ఒక్కరోజు కూడా కాఫీ ఇవ్వలేదు. కనీసం మా ఇంటికైనా రమ్మని చెప్పలేదు.” ఆయన లేచి పోబోయాడు.

చెయ్యి లాగి కూచోబెట్టాను. నేను మాట్లాడుతున్న దానికి కాఫీ తాగడానికి సంబంధం ఏమీలేదు, "మీరు కాఫీ తాగండి" అంటూ శ్రీమతి చేతిలోంచి గ్లాసు తీసుకొని ఆయన కందించాను.

తీసుకొని తాగుతూ అన్నాడాయన - "ఇట్లా ఆర్డరు వచ్చిందని తెలిసి నేనెంత బాధ పడ్డానో నీకు తెలీదు. ఇన్ని రోజులూ నువ్వు మమ్మల్నందర్నీ నడిపించావు. మేము నీ వెంట నడిచాము. నువ్వు ఇంకోళ్ళ వెంట నడవడం నాకిష్టం లేదు. ఆ వచ్చే మనిషి ఎట్టాంటివాడో! నిన్ను నడిపించే శక్తి ఆయన కుంటుందని మాత్రం నేననుకోను. ఈ మాటలు చెప్పేందుకే నీ దగ్గరికొచ్చాను. నువ్వేమో నా మీద విరుచుకుపడ్డావు... ఈ పరిస్థితుల్లో

నువ్వు ఇక్కడుండాలని నేనూ కోరుకోవడం లేదు" అన్నాడాయన. ఆయన కళ్ల వెంట నీళ్లు కారాయి.

"మిమ్మల్ని తప్పుగా అనుకున్నాను. క్షమించండి" అంటూ ఆయన చేతులు పట్టుకున్నాను.

కొంతసేపు కూర్చొని స్థిమితపడిం తరువాత ఆయన వెళ్ళిపోయాడు.

ఈ పని ఆ డిప్యూటీ సెక్రటరీగాడే చేసి ఉంటాడు. తన దగ్గరికి మూటలు మోసుకొని పోలేదని వాడి కోపం. డిప్యూటీ సెక్రటరీగాడి పదవి సృష్టించింది టీచర్ల సమస్యలను సదవగాహనతో అర్థంచేసుకొని పరిష్కరించడానికి. యాజమాన్యం వారికి విద్యా విషయిక వ్యవహారాలలో మంచి సలహాలిచ్చేందుకు! కాని ఆ వెధవ చేస్తున్న పని ఇది. ఆశయాలు వేరు. ఆచరణలు వేరు. ఘజినీ, ఘోరీల్లాంటి వెధవలు వీళ్ళు. ఒక్కో ప్రాంతాన్ని కొల్లగొట్టుకొని మరో ప్రాంతానికి పోతూ ఉంటారు. దోచుకునేందుకు పరాయి దేశం వాళ్ళు దోచుకొనిపోయారన్నా అర్థం ఉంది. ఈ వెధవలు తమ కడుపులోని పేగుల్ని తామే పీక్కు తింటూ ఆనందించే నీచులు. క్రిమి సముదాయ సంకులము, పూతిగంధ హేయము, నిరామిషము, ఖరాంగభవంబునుఅయిన ఎమ్మును నములుతూ పరమానంద సంభరితులయ్యే కుక్కలు.

వాడు చేసిన పనికి పాపం గంగరాజును తప్పుపట్టాను. అందుకు లోలోపల పశ్చాత్తాప పడ్డాను.

ఎకౌంట్ టెస్టుకు ఫీజు కట్టాను. అక్టోబరులో పరీక్షలు. కడపకు పోయి రాయాలి. తెచ్చుకున్న గైడ్లు బాగానే చదువుతున్నాను. అంతకు మించి పుస్తకాలు దొరకలేదు.

దిసీజ్ ఓన్లీ ఎ టెస్ట్ నాట్ ఏన్ ఎగ్జామినేషన్! తేలిగ్గానే పాసు కావచ్చు ననుకుంటున్నాను. పరీక్షలు రాసే సమయానికి, రిజల్టు వచ్చే సమయానికి నేనక్కడ ఉండననుకున్నాను. ఇప్పుడిక నా చేతుల్లో ఏమీ లేదు. ఏది ఎలా

జరగాలో అలా జరుగుతుంది. భగవంతుడి మీద భారం వెయ్యటం తప్ప చెయ్యగలిగిందేమీలేదు.

రాబోయే హెడ్మాస్టరు ఎలాంటివాడో! ఆయన ఆలోచనలు ఎలా ఉంటాయో! అతన్ని గురించి నాకే కాదు మా టీచర్లెవరికీ తెలీదు. రకరకాలుగా ఊహాగానాలు చేసుకుంటున్నారందరూ.

ఆర్డరు వచ్చిన వారంలోగానే ఆయన ఛార్జి తీసుకున్నారు. సర్వీసులో నాకంటే రెండేళ్ళ జూనియరు. వయసులో మాత్రం కాస్త పెద్దవాడే. చాలా తెలివైనవాడు. ఇక్కడికి రాకుండా మరో చోటుకు వేయించుకోవాలని చాలా ప్రయత్నం చేశాడట. “ముందు చేరు తరువాత చూస్తాం" అని మాట ఇచ్చారట ఆఫీసులో వాళ్ళు.

సంసారం పెట్టే ఆలోచన లేదట. స్వగ్రామంలో భూములు వగైరా ఉన్నాయట. వాటిని మేనేజ్ చేసుకునేందుకు అతని భార్య అక్కడే ఉంటుంది. వీలయినప్పుడల్లా తను పోయొస్తాడట.

ఒక రూము తీసుకుని అందులో ఉండటం ప్రారంభించాడు. ఓబుర్రాజు ఇప్పుడతనికి వంటజేసి పెడుతున్నాడు. పిల్లలు కూడా సహాయం జేస్తున్నారు.

అడిగిందే తడవుగా టీచర్లకు సెలవు మంజూరు చేస్తున్నాడు. వాళ్ళు ఆలస్యంగా వచ్చినా, ముందుగా వెళ్ళిపోయినా పట్టించుకోవటం లేదు. బుద్ధి పుట్టినప్పుడల్లా క్లాసుకు పోతాడు, మిగతా సమయాల్లో ఆఫీసు రూములో కూచుంటాడు. ప్రతి పనికీ తాను వెనక ఉండి నన్ను ముందు తొయ్యాలని చూస్తున్నాడు. మొత్తం మీద చీప్ పాప్యులారిటీ కోసం ప్రాకులాడే మనిషని అర్థమైంది నాకు.

హెడ్మాస్టరు హోదా వెలగబెట్టానిన్ని రోజులూ. ప్రత్యేకంగా నా కో సీటంటూ ఉండేది. ఇప్పుడది పరుల హస్తగతమైంది. నేను మిగతా టీచర్లతో బాటు

కూచోవాలి. చాలా ఇబ్బందిగా ఫీలవుతున్నాను. తల తీసేసినట్లుగా ఉన్నది. న్యూనతాభావం చోటు చేసుకుంటున్నది. ఇలాంటి పరిస్థితి నా శత్రువులకు కూడా ఎదురవగూడదని చాలా సార్లనుకున్నాను.

టీచర్లు ఇంతకు ముందులా నాతో కలవడం లేదు. పదవిలో ఎవడుంటే వాడి ప్రాపకం కోసం ప్రాకులాడడం సహజమే. అతి సాధారణమైన వ్యక్తి ఏ మంత్రి పదవినో అలంకరిస్తే గొప్ప గొప్ప వాళ్లందరూ అతని అడుగులకు మడుగులొత్తడం లేదూ! పదవి పోయిం తరువాత అతగాడు మళ్ళీ మామూలు మనిషవుతాడు. ఆయన్నెవరూ పట్టించుకోరు.

అందరూ నేను పదవిలో ఉన్నప్పటిలాగే నన్ను గౌరవించాలని నేనను కోవడం లేదు. కించపరచకుండా ఉంటే చాలు. వాళ్ళు నన్ను కించ పరచాల్సిన అవసరం కూడా ఏమీలేదు. నేనెవరికీ ఎటువంటి హానీ చెయ్యలేదు. పైగా అందరితోటీ బాగా కలిసి పోయాను. వాళ్ళలో ఒకడినిగా ఉన్నాను. పాపం వాళ్ళు మామూలుగానే చూస్తూ ఉన్నా నాకు వాళ్ల ప్రవర్తనలో మార్పు కనిపిస్తున్నదేమో! నే నెటు చూసినా నరకమే కనిపిస్తున్నది. అందుక్కారణం ఆ నరకమేదో నా మనసులోనే ఉండటం. అది నాతో పాటే తిరుగుతూ ఉండటం!' అనుకున్నాడట క్రింద పడిపోయిన సైతాను. వాడి పరిస్థితిలోనే నేనున్నానేమో !

బహుశా నన్ను నేనే చిన్న బుచ్చుకుంటున్నానేమో.

ఆత్మన్యూనతాభావం చాలా చెడ్డది.

ఏది ఏమైనా కానీ నాకు ఎకౌంట్ టెస్ట్ రాసి వచ్చేందుకోవారం రోజులు సెలవు పెట్టాను. అప్పుడు కొంత రిలీఫ్ గానే ఫీలయ్యాను. టెస్టు బాగానే రాశాను. కడపలో మరికొంతమంది మిత్రులు కలిశారు. వారు రాబోయే ప్రశ్నల గురించి చర్చించుకోటం అదీ మనసు పెట్టి విన్నాను. గైడ్లు కూడా బాగానే చదివి ఉన్నాను. పాసవుతాననే నమ్మకంతోనే ఇంటికొచ్చాను.

ముళ్ళమీద ఉన్నట్లున్నది. గత్యంతరం లేక ఉన్నాను.

పెళ్ళయింతరువాత శ్రీమతిని వదిలి అన్ని రోజులు ఉండలేదు. విరహవ్యధ ఇద్దరం అనుభవించాము.

క్వార్టర్లీ పరీక్షలొచ్చాయి. ఈ హెడ్మాస్టరు చేస్తున్న పనులు ఏవీ నాకు నచ్చటం లేదు. అవి నిజంగానే చెడ్డవయినందువల్ల నచ్చటం లేదో, లేకపోతే అతను చేస్తున్నాడని నచ్చటం లేదో ఖచ్చితంగా చెప్పలేను. మొత్తం మీద నచ్చని మాట మాత్రం యదార్థం. నా జూనియరు క్రింద నేను పని చెయ్యాల్సి రావటం మరీ ఇబ్బందిగా ఉంది.

అతనితో మాట్లాడటానికి కూడా మనస్కరించటంలేదు. చాలా సార్లు నా మనసుకు నేను బుద్ధి చెప్పుకున్నాను.

అతనిక్కడికి రావటం తప్పా? వాళ్లు వేశారు. వచ్చాడు. పాపం అతను మరో చోటికి పోవాలని ప్రయత్నం చేశాడట కూడా. నేను సీనియర్నయివుండి కూడా టెస్టు పాసు కాకుండా ఉండటానికి అతను కారకుడు కాడే! అది స్వయంకృతం. నాకుగా నేను చేసుకున్నది. అతన్ని చూసి నేను అసూయపడటం దేనికి? అసలు గంగరాజు మాటలు విని స్కూలు అప్‌గ్రేడు కాకుండా ఉంచి ఉంటే ఇవాళ నాకీ పరిస్థితి ఎదురై ఉండేది కాదు! అభివృద్ధి కోసం పాటుబడటం తప్పని ఇప్పుడు తెలిసింది. ఇది వ్యవస్థలో ఉన్న దోషం. అతను తన ఉన్నతి కోసం పాటుబడ్డాడు. సాధించాడు. నేను పాఠశాల ఉన్నతికోసం పాటుబడ్డాను. దాన్ని సాధించాను. ఫలితంగా నేను వెనుకబడిపోయాను.

జిల్లా పరిషత్తు పాలకులకు బుద్ధి లేదు. నన్నిక్కడ ఉంచడం పెద్దనేరం. నేనిక్కడ అసిస్టెంటుగా కంటిన్యూ కావడం స్కూలుకు ఏ విధంగానూ మంచిది కాదు. ఇంతచిన్న విషయం అంత పెద్ద చదువులు చదివిన వాళ్లకెందుకు తెలీలేదు? వాళ్ళసలు స్కూళ్ళను గురించి, వాటి అభివృద్ధిని గురించి ఆలోచిస్తేగా? ఈ వ్యవస్థలో ఎవడి శ్రేయస్సును గురించి వాడు

ఆలోచించుకోవాలి కాని, సమాజ శ్రేయస్సును గురించి ఆలోచించకూడదు. ఆలోచిస్తే నాకు పట్టిన గతే వాళ్ళకూ పడుతుంది !

అంతులేని ఆలోచనలు. పాఠాలు కూడా సరిగా చెప్పలేకపోతున్నాను. ఇంతకు ముందు ఒక్కరోజు కూడా సెలవు పెట్టేవాడిని కాదు. ఇప్పుడు కొద్ది రోజుల్లోనే దాదాపు సెలవులన్నిటినీ వాడేశాను. పుణ్యాత్ముడు శాంక్షన్ చేస్తున్నాడు మారుమాట్లాడకుండా !

ఇంట్లో శ్రీమతితో కూడా హాయిగా మాట్లాడలేకపోతున్నాను ఈ ఆలోచనల కారణంగా,

నరసమ్మ, నరసరాజు మామూలుగా వస్తున్నారు. కూచుంటున్నారు. ఇది వరకటిలా వాళ్ళతో మాట్లాడలేకపోతున్నాను. వాళ్ళతో మాట్లాడేందుకు విషయాలే దొరకడం లేదు.

క్వార్టర్లీ పరీక్షలకు హెడ్మాస్టరుగారు చేసిన ఏర్పాట్లు టీచర్లు కామెంట్ చెయ్యటానికి ఆస్కారమిచ్చాయి. వాళ్ళ కామెంట్లకు నేను టార్గెట్ కావటం నా దురదృష్టం. నిన్నగాక మొన్న ఉద్యోగంలో చేరిన సెకండరీ గ్రేడు టీచరు మోక్షముని అంటున్నాడు. "ఆయనకూ మాకూ తేడా ఏముంది సార్! ఆయనా టీచరే. మేమూ టీచర్లమే. ఆయన కా ప్రత్యేకత ఎందుకు? మీరు అందర్నీ సమానంగా చూడాలి. అంతేగాని ఒకర్నొక రకంగా, ఇతర్లను మరొక రకంగా చూడటం మంచిది కాదు" అంటూ వాదిస్తున్నాడు.

అతనికి నచ్చ చెప్పేందుకు నానా తంటాలు పడుతున్నాడా పెద్దమనిషి నాకు ఒళ్ళు మండిపోయింది. కాగితం, కలం తీసుకొని ఛెయిర్మనుగారికి ఉత్తరం రాశాను.

"అయ్యా!"

నేను ఈ పాఠశాలలో మూడు సంవత్సరాలు ప్రధానోపాధ్యాయుడుగా పని చేశాను. ప్రతి నిముషమూ స్కూలు కోసం పని చేశాను. స్కూలుకు తొమ్మిదో తరగతి వచ్చేలా కృషి చేశాను. పాఠశాలకు భవనం నిర్మింపజేశాను.

బుద్ధవిగ్రహం నేను తయారు చెయ్యకపోయినా చేసినవారిని ప్రోత్సహించాను. ఊరూరా తిరిగి బిచ్చమెత్తి మీకు కట్టాల్సిన అయిదు వేలూ కట్టించి పదో తరగతి వచ్చేట్లుగా చేశాను. ఇప్పుడిది హైస్కూలుగా ఉన్నతి పొందింది.

"ఉన్నత పాఠశాలగా మారిన ఈ స్కూలుకు క్వాలిఫైడ్ హెడ్మాస్టర్ను నియమించారు. ఇంతవరకు బాగానే ఉంది.

ఒక స్కూలుకు కొత్త హెడ్మాస్టర్ని వేసేటప్పుడు పాతవారిని ఆ స్థలం నుంచి బదిలీ చెయ్యడం మర్యాద, సంప్రదాయం. దానికి భిన్నంగా మీరు నన్నిక్కడనే అసిస్టెంటుగా రివర్టు చేసి పని చెయ్యమన్నారు. ఇది దారుణమైన అన్యాయం, అక్రమం. ఇలాంటి దౌర్భాగ్యపు పని మీరెందుకు చేశారో తెలీదు. బాగా పనిచేస్తున్నవారిని ప్రశంసా పూర్వకంగా కాస్త సౌకర్యవంతమైన చోటుకు మారిస్తే వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. దురదృష్టవశాత్తు మీరు బాగా పనిచేసేవారిని శిక్షించే విధానం అనుసరించారు. మీ యీ చర్యవలన మీరు అభివృద్ధి కాముకులు కాదని నేనను కోవలసి వస్తున్నది. సమర్థవంతమైన పరిపాలన ఎలా ఉంటుందో మీకు తెలియదను కోవాల్సి వస్తున్నది. దేశానికి, సమాజానికి ఇలాంటి విధానాలు తీరని ద్రోహం చేస్తాయి.

సర్వీసులో నాకంటే జూనియరు క్వాలిఫైడ్ హెడ్మాస్టరు కాగలిగాడు. అందుక్కారణం అతను నాకంటే తెలివైనవాడు కావటం కాదు. విద్యాయోగ్యతలు ఎక్కువగా కలిగి ఉండినందువల్లకాదు. అతను సౌకర్యాలు ఎక్కువగా ఉన్న ప్రదేశంలో పనిజేస్తూ తన ఉన్నతి కోసం కృషి చేసుకున్నాడు. నేనీ మారుమూల ప్రాంతంలో ఉండి ఈ పాఠశాల ఉన్నతికోసం కృషి చేశాను. ఆతనికి పురస్కారం! నాకు శిక్ష! ఇది ఏ నీతికి చెందు తుందో తమకు, పాలనలో తమకు మార్గదర్శకత్వం వహిస్తున్న పెద్ద పెద్ద అధికారులకు మాత్రమే తెలియాలి.

దేశాభ్యుదయమనే తాజ్మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తుతున్న కూలీలం మేము. పెద్ద పెద్ద అధికారులు మూడేళ్ళకోసారి జిల్లాలు మారుతుంటారు. స్వార్థమే

వారి పరమార్థం. తమ వంటివారినే వారు ఆదరిస్తున్నారు, అక్కున చేర్చుకుంటూన్నారు. కానుకలు, నీరాజనాలు మోసుకొని భృత్యాను భృత్యులుగా, దాసానుదాసులుగా తిరిగే వారే వారి కళ్ళలో పడుతుంటారు. మాబోటి శ్రమైక జీవులు వారి కంటబడరు.

దురదృష్టం! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడైనా మీరు నాకు న్యాయం చెయ్యండి. నేను మిమ్మల్ని కోరుతున్నది నన్నిక్కడి నుంచి బదిలీ చెయ్యండని మాత్రమే. అర్హతలేని ఉన్నతిని ఇమ్మని కోరడం లేదు. ఇంత చేశాను నాకు బహుమతులివ్వండని అడగడం లేదు.

భూమి పుత్రులైన మీరు కూడా వారి అడుగుజాడలలోనే నడవడం పాటించాల్సిన కనీస మర్యాదను మీరెక్కడ మరిచిపోతారోనని, టి.ఏ.లు, డి.ఏ.లు ఇచ్చే భారం కూడా మీకు లేకుండా చెయ్యాలని, నాకు నేనుగా బదిలీ కోరుతూ మూడు విజ్ఞాపనలు పంపుకున్నాను. వాటిని కూడా బుట్టదాఖలు చేశారు తమ అధికార్లు! చెయ్యగూడని పనిచేశారు.

ఈ స్కూలు అభివృద్ధి కోసం నేను మూడు సంవత్సరాలు నిర్విరామంగా కృషి చేశాను. మీరూ, కార్యదర్శిగారూ స్వయంగా చూశారు కూడా.

మీరు ఈ నా విజ్ఞప్తిని కూడా మన్నించకుండా నన్నింకా ఇక్కడే ఉంచితే దీని సర్వ నాశనం జరగడం ఖాయం! ఏ చేతులతో రాళ్ళెత్తి పెట్టి నిర్మించామో ఆ చేతులతో ఆ రాళ్ళనే

పీకి పారెయ్యడం ఎవరికైనా బాధాకరమే. అందుకే నా మనోవ్యధను తెలుపుతూ ఈ జాబు రాస్తున్నాను.

తమరిందుకు ఆగ్రహించి మరింత పెద్ద శిక్ష విధిస్తూ నయినా సరే నన్నీచోటునుండి బదిలీ చెయ్యండి. తమరు యీ కోర్కెను మన్నిస్తారనే నమ్మకంతో ఉన్నాను" అంటూ ఉత్తరం ముగించి చెయిర్మన్ గారి పర్సనల్ అడ్రెసుకు పోస్ట్ చేశాను.

38

క్వార్టర్లీ పరీక్షలు ముగిశాయి. దసరా సెలవులిచ్చారు స్కూలుకు. సెలవులిచ్చిన మర్నాడే అన్నీ సర్దుకొని నేను, శ్రీమతి మదనపల్లె వెళ్ళాము.

చెయిర్మను గారికి ఉత్తరం రాసేప్పుడున్నంత ధైర్యం ఆ తరువాత లేకుండా పోయింది. ఏ విధమైన పనిష్మెంటు ఇవ్వబోతారోనని ఒకటే ఆందోళన పడుతున్నది మనసు. నిండా మునిగిన తరువాత చలేంటి అనే మొండిధైర్యం ఒకవేపు ఉన్నది. ఏదైతే అది కానిమ్మని మనసు దిటవు చేసుకున్నాను. ఎంత స్థిమితంగా ఉందామన్నా అవే ఆలోచనలు, అదే భయం వెన్నాడుతున్నవి.

సెలవులు పదిరోజులూ ఎలాగో గడిపేశాము. పెద్ద సంతోషంగా ఏమీ గడపలేదు. సరిగ్గా స్కూలు తెరిచే రోజున ఇద్దరం తిరిగి జంబాడ చేరుకున్నాము. తొమ్మిదన్నరకు స్కూలు ప్రారంభమైతే నేను పదకొండుకు వెళ్లాను.

నన్ను చూస్తూనే -"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ ప్రసాద్! మిమ్మల్ని శ్రీకాళహస్తికి ట్రాన్స్ఫర్ చేశారు" అంటూ నా ట్రాన్స్ఫరు ఆర్డరు కాయితం నా కందించాడాయన.

ఆ క్షణంలో నేను పొందిన ఆనందం జన్మలో నేనెన్నడూ పొందలేదు. ఆ కాగితం తీసుకొని జేబులో పెట్టుకున్నాను. ఎవరూ చూడనప్పుడు ఎన్నిసార్లు ముద్దు పెట్టు కున్నానో ఆ కాగితం ముక్కను! పొంగిపొరలుతున్న ఆనందంతో నవ్వుతూ "నన్ను వెంటనే - రిలీవు చెయ్యండి సార్! వెళ్లిపోతాను" అన్నాను హెడ్మాస్టరుతో.

“ఇవాళ మధ్యాహ్నం దాకా అయిపోయిందిగా. మీకేం రిక్వెస్టు ట్రాన్స్ఫరు ఇవ్వలేదు' అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్సు మీద ఇచ్చారు. మీరు జాయినింగ్ టైం

గూడా ఎవైల్ చేసుకోవచ్చును. రేపు రిలీవు చేస్తాను. ఇంతలో తొందరే ముంది?" అన్నాడాయన నవ్వుతూ.

నేనేం మాట్లాడలేదు.

మధ్యాహ్నం ఇంటికిపోయి - "మనకు శ్రీకాళహస్తికి ట్రాన్స్ఫర్ వచ్చిందోయ్!" అని

శ్రీమతికి చెప్పి నా ఆనందం ఆవిడతో పంచుకున్నాను. ఆవిడ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. ఛెయిర్మనుగారు నా ఉత్తరం చూసి ఆగ్రహంతో మండిపోతూ ఇంక్రిమెంట్లు కట్టుతో సత్కరిస్తారేమోనని చాలా భయపడ్డాను. కాని అలా చెయ్యలేదు. నా బాధను అర్థం చేసుకున్నారు. నాకు తగిన న్యాయం చేశారు. ఏ మారుమూల పల్లెకో విసిరి వెయ్యకుండా పుణ్య స్థలమైన శ్రీకాళహస్తికి అసిస్టెంటుగా వేశారు. మనసులోనే ఆయనకు అనేకసార్లు ధన్యవాదాలు తెలుపుకున్నాను. ఆరోజే కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనకు ఉత్తరం రాశాను. "మేం ఎందరి కాళ్లు పట్టుకున్నా పని జరగలేదు. మీకు ఏ ప్రయత్నమూ లేకుండానే ట్రాన్స్ఫరు ఎట్టా వచ్చింది సార్!" అంటూ వచ్చాడు చంగల్రాయలు.

"ధైర్యం చేసి ఛెయిర్మనుగారికి ఉత్తరం రాశాను. అది పని చేసింది" అని చెప్పానతనికి. “ఛెయిర్మనుగారికి మంత్రం వేసి ఉంటారు" అన్నాడు శ్రీనివాసులు.

“మంత్రమూ లేదు. తంత్రమూ లేదు. కాళ్లు పట్టలేదు. కానుకలు సమర్పించు కోలేదు. తెగించి ఛెయిర్మనుగారికి జరిగిన తప్పును తెలిపాను. ఆయన చేసిన తప్పును సవరించుకున్నారు” అన్నాను నవ్వుతూ.

"ఏనుగు కుంభస్థలమే కొట్టారన్నమాట!” అన్నాడు చంగయ్య శర్మ.

"ఆఁ అంత పెద్దమాట లెందుకులెండి? ఆయనకు కోపం వచ్చి ఉంటే నా తలే పగిలి ఉండేది! ఏ మంచి క్షణంలోనే ఆయన నా ఉత్తరం చదివి ఉంటాడు. ఆయనకు మంచి బుద్ధి పుట్టింది. మంచి పని చేశాడు..

సాహసం చేశాను నాకు విజయం లభించింది' ' అన్నాను వాళ్ళందరి వంక గర్వంతో చూస్తూ.

“మీరేమైనా చెయ్యగలరు సార్!” అన్నాడు చంగల్రాయలు కళ్ళు పెద్దవి చేసి ప్రశంసాపూర్వకంగా.

“అదంతా మీ సహకారం, మీ మంచితనం. ఈ ఊళ్ళో ఇన్ని మంచి పనులు జరగటానికి కారణం మీరే! ఈ చంగల్రాయలు 'రామదాసు' వెయ్యకపోతే జనంతో నాకు సాన్నిహిత్యం ఏర్పడేది కాదు. మునసామినాయుడు, చంగయ్య శర్మ గడ్డపారలు, పారలు పట్టుకోక పోతే ఈ బిల్డింగు తయారయ్యేది కాదు. శ్రీనివాసులు ఎంత సహాయం చేశాడో చెప్పలేను. ఛెయిర్మనుగారు ఇక్కడికి వచ్చి మనల్ని చూసేలా చేసినవారు దొరసామి, అతనికి సహాయంగా నిలిచిన మోక్షముని, ఓబుల్రాజు ఎంత చేశారు నాకు! నన్ను బ్రతికించారు. మీరందరూ లేకపోతే ఏం చెయ్యగలిగేవాడిని! మీ అందరి మంచితనం ఇలాగే ఉండాలని నా కోరిక" అంటూ అందర్నీ అభినందించాను మనస్ఫూర్తిగా.

సాయంత్రం ఇంటికొచ్చాడు గంగరాజు. అతని కళ్ళలో నీరుంది. ఇంటి దగ్గర గూడా ఏడ్చినట్లున్నాడు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. "అనుకున్నది సాధించావు సార్! ఊళ్లో ఉన్న మట్టి ముద్దల్ని మనుషుల్ని చేశావు. మాచేత ఎన్నో పనులు చేయించావు. సాయంత్రం ఆరుగంటలకే అన్నాలు తిని నిద్రబోయే మనుషుల్ని రాత్రి పదకొండు పన్నెండు గంటలదాకా మేల్కొని ఉండేట్లు చేశావు. ఎప్పుడూ తాగి పండుకుంటూ స్కూలు ముఖమే చూడని ఓబుల్రాజును దాని జోలికే పోకుండా చేశావు. వెంకట్రాయలు ఎంత మారిపోయాడో! వాణ్ణి తలచుకుంటేనే ఆశ్చర్యమేస్తుంది. బంగారం లాంటి పెళ్ళాన్ని ఇంట్లో బెట్టుకుని ఊరిమీద బలాదూరుగా తిరుగు తుండేవాడు. అట్లాంటివాడు ఇప్పుడు ఇల్లు వదలటం లేదు. పొలం పనులు శ్రద్ధగా చేసుకుంటున్నాడు. పెళ్ళాన్ని ప్రేమగా చూసుకుంటు న్నాడు... నాకు ఈ ఊళ్ళో ఉండటమే అసహ్యంగా ఉండేది. ఎప్పుడెప్పుడు డబ్బు దొరుకు తుందా పారిపోదామని కాచుకొని ఉండే వాడిని. నన్నిక్కడ కట్టి పడేశావు. తాగి నీ దగ్గరికి రావటానికి భయపడి, దాన్ని పూర్తిగా వదిలేశాను. మత్తు

పదార్థాలంటేనే విరక్తి పుట్టింది. అన్నీ పూర్తిగా మానేశాను ఇవన్నీ నీ మూలంగానే జరిగాయి. నువ్వు ఇన్నిసినా నువ్వు ఊర్నించి పోవటం నాకు బొత్తిగా ఇష్టం లేదు. ఏం లాభం? ఎన్ని అడ్డాలు దాటుకున్నావు. మా కిష్టం లేని పనిని మా చేతనే చేయించావు. మనుషులు వస్తారు, పోతారు. అందరూ నీలాంటి వాళ్ళు గాదు. నీలాంటి మనిషి దొరికితే పోగొట్టుకో గూడదు. పోగొట్టుకోకుండా ఉండాలనే ప్రయత్నించాను. కాని మేము ఓడిపోయాం. నువ్వే గెలిచావు…" మధ్యలోనే ఆయన మాటలు నిలిచిపోయాయి. మాట్లాడలేక పోయాడు. ఓదార్చాలో తెలీలేదు. ఆయనకు అన్నీ తెలుసు.

ఆయనకు ఏమని చెప్పి "మమ్మల్ని మోసం జేశావు సారూ! గంగి మాంవం ఆలోచన నాకు తెలిసి సావలేదు. ఇట్లా అవుతుందనుకుంటే నేను దమ్మిడి ఇచ్చి ఉండేదాన్ని కాదు సారూ!" అని శోకాలు

పెట్టనారంభించింది నరసమ్మ.

నరసరాజు పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీలేదు.

క్రమక్రమంగా ఊళ్ళో జనం ఆడ, మగ చాలామంది పోగయ్యారు. అందరి కోరికా ఒకటే - "నే నా ఊరు వదిలిపోగూడదు."

ప్రేమమూర్తులు వాళ్ళు. ఇంతటి ప్రేమాభిమానాలు జన్మలో నాకు లభ్యం కావని నాకు తెలుసు. అయినా నేను పోవాలి.

అందర్నీ సముదాయించి పంపేసరికి రాత్రి పది గంటలయింది. "ఇంకో హెడ్మాస్టరు కింద నేను పనిచెయ్యటం మీకు మాత్రం ఇష్టమా! నేను పరీక్ష రాశాను. త్వరలో రిజల్టు వస్తుంది. అప్పుడు నేను నిజంగా పూర్తిస్థాయి హెడ్మాస్టరునవుతాను. అప్పుడు మీ ఊరికొస్తాను. మీతోనే ఉంటాను" అంటూ ఏమేమో హామీలిచ్చి పంపాను.

"పాపం వాళ్లందరికీ మీరంటే ఎంత అభిమానమండీ!" అన్నది శ్రీమతి విస్ఫారిత నేత్రాలతో.

"వీళ్ళందరూ మంచివాళ్లు అభివృద్ధికి దూరంగా ఉన్నవాళ్ళు. నాగరికతా గంధం అంటకుండా ఉన్న మానవులు. సింపుల్ ఫోక్! అంతమంది నా కోసం కంట తడిపెట్టారు. నా కళ్లవెంట ఎన్ని చుక్కలు రాలినయ్? అసలు కళ్లలో నీరు తిరగందే! ఎందుకో తెలుసా? నేను నాగరికత తెలిసినవాడిని. నలుగుర్లో ఏడిస్తే నామోషీ అని ఫీలయ్యేవాడిని. అన్నిటినీ మించి చదువు కున్న వాడిని. నా చదువు నాకు మానవత్వాన్ని నేర్పలేదు. అహంభావాన్ని నేర్పింది. అంతమంది నాకోసం ఏడ్చేట్లు చేసినవాణ్ణి నేనెంత గొప్పవాణ్ణి? అనుకునేలా చేసిన చదువు నేర్చుకున్నవాడిని. నా చదువు నాకు ఫ్యామిలిటీని నేర్పలేదు. కన్టెన్మెంట్ను నేర్పలేదు. మానవత్వాన్ని నేర్పలేదు. మానవత్వానికి దూరంగా తీసుకుపోయింది నన్ను" ఏమేమిటో పిచ్చిగా మాట్లాడాను. నా కళ్ళనుంచి కృతజ్ఞతాభాష్పాలు ఏకధారగా కారాయి.

నా మాటలు ఒక్కటిగూడా అర్థమయినట్లు లేదు శ్రీమతికి. బెంబేలు పడి పోయింది. నాకు పిచ్చి పట్టిందేమోనని భయపడ్డది.అక్కున జేర్చుకొని ఓదార్చింది నన్ను. నా కన్నీళ్ళు తుడిచింది. నన్ను మామూలు మనిషిని చేసింది.

ఉదయం వంచిన తల ఎత్తకుండా స్కూలుకు పోయాను. రిలీవింగు రిపోర్టు, లాస్ట్ పే సర్టిఫికెట్టు తీసుకున్నాను. "నే నిక వస్తాను సార్!" అని ఆయనకు షేక్ హ్యాండిచ్చి ఇవతలి కొచ్చాను. టీచర్లందరూ చుట్టుముట్టారు నన్ను "కొత్త చోటుకు జాయినింగ్ టైం ఎవైల్ చేసుకొనిపొండి" అన్నాడు శ్రీనివాసులు.

చంగ్రలాయలు నా చేతిని వదల్లేదు - రేపు మా సెండాఫ్ తీసుకొని పోవాలి" అన్నాడు మునసామి.

"ఇప్పుడవన్నీ ఎందుకండీ! పాత విషయాలన్నీ జ్ఞాపకం చేసుకొని బాధపడాలి. దయచేసి ఆ ప్రయత్నం మాత్రం మానుకోండి" అన్నాను.

"అట్లా వీలుకాదు. మీరు సెండాఫ్ పార్టీకి రావాల్సిందే" అంటూ పట్టుబడ్డాడు చంగల్రాయలు.

మీ హృదయాల్లో మీరు నాకు కాస్త చెరగని చోటివ్వండి చాలు. ఎందుకీ ఫార్మాలిటీలన్నీ? మీరు నాతో చక్కగా సహకరించినందుకు ధన్యావాదాలు" అన్నాను. నా కళ్ళలో నీళ్ళు తిరిగినయ్.

వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ చంగల్రాయలు మీరు మా వీడ్కోలు తీసు కోకుండా పోగూడదు" అన్నాడు. -

అలాగే వస్తానని వాళ్ళకు చెప్పి ఇంటికొచ్చాను. ఇప్పుడు నాకూ, ఆ స్కూలుకూ ఏ విధమైన సంబంధమూ లేదు. మొదట్లో దాన్ని మనసారా ద్వేషించాను. తరువాత ప్రేమించాను. ఇప్పుడు ఏ సంబంధమూ లేదు నాకు దానితో !

ఇంటికొచ్చి కూచున్నాను. ఆ ఊళ్ళో మనుషులు రావటం, నన్ను చూసి కన్నీళ్ళు పెట్టుకోవటం చేస్తున్నారు.

మీరందరూ ఎందుకలా బాధపడుతున్నారో నాకర్థం కావడం లేదు. నేనేం కష్టాలపాలు కాలేదు. కాళహస్తి మీ ఊరికంటే చాలా పెద్ద ఊరు. సినిమా హాళ్ళు, కాఫీ హోటళ్ళు, బస్సులు, రైళ్ళు విరివిగా ఉన్న ఊరు. ఇక్కడికంటే అక్కడ మేము సుఖంగా ఉంటాము. సౌకర్యాలనుభవిస్తాము. నాకు మంచి జరుగుతున్నందుకు మీరు సంతోషపడాలి గాని ఇలా బాధపడటం బాగాలేదు" అన్నాను.

మీకేం, మీరు హాయిగానే ఉంటారు. మేం మాత్రం మళ్ళీ బూజు పడతాము. మాలో పొంగిన చైతన్యం చచ్చిపోతుంది. మామూలు నిశ్శబ్దం మళ్ళీ రాజ్యమేలుతుంది. మాకోసం మేము విలపిస్తున్నాము" వాళ్ళు చెప్పిన మాటల సారాంశ మిది.

"మీ రివాళ మా ఇంట్లో భోంచెయ్యండి" అంటూ వచ్చాడు వెంకట్రాయలు.

“ఇవన్నీ పెట్టుకుంటే నే నీ ఊరినుంచి బయటపడటం కష్టం బ్రదర్! మీ అభిమానం చాలు. భోజనాలెందుకు?" అన్నాను నవ్వుతూ.

అతను పట్టిన పట్టు విడవలేదు. భోజనానికి వాళ్ళ ఇంటికి పోకతప్పలేదు. ఆ సజీవ శిల్పసుందరే మాకు వడ్డించింది ఎంతో సంతోషంతో వడలు, పాయసం, ఏవేవో చాలా చేశారు. తృప్తిగా తిన్నాము. ఆకులు నములుతూ కూచున్నాము. నా కోసం ఖరీదైన సిగరెట్లు కూడా తెప్పించాడతను. ఆ అమ్మాయి భోంచేస్తుంటే తోడుగా ఉండేందుకు శ్రీమతి లోపల కూచున్నది ఆమెతో.

“నీ భార్య చాలా అందంగా ఉంటుంది వెంకట్రాయలూ! సజీవ శిల్పం అని పేరు బెట్టాన్నేను. అంత అందగత్తెను నే నింతవరకూ చూడలేదు. నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఆ అమ్మాయిని జాగ్రత్తగా చూసుకో!" అన్నాను.

సిగ్గుతో తల వంచుకున్నాడతను. “మొదట మొదట నేను ఆమెను అనాదరణ చేసిన మాట నిజమే సార్! అందుకే మీరు నాతో ఈ విషయంగా చెబుతున్నారను కుంటున్నాను. నాకింకా కొన్ని దురలవాట్లు గూడా ఉండేవి. మీతో చేరిం తరువాత నేను పూర్తిగా మారిపోయాను. ఇప్పుడు నా లోకమంతా ఇల్లు, పెళ్ళాము, పొలము. అంతే!” అంటూ నవ్వాడు.

“ఎప్పటికీ ఇలాగే ఉంటానని నువ్వు నాకు మాటివ్వాలి" అంటూ చెయ్యి ముందుకు జాచాను. అతను నా చేతిలో చెయ్యి వేశాడు. ఆ చేతిని గట్టిగా పట్టుకున్నాను.

“మీరందరూ చాలా మంచివాళ్లు గొప్పవాళ్లు వెంకట్రాయలూ! నిన్ను మార్చిన నాటకం గొప్పది. సినిమాల్లో, డ్రామాల్లో వేషాలు వేసే నటీనటులు తాగుడుకు బానిస లయి చెడిపోయిన కథలు చాలా వింటుంటాము. నువ్వు గూడా విని ఉంటావు" అన్నాను.

"ఆ శక్తి నాటకానిది కాదు సార్! నేర్పించిన మీది. అదంతా మీప్రభావమే. మారింది నేనే కాదు. ఇంకా చాలామంది గూడా మారారు. తాగుడుకు మా

కందరికీ గురువు మా గంగ్ మావ: ఆయన గూడా పూర్తిగా మాను కున్నాడు" అన్నాడు నవ్వుతూ. "మీలో మనుషుల్ని మార్చగల గుణం ఉంది సార్: మీరు సామాన్యులు కాదు."

భోజనం ముగించుకున్న తరువాత శ్రీమతి, శిల్పసుందరి బయటికి వచ్చారు. ఆమెను చూస్తూనే-నీ పేరేమమ్మా?" అన్నాను

"హైమా" అన్నది సన్నగా తలవంచుకొని

"అంటే బంగారమన్నమాట! బంగారంతోనేనిజంగా ఈ విగ్రహాన్ని చేసినట్లున్నాడు బ్రహ్మః" అన్నాను నవ్వుతూ.

ఆ అమ్మాయి నవ్వింది. దానిమ్మ గింజల్లాంటి పలువరుస.
"మీరెప్పుడైనా కాళహస్తికి వస్తే మా ఇంటికి తప్పకరండి" అంటూ ఆ ఇద్దర్నీ ఆహ్వానించాను. వాళ్ళకు కృతజ్ఞతలు తెలిపి ఇంటికొచ్చాము. చేతులు జోడించి మాకు వీడ్కోలు చెప్పారు. ఇద్దరూ పక్క పక్కన 'మేడ్ ఫర్ ఈచదర్:' అనుకున్నాను.

39

జాయినింగ్ టైము పూర్తిగా ఉపయోగించుకోక తప్పలేదు. నాకు పూటకో ఇంటికి భోజనానికి పోవాల్సి వచ్చింది.

స్కూల్లో టీచర్లు. పిల్లలు వీడ్కోలు ఇచ్చారు నాకు. టీచర్లందరూ 'అది చేశాడు, ఇది చేశాడు' అంటూ పొగిడారు. ఎక్కువగానే. నేనేమీ మాట్లాడలేదు. నాకు జరిపిన సత్కారానికి కృతజ్ఞతలు తెలిపాను. పిల్లలు బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని చెప్పాను.

ఊరి వాళ్ళు గూడా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు, ప్రెసిడెంటుగారి అధ్యక్షతన. చాలామంది పూలమాలలు వేశారు. అన్ని ఎర్రగన్నేరుపూలు ఎక్కడ సంపాదించు కొచ్చారో: నాకోసం చాలా సేకరించారు. కనీసం రెండు గంపలయినా అవుతాయా పూలు. ఊరి వారందరూ నాకో బంగారు ఉంగరాన్ని బహుమతిగా ఇచ్చారు. మాటలు" పెద్దగా ఏమీ జరగలేదు.

ప్రెసిడెంటు నాలుగు మాటలు చెప్పాడు. గంగరాజో నాలుగు మాటలు మాట్లాడాడు.

మంచితనానికి, మమకారానికి, మానవతకు, ఆప్యాయతకు, ప్రేమకు, తాగ్యానికి ప్రతిరూపాలైన ఆ పల్లె ప్రజలకు హృదయపూర్వ కృతజ్ఞతలు తెలిపాను.

శ్రీమతిని జంబాడలోనే ఉంచి నేనొక్కడినే శ్రీకాళహస్తి పోయి డ్యూటీలో జాయినయి నాను. కాళహస్తి ఏనుగైతే, జంబాడ దోమ: చాలా పెద్ద స్కూలు, నలభైమందికి పైగా టీచర్లున్నారు. ఇద్దరు ప్యూన్లు, వాచ్మెన్, పెద్ద పెద్ద భవనాలు అట్టహాసంగా ఉన్నదంతా:

ఎక్కువ కష్టపడకుండానే స్కూలుకు దగ్గరగా, సువర్ణముఖి ఒడ్డున నాకు ఇల్లు దొరికింది. హాలు, వంటగది, ముందు వరండా, వెనకా ముందూ ఖాళీస్థలం బాగుంది. కరెంటున్నది ఇంటికి.

రెండు రోజుల్లో అన్నీ కుదిరాయి. వెంటనే జంబాడ వచ్చాను శ్రీమతిని తీసుకు పోయేందుకు.

మేము మాతో తీసుకుపోయేందుకు ఎక్కువ లగేజీ ఏమీ లేదు. శ్రీమతి తనతోబాటు తెచ్చుకున్న సూట్కేసులో గుడ్డలన్నీ సర్దాము. మిగిలిన సామాన్లన్నీ ఒక గోనెసంచిలో వేసి కట్టాము. మంచం వగైరా ఊరి వారి వస్తువులు. వాళ్ళకు ఇచ్చేశాము.

గోతం సంచినెత్తిన బెట్టుకొని ఓబుల్రాజు ముందుగా రోడ్లోకి పోయాడు. గంగరాజు సూట్కేసు తీసుకున్నాడు.

మే మా ఊర్నించి బయలుదేరాము. ఊరిజనం చాలామంది మాతోబాటు వచ్చారు. మగవాళ్ళు నా చుట్టూ నడుస్తున్నారు. శ్రీమతితో బాటు ఆడవాళ్ళు.

ఊరి బయట చెరువు కట్టమీదకి వచ్చాము. నేనక్కడ నుంచొని స్కూలువంక చూశాను. ఇటుకరాతి గోడలు, పైన రేకులు, ముందు తోటలోని మొక్కలు, అందంగా కనిపించాయి. ఆ పక్కనే పద్మాసన స్థితుడైన శ్వేతమూర్తి బుద్ధదేవుడి విగ్రహం అందంగా కనిపించింది. నేను, చంగల్రాయలు, శ్రీనివాసులు, చంగయ్యశర్మ, మునసామి నాయుడు ఆ చెరువు కట్టమీద కూచొని చాలా సాయంత్రాలు గడిపాము. ఆ చోటులో ఒక నిముషం నుంచున్నాను.

చెరువు ఒడ్డున రావిచెట్టు ఆకులు గాలికి రెపరెపలాడుతూ నీటిలో నీడలు చూసు కుంటున్నాయి. అక్కడక్కడా వికసించిన తామరపూలు, చెరువును శోభాయ మానం చేస్తున్నవి.

"ఆ గోడలకు త్వరగా సిమెంటు చేయించండి" అన్నాను నా పక్కనే ఉన్న ప్రెసిడెంటుతో,

"ఏదో చేసుకుంటాములే, నువ్వు పోతున్నావుగా. ఇక దాంతో నీకేం పని?" అన్నాడు గంగరాజు రోషంగా,

ఊరు దాటి ఒక పర్లాంగు దూరం వచ్చాము. అక్కడ ఆగి గంగరాజు చేతిలోంచి సూట్కేసు తీసుకోబోయాను. ఆయన ఇవ్వలేదు. "నేను బస్సుదాకా వస్తా" నన్నాడు. మిగతావాళ్ళను "ఇంక మీరు ఉండండి" అన్నాను.

ప్రెసిడెంటు నా రెండు చేతులూ పట్టుకొని "మీరు పరీక్ష పాసవుతూనే మళ్ళీ ఇక్కడికి రండి. ఇక్కడ మీరు చెయ్యాల్సిన పని చాలా ఉంది" అన్నాడు.

"సరే అందాకా ఇప్పుడున్నతనికి బాగా సహకరించండి. స్కూలు భవిష్యత్తును ఎప్పుడూ అశ్రద్ధ చెయ్యవద్దు" అన్నాను.

నరసరాజు నన్ను పట్టుకొని బోరున ఏడ్చేశాడు.

"మమ్మల్ని మోసం చేసి పోతున్నావులే సారూ: మళ్ళీ యీడకే రావాల." అంటూ కళ్ళు తుడుచుకున్నది నరసమ్మ.

అందరూ దీనంగా ముఖాలు పెట్టుకొని వెనక్కు తిరిగారు.

శ్రీమతి, గంగరాజు, మరొకరు, నేను మాత్రం మిగిలాము. మేము రోడ్డుదగ్గరికి చేరాము. ఓబుల్రాజు మాకోసం ఎదురుజూస్తున్నాడు.

రోడ్డు పక్కనే ఉన్న బండమీద సూటుకేసు పెట్టి, శ్రీమతిని ఆ బండమీద కూచోమన్నాడు గంగరాజు.

“నిన్ను వచ్చే ఏడు మళ్ళీ మా స్కూలుకే వేయించుకుంటాము. నువ్వు రాననగూడదు. రాకపోతే మా అందరి ఉసురు తగులుతుంది" అన్నాడు గంగరాజు నాకెదురుగా నుంచొని..

"గంగరాజుగారూ: మూడేళ్ళకు ముందు నేనవర్నో మీకు తెలియదు. మీ ఊరు పేరు కూడా నాకు తెలియదు. మనందరం కలుసుకోవాలని, కలసి పనిచెయ్యాలని భగవంతుడు నిర్ణయించాడు. ఆ నిర్ణయం ప్రకారమే జరిగింది. ఈ ఊరు వచ్చి పని చెయ్యటం సుతరామూ నా కిష్టంలేదు. అందుకే అమావాస్య మంగళవారం ఎనిమిదో తేదీనాడు ఇక్కడ డ్యూటీలో చేరాను. అశుభదినంనాడు చేరితే త్వరగా ఇక్కణ్ణించి వెళ్ళిపోగలనేమో ననే ఆశతో: మూడు నెలలపాటు దొంగగా మీస్కూలు పేరుమీద జీతం తీసుకున్నాను ఏపనీ చెయ్యకుండానే. అందుకే నేనే చాలా సిగ్గుపడుతున్నాను. నాలో పరివర్తన వచ్చింది. మీ ఊళ్ళో పనిచెయ్యాలని ధృఢంగా నిశ్చయించుకొని వచ్చాను. మీరు నన్ను, నేను మిమ్మల్ని అర్థం చేసుకున్నాము. నేను చెయ్యాలనుకున్న పనులన్నిటికీ మీ సహకారం లభించింది. మీరు నాకు అండగా లేకుండా ఉండి ఉంటే నేనే పనీ చెయ్యగలిగి ఉండేవాడిని కాదు. నేను మీకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో తెలీదు, మీకు నేనంటే అందరికంటే ఎక్కువ అభిమానం ఉన్నది.మీ అభిమానానికి నేను తిరిగి చెల్లించగలిగిందేమీ లేదు. నేను మీకు ఋణపడిపోతున్నాను. మీ కోర్కెకు విరుద్ధంగా జరుగుతున్నందుకు నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి.. నేనీ ఊరికి తిరిగి రావటమంటారా: ఏమో: నీటి ఋణం ఉంటే రాక తప్పదు. ఇప్పుడు రావాలనుకొని వచ్చానా?"

"మనిషికి పునర్జన్మ ఉన్నదని అందరూ చెబుతారు. చరిత్ర పునరావృతమవుతూ ఉంటుందనే సిద్ధాంతం ఒకటుంది. అదే నిజమైతే మనం ఏదో ఒక జన్మలో తిరిగి ఖాయంగా కలుసుకుంటాము, ఇలాగే కలిసి పనిచేస్తాము. అప్పుడు నేను మళ్ళీ మీతో ఉంటాను. మీరు నాతో ఉంటారు. అదీ మూడేళ్ళపాటే: మళ్ళీ వియోగం: మరెప్పటికో సంయోగం.....

"మీ ఊళ్ళో జీవించిన ప్రతిక్షణం తిరిగి జీవించాలనే కోరుకుంటాను. అమృత తుల్యమైన ఆ రోజులు పునరావృతం కావాలని కోరుకుంటాను..." ఆయన్ను కౌగిలించుకొని ప్రణామం చేశాను.

"బస్సొస్తా వుంది సా:" అంటూ మూట నెత్తికెత్తుకున్నాడు ఓబుల్రాజు. "వస్తామండీ:" అని నేను సూట్కేసు తీసుకున్నాను. శ్రీమతి చేతులు జోడించి గంగరాజుకు వీడ్కోలు చెప్పింది.

బస్సు నిలిచింది. ఓబుల్రాజు నాతో శ్రీకాళహస్తికి వస్తున్నాడు, టాపుమీద మూటవేసి బస్సు లోపలి కొచ్చాడు.

కండక్టరు "రైట్" అనడంతో బస్సు కదిలింది.

గంగరాజుకు వీడ్కోలు చెప్పేందుకు తల బయటికి పెట్టి చూశాను

ఆయన టవల్తో కళ్ళు తుడుచుకుంటున్నాడు

ఆ దృశ్యం నా మదిలో నిలిచిపోయింది శాశ్వతంగా.

(సమాప్తం)

ఈ నవల గురించి పత్రికలు ఏమన్నాయో!

ఉపాధ్యాయ వృత్తితో అవినాభావ సంబంధాన్ని ఏర్పరచుకొని, ఆ వృత్తి పట్ల అమితమైన ఆరాధనా భావాన్ని పెంచుకొని, ఎంతో చిత్తశుద్ధితో తన అనుభవాల నేపథ్యంలో ఆ వృత్తి గొప్పతనాన్ని విశదీకరిస్తూ అది మానవ జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో, ఎంతనా చైతన్యవంతం చేస్తుందో నవలా రూపంలో విశ్లేషించిన కథకుడు, నవలా రచయిత శ్రీ సి.హెచ్. వెంకటరత్నం.

- ఆంధ్రజ్యోతి 15-3-1998 Last

తమిళ ప్రాంతంలోకి దీవిగడ్డలా చొచ్చుకుపోయిన తెలుగుపల్లె జంబాడ. తెలుగుదనాన్ని నిలుపుకొన్న గ్రామం అది. జిల్లా కేంద్రానికి ఎంతో దూరంగా విసిరేసినట్లున్న ఆ ఊళ్ళోకి ఏ ఉపాధ్యాయుడూ ఇష్టపూర్వకంగా రాడు, అది పనిష్మెంట్ సెంటరు. కాబట్టి విధిలేక రావలసిందేగాని. ప్రసాద్ అలా వచ్చినవాడే. కాని, ఆ ఊరు విడిచి పోయేప్పుడు మాత్రం చాలా సంతోషంగా వెళ్ళిపోలేదు. ఎందుకంటే, ఆ ఊళ్ళో వున్న మట్టిముద్దల్ని మనుషుల్ని చేశాడు.

- కె.వి.ఆర్. ఆంధ్రజ్యోతి 8-5-1994

నాలుగు గోడల మధ్య పిల్లలకు చదువు చెప్పడమే కాదు టీచరు చెయ్యాల్సిన తన చుట్టూ ఉన్న సమాజన్ని చైతన్యవంతం చేయాలి. ఆనందాన్ని పండించి పంచిపెట్టాలి. మన సమాజంలో టీచరు అంటే ఇప్పటికీ ఎంతో గౌరవం ఉంది. ఆ గౌరవం తన సుఖసంతోషాల కోసం కాకుండా సమాజ సౌభాగ్యం కోసం ఉపయోగించాలి. సుఖమంటే ఏమిటో, సంతోషమంటే ఏమిటో చదువు రాని మనుషులు తెలుసుకునేలా చేయాలి. టీచరు స్వార్థపరుడు కాకూడదు. మన ప్రాచీన ఉపాధ్యాయులందరూ ఋషులే. వారు ఐహిక సుఖాలకు వీలయినంత దూరంగా ఉండి, విజ్ఞానాన్ని పండించి, పంచి పెట్టారు. ఈనాడు అలా అడవులకు వెళ్ళాల్సిన పని లేదు. మనుషుల మధ్యనే ఉంటూ వారు నాడు చేసిన పనిని నేడు చెయ్యాలి. పల్లె పిలిచింది నవలలో కథానాయకుడు ప్రసాద్ భావాలు సరిగ్గా అలాంటివే.

- ఇండియా టుడే సెప్టెంబరు 6-20, 1993

మానవ సహజమైన సాధారణ బలహీనతల్ని, శృంగార సెన్సెస్‌ని ఉద్రేకపరిచే నవలలే ప్రచురణ రంగాన్ని శాసిస్తున్న నేటి తరుణంలో ఒక చక్కని సాదా సీదా నవల. విభిన్న తత్వాలు గల మనుషుల మధ్య సాగిపోయే సరళమైన కథనంతో వెలువడిన నవల 'ద్వారకా' రచించిన 'పల్లె పిలిచింది'.

- ఆంధ్రభూమి డిసెంబరు 3 : 1993

ఒక పల్లెటూరి వాస్తవ పరిస్థితులను సహజంగా చిత్రిస్తూ, సామూహిక కృషితో కార్యసాధన చెయ్యవచ్చునన్న సత్యాన్ని రచయిత ఈ నవల ద్వారా నిరూపించారు. రచయిత ఆశావాది కావడం మెచ్చుకోదగ్గది. ఇది ఆయన తొలి నవల.

- ఈనాడు ఫిబ్రవరి 11 : 1996